


గోతెలుగు.కామ్
చక్కటి కుటుంబ వార పత్రిక
సూర్యదేవర రామ్మోహన రావు
నా ప్రేయసిని
పట్టిస్తే కోటి
PART - 2



వాళ్ళు ఎంటరైన రెండో నిముషంలోనే కదిరేషన్ అతడి మనుషులు రంగ ప్రవేశం చేసారు. అప్పటికే సుమారు ముప్పైమందికి పైగా వున్నారు. శిఖామణి కుర్రాళ్ళు వాళ్ళతో వూపిరి సలపకుండా ఒంటరి పోరాటం చేస్తున్న సహస్రకు ఎప్పుడైతే కదిరేషన్ బృందం తనకు సాయంగా ఎంటరైందో కాస్త వూపిరి తీసుకునే అవకాశం ఏర్పడిన్ది. దాంతో అటు యిటు ఇనుపరాడ్ లో రౌడీలను విరగొట్టి చెదరగొడుతూ గొడవకు కారణమైన గుండా శిఖామణి వైపు దూసుకెళ్ళింది.

శిఖామణి మనుషుల్లో కుడిభుజం లాంటి వేలు అనే యువకుడొకడున్నాడు. వీడికి కాస్త ముందు చూపు ఎక్కువ. ఎప్పుడైతే సహస్రకు సాయంగా కొందరు ఎంటరయ్యారో ఎప్పుడైతే సహస్ర సుడిగాలిలా శిఖామణివైపు దూసుకొస్తుందో వెంటనే పరిస్థితిని అంచనా వేసాడు. ఎందుకైనా మంచిదని సెల్ ఫోన్ అందుకుని తేనాంపేట ఆ పరిసరాల్లోని తమ బేచ్ లకు చక చకా ఫోన్లుకొట్టి పిలవటం ఆరంభించాడు. ఈ లోపల పోరాటం ఆరంభంలోనే సహస్ర ముఖాన్ని కవర్ చేస్తున్న చున్నీ జారిపోయింది. దాన్ని తిరిగి

అందుకోడానికి ముఖాన్ని కవర్ చేసుకోడానికో ఆమెకు అవకాశం లేకపోయింది. జీప్ సమీపంలో నిలబడిన శిఖామణికి పరిస్థితి చూస్తుంటే మతి పోతున్నట్టుంది. ఇప్పుడు సహస్ర ముఖాన్ని స్పష్టంగా చూడగలుగుతున్నాడు.

అందమైన ముక్కుకి డైమండ్ ముక్కెర, చెవులకు గోల్డ్ రింగులు, మెడలో సన్నటి గోల్డ్ చైన్ అత్యంత సుందరమైన ఆమె ముఖం. ఎంత సింపుల్ గా వున్నా సర్వాభరణ భూషితమైన అమ్మవారిలా దర్శనమిస్తోంది. వాడి అశ్చర్యం సహస్ర అందం గురించి కాదు. అంత కోమలమైన అమ్మాయిలో ఇంతటి ధైర్య సాహసాలేమిటి ఈ పోరాట స్ఫూర్తి ఏమిటి?

శిఖామణి ఆశ్చర్యం నుంచి తేరుకునే లోపల చిరుత పులిలా వచ్చి వాడి ఎదురుగా నిలబడిన్ది సహస్ర. పొజిషన్ తీసుకొంటున్న సహస్రను చూడగానే “ ఏయ్ ఆగమ్మాయ్ ఆగు ” అనరిచాడు శిఖామణి.

“నేను ఆగమన్నప్పుడు నువ్వు ఆగలేదు. ఇప్పుడు నేనెందుకు ఆగాలి?” ఎదురు ప్రశ్నించింది సహస్ర.

“ఎందుకంటే… చెట్టంత మనిషిని. పహిల్వాన్ని. నాకు దయా దాక్షిణ్యాలు తెలిదు. నా కుర్రాళ్ళని కొట్టినంత ఈజీ కాదు నన్ను కొట్టడం. తామర తంపరగా వస్తున్న మా కుర్రాళ్ళని చూస్తున్నావ్ గదా? తప్పించుకోలేవు. నీకు భయపడి చెప్పటంలేదు. నిన్ను చూస్తుంటే ముచ్చటేస్తుంది. నీ వయసును అందాన్ని భవిష్యత్తును నాశనం చేసుకోకు. వెంటనే ఇక్కడ్నుంచి పారిపోయి ప్రాణాలు దక్కించుకో. లేదంటే చంపేస్తారు” పెద్ద గొంతుతో హెచ్చరించాడు శిఖామణి.

“గీత బోధ చేయటానికి నువ్వు కృష్ణుడివి కాదు వింటూ కూచోడానికి నేను అర్జునుడ్ని కాదు. పదిమంది వెధవల్ని వెంటేసుకుని నగరం నడి బొడ్డులో పరువుగా బతుకుతున్న ఒక స్త్రీని ఎత్తుకుపోవాలని చూసిన నువ్వో మగాడివా? పది మంది ఒకడ్ని కొట్టడం కాదురా. ఒక ఆడపిల్ల పది మందిని కొట్టడం గొప్ప. పోరాటం ఆరంభించింది మీరు. దీన్ని ముగించే వెళ్తాను. తేనాం పేటలో రౌడీ అనేవాడు కనబడ కూడదు. కండలు పెంచిన పహిల్వాన్వి గదా, కమాన్ నువ్వో నేనో తేల్చుకుందాం” అంటూ వేగంగా ముందుకు దూకింది. దాంతో చేతిలోని ఇనప రాడ్ గిర గిరా తిప్పుతూ ముందుకురికాడు శిఖామణి. ఇక ఇరువురి మధ్య ఆరంభమైంది పోరాటం.

సరిగ్గా ఇదే సమయంలో మునిసామి అతడి మనుషులు రంగ ప్రవేశం చేసారు. వస్తూనే ఎడా పెడా బాణా కర్రతో గుండాల్ని బెదర గొడుతూ సహస్రకి రక్షణగా ఆమె సమీపంలోకి వెళ్ళిపోయాడు మునసామి.ఇపుడా ప్రదేశంలో జరుగుతోంది ఒక దొమ్మిలా లేదు. వీధి పోరాటం కూడ కాదు. ఒక రణ రంగాన్నే తలపిస్తోంది. అరుపులు కేకలు ఆర్తనాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లుతోంది. అంతలో విరాట్ కూడ రంగప్రవేశం చేసాడు. అతడితో కలిసి సహస్ర వర్గమే సుమారు పాతిక ముప్పైమంది వరకు ఉండగా శిఖామణి వర్గం అరవై

మంది పైనే ఉంటారు.

బేచ్ లు బేచ్ లుగా సైకిళ్ళ మీద బైక్ ల మీదా తేనాం పేట రౌడీ కుర్రాళ్ళు బీభత్సంగా అరుస్తూ ఇంకా వచ్చి పడుతూనే వున్నారు. జనం ఆ పోరాటాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నారు. రోడ్ వెంట అటు ఇటు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎవరో ఫోన్ చేసినట్టున్నారు. కదిరేషన్ బేచ్ ఎంటరవుతున్నప్పుడే మీడియాకు చెందిన రెండు వేన్ లు ఎంటరయ్యాయి. టివి లకు లైవ్ టెలికాస్ట్ ఆరంభమైంది. ఇంకా సంఘటనా స్థలానికి తమ ప్రతినిధులు చేరుకుని ఛానల్ వాళ్ళు తమ టీవీల్లో స్క్రోలింగ్ లో ముఖ్య ప్రకటన అంటూ ప్రసారం ఆరంభించారు.

దాంతో నాగరప్రజల దృష్టికి ఒక్కసారిగా టివి స్క్రీన్ ల వైపు మళ్ళింది.

ఇదే సమయంలో కాస్త ముందుగా...

సమాచారం తెలిగానే టి నగర్ పోలీస్ స్టేషన్ నుంచి ఇక యస్సై ఆరుగురు కానిస్టేబుల్స్ లాఠీలు వూపుకుంటూ జీప్లోవచ్చి దిగారు. ఏదో చిన్న దొమ్మి అనుకున్నారు. కాని వచ్చి చూడగానే వాళ్ళకి కళ్ళు గిర్రున తిరిగినంత పనైంది. ఇప్పుడు తాము లా అండ్ ఆర్డర్ కోసం వాళ్ళ ముందుకెళ్తే ప్రాణాలతో బయటపడ్డం కష్టమనిపించింది. ఇటు రోడ్డు నుండి లోపల ఖాళీ స్థలం వరకు యుద్ధ రంగాన్ని తలపిస్తోంది. ఎలా చూసినా రెండు వర్గాలు వంద మంది ఉండొచ్చనిపించింది. అదనపు బలగాలు వస్తే గాని తాము ఏం చేయలేని పరిస్థితి వుంది. దాంతో వచ్చిన వాళ్ళు ప్రేక్షకులుగా మారి పోగా యస్సై వరసగా ఇతర పోలీస్ స్టేషన్లకు నగర పోలీస్ కంట్రోల్ రూమ్ కి చక చకా ఫోన్ లు కొట్టి పరిస్థితి వివరించాడు. సైరన్లు మోగించుకొంటూ పోలీసు వాహనాలు దూసుకు రానారంభించాయి. రెండు వేన్ లలో తుపాకులు ధరించిన రిజర్వ్ పోలీస్ లు కూడ సంఘటనా స్థలానికి బయలు దేరారు.

ఈ లోపల సుమారు పది నిముషాల వరకు...|

సహస్ర శిఖామణిల మధ్య...

హోరా హోరీగా సాగింది పోరాటం....

శిఖామణి చాలా బలమైన మనిషి కావటంచేత సహస్రకు ఓపట్టాన లొంగేట్టు కన్పించటం లేదు. సహస్ర కొట్టే కుంగ్ఫూ పంచ్ ని

ఫ్లైయింగ్ కిక్స్ ని తట్టుకొని నిలబడుతూ, తప్పించుకుంటూ, తిరిగి దెబ్బ కొట్టాలని ప్రయత్నిస్తూ పోరాడుతున్నాడు.

వాడికి సాయంగా ఎవరూ యిటు రాకుండా ఓ ప్రక్కన మునుసామి మరో పక్కన కదిరేషన్ లు కర్రలు తిప్పుతూ రౌడీల తాట తీసి చెదరగొడుతున్నారు. ఇక ఆ యిద్దరి మనుషులయితే రుద్ర గణాల్లా చెలరేగి రౌడీలతో హోరా హోరీగా పోరాడుతూ దెబ్బకు ఒకడ్ని పడగొట్టేస్తున్నారు.

కాని అసంఖ్యాకంగా వచ్చి పడుతున్న రౌడీ మూకల్ని చూస్తుంటే ఈ పోరాటం ఇంకా ఎంతసేపు కొనసాగుతుందో ఎవరూ అంచనా వేయలేకపోతున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేయకముందే అక్కడ్నుంచి తప్పుకోవాలని అందరికీ వున్నా. సహస్ర అక్కడ్నుంచి కదిలితేగాని అది వీలుపడదు.

అయితే సహస్ర ఆలోచన వేరుగా వుంది. ఎట్టి పరిస్థితిలోను శిఖామణిని వదిలి పోయే ఉద్దేశం ఆమెకు లేదు. వాడ్ని పడగొట్టి ఏ చేత్తో అయితే సుకుమారి జుత్తు పట్టి లాగాడో, ఆ చేతిని విరగొట్టి వాడ్ని జీవితంలో ఎప్పుడూ స్త్రీల వంక కన్నెత్తి చూడకుండా చేయాలని ఆమె ఉద్దేశం. అరుపులు కేకలు కర్రలు కత్తుల చప్పుళ్ళు రణగొణ ధ్వనిలో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోతోంది. ఇదే సమయంలో విరాట్ ఎంటరయ్యాడు. ఎక్కడికక్కడ దొరికిన రౌడీని దొరికినట్టు విరగొట్టేస్తూ దారి చేసుకుని మూడో నిముషంలోనే సహస్ర సమీపంలోకి వెళ్ళిపోయాడు.

ఆమె తనతో మాట్లాడదు....

తను ఆమెతో మాట్లాడాలా వద్దా?

పరిస్థితిని గమనిస్తూ కొన్ని క్షణాలు ఆగాడు.

శిఖామణి ఆరంభంలో కొంతసేపు సహస్ర వేగాన్ని నిలువరించగలిగినా క్రమంగా డిఫెన్స్ లో పడిపోయాడు. సుకుమారి జోలికి ఎందుకెళ్ళాన్రా బాబు అని ఇప్పుడు బాధపడుతున్నాడు.

శిఖామణి వంటిమీది గాయాలు చూస్తేనే అర్థమవుతోంది సహస్ర ఎంత దారుణంగా అటాక్ చేసిందో. ఈ పాటికే వాడు పడిపోవాలి కాని తెలివిగా వాడు ఎదురొడ్డి పోరాడకుండా సహస్ర పంచ్ లని లెగ్ స్ట్రోక్ లను తప్పించుకొంటూ ఆత్మరక్షణలో పడ్డంతో వాడ్ని

కూల్చటంలో ఆలస్యం జరుగుతోంది.

శిఖామణి మూతి పగిలి నెత్తురోడులోంది. బోడిగుండు రక్తసిక్తమైంది. వంటి మీద గాయాలు రక్తం చిందుతున్నాయి. వాడికి అండగా రావాలని దూసుకొస్తున్న రౌడీలని అటు మునుసామి ఇటు కదిరేశన్ లు చితగ్గొట్టి తరుముతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పోలీసులు వచ్చి ముట్టడిన్చే అవకాశం ఉంది. ఉన్నట్టుండి కదిలాడు విరాట్. అతడి రాకను కాస్త ఆలస్యంగా గమనించింది సహస్ర.

"పోలీసులు వచ్చేదాక ఈ వెధవతో పోరాడుతూనే వుంటావా? తప్పుకో " అనరస్తు చివ్వున ఎగిరి శిఖామణి పక్కటెముకల మీద తన్నాడు. ఆ షాక్ నుంచి కోలుకొనే లోపు విరాట్ పిడికిలి వాడి చెవి పక్కన దారుణంగా తాకింది. అదే క్షణంలో సహస్ర ఎగిరి గుండెల మీద తన్నింది. ఒకే సారి ఇద్దరూ అటాక్ చేయటంతో నిలవలేక బాధతో పెద్దగా అరుస్తూ ఎగిరి వెనక్కి పడిపోయాడు. అంతే...

తొలిసారిగా వాడికి...

ప్రాణభయం అంటే ఏమిటో తెలిసింది....

ఇంకా అక్కడే ఉంటే ఇద్దరూ చంపేస్తారని భయపడ్డాడు. శక్తినంతా కూడదీసుకొని చివ్వున లేచి పరుగెత్తి తమ జీప్ ఎక్కేసాడు. వాడ్ని ఆపాలని కదిలిన సహస్రను చేయిపట్టి ఆపాడు విరాట్.

"చాలు జరిగింది చాలు. వాడు పారిపోతున్నాడు పోనీ. పోలీస్ సైరన్లు వినబడుతున్నాయి. వెంటనే మనం వెళ్ళిపోవాలి" అంటూ హెచ్చరించాడు."లేదు వాడ్ని వదలకూడదు. వాడి కాలో చెయ్యో తీసే వరకు వదలను, నన్ను వెళ్ళనీ" ఆవేశంతో అరిచింది సహస్ర.ఆ కాస్త సమయంలోనూ శిఖామణి జీప్ స్టార్ట్ చేసి చివ్వున రౌండ్ తిప్పి సహస్ర వైపు దూకించాడు. తనను దెబ్బతీసిన ఆ పిల్లను జీప్ లో తొక్కించి చంపేయాలన్నంత ప్రతీకారేచ్చలో చివరి ప్రయత్నంగా వేగంగా దూసుకొచ్చేసాడు సహస్ర వైపు. ఆఖరి క్షణంలో సహస్రను విరాట్ పక్కకు లాగేసాడు గాని లేకపోతే సహస్రను జీప్ తో తొక్కించిచేసే వాడే.

తన ప్రాణానికి ప్రాణమైన సహస్రను చంపాలనుకున్న వాడ్ని ఇక క్షమించలేక పోయాడు విరాట్. కింద పడున్న ఒక ఇనుప రాడ్ ని అందుకొని శిఖామణి వైపు బలంగా విసిరేసాడు.భూతంలా దూసుకొస్తున్న జీప్ ను చూడగానే ఆ దిశలో పోరాడుతున్న ఇరు వర్గాల వాళ్ళు పక్కకు పరుగులు తీసారు. అదే సమయంలో విరాట్ ప్రయోగించిన ఇనపరాడ్ విష్ణు చక్రంలా తిరుగుతూ దూసుకెళ్ళి జీప్

లోని శిఖామణి బోడిగుండును దారుణంగా తాకి 'ఖంగు' మని చప్పుడు చేసింది. దెబ్బకు ముందుకు తూలటంతో నుదురు స్టీరింగ్ ను బలంగా గుద్దుకొని క్షణంలో తెలితప్పి పోతూ పక్కకు ఒరిగి పోయాడు.

కంట్రోల్ తప్పిన జీప్ రోడ్ మీదకు దూసుకెళ్ళి అడ్డంగా తిరిగి పక్కకు పల్టీ కొట్టి శిఖామణిని ఈడ్చుకొంటూ దూసుకెళ్ళి ట్రాఫిక్ లో నిలిచిపోయిన వాహనాలు రెంటిని ఢీకొంది. నిప్పురవ్వలు ఎగసి నేలకు జారిన ఆయిల్ కు నిప్పంటుకొని క్షణంలో అగ్గి ఆయిల్ టాంక్ లో జొరబడిరది. అంతే....డైనమైట్ పేలినట్టు జీప్ ఆయిల్ టాంక్ ఒక్కసారిగా పేలిపోవటంతో గొల్లున అరిచి దూరంగా పరుగులు తీసారు జనం. భయంకర అగ్ని జ్వాలలు గాల్లోకి ఎగసాయి. జీపు తునాతునకలయి పక్కనున్న రెండు వాహనాలూ మంటల్లో చిక్కుకున్నాయి. ట్రాఫిక్ జామయి వెనక్కో పక్కలకో వెళ్ళలేక రోడ్ వెంట అనేక వాహనాలు నిలిచి పోయాయి. ఎప్పుడైతే మంటలు ఎగసాయో వాహనాలు వదిలి పరుగులు తీసారు జనం.

ఇదే సమయానికి కొన్ని పోలీసు వాహనాలు వచ్చి చేరాయి. కాని ట్రాఫిక్ లో నిలిచిపోయిన వాహనాల్ని దాటి అవి ముందుకొచ్చే అవకాశం లేక పోవటంతో వాహనాలు దిగి పోలీసులు పరుగులెత్తుకురాసాగారు. కొన్ని వాహనాలు సందు గొందుల వెంట తిరిగి ఎలాగో చేరుకో గలిగాయి. వాహనాలు దిగుతూనే లాఠీలు ఝుళిపిస్తూ ముందుగా జనాన్ని దూరంగా తరిమి రెండు ఫ్లడ్ లైట్లను ఆన్ చేసి సంఘటన స్థలంలోకి ఫోకస్ చేసారు పోలీసులు. అయినా ఎక్కడా ఇరువర్గాలు చెదిరి పోయే పరిస్థితి కన్పించలేదు. రిజర్వు పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్ ని పోరాడుతున్న వాళ్ళ మధ్యకు విసురుతూ రబ్బరు బుల్లెట్లతో గాల్లోకి కాల్పులు జరపటం ఆరంభించారు. పోలీసులు గుంపులో జొరబడి లాఠీచార్జీ ఆరంభించారు. అప్పుడే సహస్రను గుర్తించిన పోలీసులు ఇద్దరు ` ''మనం వెదుకుతున్న సహస్రనే ఆ అమ్మాయి. ఇక్కడే ఉంది. పారిపోకుండా చూడండి'' అనరిచాడు.

పరిస్థితి విషమిస్తోందని గ్రహించిన విరాట్ ''సహస్రా ఇక శిఖామణి ఏమయ్యాడనేది వాడి అదృష్టం మీద అధార పడిన విషయం. పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగిస్తున్నారు. మనం పారిపోక తప్పదు'' అంటూ కొంత దూరంలో వీర భద్రుడిలా... రౌడీ మూకల మీద విరుచుకు పడుతున్న మునుసామిని పిలిచాడు. ''గురువు గారు మనం వెళ్ళిపోవాలి మనవాళ్ళు ఒక్కడూ ఇక్కడ ఉండకూడదు. మా గురించి చూడొద్దు. పోలీసులు ఈ ప్రాంతాన్ని పూర్తిగా కవర్ చేయకముందే మనం అవతలికెళ్ళిపోవాలి. త్వరగా'' అనరిచాడు.

''ఒకే చినబాబు మీరు పదండి వచ్చేస్తున్నాం'' అనరిచాడు మునుసామి. సహస్ర తన మనుషులు కదిరేశన్ ని మిగిలిన వాళ్ళని హెచ్చరించింది. వాళ్ళు వేగంగా చెదిరి పోవటం ఆరంభించారు.

''పద వెళ్ళిపోదాం'' అంటూ సహస్ర చేయి పట్టుకున్నాడు విరాట్.

ఆ చేతిని కోపంతో విదిల్చి కొట్టింది సహస్ర.

"వద్దు నేన్నీతోరాను. నీదారి నీది. నాదారి నాది" అంది మొండిగా.

అంత క్లిష్ట పరిస్థితిలోకూడా...

సహస్ర మొండితనం చూడగానే...

విరాట్ కి సర్రున ముంచుకొచ్చింది కోపం.

"చెప్పేది నీక్కాదా. ఇప్పుడూ పెంకి తనమేనా!" అంటూ చెంప మీద ఒక్కటిచ్చాడు. దెబ్బకు సహస్ర కళ్ళలో గిర్రున నీళ్ళుతిరిగాయి. అదే క్షణంలో మరో ఘోరం చోటు చేసుకుంది.

శిఖామణికి నమ్మిన బంటు వేలు. వాడే ఫోన్ లు కొట్టి తమ బేచ్ లను అక్కడికి రప్పించింది. శిఖామణికి ఏ గతి పట్టిందో ప్రత్యక్షంగా చూసాక వాడు సహస్ర మీద పగ-ద్వేషంతో మండిపోతున్నాడు. ప్రాణాలతో సహస్రను వెళ్ళనీకూడదనుకొని ఆవేశంతో పొడవాటి కత్తి ఒకటి పుచ్చుకొని దొంగ దెబ్బ తీయటానికి ఆమె వెనక్కి నక్కి నక్కి వచ్చేస్తున్నాడు. సహస్ర విరాట్లు గొడవపడుతున్న సమయంలోనే కత్తిని లేపి విసురుగా వచ్చేసాడు.చివరి క్షణంలో కంటి కొస నుండి ప్రమాదం గమనించిన విరాట్ సహస్ర చెంపను తాకిన అదే చేత్తోనే ఆమెను భుజం పట్టి వేగంగా పక్కకు లాగేస్తూ ముందుకు దూకి. వేలు కత్తి పట్టిన చేతిని బ్లాక్ చేయ బోయాడు. ఫ్లడ్ లైట్ల కాంతిలో అంచనా తప్పింది. వేలు చేతిలో కత్తి సహస్ర వీపులో దిగటానికి బదులు విరాట్ ఎడం భుజాన్ని రెండంగుళాల లోతున ఆరంగుళాల పొడవున నిలువునా చీరేసింది. అది చూడగానే కెవ్వున అరిచింది సహస్ర. అంతే ఆడ పులిలా, తన విరాట్ ని గాయ పర్చిన వాడి మీదకు దూకింది. ఒకే దెబ్బతో వాడి చేతిలోని కత్తిని లాక్కుని ఒకే వేటు కత్తి పట్టిన వేలు చేతిని భుజం వద్దకు తెగ నరికింది. కత్తి వెంటే చేయి తెగి ఎగిరిపడిరది. బాధతో భయంకరంగా అరిచాడు వాడు. ఈ లోపల ఎగువ నుంచి పోలీసులు దూసుకు రానారంభించారు.

సహస్ర ఆవేశం చూసి ఆమెకు తన పట్ల ప్రేమ తగ్గలేదని విరాట్ కి అర్థమైంది. భుజం గాయం నరకం చూపిస్తుండగా అంత బాధలో కూడా... "వాడ్ని ఎక్కువగా శిక్షించావేమో. చేయి నరక్కుండా ఉండాల్సింది" అన్నాడు.

“వాడు నిన్నో నన్నో చంపితే ఇలా ఆలోచించేవాడివి కాదు. చేయి నరకటం కాదు. ఇలాంటి కుక్కల్ని నడిరోడ్లో ఉరితీయాలి. అప్పుడే ఈ దేశంలో అర్ధరాత్రికూడా ఆడది నిర్భయంగా తిరగ్గలుగుతుంది. ఓట్ల రాజకీయంలో ఇలాంటి రౌడీల్ని పెంచి పోషిస్తున్న రాజకీయ పార్టీల్ని, పోలిసుల్ని అనాలి. వీళ్లని కాదు!” అంది ఆవేశంగా సహస్ర.

విరాట్ తన జేబు రుమాలు తీసి సహస్ర కిచ్చాడు. “ఒకే ఒకే ఆవేశ పడకు. ఇప్పుడైనా కట్టు కడతావా నాకెందుకని వెళ్ళిపోతావా? నెత్తురు పోతోంది” అన్నాడు.

ఆ మాటతో ఒక్క సారిగా...

ఏడుపు ముంచుకొచ్చింది సహస్రకి...

ఇప్పటికిప్పుడు రెండు ప్రమాదాల నుంచి తనని కాపాడాడు. తన ప్రాణం అడ్డం వేసి మరీ కాపాడాడు. ఇంకా విరాట్ ని తను శంకించటంలో అర్థంలేదు. కళ్ళు తుడుచుకుంటూ గాయాల్ని చూసింది. నిజంగానే వరదలా పొంగుతోంది నెత్తురు. చాలా లోతుకు తెగి ఉండాలి. “నావల్లే ఇదంతా నావల్లే” అంటూ రుద్ధ కంఠంతో పలుకుతూ గాయానికి జేబు రుమాలు చుట్టి కట్టు కట్టింది. రుమాలు ఎర్రగా తడిసి పోతోంది. ఆమె ముఖాన్ని తన గుండెలకు హత్తుకొని ప్రేమగా జుత్తు నిమిరాడు విరాట్. “సారీరా కోపంతో నిన్ను కొట్టాను. నువ్వు నా ప్రాణం నీ తర్వాతే ఎవరయినా. అది గ్రహించటంలేదు నువ్వు” అన్నాడు బాధగా.

“ఒకే ముందు మనం వెళ్ళిపోవాలి. పోలీసులు ఇటే వస్తున్నారు” అంది కళ్ళు తుడుచుకుంటూ. ఆమె చేయి అందుకొని అవతలి ఇళ్ళవైపు పరుగు తీసాడు విరాట్. ఈసారి హఠం చేయకుండా అనుసరించింది సహస్ర.

“అదిగో... అదిగదిగో... వాళ్ళిద్దరూ పారిపోతున్నారు. సహస్రను ఆపండి వదలొద్దు” వెనకనుంచి ఒక పోలీసు గొంతు చించుకొని అరుస్తున్నాడు.

ఆ అరుపుల్ని లెక్కచేయకుండా...

సహస్ర విరాట్ లిద్దరూ ఏకమై అటుపక్క యిళ్ళ మధ్యగా సందులోకి పారిపోయారు. లాఠీలు వూపుకొంటూ పోలీసులు వారిని అనుసరించి తరుముకెళ్ళారు. అయితే నాలుగు వీధులు దాటి అయిదో వీధిలో ప్రవేశించేసరికి పారిపోతున్న ఇద్దరూ ఎటు తప్పించుకున్నారో గాని కంటికన్పించకుండా పోయారు. అంతటితో వెనుతిరిగారు పోలీసులు.ఈ లోపల పోలీసులు సంఘటనా స్థలాన్ని పూర్తిగా కవర్ చేసారు. ఫైర్ సర్వీస్ వాళ్ళు తగలబడుతున్న వెహికిల్స్ ని ఆర్పే పనిలో బిజీగా వున్నారు. పారి పోయిన వాళ్ళు పారిపోగా మిగిలిన వాళ్ళు పోలీసులకు పట్టుబడ్డారు. అంతకు ముదే మునుసామి కదిరేశన్ లు వాళ్ళ మనుషులు అక్కడినుంచి తప్పుకొని వెళ్ళి పోగలిగారు. జరుగుతున్నదంతా టివి ఛానెల్స్ వాళ్ళు లైవ్ టెలికాస్ట్ చేస్తూనే ఉన్నారు. పోరాటం ఆగిపోయిన సంఘటనా స్థలంలో పడున్న ఆయుధాలు క్షత గాత్రులు ఆర్తనాదాలతో బీభత్సంగా ఉంది. పోలీసులు గాయ పడిన వాళ్ళని హాస్పిటల్ కి తరలించే పనిలో పడ్డారు. ఇదిలా ఉండగా...ప్రభుత్వానికి అసలు సమస్య...

సరిగ్గా ఇక్కడే మొదలయింది.

సంఘటనా స్థలం నుంచి పారిపోయిన తమ నాయకుడు శిఖామణిని ప్రత్యర్థులు చంపేసారని ఫోన్లమీద ప్రచారం చేయటంతో తేనాం పేట పరిసర ప్రాంతాల్లోని అల్లరి మూకలు ఒక్కసారిగా వీధిన పడ్డాయి. గుంపులు గుంపులుగా రౌడీలు బయలుదేరి వాహనాలు తగల బెడుతూ షాపుల్ని పగల గొడుతూ అరాచకాలకు పాల్పడ్డారు. అప్పటికింకా సమయం రాత్రి తొమ్మిది గంటలు దాటలేదు. పరిస్థితి గమనిస్తున్న వ్యాపారులు షెట్టర్ లు దించేసి షాపులు మూయటం ఆరంభించారు. అల్లర్లు మరింత చెలరేగాయి. అవి విస్తరించక ముందే అణచి వేయాలని ప్రభుత్వ బలగాల్ని రంగంలోకి దించింది ప్రభుత్వం. రౌడీ మూకలు బస్సుల్ని రాళ్ళతో కొట్టడం, తగల బెట్టడం ప్రయివేటు వాహనాల్ని ధ్వంసం చేయటం, షాపుల్ని లూటీ చేయటం ప్రజల్ని తరిమి కొట్టడం వంటి అరాచాకాలకు తెగబడి బీభత్సం సృష్టించాయి. ఆయా ప్రాంతాల్లో వన్ ఫార్టీ ఫోర్ సెక్షన్ పెట్టి కర్ఫ్యూ విధించి కన్పిస్తే కాల్చివేతకు ఉత్తరువిచ్చింది.


చెన్నైలో పరిస్థితి ఇది...

స్టేట్ వైడ్ గా ప్రజలు టివిలకు అతుక్కుపోయి చూస్తున్నారు.

*************************************************************

పోలీసులకు స్లిప్ ఇచ్చిన విరాట్ సహస్రలు ఎక్కడా ఆగకుండా సందుగొందుల వెంట పరుగు తీస్తు పది వీధులకి అవతల ఒక పెద్ద రోడ్ కి చేరుకున్నారు.

ఇప్పుడు ఏం చేయాలి?ఇద్దరి ముందున్న ప్రధాన సమస్య ఇది.ఎలాగో పోలిసుల్ని తప్పించుకొని బయట పడగలిగారు. కాని తన భుజం పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉంది. వెంటనే ట్రీట్ మెంట్ జరగాలి. ఈ ప్రమాదకర స్థితిలో ఏ ఆస్పత్రికెళ్ళినా ట్రీట్ మెంట్ జరక్కపోగా తమని పోలిసులకు పట్టిస్తారు. ప్రస్తుతం ఇంటికి చేరటం కన్న తనకి ట్రీట్ మెంట్ ముఖ్యం. టివి వాళ్ళు లైవ్ టెలికాస్ట్ చేసుంటే ఖచ్చితంగా జనం, పోలిసులు తమని గుర్తుపట్టేస్తారు.తీవ్రంగా ఆలోచిస్తున్న విరాట్ దృష్టి...రోడ్ కి అవతల తమకు సమీపంలోనే ఉన్న ట్వంటీఫోర్ అవర్స్ మెడికల్ షాపుమీద పడిరది.“ఏం చేద్దాం?” ఆందోళన చెందుతూ అడిగింది సహస్ర.



“ఏదో ఒకటి వెంటనే చేయకపోతే ఒంట్లో నెత్తురంతా బయటికి పోయేలా ఉంది. ఆ మెడికల్ షాప్ కి వెళ్ళి రాగలవా?” అన్నాడు పంటి బిగువున బాధను భరిస్తూ.

‘‘ఎలా విరాట్.. ముఖం కవర్ చేసుకోడానికేమీ లేదు. నన్ను గుర్తుపట్టేస్తారు’’ అంది నిస్సహాయంగా సహస్ర.

‘‘ఒకే కొంచెం రిస్క్ చేయక తప్పదు. పద నేనూ వస్తాను’’ అంటూ కదిలాడు విరాట్.

మెడికల్ షాపులో ఒక యువతి కూచుని టివి చూస్తోంది. అంత క్రితమే ఒక వ్యక్తి ఏవో మందులు కొనుక్కొని వెళ్ళిపోయాడు. రోడ్డు నిర్మానుష్యం కాగానే సహస్ర విరాట్ లు వేగంగా రోడ్ దాటి మెడికల్ షాపు ముందుకు వెళ్ళిపోయారు. జరుగుతున్న అల్లర్ల గురించి టివిలో పోలీసు కమీషనర్ ప్రజలకు ఏదో సందేశం ఇస్తున్నాడు. టివిలో వార్తలు మొదలయితే ఆ యువతి తమను గుర్తించే ప్రమాదం వుంది. అటు ఇటు చూసిన విరాట్ కి...

పక్కన చేతికి అందే ఎత్తులోనే కేబుల్ టివి కనక్షన్ వైరు కన్పించింది. అంతే... చప్పుడు కాకుండా కేబుల్ వైరు కట్ చేసి ఏమీ తెలినట్టు లోనకు అడుగు పెట్టాడు. సహస్రను పక్కగా బయటే ఉంచాడు.

టివి ఆగిందని కంగారు పడుతున్న షాపు లేడీ విరాట్ ని చూసి ‘‘ఎవరు మీరు? ఏంకావాలి?’’ అనడిగింది. కంగారుగా. ఆమె చూపులు విరాట్ భుజం గాయం మీద వున్నాయి.

‘‘కంగారు పడకండి మేడం. చిన్న హెల్ప్ చేయాలి. ఇక్కడికి దగ్గర్లోనే మా బైక్ ఆక్సిడెంటయింది. పలుగు రాయి నా భుజాన్ని లోతుకు చీరేసి నెత్తురొస్తుంది. నెత్తురు ఆగటానికి మందులు, ఇంజక్షను యివ్వండి. అలాగే ఒక సూది దారం యివ్వండి.’’ గబగబా తమకి ఏం కావాలో చెప్పేసాడు.

‘‘సూది దారం ఎందుకు? అవిక్కడుండవు’’ అందామె.

‘‘అది లేకపోతే ఆపరేషన్లో వాడే వంపు సూది దారం వున్నా ఇవ్వండి మేడం. మీకు చాలా పుణ్యం వస్తుంది. ఆమె చుడీదార్ వెనక చినిగిపోయి వీపంతా కలబడుతోంది కుట్టాలి’’ అంటూ అయిదు వందల నోటు తీసి కౌంటర్ మీద వుంచాడు.

‘‘చిల్లర ఇవ్వక్కర్లేదు మేడం నేనడిగినది ఇవ్వండి’’ అన్నాడు.

“ఆవిడ ఎవరు?” నోటు తీసుకుంటూ అడిగింది.

“ఆమె నా భార్య” తడబడకుండా చెప్పేసాడు.

ఇక ఆ యువతి సందేహించకుండా విరాట్ అడిగినవన్నీ ఒక కవర్లో వేసిచ్చింది. వాటర్ బాటిల్ కూడా అడిగి తీసుకొని వెనుతిరిగాడు విరాట్. అతడి భార్య వీపు మీద చుడీదార్ ఏమాత్రం చిరిగిందో చూద్దామని షాపులోయువతి రోడ్ దాటుతున్న జంట వంక ఆసక్తిగా చూసింది. సహస్ర వీపు మీద ఎక్కడా చిన్న చిరుగు కూడా కనబడక పోడంతో అవాక్కయింది.

ఆమె చూస్తుండగానే సహస్ర విరాట్ లు ఎదురు వీధిలోకి వెళ్ళి అదృశ్యమయ్యారు.

*******************************************

అక్కడ పోలీసులు సంఘటనా స్థలాన్ని కవర్ చేస్తున్న సమయానికి సుకుమారి ఆమె తన ఇద్దరు బిడ్డలతో చెన్నైనుంచి కంచి వెళ్ళే రూట్లో బస్ లో ప్రయాణం చేస్తోంది.

ఆమె కళ్ళముందు సహస్ర మెదులుతోంది.

సహస్ర ఏమైందోనన్న బెంగతో మాట మాటకి చెమరిస్తున్న కళ్ళు తుడుచుకుంటోంది.

సుకుమారి పుట్టి పెరిగిన వూరు కంచి.

ఆమె తల్లిదండ్రులు ఇద్దరు అన్నలు అంతా అక్కడే వున్నారు. అప్పట్లోనే తనను కంచి వచ్చేయమని బంధువులంతా చెప్పినా ఇల్లు వదులుకోలేక, పిల్లల చదువుల దృష్టిలో ఉంచుకొని చెన్నైలోనే ఉండి జాబ్ చేసుకుంటూ బతుకుతోంది. శిఖామణి లాంటి

గూండా మూలంగా ప్రశాంతంగా ఉన్న తన జీవితం తిరిగి అల్లరి పాలయింది. సమయానికి సహస్ర కాపాడి ఉండకపోతే తన బిడ్డలు అనాధలయ్యేవారు. ఇంతకీ అక్కడ పరిస్థితి ఏమిటి. సహస్ర ఏమైందో తెలిక సుకుమారి మనసు కొట్టుమిట్టాడుతోంది.

ఇంతలో అవతలి సీట్ లో వ్యక్తి ఫోన్ లో సంభాషణ వినగానే అటు చూసింది సుకుమారి.

అవతలి వ్యక్తి చెన్నైలో పరిస్థితి వివరిస్తున్నట్టున్నాడు. వివరాలు అడిగి తెలుసుకుంటున్నాడతడు. సంభాషణ ముగియగానే అతనితో ` ''అయ్యా చెన్నైలో పరిస్థితి ఏమిటి? గొడవలు సద్దు మణిగాయటనా?'' అంటూ ఏమీ తెలీనట్టు అడిగింది సుకుమారి.''లేదమ్మ అక్కడంతా బీభత్సంగా ఉందట'' వెంటనే చెప్పాడతను.

ఆ మాట వినగానే..

సుకుమారి గుండెలు దడదడలాడాయి.

''ఏం జరుగుతోందట? పోలీసులు ఆపలేకపోయారా?'' తనను ఆను కంట్రోల్ చేసుకుంటూ అడిగింది.

''మీరడిగేది జి యన్ చెట్టి రోడ్ లో గొడవ గురించేనా?''

''అవును''

''తేనాంపేట గుండా శిఖామణి ఎవరో స్త్రీని అల్లరి చేస్తుంటే ఒకమ్మాయి వచ్చి ఆమెను కాపాడి పంపించేసి గుండాల్ని చితక్కొట్టిందట. ఆమె తరపున మరో పాతిక ముప్పైమంది వచ్చి శిఖామణి కుర్రాళ్ళని చావగొట్టి చెవులు మూసారట. తర్వాత ప్రమాదంలో వాహనాలకు నిప్పంటుకొని శిఖామణి కుడికాలు నుజ్జునుజ్జయి ఒళ్ళంతా కాలిన స్థితిలో పోలీసులకు చిక్కాట్ట. ప్రస్తుతం శిఖామణితో బాటు గాయపడ్డ వాళ్ళని రాయపేట ఆస్పత్రికి పోలీసులు తరలిస్తున్నారట....''

''ఆ అమ్మాయి.. తనేమైంది?''

‘‘తప్పించుకుంది. వాళ్ళంతా తప్పించుకు పారిపోయారట’’

ఆ మాట వినగానే తేనెజల్లు కురుస్తున్నంతగా...

సంతోష పడింది సుకుమారి.

ఈ లోపల అవతలి వ్యక్తి చెప్తూనే వున్నాడు.

‘‘ఒకందుకు మెచ్చుకోవాలమ్మా. ఆడపిల్లంటే ఎలా వుండాలో ఆ పిల్ల నిరూపించింది. ఏ తల్లి కన్న బిడ్డో గాని, పచ్చినెత్తురు తాగే తేనాంపేట శిఖామణి కొమ్ములు విరిసేసింది. వాడి మనుషుల తాట తీసి పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంది’’ అన్నాడు.

‘‘నిజంగా తను తప్పించుకుందా?’’ అనుమానం తీరక అడిగింది సుకుమారి.

‘‘ఆమెకు సాయంగా ఎవరొచ్చారు?’’

‘‘అదేగా చెప్తున్నాను. పోలీసులకే తెలియంది జనానికేం తెలుసుస్తుంది. రణ రంగంగా మారిన ఆ ప్రదేశాన్ని పోలీసులు ముట్టడించే సరికే వాళ్ళంతా పారిపోగా కొందరు రౌడీలు గాయపడిన వాళ్ళు పోలీసులకు చిక్కారు. గాయపడ్డ వాళ్ళని రాయపేట ఆస్పత్రికి తరలించారట’’‘‘శిఖామణి... ఆ వెధవ ఏమయ్యాడు?’’

‘‘వాడు జీప్ లో పారిపోతూ ఆక్సిడెంటయి. జీపుతో బాటు కొన్ని వాహనాలు తగలబడగా, శిఖామణి కుడికాలు నుజ్జు నుజ్జయి ఒళ్ళుకాలిన స్థితిలో ప్రాణాపాయ స్థితిలో వున్నాట్ట. ఈ విషయం తెలీగానే రౌడీ మూకలు వీధుల్లో పడి అల్లర్లకు తెగబడి పరిస్థితి ఉద్రిక్తంగా ఉందట. పోలీసులు కర్ఫ్యూ విధించారట’’ అంటూ ఫోన్ లో తన మిత్రుడు చెప్పిన విషయాన్ని సుకుమారికి వివరించాడా పెద్దమనిషి.

‘‘ఇంతకీ పోలీసులు ఆ అమ్మాయిని గుర్తించారన్నారుగా. ఆమె ఎవరు?’’ కుతూహలంగా అడిగింది సుకుమారి. సుసాగా ఆమెను గుర్తించి షాపింగ్ మాల్ పేరు బయటకొచ్చిందేమో. అదే జరిగితే తన పేరుతో బయటకొచ్చే అవకాశం ఉందన్న సందేహంతో అడిగింది సుకుమారి. కాని ఆమె విన్న సమాధానం ఆమెకు నిజంగా షాకిచ్చింది.

‘‘కొద్ది రోజుల క్రితం పేపర్లో పట్టిస్తే కోటి రూపాయలంటూ ప్రకటనలో ఓ అమ్మాయి ఫోటో పడింది చూసారా? పేరు సహస్ర. ఆ సహస్రే ఇప్పుడు శిఖామణి నడుంను విరగ్గొట్టింది. ఉండాలి. ఇలాంటి అమ్మాయి వూరికి ఒక్కరున్నా చాలు. దేశంలో రౌడీ అనే వాడుండడు’’ అన్నాడు. తాము షాపింగ్ మాల్ లో సుసాగా పిలుచుకునే అమ్మాయి అసలు పేరు సహస్ర అని తెలిగానే నిజంగానే సుకుమారి షాకయింది. కాని ఆమె తప్పించుకుందని తెలిసి మనసు తేలికపడింది.

ఆమె ఫీలింగ్సోసంబంధం లేకుండా...

బస్సు కంచివైపు పరుగు తీస్తునే వుంది.

*********************************************

‘‘మనం అనవసరంగా తిరుగుతున్నట్టున్నాం. వాళ్ళిటు రాలేదు. వచ్చుంటే ఈ పాటికే మనకి కనబడాలి’’ అన్నాడు సీటు చివర డోర్ పక్కన కూచున్న షూటర్ విక్కీ.

‘‘ఒక పని సాధించాలంటే ఓర్పు సహనం చాలా ముఖ్యం. ఎవరూ డౌటు పడక్కర్లేదు. సహస్ర ఆమె వెంట వున్న యువకుడూ ఇటే వచ్చారు’’ అన్నాడు స్థిరంగా మధ్యలో కూచున్న ధనగిరి.

‘‘మూడు వైపులా పోలీసులు కవర్ చేసేసారు. నాలుగో పక్కకి పోలీసులు వచ్చేలోపు వాళ్ళిద్దరూ ఇటు పారిపోవటం నేను చూసాను. కొందరు పోలీసులు కూడా వాళ్ళని తరుముకెళ్ళారు. కాబట్టి వాళ్ళింకా ఈ ఏరియాలోనే తిరుగుతుంటారు. కనబడగానే ఇద్దర్నీ కాల్చిపారేయండి’’ అంటూ వివరించాడు.

వెనక సీట్లో రెండోవైపు డోర్ పక్కన కూచున్నాడు రెండో షూటర్ డేవిడ్. వాడికి రాకూడని సందేహం వచ్చింది.

‘‘కోప్పడకు. మనికిచ్చిన ఇన్స్ట్రక్షన్స్ ప్రకారం ఆ అమ్మాయిని అనుసరించి ఇల్లు తెలుసుకున్నాక ఇంటి దగ్గరే షూట్ చేయాలి గదా. నువ్వేమిటి ఇక్కడే వేసేద్దామంటావ్. పొరబాటు జరిగితే ఎట్టయప్పతో మాటొస్తుంది గదా!’’ అనడిగాడు.

‘‘వాళ్ళు చెప్పారని మీనమేషాలు లెక్కిస్తే పనులు కావు. త్వరగా పని ముగించామా అవతలికి వెళ్ళిపోయామా అన్నట్టుండాలి. త్యాగరాజన్ సార్ ఫోన్ లో అదే చెప్పారు. పిచ్చి ఆలోచనలు చేయకుండా చెప్పింది చేయండి’’ అన్నాడు. ధనగిరి మాటలు ముగించేసరికి వారి వేన్ ఒక వీధి మలుపు తిరిగింది.

ఆ వీధి అప్పటికే నిర్మానుష్యంగా వుంది. ఇళ్ళలో జనం తలుపులు బిగించి నిద్రలు తీస్తున్నారు. వీధి దీపాలు వెలక్క వీధి చీకటి గుహలా వుంది. హెడ్ లైట్ల కాంతిలో దూరంగా ఒక జంట తమ కెదురుగా నడచుకొంటూ రావటం చూసారు. చూసిన మరుక్షణంలో షూటర్ విక్కీ ఆనందంతో ఉక్కిరి బిక్కిరవుతూ తన షాట్ గన్ అందుకున్నాడు.

‘‘నీ అంచనా ఇంత ఖచ్చితంగా ఉంటుదనుకోలేదు. ఆ వచ్చే యిద్దరూ మనం వెదుకుతున్న వాళ్ళే’’ అనరిచాడు.

‘‘వదలకు. ఇద్దరూ రెడీగా ఉండండి. ఒకేసారి కాల్పులు జరపండి. ఫస్ట్ రౌండ్లోనే ప్రాణాలు పోవాలి గెట్రెడీ’’ అంటూ హెచ్చరించాడు ధనగిరి అంతే`

డ్రయివర్ ఒక్కసారిగా వేన్ స్పీడ్పెంచి వేగంగా ముందుకు దూకించాడు.

*************************************************************

మెడికల్ షాపునుంచి బయలు దేరిన విరాట్ సహస్రలు రోడ్డు దాటి పక్క వీధిలోకి వెళ్ళిపోయారు. కొంత దూరం వెళ్ళగానే అక్కడి నుండి వీధి దీపాలు వెలగటం లేదు. ఆ ప్రాంతం చీకట్లో మునిగివుంది. ఇద్దరూ వడి వడిగా నడుస్తున్నారు.

‘‘ఆమెతో నేన్ని భార్యనని ఎందుకు చెప్పావ్?’’ అంతవరకూ గొంతులో దాచుకున్నా ప్రశ్నను ఇక ఆగలేక అడిగేసింది సహస్ర.‘‘

ఏం? చెప్పకూడదా?'' ఎదురు ప్రశ్నించాడు విరాట్.''అలా చెప్పకపోతే అనుమానించి అడిగినవి ఇవ్వదు. అందుకే అలా చెప్పాను. చెప్పకూడదా? నువ్వు నన్ను పెళ్ళి చేసుకోవా?'' అడిగాడు.

''ఇప్పుడే చెప్పలేను''

''ఎందుకు చెప్పలేవు?''

''ఎందుకంటే నువ్వు నాకు మాత్రమే సొంతం అని పూర్తిగా నమ్మకం కలగాలి.

అప్పుడు''

''ఓహో! సరి నమ్మకం కలగలేదనుకుందాం. అప్పుడేంచేస్తావ్? నన్నుకాదని వేరే వాడ్ని చేసుకుంటావా?''

''నేనలా చెప్పలేదు. ఈ జన్మకి నువ్వే నా మొగుడని ఎప్పుడో డిసైడయిపోయాను.''

''అయితే పెళ్ళి చేసుకో. నువ్వే నా పెళ్ళామని నేనూ ఎప్పుడో డిసైడయిపోయాను''

''అదెలా కుదురుతుంది. పెళ్ళి చేసుకోడానికి నీకు విశాల ఉందిగా. నేనెందుకులే''

''చివరికి దొరికి పోయావ్ చూసావా? నీ సమస్య నేను కాదు విశాల. ప్రస్తుతం నీకు సమస్యల్ని వివరించే ఓపిక నాకు లేదు. గాయం నరాల్ని తోడేస్తోంది. త్వరగా ఏదో ఒకటి చేయాలి. అక్కడ పార్కులో లైటు వెలుగుతోంది పద'' అంటూ శక్తినంతా కూడదీసుకొని నడక వేగం పెంచాడు.అది చిన్న పార్కు. పార్కును చుట్టూ నాలుగు పక్కలా రోడ్డు ఉంది. ఆ పార్కు పరిసరాల్లో మాత్రం కొన్ని లైట్లు వెలుగుతున్నాయి. గేటు తీసే ఉంది. ఆ ప్రాంతమంతా నిర్మానుష్యంగా నిశ్శబ్దంగా వుంది. ఇద్దరూ పార్కులో ప్రవేశించారు. నేరుగా పార్కు సెంటర్ లోని లైట్ కింద తిన్నె మీద కూచున్నారు. చేతిలో ప్లాస్టిక్ కవర్ని వాటర్ బాటిల్ని విరాట్ ముందుంచింది సహస్ర.

బాటిల్లో కూలింగ్ వాటర్ నాలుగు చుక్కలు తాగి పక్కన పెట్టాడు విరాట్. ‘‘కవర్లో సూది దారం ఉంటాయి. దారం ఎక్కించి రెడీగా వుంచు’’ అన్నాడు బాధతో కళ్ళు మూసుకుంటూ.‘‘వద్దు విరాట్ బాధకు తట్టుకోలేవు. మత్తు ఇంజక్షనివ్వకుంటే కుట్టలేం. ఏమయితే అయింది. ఏదో అస్పత్రికి వెళ్ళి పోదాం పద’’ అంది చిన్నగా ఏడుస్తూ సహస్ర.

‘‘ఏయ్ ఇప్పుడేమైందని ఏడుస్తున్నావ్? నీకోసం బతికే ఉంటాను. భయపడక. ఆస్పత్రి అంటూ కొంప ముంచే ఆలోచనలు చేయక. కట్టు విప్పి గాయాన్ని కడుగు చెప్తాను. త్వరగా ’’ అన్నాడు.

కళ్ళు తుడుచుకుని`

అతను చెప్పినట్టు చేసింది.

నెత్తురు ముద్దలా వున్న జేబు రుమాలును నీళ్ళలో తడిపి పిండి, విరాట్ భుజం గాయాన్ని చన్నీటితో కడిగింది. నరకం చూపిస్తోంది గాయం. ఆ గాయాన్ని చూస్తున్న సహస్రకి దుఃఖం ఆగటం లేదు. తన ఎడం చేతిని సహస్ర భుజం మీద వుంచాడు.‘‘పట్టుకో చేతిని కదలకుండా గట్టిగా పట్టుకో’’ హెచ్చరించాడు.సహస్రకు దుఃఖం ఆగటం లేదు.చిన్నగా ఏడుస్తోంది.‘‘ఏడవకు!’’ అన్నాడు కటువుగా.‘‘ఏడ్చి నాయకర్ వంశానికి మచ్చతేవద్దు. నువ్వు సాధారణ యువతివి కాదు. ధైర్య సాహసాలకు నిలయమైన నాయకరాజుల వంశం నీద. ఎన్నో యుద్ధాలు చూసిన వీరవంశం. కష్టాలను కళ్ళలోనే దాచుకుని వీరోచితంగా పోరాడిన వాళ్ళు మీ వంశీకులు. ఎందుకేడుస్తావ్? ఏడిస్తే పనులు కావు. తేనాంపేట కరడు గట్టిన గూండా శిఖామణి కొమ్ములు విరిచి. వాడి అడ్డాను కాల్చి. రౌడీ మూకల్ని చిత్తు చేసిన మహాశక్తివి నీకు ఏడుపేమిటి? నాకే సిగ్గుగా వుంది. ధైర్యం వదలక. మన ప్రయత్నం మనం చేద్దాం. భయ పడక. చేతిని బలంగా పట్టుకో’’ అంటూ సహస్రకు ధైర్యం నూరిపోస్తూనే పళ్ళబిగువున బాధను భరిస్తూ చకచకా సూది-దారంతో గాయానికి కుట్లు వేయటం ఆరంభించాడు. బాధ నర నరాన భగ్గుమన్నా ఆపలేదు. అపితే కుట్టలేడు. చకచకా జరిగిపోవాలి. బద్దలా విడిపోయిన కండను దగ్గరకు చేర్చి తనకు తానే కుట్లు వేసుకున్నాడు.

అంత బాధను ఎలా తట్టుకున్నాడో`

ఎలా కుట్లు వేసుకున్నాడో విరాట్ కే తెలీదు.

చివరి కుట్టు అవగానే`

దారాన్ని పంటితో తెంచింది సహస్ర.

గాయం మీద టించరు పోసి పౌడర్ అద్దేసరికి ప్రాణం పోతున్నంత నరకాన్ని అనుభవించాడు. నిస్త్రాణతో కాస్సేపు సోలిపోయాడు. అతడి ముఖాన చల్లటి నీళ్ళు చల్లి తెప్పరిల్లేలా చేసింది సహస్ర. కొంచెం నీరు తాగి సేద తీరగానే చివరగా యూజ్ అండ్ త్రో సిరంజితో తనకు తానే ఇంజక్షన్ చేసుకొని బాధగా కళ్ళుమూసుకుంటూ అలాగే ఉండిపోయాడు కాస్సేపు.

‘‘ఏం చేద్దాం. ఏదో ఆటో పట్టుకొని ఇంటికెళ్ళిపోదామా?’’ విరాట్ కాస్త తెప్పరిల్లగానే అడిగింది సహస్ర.

‘‘చూద్దాం. ముందు మనం ఏదో ఒక పెద్ద రోడ్డుకి చేరుకోవాలి. వెనక్కి పోలేం. జేబురుమాలు బాగా పిండి కట్టుకట్టు. వెళ్ళిపోదాం’’ అంటూ ఓపిక తెచ్చుకొని లేచాడు.

సహస్ర కట్టుకట్టింది.

నెత్తురు స్రవించటం`

కంట్రోలయింది.

ఇక దుఃఖాన్ని ఆపుకోలేక మరోసారి అతడ్ని కౌగిలించుకొని ఏడ్చేసింది సహస్ర.

‘‘పాపిష్టి దాన్ని. నువ్వు పిలిచినప్పుడే వచ్చేసుంటే ఇలా జరిగేది కాదు. నా వల్లే నీకింత బాధ’’ అంది దుద్ధకంఠంతో. ప్రేమగా ఆమె జుత్తునిమిరి`


నుదురు ముద్దాడాడు.

'నీ కోసం ఎంత బాధనయినా భరిస్తాను. ఆరోజు రైల్లో నిన్ను చూసిన క్షణంలోనే, నువ్వెవరో తెలీక పోయినా ప్రేమించాను. నీ కోసం చచ్చిపోయినా తప్పులేదనిపించింది. ఈ బాధ కన్నా నువ్వు నాకు దూరంగా వుంటేనే ` ఆ బాధ తట్టుకోలేను. నీకన్నా నా ప్రాణం ఎక్కువ కాదు'' అన్నాడు.

ఆ మాటతో తనకు తెలీకుండానే పులకించిపోతూ. ఇక వితండ వాదం చేయకుండా మౌనంగా అతడ్ని అనుసరించింది. పార్కులోంచి బయటికొచ్చి `ఎగువకు నడక ఆరంభించారు.''మన వాళ్ళంతా క్షేమంగా ఇంటికెళ్ళిపోయారంటావా?'' దారిలో అడిగింది.''వెళ్ళే వుంటారు'' చెప్పాడు.''ఇంతవరకు ఫోన్ చేయలేదు...''''కాస్సేపు ఆగి మనమే ఫోన్ చేద్దాం''ఇద్దరూ మాట్లాడుకుంటూ...మూడు వీధులు దాటారు.నాలుగో వీధిలో ప్రవేశించేసరికి అక్కడినుండి కుడి పక్క చిన్న చిన్న ఇళ్ళు గుడిశెలతో స్లమ్ ఏరియా వుంది. ఎడం పక్క మేడలు మిద్దెలు వున్నాయి. ఆప్రాంతంలో కరెంటు లేక పోవటం, అప్పటికే రాత్రి పదిన్నర దాటడంతో ఏయింట్లోను దీపాలు వెలగటం లేదు. చాలామంది నిద్రపోతున్నారు. వీధి నిర్మానుష్యంగానే వుంది. అంతలో ఎగువన మలుపులోకి వస్తున్న ఏదో వెహికిల్ హెడ్లైట్ల కాంతి చప్పున ఫోకస్ అవటం ఇద్దరూ చూసారు. క్షణం తర్వాత అది మలుపు తిరిగి ఇటే రావటం కన్పించింది.

''ఎవరు? పోలీసులంటావా?'' అనుమానంగా అడిగింది సహస్ర.

''మనం పోలీసులు లోకల్ గూండాల గురించే ఆలోచిస్తున్నాం. మధురై నుండి నిన్ను చంపటం కోసం వచ్చిన ఎట్టయ్యప్పన్ పంపించిన మనుషుల గురించి ఆలోచించటం లేదు. ఇంత వరకు వాళ్ళు మన కంట పడలేదు. మిగిలిన అందరి కన్నా మన కోసం ఎక్కువ గాలించేది వాళ్ళే. వాళ్ళు కావచ్చని సందేహంగా వుంది. అదో... ఉన్నట్టుండి వేగం పుంజుకుందా వేన్. వచ్చేది ధనగిరి బేచ్ అయితే వాళ్ళ దగ్గర రివాల్వర్లుంటాయి. మనం జాగ్రత్తగా ఉండాలి. వాళ్ళు మనల్ని గుర్తించి వేగంగా వస్తున్నారు. మనం తప్పుకోడానికిక్కడ అవకాశం లేదు. జాగ్రత్త గెట్ రెడీ'' అంటూ డాగర్ అందుకున్నాడు విరాట్. చూస్తుంటే సహస్రకు విరాట్ మాటలు నిజమనిపించింది. అసలే విరాట్ పరిస్థితి బాగ లేదంటే పులిమీద పుట్రలా ఇదొకటి. కోపంతో వూగి పోతూ గుప్పెడులా వుండే పలుగు రాళ్ళు రెండు అందుకుంది. ఈ లోపల...సమీపంలోకి రానే వచ్చేసిందా వేన్.



కళ్ళు జిగేల్ మన్పించే హెడ్ లైట్ల కాంతిలో కూడా వేన్ డోర్లో లేచి షాట్ గన్ ఎక్కు పెడుతున్న వ్యక్తిని గుర్తించాడు విరాట్. 'ధన్' మంటూ ఘర్జించింది షాట్ గన్. విరాట్ సహస్రను పక్కకు లాగుతూ చేతిలోని డాగర్ని ప్రయోగించాడు. గాలిని చీల్చుకొంటూ దూసుకెళ్ళిన డాగర్ షాట్గన్ వ్యక్తి గొంతులో దిగబడింది. వాడు షూటర్ విక్కీ. డాగర్ గొంతులో దిగబడగానే అరిచే అవకాశం కూడా లేక గన్ వదిలేసి డోర్ బార్లా తెరుస్తూ విరుచుకు పడిపోయాడు రోడ్ మీదకి.

"విక్కీ.. ఏమైందిరా? ఏమైంది?" పక్కనున్న ధనగిరి ఆందోళనగా అరుస్తూనే వున్నాడు. విక్కీ షాట్ గన్ ప్రయోగించినప్పుడే వెనక రైట్ డోర్లో వున్న డేవిడ్ రివాల్వర్ తో కాల్పులు జరిపాడు. విరాట్ సహస్రలు వెనక్కు దూకారు. సహస్ర చేతిలో పలుగు రాళ్ళు సుడిగాలిలా వెంటవెంటనే దూసుకెళ్ళి ఏక కాలంలో వేన్ ఫ్రంట్ గ్లాస్ ని తాకి, భళ్ళున పగలగొట్టాయి. అద్దం ముక్కలు ముఖం మీదకు చిమ్మి డ్రయివరు కెవ్వుమంటూ స్టీరింగ్ వదిలేసి చేతులతో ముఖాన్ని కప్పుకున్నాడు.

అంతా రెప్పపాటుకాలంలో...

చకచకా జరిగి పోయిన...

వూహించని సంఘటనలు...

కంట్రోల్ తప్పిన వేన్ రోడ్డు మీద అటూ యిటు అడ్డ దిడ్డంగా కొంత దూరం విరాట్ సహస్రలను దాటి పరుగెత్తి వేగంగా ఎడం పక్క మురుగు గుంటలోకి దూకేసి పక్కకు ఒరిగిపోయింది. లోతయిన మురుగు గుంట. డేవిడ్ కి మూడు రౌండ్ల తర్వాత వేన్ కంట్రోల్ తప్పటంతో కాల్పులు జరిపే అవకాశమే లేకపోయింది. అదే సమయంలో సహస్రకు జరిగిన ప్రమాదాన్ని కొద్ది క్షణాలు ఆలస్యంగా గుర్తించాడు విరాట్.వాళ్ళిద్దరూ నిలబడిన చోట పక్కనే పెద్ద భవంతి రోడ్ నానుకునే ఉంది. భవంతి రెండో అంతస్థు సన్ షేడ్ వెంట అందానికి తాళ్ళతో వేలాడ దీసిన పూల కుండీలు కొన్ని వున్నాయి. సహస్ర సరిగ్గా వాటి కింద ఉంది. దేవిడ్ జరిపిన కాల్పుల్లో తామిద్దరూ తప్పించుకున్నారు. కాని గురితప్పిన బుల్లెట్ ఒకటి నేరుగా పైకిపోయి ఒక కుండీ తాళ్ళను తెంచేసింది.సరిగ్గా ఆ కుండీ కింద నిలబడుంది సహస్ర. దెబ్బతిన్న పక్షిలా తూలుతూ తమను దాటి పోతున్న వేన్ ని చూస్తుండటంతో మీద పడుతున్న ప్రమాదాన్ని గుర్తించలేక పోయింది. తాడు తెగి జారిన పూలకుండీ సూటిగా వచ్చి సహస్ర తలమీద పడిన్ది. అంతే.........

తల మీద పిడుగు పడినంత బాధతో పెద్దగా అరుస్తూ తెలివి తప్పి విరుచుకు పడిపోయింది.

అలా పడి పోతున్న సహస్రను ఒడిసి పట్టుకున్నాడు విరాట్. ఎడం భుజం గాయం కలుక్కుమంది.''ఓ మైగాడ్ ఎంత ఘోరం జరిగింది. సహస్ర... సహస్ర'' అంటూ బుగ్గలు తట్టాడు. సహస్రలో కదలిక లేదు. తలమీద నెత్తురు చిక్కగా చేతికి తగిలింది. చిమ్మ చీకట్లో ఏమీ తెలిటం లేదు. ఈ సంఘటనతో పిచ్చెక్కిపోయాడు విరాట్. పూల కుండి నేరుగా తల మీద పడ్డంతో తల చిట్లిందో పగిలిందో ఏమైందో అర్థం కాలేదు. కోపంతో వీరభద్రుడై పోతూ సహస్రను కింద పడుకోబెట్టాడు.

వేగంగా పరుగెత్తి రోడ్ మీద పడున్న విక్కీ శవాన్ని కాళ్ళతో తన్ని పక్కన పడున్న షాట్ గన్ అందుకున్నాడు. ''చంపేసారు గదరా. నా సహస్రను చంపిన మిమ్మల్ని క్షమించను'' అనరుస్తూ గుంటలో పడిన వేన్ వైపు పరుగెత్తాడు. వేన్ డ్రయివరు అప్పుడే వేన్ లోంచి బయట పడి రోడ్ ఎక్కాడు. వెనక డోర్ లోంచి డేవిడ్. మరొకరు ఎలాగో బయట పడ్డారు. వేన్ లోంచి అరుపులు ఆర్తనాదాలు విన్పిస్తున్నాయి. వేన్ కింద బురదలో చిక్కి ఎందరు పోయారో తెలీదు.

వేన్ని సమీపిస్తూనే విరాట్ నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపాడు. షాట్ గన్ గుళ్ళకి ముందుగా రోడ్డెక్కిన ముగ్గురూ చావు కేకలతో

విరుచుకు పడి ప్రాణాలు వదిలారు. అప్పుడే పైకి రాబోతున్న ధనగిరి తల వెనక్కి తీసుకొని లోపలే ఉండిపోయాడు. కోపం తీరక వేన్ మీద మరో రౌండ్ కాల్పులు జరిపి వెళ్ళినంత వేగం గానూ వెనక్కి వచ్చేస్తూ షాట్ గన్ని మురుగు గుంటలోకి విసిరేసాడు. సహస్రలో మార్పులేదు.చలనం లేకుండా పడుంది. తన షర్టు చించి ఆమె తలకు కట్టు కట్టాడు.

గన్ సౌండ్స్, కేకలు చుట్టుపక్కల వాళ్ళను అలర్ట్ చేసాయి. టార్చి లైట్లతో ఇళ్ళలోంచి జనం బయటకు వస్తున్నారు. ఇక ఒక్క క్షణం తనిక్కడున్నా ప్రమాదమని గ్రహించాడు. విరాట్ శక్తినంతా కూడ దీసుకుని కుడి చేత్తోనే సహస్రను లేపి భుజం మీద వేసుకొని కాలి కొద్ది చీకట్లలో ఎగువకు పరుగు తీసాడు.

కాల్పులు ఆగిపోయిన మరుక్షణం వేన్ లోని ధనగిరి పైకి వచ్చేసాడు. అతనితో బాటు మరో ముగ్గురు మాత్రం రాగలిగారు. అప్పటికే చుట్టు పక్కల వాళ్ళు లేచి వస్తున్న అలికిడి గావటంతో వాళ్ళంతా మరో దిశగా చీకట్లలో అదృశ్యమయ్యారు. చుట్టు పక్కల వాళ్ళు మురుగు గుంట వద్దకు వచ్చి టార్చిలైట్లు ఫోకస్ చేసేసరికి లోపలి నుంచి ఇంకా మూలుగులు అరుపులు విన్పిస్తున్నాయి. రోడ్డు మీద శవాన్ని చూసి అదిరి పడ్డారు. పోలీసులకు ఫోన్ చేసారు. ఇంతలో పోలీస్ పెట్రోలింగ్ వేన్ ఒకటి అటుగా వచ్చింది. సంఘటన గురించి తెలిగానే కంట్రోల్ రూమ్ కి సమాచారం అందించారు. వేన్ లో ఇంకా ప్రాణాలతో చిక్కుబడి ఉన్న వాళ్ళని స్థానికుల సాయంతో బయటకు తీసే పని ఆరంభించారు పోలీసులు.

సహస్రను భుజాన వేసుకుని బయలు దేరిన విరాట్ ఎక్కడా ఆగలేదు. ఎడం భుజం గాయం నరకం చూపిస్తోంది. సహస్రను భుజం మార్చుకోలేడు. శక్తినంతా పాదాల్లోకి తెచ్చుకొని వేగంగా ఆ చీకట్లలో నడచి పోతూనే వున్నాడు. తమ కోసం ఒక పక్క పోలీసులు మరో పక్క శిఖామణి తాలూకు గుండాలు గాలిస్తుంటారని తెలుసు. ఇప్పుడు తమను అటాక్ చేసింది ఖచ్చితంగా ధనగిరి బేచ్ మనుషులే. వాళ్ళలో ఎందరు చచ్చారో ఎందరు బతికారో తెలీదు. గెలుపు తమదైనా సహస్ర గాయపడ్డంతో ఓడినట్టే లెక్క. వూహించని ప్రమాదం యిది.ఈ పరిస్థితిలో మరో గ్రూపు ఏదన్నా ఎదురు పడితే వాళ్ళని ఎదిరించే శక్తి ఓపిక తనకు లేవు. తన పరిస్థితి అర్ధం గాక ముందే సహస్ర ప్రమాదంలో పడింది. ముందు తమను కాపాడుకోవటం ముఖ్యం.

సుమారు ఫర్లాంగు దూరం భుజాన సహస్రతో శక్తినంతా కూడ దీసుకొని చీకట్లలో పరుగెత్తాడు. ఒళ్ళంతా చెమటలు కారుతోంది దుస్తులు రక్తసిక్తమయ్యాయి. క్రమంగా శక్తి సన్నగిల్లుతోంది. కళ్ళు తిరిగి పడిపోవచ్చనే సందేహం కలుగుతోంది. ఇంతలో కుడి పక్క సువిశాలమైన ప్లే గ్రౌండ్ కన్పించింది. పార్కుల్లాగే వీటినీ మెయింటెన్ చేస్తారు. అప్పుడప్పుడూ స్పోర్ట్స్ గాని ఇతర ఈవెంట్స్ గాని కండక్ట్ చేస్తారు. గ్రౌండ్ కి ఒక మూల వ్యాయామం చేస్తారు.      ప్లే గ్రౌండ్ కి నాలుగు పక్కలా వుండే రోడ్ వెంట ఉదయమే వాకర్స్ నడుస్తుంటారు.

ఆ ప్రాంతం పేరు గుర్తు లేదు. గాని గతంలో ఒకటి రెండు సార్లు ఈ ప్రాంతానికి వచ్చిన గుర్తు. ప్రస్తుతం ఇలా వీధుల్లో తిరగటం కన్నా

గ్రౌండ్ లోకి వెళ్ళి పోవటం మంచిదనిపించింది. వెంటనే గ్రౌండ్ లో అడుగు పెట్టి అవతలి వైపుకి నడక ఆరంభించాడు. చిమ్మ చీకటి అడుగులు తడబడుతున్నాయి. కళ్ళు తిరుగుతున్నట్టుంది. అధిక రక్త స్రావం తన ప్రభావాన్ని చూపిస్తోంది. విల్ పవర్ కూడగట్టుకొని నడుస్తున్నాడు. అంతలో అతడి సెల్ ఫోన్ మోగింది ఇప్పుడు ఆగి ఫోన్ తీసే ఓపిక లేదు. బహుశ చందూ చేసుండొచ్చు జేబులోంచి సెల్ తీసి స్విచ్ ఆఫ్ చేసేసాడు.

క్షణం తర్వాత తిరిగి సహస్ర చుడీధార్ జేబులో సెల్ రింగవటం ఆరంభించింది. దాన్ని కూడ స్విచ్ ఆఫ్ చేసాడు. క్రమంగా అడుగులు తడబడుతున్నాయి. అడుగు తీసి అడుగు వేయటం కష్టంగా ఉంది. భుజం మీది సహస్ర శరీరం క్రమంగా పది టన్నుల బరువైపోతున్నట్టు తోస్తోంది. తనకు తెలికుండానే కళ్ళు కన్నీటిని వర్షిస్తున్నాయి.

ఎలాగో చివరికి ప్లే గ్రౌండ్ అవతలికి చేరుకున్నాడు. ఇక ముందుకెళ్ళే పరిస్థితి లేదు. కళ్ళు తుడుచుకొని అటు ఇటు చూసిన విరాట్ కి ప్లే గ్రౌండ్ నానుకొని రోడ్డు పక్క చెత్తకుండీ, దాని వెనక పేరుకొని వున్న చెత్త మీద పడిన్ది. ప్రస్తుతం తాము తలదాచుకోడానికి ఇంతకన్నా అనువైన చోటు దొరకదనిపించింది. తను తెలివి తప్పే లోపు సురక్షతమైన చోట వుండాలి.

ఇక క్షణం కూడా ఆలోచించ లేదు విరాట్...

కుప్ప తొట్టి వెనక చెత్త చెదారం వైపు వెళ్ళాడు. దుర్వాసన వస్తున్నా భరిస్తూ కళ్ళు చించుకొని చూసాడు. అక్కడ చినిగిన చాపలు ఏవో రెండు మూడు పడున్నాయి. సహస్రను నేలకు దించాడు చెత్త పక్కనే ఒక చాపను పరిచి సహస్రను ఆ చాప మీద పరుండ జేసాడు. పక్కనే తనూ పడుకుని మరోచాపను తమ ఇద్దరిపైకి కప్పుకున్నాడు. ఇప్పుడు ఎవరన్నా అటుగా వచ్చినా చెత్త కుప్ప వెనక ఎవరో దాక్కున్నారని కనిపెట్టలేరు. ఆ చెత్తకుండీ ఎదురు గానే ఒక రోడ్ నేరుగా పోతోంది. విరాట్ తన సెల్ తీసి ఆన్ చేసాడు. ఇప్పుడున్న స్థితిలో చందూకి ఫోన్ చేసి లాభం లేదు. బైక్ మీద తమని పికప్ చేయలేడు. మునుసామికి ఫోన్ చేయొచ్చు. కాని అతడు చెన్నైకి కొత్త. వెంటనే తమకు చికిత్స అందకపోతే తెల్లవారే లోపలే ప్రాణాలు పోవటం ఖాయం. చివరి క్షణంలో కళ్ళ ముందు మెదలింది విశాల మాత్రమే.

ఆలస్యం చేయకుండా... విశాలకు ఫోన్ చేసాడు. రింగయిన వెంటనే లైన్ లో కొచ్చింది విశాల.

"విరాట్.....ఎక్కడున్నావ్?" దుఃఖంతో పూడుకుపోతున్న గొంతులో పెద్దగా అరిచేసింది విశాల. "ప్రస్తుతం ప్రమాద స్థితిలో వున్నాను" బలహీన స్వరంతో బదులిచ్చాడు.

‘‘అక్క…. అక్కసహస్ర ఎక్కడ?’’

‘‘నా పక్కనే వుంది. తల మీద పూలకుండీ పడి ప్రమాద స్థితిలో తను తెలివి తప్పి పడుంది. నా భుజానికి బలమైన గాయం తగిలి చాలా రక్తం పోయింది. కళ్ళు తిరుగుతున్నాయి. శతృవుల నుంచి కాపాడుకుంటూ ఎలాగో ఇంత వరకు సహస్రను తీసుకొచ్చాను….’’‘‘ఓ మైగాడ్………భయపడుతూనే వున్నాను. అలాగే జరిగింది ఇప్పుడు ఎక్కడున్నారు.?’’

‘‘ఏయ్… టివి చూస్తునే వున్నావా?’’

‘‘రెండు గంటలుగా టివికి అతుక్కు పోయి చూస్తున్నాను. జియన్ చెట్టి రోడ్ లో జరిగిందంతా లైవ్ టెలికాస్ట్ చేసారు. ప్రస్తుతం అల్లర్లు జరుగుతున్న ప్రాంతాలు చూపిస్తున్నారు. మీ పరిస్థితి ఏంటో తెలికుండా ఫోన్ చేయకూడదని ఇంత వరకు చేయలేదు…’’‘‘ఒకె ఒకె…. చెప్పేది జాగ్రత్తగా విను.’’

‘‘చెప్పు విరాట్’’ అంటూ ఏడ్చేసింది విశాల.

‘‘ఏయ్ ఇప్పుడు ఏడ్వకూడదు. ధైర్యం కావాలి. ఏడిస్తే పనులు కావు. మా కోసం రిస్క్ తీసుకోగలవా? నువ్వు తప్ప ఈ చోటు మన వాళ్ళెవరికీ తెలీదు.’’

‘‘మీ కోసం ప్రాణమే ఇస్తా. ఎంత రిస్కయినా చేసి మిమ్మల్ని కాపాడుకుంటాను. చెప్పు ఇప్పుడు ఎక్కడున్నారు?’’‘‘ఈ ప్రాంతం పేరు నాకు గుర్తులేదు. జియన్ చెట్టి రోడ్డులో గొడవ జరిగిన ప్రాంతానికి ఆనుకొనున్న ఇళ్ళమధ్యగా లోపలికొచ్చేస్తే’’ అంటూ ప్లే గ్రౌండ్ వివరాలు చెప్పాడు.‘‘ఆ ప్రాంతం నాకు తెలుసు. నీ బ్లడ్ గ్రూప్ ఏంటి?’’

‘‘ఎ బి పాజిటివ్’’

‘‘సహస్ర బ్లడ్ గ్రూప్ తెలుసా?’’

‘‘ఓ పాజిటివ్’’

‘‘కుప్ప తొట్టి వెనకాలే మీరున్నారా?’’

‘‘అవును... బహుశ.... నువ్వొచ్చే సరికి నేను స్పృహలో ఉండను. నమ్మకమైన వారిని ఎవరినన్నా వెంట... తీసుకు...’’ అంతవరకే చెప్పగలిగాడు. అంతటితో శక్తి పూర్తిగా హరించుకు పోయింది. అంతే...

చివరి అక్షరం పలక్కముందే...

స్పృహ తప్పి తలవాలేసాడు... జరిగిన పొరబాటు... తాము కుప్పతొట్టి వెనకే...చాప కింద వున్నామని చెప్పటం మర్చిపోయాడు.. విరాట్ హౌస్....

చందు, దీక్ష మునుసామి కదిరేషన్ లు వాళ్ళ మనుషులు అంతా అక్కడే వున్నారు. అందరూ హాల్లో సమావేశమై ఉన్నారు. టివి రన్నవుతూనే వుంది. అక్కడున్న ప్రతి ఒక్కరిలోనూ ఆతృత ఆందోళన కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి.

దీక్షయితే చందూ వెంట ఇక్కడికే వచ్చేసింది. ఇంత వరకూ ఇంటికి వెళ్ళలేదు. రోజూ సహస్రతో కలిసి ఇంటికొచ్చే అలవాటు. ఇప్పుడు ఒంటిగా వెళ్ళబుద్ధి గావటం లేదు. తమను వెళ్ళి పొమ్మని హెచ్చరించిన విరాట్ సహస్రలు ఇంత వరకు ఇంటికి చేరక పోవటం పెద్ద మిష్టరీగా ఉంది అందరికీ.

రాత్రి పదకొండు గంటలవుతున్నా...

ఇంత వరకూ ఎవరూ భోంచేయలేదు...

మునిసామి శిష్యుడు బండ శివ వంట వార్పు తెలిసిన వాడు. కదిరేషన్ కజిన్ సాయంతో రెండు సార్లు అందరికీ టీ యివ్వటంతో బాటు అందరికీ టిఫిను తయారు చేయటం ఆరంభించారు.

అల్లర్లు జరుగుతున్న ప్రాంతాలు, కర్ఫ్యూ విధించిన ప్రాంతాల్ని టివిలో చూపిస్తూ మధ్య మధ్య పరిస్థితి వివరిస్తూ వార్తలు చెప్తున్నారు.ఒక వేళ…

విరాట్ సహస్రలు పోలీసులకు దొరికి పోయి వుంటే ఈ పాటికే ఆ వార్త ప్రముఖంగా టివిలో రావాలి అలాంటి సూచనలేదు. మరి ఇద్దరూ ఎటు పోయినట్టు ఏమైనట్టు? గుండాలకు చిక్కి ఉంటారా? ఛాన్సే లేదు, ఏభైమందినైనా పడగొట్టే శక్తి ఇద్దరికీ వుంది.పోలీసులు సంఘటన స్థలాన్ని పూర్తిగా కవర్ చేయకముందే వెళ్ళి పొమ్మని తమను హెచ్చరించిన విరాట్ సహస్రలు ఇంతవరకు ఇంటికి రాలేదు. ఫోన్ చేయలేదు. ఏమయ్యారు? క్షణ క్షణానికీ ఉత్కంఠ పెరిగి పోతోంది అందరిలో. అది తట్టుకోలేక అప్పటికే మునుసామి బాటిల్ ఓపెన్ చేసి కూచున్నాడు. వాళ్ళ ఫోన్ కోసం ఎదురు చూసి చూసి చివరకి చందు విరాట్ కి ఫోన్ చేస్తే రింగయినా ఫోన్ని స్విచ్చాఫ్ చేసాడు. దీక్ష సహస్ర సెల్ కి ఫోన్ చేసినా అదే జరిగింది? కనీసం ఒక్కమాట కూడ చెప్పకుండా ఫోన్ లు స్విచ్చాఫ్ చేయటాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలీక తల పట్టుక్కూచున్నారు. జరిగిన పోరాటంలో…

గుండా శిఖామణి వాడి కుర్రాళ్ళు భారీగా నష్టపోయిన మాట నిజమే. అయినా తమ వైపు కూడ కొంత నష్టం జరిగింది. మునుసామి మనుషుల్లో ఇద్దరు, కదిరేషన్ మనుషుల్లో ముగ్గురు మిస్సవటం ఇంటికొచ్చాక గాని తెలీలేదు. వాళ్ళ గురించి ఆందోళన పడుతుండగా టివిలో పట్టుబడిన గుండాలను చూపిస్తున్నప్పుడు, వాళ్ళలో తమవాళ్ళు అయిదుగురూ కూడ ఉన్నందుకు సంతోషించి కాస్త తేలిగ్గా వూపిరి తీసుకున్నారు. వాళ్ళని ఎలాగోలా తర్వాత బయటికి తీసుకు రావచ్చు కాని మిస్సయిన విరాట్ సహస్రల గురించే అంతా టెన్షన్ పడుతున్నారు.

చందూ మళ్ళీ విరాట్ సెల్ కి ఫోన్ చేయబోతుంటే వారించింది దీక్ష.

"చేసింది చాలు ఇక ఆపు, వాళ్ళిద్దరూ ఏ పరిస్థితిలో వున్నారో ఏంటో వాళ్ళ గురించి ఎంతో కొంత సమాచారం తెలియాలంటే విశాలని కాంటాక్ట్ చేయటం మంచిది. విశాల సెల్ నంబరుందా నీ దగ్గర?" అంది.

ఇంత వరకు తనకీ విషయం తట్టనందుకు తనను తానే తిట్టుకున్నాడు. విశాల సెల్ నంబర్ కి ఫోన్ చేసాడు. వెంటనే లైన్ లో కొచ్చింది విశాల.

“ఏమ్మా… విరాట్ సహస్రల జాడ తెలీక టెన్షన్ పడుతున్నాం. జరిగింది టివిలో చూసుంటావ్? నీకేమన్నా విరాట్ ఫోన్ చేసాడా?” అనడిగాడు.“అన్నయ్యా ఇంతకు ముందే నాకు ఫోన్ చేసాడు. నేను బయలుదేరుతున్నాను. పక్కన ఎవరన్నా వున్నారా? కొంచెం దూరంగా రా చెప్తాను” అటు నుంచి అంది విశాల.

వెంటనే ఇంట్లోంచి బయటికొచ్చేసాడు.

“చెప్పమ్మా ఎక్కడున్నారు వాళ్లు”

“పరిస్థితి బాగలేదు, ఓ పని చేయ గలవా?”

“ఏం చేయాలి చెప్పు. వాళ్ళ క్షేమం ముఖ్యం.”

“వెంటనే నువ్వొక్కడివే బయలుదేరి రాగలవా?”

“చెప్పమ్మా, వస్తాను, ఒక్కడ్నే వస్తాను”

“జియన్ చెట్టి రోడ్ కి అటు పాండీ బజార్ నుంచి లజ్ కార్నర్ కెళ్ళే రోడ్ కి మధ్య ప్రాంతంలో స్లమ్ ఏరియా దాని పక్కన ఒక పెద్ద ప్లే గ్రౌండ్ ఉంటాయి. ఆ ప్రాంతం నీకు తెలుసా? ”

“లేదమ్మా అటు లోనకెప్పుడూ వెళ్ళలేదు ”

“అయితే ఓ పని చెయ్యి, నేరుగా పాండీ బజార్ కి వచ్చెయ్, నీ కోసం ఆంధ్రా బ్యాంక్ ముందు వెయిట్ చేస్తుంటాను. నా కారు నంబర్ తెలుసుగా ”

“వచ్చేస్తాను. ఇప్పుడే బయలుదేరుతున్నాను.”

“ఎంత సేపట్లో రాగలవ్?”

“జస్ట్ పావు గంట లేదా ఇరవై నిముషాలు మించదు”

“వచ్చేయ్ ఒక్కడివేరా. వాళ్ళు క్షేమంగా వున్నారు. ఎవర్నీ భయపడవద్దని చెప్పు. అలాగే ఈ రాత్రికి ఎవరికీ ఫోన్ చేయొద్దని చెప్పు. ముఖ్యంగా విరాట్ సెల్ కి. నీవు వెళ్ళటం లేటు కావచ్చు. ఎదురు చూడొద్దని చెప్పు. తర్వాత ఫోన్ చేద్దాం, బయల్దేరు” అంటూ లైన్ కట్ చేసింది విశాల.

విశాల చెప్పినట్టే లోనకొచ్చి...

అందరికీ చెప్పాడు చందూ.

అతను బయలుదేరుతుంటే మునిసామి అడిగాడు.

“వాళ్ళెలా వున్నారో ఏమిటో వాళ్ళని చూడాలని మాకూ ఉండదా, మన వేన్ ఉందిగా, అందులో వెళ్దాం” అన్నాడు.“సిటీలో పరిస్థితి బాగ లేదు. తెలుసుగా. నే వెళ్ళొచ్చేస్తాను. టెన్షన్ పడకుండా భోంచేసి పడుకోండి” అంటూ దీక్షతో కూడ తన గదిలో పడుకోమని చెప్పి బైక్ తీసి బయలుదేరాడు చందూ.

“నాకేదో భయంగా వుంది చందూ” అంది బయటి కొచ్చిన దీక్ష కన్నీళ్ళతో ఆమె భుజం తట్టి ధైర్యం చెప్పాడు.”“అధైర్య పడకు. వాళ్ళు క్షేమంగా ఉంటారు. వస్తాను” అంటూ బైక్ ను బయటికి దూకించాడు చందూ.

విరాట్ నుంచి ఫోన్ రాగానే..

టివి ఆఫ్ చేసి హడావుడిగా...

బయలు దేరింది విశాల...

మెట్ల మీద కొస్తూ సెల్ అందుకుని.

ఆమె ప్రస్తుతం ఎం జి ఆర్ వైద్య కళాశాలలో సర్జన్ గా పనిచేస్తోంది. శస్త్ర చికిత్సలో మంచి పేరుంది. అలాగే ఇంటి దగ్గర క్లినిక్ వుంది.



ఒక నంబర్ కి ఫోన్ చేసింది.

"ఏమిటే... ఈ టైంలో గుర్తొచ్చానా ఫోన్ చేసావ్?" అటు నుంచి ఒక లేడీ గొంతు పరిహాసంగా అడిగింది.

ఆ గొంతు తాలూకు లేడీ పేరు గుణ దీపిక.

ఆమె ప్రస్తుతం ఎం జి ఆర్ వైద్య కళాశాలలో సర్జన్ గా పనిచేస్తోంది. శస్త్ర చికిత్సలో మంచి పేరుంది. అలాగే ఇంటి దగ్గర క్లినిక్ వుంది.

మేడ పైన కాపురం కింద అంతా ఆస్పత్రి. శస్త్ర చికిత్సకు అన్ని వసతులు వున్నాయి.

"గుర్తు రావటం కాదు నీ హెల్ప్ కావాలి. చాలా అర్జంటు" అంది విశాల.

"ఏ విషయంలో చెప్పవే? నీ గొంతు అదోలావుంది. మమ్మీ క్షేమమే కదా?" వెంటనే అడిగింది గుణ దీపిక.

"అంత టైం లేదు. నాక్కావలసిన వాళ్ళిద్దరూ చాలా ప్రమాదంలో వున్నారు. ఓగంట లోపే వాళ్ళని తీసుకొస్తున్నాను. ఆపరేషన్ అవసరం పడొచ్చు. అంతా రెడీ చేసుకునుండాలి......."

"ఆగాగు...........నువ్విలా రెండు ముక్కల్లో చెప్పేస్తే ఎలా అర్ధమవుతుంది......"

"ఇంతకుమించి చెప్పే టైంలేదు. ప్లీజ్..........వాళ్ళని నువ్వే కాపాడాలి...." అంటూ ఏడ్చేసింది విశాల. తనకు తాను కంట్రోల్ చేసుకోవటం కష్టంగా వుంది.

"ఒకె ఒకె ఏడవకు. రెండే రెండు ప్రశ్నలడుగుతాను చెప్పు" అంది అవతిలి గుణదీపిక.

"అడుగు" అంది కళ్ళు తుడుచుకుంటూ.

"వాళ్ళిద్దరూ ఎవరు? స్త్రీలా.... పురుషులా?"

"ఒక మగ ఒక ఆడ"

"బ్లడ్ గ్రూపు ఏమిటి?"

‘‘అతని బ్లడ్ గ్రూప్ ఎబి పాజిటివ్, ఆమె బ్లడ్ గ్రూప్ ఓ పాజిటివ్?’’

‘‘బట్ ఈ విషయం చాలా రహస్యంగా ఉండాలి. అంతా తర్వాత చెప్తాను గెట్ రెడీ’’ అంటూ లైన్ కట్ చేసి చక చకా మెట్లు దిగుతుండగా చందు ఫోన్ చేసాడు.

ఒక్క క్షణం ఆలోచించింది విశాల. వాళ్ళని కార్ లోకి చేర్చటం తన ఒక్క దానివల్ల సాధ్యం గాక పోవచ్చు. నమ్మకమైన ఒకర్ని వెంట తీసుకు రమ్మని విరాట్ చెప్పాడు. చందూ కన్నా నమ్మకమైన వాళ్ళెవరు? అందుకే చందూని రమ్మని చెప్పి మాట్లాడి లైన్ కట్ చేసింది. కిందకు వచ్చే సరికి తల్లి కాంచనమాల ఇంకా మెలకుగానే వుంది కారు తాళాలు తీసుకొని బయటకు బయలు దేరిన కూతుర్ని చూసి ఆశ్చర్య పోయింది.‘‘ఏంటే?... అసలే సిటీలో పరిస్థితులు బాగా లేవు ఈ టైంలో ఎక్కడికి బయలు దేరావ్?’’ అంది కోప్పడుతూ.

‘‘విరాట్ ఫోన్ చేసాడు మమ్మీ. తొందరగా వచ్చేస్తాను చాలా అర్జంట్. మీరు పడుకోండి వచ్చేస్తాను’’ అంటూ మరో మాటకి అవకాశం యివ్వకుండా కారు స్టార్ట్ చేసి బయటకు దూకించింది.

రెండు నిమిషాల్లోపే కారు ఆంధ్రా బ్యాంక్ బిల్డింగ్ ముందు ఆపి చందూ కోసం ఎదురు చూసింది. మరో అయిదు నిముషాల్లో చందూ బైక్ అక్కడికి శరవేగంతో దూసుకొచ్చింది.

‘‘ఫాలోమి చందూ’’ అంటూ కారును ఎగువకు పోనిచ్చింది. ఆ కారుని బైక్ మీద అనుసరించాడు చందూ.

అప్పటికి సమయం పదకొండు దాటడం మూలంగా పాండిబజార్ నిర్మానుష్యంగా ఉంది. ఏవో కొన్ని వెహికిల్స్ తిరుగుతున్నాయి.కొంత దూరం ఎగువకు వెళ్ళాక.కారుని ఎడం పక్క వీధిలోకి పోనిచ్చింది విశాల. ఆ ఏరియా గాడాంధకారంలో వుంది. లోనకు వెళ్ళేకొద్దీ ఎక్కడా కరెంటు లేదు. వీధి దీపాలు నిద్ర పోతున్నాయి. వీధుల్లో జన సంచారం కన్పించటం లేదు. హెడ్ లైట్ల కాంతిలో ముందుకు పోతున్నారు.అర డజను వీధులు దాటిపోయాక ఒక చోట కుడి పక్క వీధిలోకి తిరిగింది కారు. ఆ వీధి నేరుగా ప్లే గ్రౌండ్ వద్ద చెత్త కుండీ వద్దకు చేరుస్తుంది. సమీపంలోకి వచ్చేసామన్న ఫీలింగ్ తో విశాల గుండె వేగంగా కొట్టుకోనారంభించింది. సహస్ర విరాట్ లు ఎలా వున్నారో తెలిదు. క్షణ క్షణానికి ఆమెలో ఆరాటం పెరిగిపోతోంది. అదే సమయంలో ఎడం పక్క వీధిలోంచి ఒక పోలీస్ జీప్ రివ్వున వచ్చి వీధి మొగలో ఆగింది ఓ మైగాడ్! అంటూ కారు స్లో చేసింది విశాల.

ఒక కానిస్టేబుల్ దిగి...

లాఠీ వూపుతూ కారు ఆపమని సైగచేసాడు.

అతనికి సమీపంలో కారు ఆపింది విశాల. కారు పక్కనే తన బైక్ ఆపాడు విరాట్. కారు హెడ్ లైట్ల కాంతిలో జీప్ లో డ్రయివరు గాక మరో యిద్దరు కానిస్టేబుల్స్ మాత్రమే కన్పిస్తున్నారు. యస్సైగాని సర్కిలు గాని లేరు. పెట్రోలింగ్ కి పోలిసులే వచ్చినట్టున్నారు. కారు ఆగగానే జీప్ లోంచి మరో యిద్దరు పోలిసులు దిగి కారు వద్దకొచ్చారు.

విశాల సైడ్ గ్లాస్ దించి

వాళ్ళని కోపంగా చూసింది

"ఇది కర్ఫ్యూ ప్రాంతం కాదు గదా. కారెందుకాపారు? మీ యస్సై ఎవరు? ఇలా పిలు?" కోపంగా అరిచింది. మరో కానిస్టేబుల్ బైక్ వంక చూస్తూ "ఏయ్ మిస్టర్ బైక్ దిగు ఎవరు నువ్వు, ఈ టైంలో ఎక్కడికి?" అంటూ దబాయించాడు.

"హలో! ఇటురా అతను నా కజిన్. మాట్లాడదలచుకుంటే నాతో మాట్లాడు. కం హియర్" అంది అధికార స్వరంతో.

"అది కాదు మేడం, ఈ టైంలో మీరూ...." కొంచెం తగ్గి నసిగాడు దగ్గరకొచ్చిన పోలిసు.

"మీ యస్సై ఎక్కడ?" అడిగింది.

"లేరు మేడం. మేమే పెట్రోలింగ్ తిరుగుతున్నాం. కరెంటు లేదు. అటు ప్లేగ్రౌండ్ వెనక అడ్డరోడ్డులో కొంతసేపటి క్రితం కాల్పులు జరిగి నలుగురు చనిపోయారు. వేన్ బురద గుంటలో కూరుకుపోయింది. మా యస్సై కొందరు పోలిసులు అక్కడ వుండి ఆ రోడ్ బ్లాక్

చేసారు. మీరటు వెళ్ళలేరు. ఇంతకీ మీరీ టైంలో ఎక్కడికి మేడం?'' అంటూ అడిగాడు.

అతడి మాటలతో విశాలకి అర్థమైపోయింది. ఏం జరిగి వుంటుందో...

''ముందే మీరిలా అడిగితే సమాధానం చెప్పేదాన్ని. పార్కు రైట్ సైడ్ లోపలి వీధిలో మా బంధువులున్నారు. విజయా ఆస్పత్రిలో మా తాత గారికి ఆపరేషన్ జరుగుతోంది. బంధువుల్ని తీసుకెళ్ళటానికి వెళ్తున్నాం. బైక్ మీద మా కజిన్ ఉన్నాడు. అతనికి రూట్ తెలీదు అందుకే కారు వెంట వస్తున్నాడు. కాస్సేపట్లో వెళ్ళిపోతాం. చాలా ఇంకేమన్నా చెప్పాలా?'' అంటూ హుందాగా చిన్న అబద్ధం చెప్పింది. ఆమె మాటతీరు హుందా తనం పోలీసుల అనుమానాల్ని చెల్లా చెదరుచేసాయి.

''ఇంకేం చెప్పక్కర్లేదు మేడం. మీరు వెళ్ళండి'' అంటూ సెల్యూట్ చేసాడు. మొదటి కానిస్టేబుల్.

''రాత్రిళ్ళు కష్టపడి డ్యూటీ చేస్తుంటారు మీరు. ఇంద వెళ్ళి టీ తాగండి'' అంటూ అయిదు వందల నోటు అతడి చేతిలో వుంచింది విశాల. పోలీసుల ముఖాలు ప్రసన్నమయ్యాయి.

''ముందు ఈ ప్రాంతంలో కరెంటు సరి చేసి లైట్లు వెలిగేలా చూడండి'' అంటూ కారును ముందుకు పోనిచ్చింది. చందూ బైక్ స్టార్ట్ చేసి అనుసరించాడు. పోలీసులు జీప్ ఎక్కగానే అది పక్క రోడ్ లోకి వెళ్ళి పోయింది. మరో రెండు నిముషాల్లో కారు రివ్వున వచ్చి ప్లే గ్రౌండ్ పక్కన చెత్తకుండీ సమీపంలో ఆగింది. చందూ కూడ వచ్చి బైక్ దిగాడు.

విశాల కారు లైట్లు ఆఫ్ చేసి కిందకు దిగింది ఓసారి చుట్టూ చూసింది. పోలీసు జీప్ ఎటు పోయిందో దాని జాడ లేదు.

''ఏంటమ్మా ఇక్కడ ఆగిపోయావ్? మన వాళ్ళిద్దరూ ఎక్కడ?'' విషయం తెలీని చందూ చుట్టూ చీకట్లలోకి చూస్తూ అడిగాడు.

''అన్నయ్యా కంగారుపడకు. వాళ్ళిక్కడే వున్నారు. పోలీస్ జీప్ తిరగి వచ్చేలోపు మనం వెళ్ళిపోవాలి కమాన్?'' అంటూ టూర్చి లైటు ఆన్ చేసి కుప్ప తొట్టి పరిసరాల్ని గాలించనారంభించింది'.

“వాళ్ళిక్కడున్నారా!” ఆమెను అనుసరిస్తూ నమ్మలేనట్టడిగాడు చందూ.

“అవును, సరిగా చూడు ఇద్దరూ స్పృహలో లేరు” అంటూ హెచ్చరించింది.

ఇద్దరూ రెండు సార్లు ఆ కుప్ప తొట్టిని దాని వెనక చెత్త చెదారాన్ని చుట్టివచ్చారు. కాని విరాట్ సహస్ర జాడలేదు.

“వాళ్ళిక్కడ లేరేమో” అనుమానంగా అన్నాడు చందూ.

“ఉన్నారు. ఇక్కడే ఉన్నారు. వన్ మినిట్ ” అంటూ తన సెల్ అందుకొని విరాట్ సెల్ కి ఫోన్ చేసింది.

మరుక్షణమే…

కుండీ వెనక నుంచి ఫోన్ రింగవుతున్న శబ్దం విన్పించింది. ఫోన్ ఆన్లోనే ఉంచి శబ్దం విన్పిస్తున్న వైపు అడుగులేసారు. భరింపరాని దుర్వాసనతో కూడిన ఆ చెత్త కుప్ప వెనక విరాట్ సహస్రలు వున్నారంటే చందూ నమ్మలేక పోయాడు, కాని ఫోన్ రింగవగానే నమ్మకం ఏర్పడిరది. ఆ శబ్దం ఒక పాత చాప కిందనుంచి వస్తోంది. తనే ముందుకెళ్ళి చాపను తొలగించాడు అంతే.

రక్త సిక్తమైన శరీరాలతో

స్పృహ లేని స్థితిలో

శవాల్లా పడున్న ఆ జంటను చూడగానే

గుండె పగిలి పోతున్నంత బాధతో అలాగే విరాట్ పక్కన కూలబడి పోయి బావురుమని ఏడ్చేసాడు చందూ. విశాల కళ్ళు అశృ ధారలు కురిపిస్తున్నాయి. కాని ఇది ఏడ్చే సమయం కాదు. వెంటనే వాళ్ళిద్దర్నీ తీసుకొని సేఫ్ గా అవతలికి వెళ్ళి పోవాలి. చందూ

భుజంమీద చెయ్యేసి ధైర్యం చెప్పింది.

“మనకి అట్టే టైంలేదు. ఏడుస్తు కూచుంటే పనులు కావు. ఇద్దర్నీ ముందు కారులోకి చేర్చాలి. కమాన్” అంది ధైర్యం తెచ్చుకుంటూ.ఆమె మాటలతో ధైర్యం తెచ్చుకున్నాడు చందూ. లేచి కళ్ళు తుడుచుకున్నాడు. ముందుగా సహస్రను భుజాలు పట్టి లేపాడు చందూ. విశాల కాళ్ళు పట్టుకుంది. జాగ్రత్తగా తీసుకెళ్ళి కారు వెనక సీట్లో పడుకోబెట్టి డోర్ వేసుకుని తర్వాత విరాట్ భుజాలు పట్టిలేపి భుజం మీద వేసుకుని కారు వద్దకు మోసుకొచ్చాడు చందూ. అతడ్ని ఫ్రంట్ సీట్లో పడుకోబెట్టింది. విరాట్ తలను తొడమీద ఉంచుకుంది. డోర్ మూసి కారు స్టార్ట్ చేసింది ఎప్పటిలాగే ఆ కారును అనుసరించాడు చందూ.

విశాల ఫోన్ చేసి వాళ్ళిద్దరూ ప్రమాద పరిస్థితిలో ఉన్నారంటే బయటకు రాలేని పరిస్థితిలో ఉన్నారు అనుకున్నాడు గాని ఇలా ప్రాణాపాయస్థితిలో ఉన్నారనుకోలేదు. ఏం జరుగుతోంది? అసలేం జరిగింది? ఇద్దరూ గండం గడిచి బ్రతుకుతారా? దారిలో ఏ అవాంతరం లేకుండా కారు ఉస్మాన్ రోడ్ కొచ్చి ఓల్డ్ మాంబళంలో ప్రవేశించాక గాని విశాల మనసు కుదుట పడలేదు. కారును నేరుగా గుణి దీపిక క్లినిక్ వైపు దూకించింది.

కోయంబత్తూరు...

విరాట్ తండ్రి వెంకటరత్నం నాయుడు గారు చెన్నైలో గొడవలు జరుగుతున్న సమయానికి ఆయన కోయంబత్తూరులో లేడు. పని మీద కుంభకోణం వెళ్ళి తిరిగి వచ్చేసరికి ఆ రాత్రి పదకొండున్నర గంటలయింది. అప్పటికి ఇంట్లో అంతా నిద్రపోతున్నారు.నాయుడు గారు స్నానం చేసి భోంచేసే సరికి అర్ధరాత్రయింది. భార్య మంగతాయారు భోజనం వడ్డించింది. భోంచేసాక కాస్సేపు టివిలో వార్తలు చూసి పడుకోవటం ఆయన అలవాటు.

చెన్నైలో గొడవలు జరుగుతున్నాయని దారిలో విన్నాడు. గాని అసలు విషయం ఆయనకింకా తెలిదు. యధాలాపంగా టివి ఆన్ చేసి న్యూస్ ఛానల్ పెట్టగానే చెన్నైలో రాత్రి ఏడు గంటల తర్వాత తేనాం పేట గుండా శిఖామణి వాడి కుర్రాళ్ళు ప్రత్యర్ధులతో మొదలైన గొడవకు సంబంధించి కొన్ని క్లిప్పింగులు చూపిస్తున్నారు. వాటిని చూస్తూ నిర్ఘాంతపోయారు వెంకట రత్నం నాయుడు గారు.

ఒక క్లిప్పింగ్ లో స్పష్టంగా తెలుస్తోంది. అక్కడ ఫైటింగ్ లో తన చిన్న కొడుకు విరాట్ వున్నాడు. పక్కన ఒక అందమైన అమ్మాయి రౌడీలతో హోరా హోరీ పోరాడుతూ బిజీగా వుంది. అంతకన్నా మరో ఆశ్చర్యకరమైన విషయం విరాట్ కనబడగానే కాళ్ళు చేతులు కట్టి మరీ వాడ్ని కోయంబత్తూరు తీసుకు రమ్మని తను చెన్నై పంపించిన తన మిల్లు కార్మికులు మునుసామి మిగిలిన వాళ్ళుకూడ

ఆ పోరాటంలో తలమునకలై ఉండటం. వాళ్ళకి సాయంగా మరి కొందరూ కన్పిస్తున్నారు.

అది చూడగానే వెంకట రత్నం నాయుడు ఒక్కసారిగా కోపంతో భగ్గుమంటూ భార్యను పిలిచాడు.

‘‘ఏమిటండీ........మీరింకా పడుకోలేదా? ఏం కావాలి?’’ అంటూ వచ్చిందావిడ.

‘‘ఏం కావాలా!..... ఓసి నీ దుంపతెగ. లోకం ఏమైపోయినా మీకక్కర్లేనట్టుంది. టివిలో వార్తలు చూసావా?’’ అనడిగాడు నాయుడు.‘‘అయ్యో రామ నేనెక్కడ చూసానండీ? భక్తి ఛానల్ చూసి పడుకున్నాను. అంతలో మీరొచ్చారు ఇంతకీ ఏమైంది?’’

‘‘భక్తి తప్ప ఇంకేమీ అక్కర్లేదే నీకు, చెన్నైలో గొడవల గురించే నీకు తెలిసినట్టు లేదు. వెళ్ళు..... వెళ్ళి పెద్దోడ్ని లేపి తీసుకురా’’ అనరిచాడాయన.

మంగ తాయారుకి భర్త ఎందుక్కోప్పడుతున్నాడో ఏం జరిగిందో తెలిక హడావుడిగా వెళ్ళి నిద్ర పోతున్న పెద్ద కొడుకు విక్రాంత్ ని లేపి తీసుకొచ్చింది.‘‘ఏరా, చెన్నైలో గొడవ జరిగింది. నువ్వు టివిలో వార్తలు చూడలేదా?’’ రాగానే కొడుకును అడిగాడు వెంకట రత్నం నాయుడు.‘‘లేదండి’’ అన్నాడు పెద్ద కొడుకు.

‘‘ఇప్పుడు చూడండి! మన విరాట్ చెన్నైలో చేస్తున్న ఘన కార్యం ఏమిటో చూడండి. గొడవతో మన వాడికి ప్రత్యక్ష సంబంధం వుంది. ఇంట్లో ఇంత మంది వున్నారు. ఎవరూ టివిలో వార్తలు చూడలేదు. నాకు ఫోన్ చేసి చెప్పలేదు. వాడ్ని తీసుక రమ్మని పంపిస్తే వీళ్ళు వాడితో చేరిపోయారు. అక్కడి పరిస్థితి ఏమిటో తెలిదు. డామిట్ ఒక్కరికీ బాధ్యత లేదు’’ అంటూ విసురుగా వెళ్ళి ఫోన్ అందుకున్నాడు.టి వి లో ఇప్పుడు ఎదురుగా ఆ సంఘటన తాలూకు దృశ్యాలు చూసాక గాని ఆయన ఎందుకంత కోప్పడుతున్నాడు అర్ధం కాలేదు. అక్కడున్న వాళ్ళలో విరాట్ పక్కన పోరాడుతున్న అమ్మాయి ఎవరో వూహించింది నాయుడు గారి భార్య మంగ తాయారు మాత్రమే. సహస్రను స్వయంగా చూడలేదు. గాని ఆమె గురించి విరాట్ ద్వారా గతంలోనే అంతా తెలుసుకుందావిడ. అసలా గొడవేమిటో అక్కడ ఏం జరుగుతుందో తెలిక ఒక్కసారిగా ఆందోళన గురయ్యారంతా.

వెంకట రత్నం నాయుడు మునుసామి సెల్ కి ఫోన్ చేసాడు.

అప్పటికే అర్ధరాత్రి దాటింది సమయం.

అక్కడ చెన్నైలో మందు కొట్టి మునుసామి నిద్ర పోతున్న సంగతి ఈయనకు తెలీదు. విరాట్ సహస్రలు ఇంటికి రాలేదన్న టెన్షన్ లో అక్కడ వాళ్ళంతా చాలా సేపటిగ్గాని నిద్ర పోలేదు. విశాలకు ఫోన్ చేసి చందూ బయటి కెళ్ళటంతో ఆ తర్వాత అంతా నిద్ర పోయారు. దాంతో ఫోన్ రింగవుతోంది. గాని ఎత్తటం లేదు.

యూ బ్లడీ ఫూల్........తియ్యరా ........ఫోన్ తియ్యరా అని విసుగుక్కొంటూ వరసగా ఫోన్లు కొడుతునే వున్నాడు. నాలుగో సారి చేయగానే అప్పుడు ఫోన్ ఎత్తారు కాని ఎత్తింది మునిసామి కాదు బండ శివ! నిద్ర మత్తులో వున్నట్టున్నాడు.

''నీ ఎంకమ్మా ఎవడ్రా అర్ధరాత్రి ఫోన్ చేస్తాడు. అన్న నిద్రపోతున్నాడు. పొద్దుటే చెయ్యి'' అంటూ స్విచ్చాఫ్ చేయబోయాడు.''అరే బండ శివా మందెక్కువయిందా నిద్ర ఎక్కువైందా వెధవా నేన్రా మీ వెంకటరత్నం నాయుడ్ని. అర్ధమైందా? మునుసామిని లేపు. మీరంతా ఇప్పుడెక్కడున్నారు?'' కోపంతో అరిచాడు వెంకటరత్నం నాయుడు. నాయుడు గారి గొంతు వింటూనే అదిరి పడి నిద్ర పోతున్న మునుసామిని లేపి ఫోన్ చేతికిచ్చి తప్పుకున్నట్టున్నాడు. ఈ సారి మునిసామి గొంతు విన్పించింది. ''నమస్తే పెద్దయ్య గారూ నమస్తే'' అంటూ. మాటలు ముద్ద ముద్దగా వస్తున్నాయి.

''మునుసామి నేను చెప్పిందేమిటి మీరు చేస్తున్నదేమిటి?'' గద్దించాడు వెంకటరత్నం నాయుడు.

''నిద్రపోతున్నాం సార్. ఇంకేం జేసినాం?''

''ఇప్పుడెక్కడున్నారు...?''

''హోటల్ గదిలోనే వున్నాం సార్''

''విరాట్ ఎక్కడ''

‘‘తెలిదు సార్. ఇంకా దొరక లేదు’’

‘‘అబద్ధాలు చెప్పటం ఎప్పట్నుంచి నేర్చుకున్నావ్? చెన్నై వెళ్ళి మీరు వెలగబెట్టిన కార్యం ఇదన్నమాట. చిన్నోడు దొరకలేదని ఇన్ని రోజులూ నాతో అబద్ధం ఎందుకు చెప్పావ్?’’ కోపంతో అరిచాడు వెంకటరత్నం నాయుడు.

‘‘చినబాబు కోసమే అబద్ధం చెప్పాను పెద్దయ్యగారూ’’ వినయంగా అటు నుంచి బదులిచ్చాడు మునుసామి.

‘‘ఆ గొడవతో మీకేంటి సంబంధం మీరెందుకెళ్ళారు? చినబాబు ఎందుకెళ్ళాడ్రా...?’’

‘‘ఆ అమ్మాయి సహస్ర కోసం’’

‘‘సహస్ర ఎవరు? ఆ గొడవలో ఫైట్ చేస్తున్న పిల్లా?’’

‘‘అవును వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు. కాపాడుకోవాలి గదా!’’

‘‘ఎవరా సహస్ర?    ఆ పిల్ల వివరాలేమిటి?’’

‘‘అడిగి పొద్దున్న చెప్తాను. నిద్రముంచుకొస్తోంది’’ అంటూ అవతల మునుసామి పెద్దగా ఆవులించిన శబ్దం విన్పించింది. దాంతో నాయుడి గారి కోపం తారా స్థాయికి చేరుకుంది.

‘‘మర్యాదగా చెప్తావా లేదా? చెప్పలేదంటే మీ అందర్నీ పనిలోంచి తీసేస్తాను’’ అంటూ బెదిరించాడు.

‘‘ఆ పనేదో పొద్దుట చేయండి సార్....... నా వల్లకాదు...... నిద్ర........’’

మును సామి లైన్ కట్ చేసాడు. అంతే కాదు బండశివను పిలిచి తమ వాళ్ళ సెల్ ఫోన్లన్నీ స్విచ్చాఫ్ చేయించాడు. దాంతో నాయుడుగారు మిగిలిన వాళ్ళలో ఎవడికి ఫోన్ చేసినా స్విచ్చాఫ్ వస్తోంది. ఈ రాత్రికి వాళ్ళిక లైన్ లోకి రారని అర్థమైపోయింది. దాంతో ఆ కోపం ఈ కోపం ఇంట్లో వాళ్ళమీద చూపించాడు.

' చిన్నోడిని నెత్తికెత్తుకున్నందుకు ఏం చేసాడో చూసావా? బంగారం లాంటి మేనకోడల్ని కాదని పారిపోయి మూడేళ్ళుగా తప్పించుకున్నాడు. చివరికి చెన్నైలో ఎవరో దిక్కుమాలిన పిల్లని లవ్ చేసి అనవసర గొడవల్లో ఇరుకున్నాడు. వీడ్ని ఏంచేయాలి?'' అంటూ మండిపడ్డాడు.ఆ మాటలకి మంగతాయారుకి కోపం వచ్చింది.

''మమ్మల్ని ఏమన్నా అంటే అనండి. వాళ్ళనంటే పూరుకోను. ఆ పిల్ల మీరనుకుంటున్నట్టు దిక్కు మాలిందీ కాదు. అనాధా కాదు'' అంది.ఆ మాటతో వెంకటరత్నం నాయుడు గారి ఆశ్చర్యానికి అంతు లేకుండా పోయింది. గబగబా భార్య దగ్గరకెళ్ళాడు.

''అంటే.... వాళ్ళ గురించి నీకు ముందే తెలుసా? అయితే చెప్పు ఎవరా అమ్మాయి? ఎవరి తాలూకు?''

''చెప్పను''

''చెప్పాలి''

''చెప్పనంటున్నాగా'' అంటూ గబగబా తన గదిలోకి వెళ్ళిపోయిందావిడ. చెప్తే నాయుడు గారికి బిపి పెరిగి కోపం తారా స్థాయికి పోతుందని ఆమెకు తెలుసు.

భార్య మొండి వైఖరికి విసిగిపోతూ పెద్ద కొడుకు విక్రాంత్ వంక చూసాడు వెంకటరత్నం నాయుడు.

''లాభం లేదురా నేను వెంటనే చెన్నై వెళ్ళాలి. మార్నింగ్ ఫ్లైట్ కి టికెట్ బుక్ చెయ్యి'' అన్నాడు.''ఒకె డాడీ నేను ఏర్పాటు చేస్తాను. మీరు పడుకోండి'' అన్నాడు విక్రాంత్. ఇంతలో తిరిగి డోర్ లోకొచ్చింది మంగతాయారు. కొడుకుని చూస్తూ ''ఒకటి కాదు

రెండు బుక్ చేయి. నేనూ చెన్నై వెళ్తున్నాను” అంది.


“నేను మీ వెంటరాను. విడిగానే వెళ్తాను” అంది తనూ పట్టుదలగా.

“ఎక్కడికెళ్తావ్? అంటే...... నీకు వాళ్ళ అడ్రస్ తెలుసు కదూ?”

“తెలుసు. కాని చెప్పను.”

“చెప్పకపోతే..... ఒకె.... డైవర్స్..... నీకు విడాకులిచ్చేస్తాను.”

“సర్లే, ఈ వయసులో మనం డైవోర్స్ తీసుకుంటే అంతా మనల్ని చూసి నవ్వుతారు. మీకా శ్రమక్కర్లేదు, నేను మా పుట్టింటి కెళ్ళిపోతాను.”“ఆహా ఇప్పుడే వెళ్తావా చెన్నై వెళ్ళొచ్చాక వెళ్తావా?”




‘‘రేపొద్దుటే వెళ్ళిపోతాను’’ అంటూ లోనకెళ్ళి తలుపేసుకుంది మంగతాయారు. తల పట్టుకొని సోఫాలో కూలబడ్డాడు వెంకట రత్నం నాయుడు.

‘‘చూసావ్ రా పెద్దోడా.... అడ్రసు తెలిసి కూడ మీ అమ్మ చెప్పనంటోంది’’ అన్నాడు పెద్ద కొడుకు విక్రాంత్ ని చూస్తూ.

విక్రాంత్ తండ్రి పక్కన కూచొని ఆయన చేయి అందుకొని అభిమానంగా చూసాడు. ‘‘డాడీ మమ్మీ కోపం మీకు తెలిందే కాదు. మీరు చెన్నై వెళ్తే వాళ్ళని ఎక్కడ విడదీస్తారోనని మమ్మీ భయం. తనకు అడ్రసు తెలుసు గాబట్టి ఇబ్బంది లేదు. మమ్మీకి ఎలాగో

నచ్చజెప్పి ఓసారి మీ యిద్దరూ చెన్నై వెళ్ళి రండి. మమ్మీ కోపం ఎంతసేపు...? అయిందేదో అయింది. రెండ్రోజులు ఆగి మమ్మీతో కలిసి వెళ్ళండి'' అంటూ సలహా యిచ్చాడు.

కోడలు కూడ ఇదే సలహా యివ్వటంతో ప్రస్తుతానికి ప్రయాణం విరమించుకున్నాడు వెంకటరత్నం నాయుడు. ఇదే టైంలో అక్కడ చెన్నైలో విరాట్ సహస్రలు ప్రాణాపాయ స్థితిలో వున్నారని తెలిస్తే క్షణం కూడ ఆగేవారు కాదేమో.

కోయంబత్తూరులో టివి వార్తలు చూసి వెంకటరత్నం నాయుడు ఆవేశ పడినట్టే, ఆవేశంతో కంగారు పడుతున్న మరో ఇద్దరు వ్యక్తులున్నారు.

వారిలో ఒకడు భూ కుంభకోణాల పుట్ట, మాజీ సియం, మనవడు త్యాగరాజన్. రెండో వ్యక్తి సహస్ర తండ్రి అయిన మహదేవ నాయకర్.

రాత్రి సుమారు ఎనిమిది గంటల ప్రాంతంలో చెన్నై నుంచి ఎవరో ఫోన్ చేసి చెప్పే వరకు అక్కడి విషయం త్యాగరాజన్ కి తెలీదు. ఆ సమయంలో అతను తన ఇంట్లోనే ఉన్నాడు. వెంటనే టివి ఆన్ చేసుకొని చూస్తున్నాడు.

తేనాంపేట గుండా శిఖామణి తనకు తెలిసిన వాడే. సంఘటన స్థలంలో పరిస్థితి చూడగానే ఉలిక్కి పడ్డాడు. ఎందుకంటే కొమ్ములు తిరిగిన గుండా శిఖమణిని ఎదుర్కొంటున్నది ఎవరో కాదు. సహస్ర....... ఇంకా చెప్పాలంటే ఎవర్ని చూసిరమ్మని తను ధనగిరి బేచ్ ను చెన్నై పంపించాడో ఆ లేడీ జర్నలిస్టు లహరి చూస్తుండగానే ఫైటింగ్ ఉధృతమైంది. ఆమెకు సాయంగా మరికొందరు రంగంలోకి దిగారు. వాళ్ళలో కొందర్ని ఇక్కడ మధురైలో చూసిన గుర్తు.

వెంటనే ధనగిరికి ఫోన్ చేసాడు.

''ఏరా? ఎక్కడ చచ్చార్రా మీరంతా?'' అంటూ అసహనంగా అరిచాడు.

''సార్ మేం ఆ పని మీదే తిరుగుతున్నాం. ఇంత వరకు ఆ అమ్మాయి మా కంట పడలేదు.''

“అఘోరించారు. ఇప్పుడెక్కడున్నారు?” గద్దించాడు.

“సాయం కాలం నుండి నందనం, విల్లివాక్కం పరిసర ప్రాంతాలు గాలించి ఇప్పుడే హోటల్ కి బయలు దేరాం” బదులిచ్చాడు ధనగిరి.

“మీరు గాలించింది చాలు. ముందు చెప్పింది చేయండి. వెంటనే మీరు జయన్ చెట్టి రోడ్ కి వెళ్ళండి. అక్కడ పెద్ద గొడవ జరుగుతోంది. లహరి ఆ గొడవలో గుండాలతో హోరా హోరీగా పోరాడుతోంది. ఎవరికీ అనుమానం రాకుండా మీరు లహరిని షూట్ చేసి పారేయండి. పని ముగియగానే చెన్నై వదిలి వచ్చేయాలి. వెళ్ళండి” అంటూ వాళ్ళని అటు మళ్ళించాడు జగన్మోహన్.

తర్వాత పరిణామాల్లో...

అర్ధరాత్రి వేళ ఎప్పుడో ధనగిరి ఫోన్ చేసి చెప్పాడు. సహస్ర వెంట మరో యువకుడున్నాడని, వాళ్ళు తప్పించుకున్నారని, కాల్పుల్లో షూటర్ విక్కీ డేవిడ్ లతో బాటు మరో ఇద్దరు చనిపోగా, మరో నలుగురు వేన్ ప్రమాదంలో మరణించారని, ప్రస్తుతం ధనగిరి వెంట మరో ముగ్గురు తప్పించుకొని ఆప్రాంతం వదిలి పారిపోయారని తెలిసి షాక్ తిన్నాడు.

ఇదిలా వుండగా...

రెండో వ్యక్తి మహదేవ నాయకర్...

ఆయన రాత్రి ఎనిమిది గంటల నుండి టివికి అతుక్కుపోయి చూస్తూనే వున్నాడు. ప్రత్యక్ష ప్రసారాలు చూసాడు. ఆ తర్వాత సంఘటన తాలూకు క్లిప్పింగ్ లూ చూసాడు. తను సహస్రను పట్టి మధురై తీసుకు రమ్మని పంపించిన కదిరేషన్, వడివేలు మిగిలిన వాళ్ళు కూడ వెళ్ళిన పని మర్చిపోయి సహస్రకు సాయంగా పోరాటం చేయటం మిస్టరీగా వుంది.

కదిరేషన్ కి మిగిలిన వాళ్ళకి ఫోన్లు కొడుతూనే వున్నాడు. ఫోన్లు స్విచ్చాఫ్ లో వున్నాయి. ఒకటి రెండు మోగుతున్నా ఎవడూ

లిఫ్ట్ చేయటం లేదు.

అసలేం జరిగిందో తేనాం పేట గుండా శిఖమణితో సహస్రకు గొడవేమిటో తెలిక హైరాన పడుతున్నాడు మహదేవ నాయకర్. తన కూతురు సహస్రకి సాయంగా వచ్చి పోరాడుతున్న చాకు లాంటి యువకుడ్ని గమనించాడు. సహస్రను లవ్ చేసి కన్పించటం లేదని పేపర్ లో ప్రకటనిచ్చింది అతడే కావచ్చని వూహించాడు. ఏ విషయం తెలిడానికి తన మనుషులు ఒక్కడయినా లైన్ లో దొరికితే గద...

పిచ్చెక్కినట్టుంది నాయకర్ కి...

తనకు తెలిసింది ఒక్కటే...

తన మనుషులు అడయారు లోని హోటల్ గదుల్లో వుంటున్నారు. ఆ హోటల్ తనకు తెలుసు. నేరుగా ఆహోటల్ కెళ్ళి కూచుంటే దొరుకుతారు. మరునాడు ఉదయం ఫ్లయిట్ కే చెన్నై వెళ్ళాలని నిశ్చయించుకొని పడుకున్నాడు మహాదేవ నాయకర్. కాని తెల్లవారగానే విరాట్ ఫ్రండు ధర్మ మూలంగా కొన్ని నిజాలు తెలుస్తాయని ఆ తర్వాత మధురై వాతావరణం వేడెక్కి పరిణామాలు తీవ్రంగా వుంటాయని వూహించలేక పోయాడాయన.

విశాల నడుపుతున్న కారు ఓల్డ్ మాంబళం వీధుల్లో పరుగు తీస్తోంది. ఆ కారును తన బైక్ మీద చందూ గుడ్డిగా అనుసరిస్తున్నాడు గాని, ఆమె ఏంచేయబోతుందో తెలిక చాలా టెన్షన్ పడుతున్నాడు. ఇలాంటి సందర్భాల్లో పోలీస్ కేసు గాకుండా ట్రీట్ మెంట్ చేయటానికి ఏ డాక్టరూ సాహసం చేయడు. అదీ యిలా అర్ధరాత్రి వేళ.

కన్ను మూసినా తెరిచినా శవాల్లా రక్త సిక్తమైన దేహాలతో చాపమీద పడున్న తన ప్రాణ మిత్రుడు విరాట్, అతడి ప్రాణానికి ప్రాణమైన సహస్ర మెదులుతున్నారు. వాళ్ళని కారులో వేసుకొని విశాల ఎక్కడికి పోతోందో అర్థం గావటం లేదు. ఓల్డ్ మాంబళం ఏరియా నిశ్శబ్దంగా వుంది. వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. విశాల వీళ్ళిద్దర్నీ తన ఇంటికి తీసుకు పోతోందేమోనని సందేహం కలుగుతోంది. మాట మాటకీ చెమరిస్తున్న కళ్ళు తుడుచుకొంటున్నాడు.

అయితే...

విశాల ఏర్పాట్లు ఏవో తను చేసే వచ్చిందని చందూకి తెలిదు. అక్కడ డాక్టర్ గుణ దీపిక అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా వుండి విశాల రాక కోసం ఎదురు చూస్తోంది. ఆమె చాలా తెలివైన యువతి. ప్రాణ స్నేహితురాలయిన విశాల కోసం ఎలాంటి రిస్కయినా ఫేస్ చేయటానికి సిద్ధంగా వుంది.

ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాలని ఫోన్లో విశాల చెప్పినప్పుడే కొంత వూహించ గలిగింది. చుట్టు పక్కల యిళ్ళలో ఎక్కడా లైట్లు వెలగటం లేదు. గాఢనిద్రలో వున్నారంతా. అర్ధరాత్రి సమయం.

అయినా సరే తమ కాంపౌండ్ గేటు పైనగాని పోర్టికోలో గాని లైట్లు ఆన్ చేయలేదు. గేటు మాత్రం బార్లా తెరిచివుంది. అక్కడే ఛేర్ వేసుకొని చొని ఎదురు చూస్తోంది. తనకు సాయంగా నమ్మకమైన నడి వయసు నర్సు ఒకామె తోడుగా ఇక్కడే వుంటుంది. ఇద్దరూ కలిసి రెండు స్ట్రెచర్లను తీసుకొచ్చి అప్పటికే పోర్టికోలో రెడీగా వుంచారు. లోన ఆపరేషన్ థియేటర్లో అన్నీ సర్వ సన్నద్ధంగా వుంచి ఎదురుచూస్తున్నారు.

సరిగ్గా విశాల కారు రివ్వున దూసుకొచ్చి గేటులోకి తిరిగింది. కారు వెంటే చందూ బైక్ కూడ లోనకొచ్చేసింది. గబగబావెళ్ళి గేటు మూసి తాళం వేసేసింది నర్సు. తాము వచ్చింది ఏదో అస్పత్రికని లోన కొచ్చాకే చందూకి అర్ధమై తేలిగ్గా వూపిరి తీసుకున్నాడు.

ఆ తర్వాత క్షణం కూడ ఆలస్యం జరగలేదు. కారు లోని విరాట్ ని సహస్రను స్ట్రెచర్ల మీద పడుకోబెట్టి లోనకు తోసుకెళ్ళిపోయారు ఆ వెనకే క్లినిక్ ఫ్రంట్ డోర్స్ ని కూడ క్లోజ్ చేసి తాళం వేసేసింది నర్సు.

విరాట్ సహస్రలున్న రెండు స్ట్రెచర్లను సరాసరి ఆపరేషన్ థియేటర్లోకి తోసుకొచ్చేసారు.

చకచకా లైట్లు వెలిగాయి...

ముందుగా విరాట్ భుజం గాయాల్ని పరిశీలించింది. గాయానికి వేసిన కుట్లను చూసింది. ఒక డాక్టర్ వేసిన కుట్లు కావవి ఏం జరిగి ఉంటుందో వూహించి ఆశ్చర్య పోయింది.

‘‘ఓమైగాడ్.....      సూది దారంతో తనకు తనే కుట్టేసుకొన్నట్టున్నాడు. ఎనీవే.... ఒంట్లో చాలా రక్తం పోయింది. రక్తం ఎక్కిస్తే గాని గాయానికి ఫ్రష్ గా కుట్లు వేయటం సాధ్యం కాదు. ఇది కత్తి గాటు. సందేహం లేదు. అసలు వీళ్ళిద్దరూ ఇదే పరిస్థితిలో ఉంటే కోమాలోకి పోయి తెల్లవారే సరికి ప్రాణాలు పోయేవి. సరైన టైంలో తీసుకొచ్చావే విశాలా. నీ ధైర్యానికి మెచ్చుకోవాలి. నర్స్ కమాన్ సిజర్ తో ఇతని షర్టు కట్చేసి తీసేయ్. వెంటనే బ్లడ్ ఎక్కించడానికి ఏర్పాట్లు చెయ్యి’’ అంటూ పక్క      స్ట్రెచర్ మీది సహస్ర వద్దకెళ్ళింది.

వెంటనే ఆ ఏర్పాట్లలో మునిగిపోయింది నర్సు. ఇప్పుడు దగ్గర కొచ్చిన విశాలవంక చూస్తూ ‘‘నాకో నిజం చెప్పు ఇతను నీ లవరే కదూ?’’ అనడిగింది డాక్టర్.

‘‘ఎందుకొచ్చిందా డౌటు?’’

‘‘ముందు అడిగిందానికి ఆన్సర్ చెప్పు. అవునా కాదా?’’

‘‘అవును’’

‘‘మరి ఈ సహస్ర ఎవరు?’’

‘‘విరాట్ లవరు?’’

‘‘వ్వాట్? ........... ఇతను నిన్ను లవ్ చేయటం లేదా?’’

‘‘చేస్తున్నాడు’’

‘‘నువ్వుండగా మళ్ళీ సహస్రను లవ్ చేయటం ఏమిటి?’’

“నా కన్నా ముందే సహస్రను లవ్ చేసాడు గాబట్టి”

“ఓ మైగాడ్ నాకు పిచ్చెక్కేలా వుంది. అంటే మీ ఇద్దరూ ఇతన్నే లవ్ చేస్తున్నారంటావ్”

“అవును”

“ఇతను కూడ మీ ఇద్దర్నీ లవ్ చేస్తున్నాడంటావ్”

“అవును అవును అవును ఇంకా ఏమిటి నీ డౌటు?”

“ఒకే ఒక్క డౌటు”

“అడుగు చెప్తాను”

“మీ యిద్దర్లో తను పెళ్ళాడబోయేది ఎవర్ని?”

“ఏమో...........తనిష్టం”

“ఇద్దర్నీ చేసుకుంటానంటే?”

“నాకభ్యంతరం లేదు”

"ఓ మైగాడ్ నిజంగానే నాకు పిచ్చెక్కించావే. లోకంలో ఎక్కడైనా ఇద్దరు ప్రేమికుల్ని చూసానుగాని మీలా ముగ్గురు ప్రేమికుల్ని ఎక్కడా డలేదు."

బ్లడ్ శరీరంలో ప్రవేశించే కొద్ది    అటు సహస్ర ఇటు విరాట్ ముఖాల్లో స్పష్టంగా తేటదనం కన్పించనారంభించింది ఇద్దరి శ్వాస నార్మల్ కొచ్చింది. పల్స్ నార్మల్ కొచ్చింది    ఇద్దరికి కుట్లువేసి బాండేజ్ వేసే సరికి రెండు గంటలు పట్టింది. అప్పటికి తెల్లవారు జామున మూడు గంటలు కావస్తోంది సమయం.    విరాట్ కి, సహస్రకీ ఇంజక్షన్లు ఇచ్చాక తృప్తిగా విశాల వంక చూసింది గుణ దీపిక.

"భయపడాల్సిందేం లేదు. నిశ్చింతగా ఉండండి. ఉదయాని కంతా విరాట్ స్పృహలోకి వస్తాడు. సహస్రకు లేటు కావచ్చు. స్పృహలోకి వచ్చిం తర్వాత అవసరమైతే స్కల్ని ఎక్స్ రే తీయించి చూద్దాం. పేషంట్స్ ని ఇక్కడే ఉంచి ఉదయం వచ్చినా సరే మీరు రాత్రికి ఇక్కడే ఉండి పోయినా సరే. ఏం చేద్దాం" అంది.

"లేదు లేదు. పోలీసులు హాస్పిటల్స్ ని చెక్ చేసే ప్రమాదం వుంది. చూసావుగా మమ్మీ ఇప్పటికే పది సార్లు ఫోన్ చేసింది. నేనింటి కెళ్తే గాని తను నిద్రపోదు. మా ఇంటికి తీసుకుపోతాను" అంది విశాల.

"ఒకె ఉదయం తొమ్మిది గంటలకి ఇంటి కొచ్చి చూస్తాను. వారం తిరిగే సరికి ఇద్దరూ మామూలుగా లేచి తిరుగుతారు. ఇక బెంగ పెట్టుకోకు" అంటూ ధైర్యం చెప్పింది డాక్టర్ గుణ దీపిక. ఆమెను కౌగిలించుకొని    థాంక్స్ చెప్పింది విశాల.

అంతా కలిసి విరాట్ సహస్రలను కారులోకి చేర్చారు. మరోసారి డాక్టర్ గుణ దీపికకు కృతజ్ఞతలు చెప్పి కారు స్టార్ చేసింది విశాల కారు వెనకే తన బైక్ ను పోనిచ్చాడు చందూ. వాహనాలు బయటి కెళ్ళగానే నర్సు క్లినిక్ గేటు మూసి తాళం వేసుకుంది.

ఇంటి కొచ్చేసరికి అప్పటికే ఆందోళనతో కూతురి రాక కోసం ఎదురు చూస్తూ మెలుకూగానే వుంది విశాల తల్లి కాంచన మాల ఆమెకు అసలు విషయం ఇంకా తెలీదు. ఇప్పుడు తెలిసి జరిగిందానికి చాలా బాధ పడింది. చుట్టు పక్కల ఎవరూ గమనించకముందే నౌకరు సాయం రాగా ముందుగా సహస్రను లోనకు తీసుకెళ్ళి మేడ మీద విశాల గదిని ఆనుకొనున్న గెస్ట్ రూంలో పరుండ జేసారు. తర్వాత చందూ నౌకరు ఇద్దరూ విరాట్ ను సాయం పట్టి మెట్ల వెంట రూంలో పరుండ జేసారు. గేటు మూసి తాళం వేసి బయట లైట్లు ఆర్పేసి లోనకొచ్చారు. చందూని తల్లికి పరిచయం చేసింది విశాల. చందూకి ఇదే మొదటిసారి ఆ యింటికి రావటం.

నిజానికి రాత్రి నుంచి చందూ ఏమి తిన లేదు. విపరీతంగా ఆకలి. కాని అడగటానికి మొగమాటంతో ‘‘విశాలా నేను ఇంటికెళ్ళి పోతనమ్మా’’ అన్నాడు.

‘‘ఇప్పుడా వద్దు వద్దు. ఉదయం వెళ్లువుగాని. విరాట్ గదిలోనే నువ్వు కంఫర్టబుల్ గా పడుకోవచ్చు. అన్నట్టు అన్నయ్యా..... నువ్వు ఏమన్నా తిన్నావా లేదా? తినుండవు. నాకు తెలుసు. అమ్మా భోజనం ఉందా?’’ అనడిగింది విశాల.

చందూ విశాలతోబాటు భోంచేసి వెళ్ళి విరాట్ గదిలో నిద్రపోయాడు. తర్వాత ఎప్పుడో వచ్చి విశాల తన గదిలో పడుకుంది. బాగా అలసిపోడంతో వెంటనే నిద్రలోకి జారుకున్నారంతా.

మహదేవ నాయకర్.....

ఉదయం చెన్నై వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. ప్రయాణమయ్యాడు కూడ. ఇక బయలుదేరబోతుండగా ఆయన సెల్ ఫోన్ రింగయింది.

‘‘హలో.............ఎవరూ?’’ కాస్త విసుగ్గా అడిగాడు.

‘‘అంకుల్ నేను ధర్మని’’

‘‘ఏంట్రా అబ్బాయ్ ఈ మధ్య అస్సలు కన్పించటం మానేసావ్. వ్యాపారం ఎలా ఉంది?’’

‘‘మీనాక్షి అమ్మవారి దయతో బాగుంది అంకుల్. ఇప్పుడు మీకు ఫోన్ చేయటానికి బలమైన కారణం ఉంది. అర్జంటుగా మీతో మాట్లాడాలి. బయలుదేరి వస్తున్నాను. ఇంట్లోనే వున్నారుగా?’’

“ఉన్నాను గాని నేను అర్జంటు పనిమీద చెన్నై వెళ్తున్నాను. వచ్చాక మాట్లాడొచ్చు గదా”

“లేదంకుల్ ఇప్పుడే మాట్లాడాలి. రాత్రి మీరు టివి వార్తలు చూసారు గాబట్టి ఇప్పుడు చెన్నై వెళ్ళాలనుకుంటున్నారు. అవునా?”

“అవును ఆ మాట నిజమేకాని.........”

“అంకుల్ ప్లీజ్ ప్రయాణం వాయిదా వేసుకోండి ఈ విషయంలో మీక్కూడ తెలిని చాలా విషయాలున్నాయి. వచ్చి చెప్తాను.”

“అది కాదురా ధర్మా నాకు తెలిని విషయాలేమున్నాయి?.”

“ఉన్నాయి చాలా వున్నాయి. తెలిస్తే మీరే ఆశ్చర్య పోతారు.”

“మాకు తెలిని విషయాలు నీకెలా తెలుసు?”

“ఎలా అంటే మీ అమ్మాయి సహస్ర లవ్ చేసిన కుర్రాడు నా క్లోజ్ ఫ్రెండ్ గాబట్టి. అర్ధమైందిగా కాస్సేపు ఓపిక పట్టండి నేను వచ్చేస్తున్నాను” అంటూ అవతల లైన్ కట్ చేసాడు ధర్మా.

చెన్నై.......

మరునాడు ఉదయం చందూకి మెలుకూ వచ్చేసరికి ఎనిమిది గంటలు దాటింది. సమయం రాత్రి విరాట్ ను పరుండజేసిన అదే డబుల్ కాట్ మీద ఒక పక్కగా నిద్ర పోయాడు. లేవగానే విరాట్ వంక చూసాడు.

అతడికి రాత్రి ఛాతీవరకు దుప్పటి కప్పింది విశాల, ముఖం ప్రశాంతంగా ఉంది గాని నిద్రలో వున్నట్టున్నాడు. ఇంకా స్పృహలోకి రాలేదు. బాత్రూం కెళ్ళి ఫ్రెషప్ అయి ముఖం కడుక్కొని వచ్చాడు. ఇంతలో విశాల అతడి కోసం బెడ్ కాఫీ తెచ్చింది.

తెల్ల వారు జామున పడుకున్నా అయిదున్నర గంటలకే  లేచి పోయింది విశాల. ఒకసారి సహస్రను విరాట్ ను చూసి వెళ్ళింది. తలార స్నానం చేసి చీర జాకెట్లో తయారై పొద్దుటే వడపళని గుడికి కార్ లో వెళ్ళింది.  విరాట్ సహస్రల పేరన సుబ్రమణ్యేశ్వరునికి అర్చన చేయించి పూజ ముగించుకొని తిరిగి ఇంటికి చేరుకునే సరికి ఏడు కావచ్చింది సమయం. మేడ మీదకు వెళ్ళి విరాట్, సహస్రలకు విభూది పూసి, బొట్టు పెట్టి తిరిగి కిందకు వచ్చి తల్లి కాంచన మాలను లేపింది.

అందుకే చందూ బెడ్ కాఫీతో వచ్చిన విశాలను ఆశ్చర్యంగా చూసాడు.

"ఏమ్మా గుడికెళ్ళొచ్చావా? రాత్రి నిద్రపోలేదా?" అంటూ పలకరించాడు.

"అవునన్నయ్య. వాళ్ళిద్దరిపేరున అర్చన చేయించి వచ్చాను" అంది.

"నేను బయలు దేరుతున్నాను" అన్నాడు కాఫీ తాగాక.

"కాస్సేపు ఆగన్నయ్యా టిఫిన్ చేసి వెళ్దువు గాని" అంది విశాల.

"లేదమ్మా వెళ్ళాలి. మళ్ళీ వస్తాగా. అక్కడ వాళ్ళంతా ఏం జరిగిందో తెలీక కంగారు పడుతుంటారు. దీక్ష సహస్రను చూడకుండా ఉండలేదు. రాత్రే చాలా భయపడిన్ది. వాళ్ళకి జరిగింది చెప్పి వీళ్ళకు బట్టలు తీసుకుని ప్రస్తుతానికి దీక్షను మాత్రం తీసుకొస్తాను. ఒకే సారి అంతా వచ్చినా మంచిది కాదు. చుట్టూ పక్కల వాళ్ళు గమనించే ప్రమాదం వుంది. విరాట్, సహస్రలు కోలుకునే వరకూ మనం జాగ్రత్తగా ఉండాలి. సెల్ ఫోన్లున్న ఈ రెండు కవర్లు నీ వద్దే వుంచి స్పృహ వచ్చాక వాళ్ళకివ్వు" అంటూ కవర్లను విశాల చేతికిచ్చాడు.


విశాల వంక చాలా అభిమానంగా చూసాడు "నిజంగా ఇది విరాట్ సహస్రలకు పునర్జన్మ. ఏ పూర్వ జన్మ అనుబంధమో వాళ్ళిద్దర్నీ దక్కించుకున్నావ్. నిన్నెలా అభినందించాలో తెలీటం లేదు. రత్నాల్లాంటి మీ ఇద్దరి ప్రేమను పొందిన మా విరాట్ నిజంగా అదృష్టవంతుడు" అనిచెప్పి ఇక బయలుదేరాడు...

చందూ బైక్ వెళ్ళిన వెనకే...

డాక్టర్ గుణ దీపిక కారు లోనకొచ్చింది. కాస్సేపు విశాల తల్లి కాంచనమాలను పరామర్శించి ఆమె ఇచ్చిన కాఫీ తాగాక విశాలతో కలిసి మేడ మీది పేషంట్ల వద్దకొచ్చింది. రెండు గదుల్లోకి వెళ్ళి ఇటు విరాట్ ను అటు సహస్రను కూడ పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేసింది. ఇంజక్షన్ ఇచ్చి, మందులు రాసిచ్చి వాళ్ళకి స్పృహ వచ్చాక ఎలా వాడాలో కూడా వివరించింది.

"విరాట్ కూడ ఇంకా స్పృహలోకి రాలేదు. అదే కంగారుగా వుంది" అంది విశాల.

"కంగారెందుకు? ఒక డాక్టర్ గా నేను చెప్తున్నాను. గండం గడిచింది. సంతోషించు. ఇద్దరూ సేఫ్. నా అంచనా కరక్టయితే సహస్రకి ఎక్స్ రే తీయించాల్సిన అవసరం లేక పోవచ్చు. విరాట్ కి ఇంకో గంటలో స్పృహ వస్తుంది. సహస్రకు లేటవుతుంది. కంగారుపడకు. నేను ఆస్పత్రికి డ్యూటీకి వెళ్తొస్తాను. సాయంత్రం రాగానే వచ్చి చూస్తాను. అన్నట్టు చెప్పటం మరిచాను.



నువ్వు వీళ్ళనిక్కడికి రాత్రికి రాత్రి తీసుకు రావటమే మంచిదయింది. ఉదయం అయిదు గంటలకి పోలీసులు వచ్చి ఎంక్వయిరీ చేసి వెళ్ళారు. మనం వెరీ లక్కీ. వీళ్ళిక్కడున్నట్టు ఎవరికీ తెలీకూడదు. విజిటర్స్ ని ఆపితే మంచిది. వస్తాను”      అంటూ బయలుదేరి వెళ్ళిపోయింది డాక్టర్ గుణదీపిక.

డాక్టర్ గుణదీపికను సాగనంపాక....

తిరిగి మేడమీది విరాట్ గదిలోకొచ్చింది విశాల....

బెడ్ మీద విరాట్ పక్కన కూచుంది....

విరాట్ ముఖంలోకి చూసింది....

ప్రశాంతంగా నిద్రపోతున్నట్టుంది.....

విరాట్ ముఖం....

జుత్తు నిమిరి మీదికి వంగి నుదురు ముద్దాడిరది....

రాత్రి సంఘటనతో తమకి గొప్ప గండం గడిచినట్టయింది. విరాట్ లేకపోతే తను బ్రతికేదా? సహస్రకేమన్నా జరిగుంటే విరాట్ బ్రతికేవాడా? ప్రాణ స్నేహితురాలయినందుకు డాక్టర్ గుణదీపిక చేసిన సహాయాన్ని జీవితంలో మర్చిపోలేదు. పచ్చగా మేలిమి బంగారు ఛాయలో మెరుస్తున్న విశాలమైన విరాట్ ఛాతిని చూస్తుంటే మనసులో మోహపు తెరలు పురివిప్పుతున్నాయి. వయసు కోరికలు అలజడి కలిగిస్తున్నాయి. అతడి ఛాతిని ముద్దాడి అలాగే ఛాతీమీద తలాన్చుకొని ఉండి పోయింది.

ఆమె కంటి కొనల నుండి ముత్యాల్లా జాలువారిన కన్నీరు అతడి ఛాతిని నును వెచ్చగా తడుపుతోంది. అలా ఎంత సేపు ఉండి పోయిందో విశాలకే తెలీదు. రాత్రి సరిగా నిద్ర లేమి వల్ల అలాగే మత్తుగా అతడి ఛాతీమీద నిద్రలోకి జారుకుంది.

చాలా సేపటికి....

విశాల కన్నీరు విరాట్ కి....

స్పృహ వచ్చేలా చేసింది....

చాలా సడెన్ గా స్పృహ తెలిసింది విరాట్ కి....

కళ్ళు తెరవగానే....

పైన గిర్రున తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్ కన్పించింది. తలంతా దిమ్ముగా వుండి కాస్సేపు ఏం జరిగింది తను ఎక్కడున్నాడు ఏదీ గుర్తు లేకుండా పోయింది. తిరిగి కళ్ళు మూసుకొని విల్ పవర్ ను కూడ గట్టుకొనే కొద్ది క్రమంగా జరిగిన సంఘటనలన్నీ ఒక్కటొక్కటిగా గుర్తురానారంభించాయి. చివరిగా తను విశాలకు ఫోన్ చేయటం వరకే గుర్తుంది. తర్వాత ఏం జరిగిందీ తెలీదు. తిరిగి కళ్ళు తెరిచాడు.

తన ఎడం భుజం గాయానికి ట్రీట్ మెంట్ చేసి బాండేజ్ వేయ బడిన్ది. డౌట్ లేదు విశాల తమను కాపాడిన్ది. సహస్ర............ సహస్రకెలా వుంది? సహస్ర గుర్తు రాగానే ఆందోళనతో, పక్కన తన ఛాతి మీద తల వాల్సి నిద్ర పోతున్న విశాల వంక చూసాడు. అతడు కదలటం గమనించి దిగ్గున లేచి కూచుంది విశాల. ఆమె కళ్ళు ఆనందంతో మెరుస్తున్నాయి. ఆమె పలకరించే లోపలే ‘‘సహస్ర..........సహస్ర ఎక్కడ విశాలా...........తనెలా వుంది?’’ లేచి కూచోడానికి ప్రయత్నిస్తు ఆత్రంగా అడిగాడు.

‘‘కంగారు పడకు విరాట్ తనూ క్షేమంగా వుంది. పక్క గది లోనే వుంది. స్పృహ రావటానికి లేటవుతుందని డాక్టర్ చెప్పింది. రిలాక్స్’’ అంది.

‘‘నేను చూడాలి విశాలా. తననోసారి చూస్తే గాని మనసు కుదుట పడదు. ప్లీజ్ నన్ను ఆ గదిలోకి తీసుకెళ్ళూ.’’ అన్నాడు లేవటానికి ప్రయత్నిస్తూ. ఎడం చేయి బాండేజ్ మూలంగా కుడిచేయి వాలుగా లేవలేకపోతున్నాడు. అతనికి తన చేయి అందించింది విశాల. బెడ్ దిగిన విరాట్ కి శరీరం నీరసంతో తూలులోంది కళ్ళు తిరుగుతున్నట్టున్నాయి. అన్ని వికారాలు సర్దుకోడానికి కొంత టైం పడుతుంది. ముఖ్యంగా ఏమన్నా తినాలి. నిన్న మధ్యాహ్నం ఎప్పుడో చేసిన భోజనం తర్వాత ఆహారం ఏమీ తీసుకునే అవకాశమే లేకపోయింది.

విశాల భోజనం మీద చెయ్యి వేసి ఆసరా తీసుకొంటూ ఆమె వెంట పక్కగదిలోకెళ్ళాడు విరాట్ ఓ పక్కకు తిప్పి రాత్రి ఎలా పడకేసిన సహస్ర అలాగే పడుంది బెడ్ మీద. తలను చుట్టూ బాండేజ్. అలాగే తల నుంచి నిలువుగా చాచుకొని చుట్టి మరో బాండేజ్ ఉంది. చూడ్డానికి గాఢమైన నిద్రలోవున్నట్టుంది. నెమ్మదిగా వచ్చి సహస్ర పక్కన కూచున్నాడు విరాట్. విశాల వంక చూసాడు. చీర జాకెట్లో నుదుట కుంకుమతో అప్పుడే విరిసిన గులాబిలా వుంది విశాల.

‘‘సహస్రకి విభూది కుంకుమ నుదుట వుంచింది ఎవరు?’’ అడిగాడు.

‘‘నేనే...... ఉదయమే పడవళని గుడికెళ్ళి మీ యిద్దరి పేరున అర్చన చేయించి వచ్చి నీకు అక్కకి విభూది నుదుట పూసిబొట్టు పెట్టాను. మురుగన్ దయ వల్ల అంతా సవ్యంగా జరిగింది. మీకు గుణం కాగానే గుడికి వచ్చి నూటొక్క టెంకాయ కొడతానని కూడ మొక్కుకున్నాను’’ చెప్పింది విశాల.

‘‘రాత్రి............ నీకు ఫోన్ చేసాక తర్వాత ఏం జరిగిందో తెలీదు. ఏం జరిగింది...? మమ్మల్ని కాపాడిన డాక్టర్ ఎవరు? పోలిసులకు తెలికుండా నీకు ఎలా సాధ్యపడిన్ది?’’

‘‘చెప్తాను. నువ్వు ఎలాంటి టెన్షన్ లేకుండా కూచో. కూచోడం కాదు వెళ్ళి బ్రష్ చేసుకురా. ఈ లోపల నేను కిందకెళ్ళి నీకు టిఫిను కాపి తెస్తాను. చాలా బలహీనంగా వున్నావ్. నిన్న ఎప్పుడో భోంచేసుంటావ్ కమాన్, ని గదిలో కొత్త బ్రష్షు అవి వుంచాను’’ అంటూ విరాట్ ని సహస్ర పక్క నుంచి లేపింది.

‘‘నిజంగా..............సహస్రకే ప్రమాదం లేదుకదా?’’ సందేహ నివృత్తి కోసం మరోసారి అడిగాడు.

‘‘లేదు విరాట్. తను సేఫ్ భయపడాల్సిదేం లేదు. ఇంకో రెండు మూడు గంటల్లో తనకి స్పృహ వస్తుంది. మీకు ఆపరేషన్ చేసింది ఎవరో కాదు నా క్లోజ్ ఫ్రెండ్ డాక్టర్ గుణదీపిక. నా మాట నమ్ము’’ అంది విశాల.

విరాట్ కి విశాల పట్ల ప్రేమ ద్విగుణీకృతమైంది.

రాత్రి విశాల సాహసించక పోయుంటే ఈ పాటికి సహస్ర తను, ఎక్కడో కుప్ప తొట్టి వెనక చెత్తలో అనాథ ప్రేతల్లా పడుండేవారు. అది తలుచుకొగానే దు:ఖం పొంగుకొచ్చింది ఉన్నట్టుండి. విశాలను కౌగిట పొదువుకొంటూ ఏడ్చేసాడు. విశాల ప్రేమగా అతడ్ని ముద్దాడి కళ్ళు తుడిచింది.

‘‘వద్దు విరాట్ నాకు ధైర్యం చెప్పిన నువ్వు ఇప్పుడిలా ఏడవకూడదు. ఇది మనం సంతోషించాల్సిన సమయం. ప్లీజ్ నువ్విలా ఏడిస్తే నాకు ఏడుపొస్తుంది’’ అంది గుండెల్లో ముఖం దాచుకొంటూ.

‘‘లేదు విశాలా కాస్సేపిలా కౌగిట ఉండనీ. నీ స్వచ్ఛమైన ప్రేమను గుర్తించటంలో చాలా అలక్ష్యం చేసాను. క్షమించు. నా ఫోన్ రాగానే రాత్రి నువ్వు ఎంత టెన్షన్ పడ్డావో ఎంత రిస్కు తీసుకున్నావో వూహించగలను నీకు సాయంగా ఎవరో వచ్చుండాలి. ఎవరు?’’ అడిగాడు.

‘‘చందూ అన్నయ్యొచ్చాడు. రాత్రి నీపక్కనే పడుకున్నాడు. ఉదయం ఇంటికెళ్ళాడు. మీకు బట్టలు అలాగే దీక్షను తీసుకొస్తాడు’’

అంది.

“ఇది మీ యిల్లే కదూ?”

“అవును. ఇంతకన్నా మీకు సేఫ్ ప్లేస్ ఉండదు. ఆస్పత్రిలో ఉంచమంటే నేనే తీసుకొచ్చేసాను. అయిదు గంటలకి పోలీసులు ఆస్పత్రికి వచ్చి ఎంక్వయిరీ చేసి వెళ్ళారట. సిటీలో అన్ని ఆస్పత్రుల్ని చెక్ చేస్తున్నారు. ఒకె. తర్వాత మాట్లాడుకుందాం. ముందు ముఖం కడుక్కో. కమాన్” అంటూ విరాట్ ని అతడి గదిలోకి తీసుకెళ్ళి వదిలి కిందకు వెళ్ళింది విశాల.

విరాట్ బాత్రూం కెళ్ళి ఫ్రషప్ అయి బ్రష్ చేసుకొని ముఖం కడుక్కొని వచ్చి కూచున్నాడు. కాస్సేపటికి రెండు కప్పులలో వేడి వేడి కాఫీ తీసుకొచ్చింది విశాల. ఒకటి విరాట్ కిచ్చి తనొకటి తీసుకుని ఎదురుగా సోఫాలో కూచుంది. ఇంతలో విశాల తల్లి కాంచన మాల తనకు ఓపిక లేక పోయినా విరాట్ స్పృహలోకొచ్చాడని తెలిసి రెండు ప్లేటుల్లో వేడి వేడి ఇడ్లీ గారెలు చట్నీ ఒక ఫ్లాస్కు నిండా టీ పోసి తీసుకొచ్చి ఎంతో ఆదరంగా విరాట్ ను పరామర్శించింది.

“నీకు ఇంకా స్పృహ రాలేదని విశాల కూడ ఉదయం నుంచి ఏమీ తీసుకోలేదు విరాట్. ఇద్దరూ టిఫిను తీసుకుని టీ తాగండి. సహస్ర గురించి బెంగపడకు. తనూ స్పృహలోకి వచ్చేస్తుంది” అని ధైర్యం చెప్పి కిందకు వెళ్ళిపోయిందావిడ.

“సహస్ర గురించి మీ అమ్మగారికి అంతా తెలుసా? నిన్నేమీ అడగలేదా?” టిఫిన్ తీసుకునేటప్పుడు అనుమానం వచ్చి అడిగాడు.

“మమ్మీకి అంతా తెలుసు” అంది విశాల.

“చెప్పాగా మమ్మీ డాడీలది లవ్ మేరేజ్. ఇరు తరుపు బంధు వర్గం అంగీకరించక పోవటంతో చెన్నై వచ్చేసి ఇక్కడ స్థిర పడ్డారు. డాడీ టైలరింగ్ లో మాస్టర్ అయితే కొద్ది మంది స్టాఫ్ తో రెడీమేడ్ దుస్తుల తయారీ ఆరంభించారు. అదృష్టం కలిసొచ్చింది. ఈ రోజు మూడు వందల కుటుంబాలు మా గార్మెంట్స్ కంపెనీ మీద ప్రత్యక్షంగా ఆధార పడి బ్రతుకుతున్నాయి. డాడీ పోయే నాటికే నేను డిగ్రీ చదివి ఫ్యాషన్ డిజైనర్ కోర్సు చేసి డిప్లొమా తీసుకున్నాను. డాడీ పోగానే కంపెనీ బాధ్యత నా మీద పడిన్ది.

మాకు అష్టయిశ్వర్యాలున్నా బంధు వర్గం లేరు. వాళ్ళు ఎక్కడున్నారో మమ్మీకి తెలుసు కాని చెప్పదు. తనకు నేను నాకు తను అంతే. అందుకే మా మధ్య దాపరికాలుండవు ఎందుకో మమ్మీకి నువ్వు చాలా నచ్చావ్. సహస్ర గురించి తెలిసినా అభ్యంతరం చెప్పలేదు. నాకు మొగుడు రావటం ముఖ్యం. అందుకే అభ్యంతరం చెప్పలేదనుకుంటా” అని నవ్వింది.

“ఇందుకే అప్పుడప్పుడూ మా గురువు గారు అంటుండే వారు నీ నెత్తిమీద రెండు సుడులున్నాయి చిన బాబు, నీకిద్దరు పెళ్ళాల యోగం తప్పదనేవాడు. అదే నిజమైంది” అంటూ తనూ నవ్వాడు విరాట్.

“ఎవరా గురువు?” విరాట్ కి మంచి నీళ్ళ గ్లాసు అందిస్తూ అడిగింది విశాల.

“ఇంకెవరు? మా ఇంట్లో వున్న మునుసామి నాయుడు.”

టిఫిను ముగించి నీరు తాగాడు విరాట్. తర్వాత విశాల రాత్రి జరిగింతా వివరించింది.

“ఒకె ప్రస్తుతానికి ఈ టాబ్లెట్స్ రెండు వేసుకొని టీ తాగి విశ్రాంతి తీసుకో. మీకు బయటికెళ్ళి మెడిసన్ తేవాల్సుంది. నేను వెళ్ళొచ్చేస్తాను” అంటూ విరాట్ కి టాబ్లెట్స్ ఇచ్చి టీ గ్లాసు అందించింది.

“ఏయ్ చందూ వస్తాడుగా. తను తెస్తాళ్ళే. నువ్వెందుకు వెళ్ళటం?” అన్నాడు విరాట్.

“ఏం బాబు నేను ఖర్చు పెట్టకూడదా? నేవెళ్ళొచ్చేస్తాను. టేక్ రెస్ట్” అంటూ కాళీ ప్లేట్లు గ్లాసులు అన్నీ తీసుకొని కిందికెళ్ళిపోయింది విశాల. విరాట్ మరోసారి సహస్ర గదిలోకి వెళ్ళాడు. ఆమెలో చలనం లేదు. ఆలాగే పడుకునుంది. ప్రేమగా బుగ్గలు నిమిరి నుదురు ముద్దాడి కాస్సేపు అక్కడే కూచున్నాడు. తర్వాత తన గదిలో కొచ్చి ఇలా పడుకున్నాడో లేదో వెంటనే గాఢ నిద్ర లోకి జారుకున్నాడు.

కారులో బయటి కెళ్ళిన విశాల గంట లోపలే మెడిసిన్స్ తీసుకొని ఇంటికొచ్చేసింది. మేడ మీది కెళ్ళి చూస్తే విరాట్ తిరిగి నిద్రపోతూ కన్పించాడు. రాత్రంతా నిద్ర లేమితో తనకూ కళ్ళు మూతలు పడుతున్నాయి. దాంతో తన గదిలోకి పోయి పడుకుంది వెంటనే.

దీక్షను తీసుకొని చందూ తన బైక్ మీద వచ్చి చేరుకున్నాడు. గోస్వామి కాలనీకి వెళ్ళి ఇంట్లో అందరికీ జరిగింది చెప్పి పరిస్థితి వివరించాక తను స్నానం చేసి బట్టలు మార్చుకొని దీక్షను వెంట పెట్టుకొచ్చే సరికి ఈ టైమైంది. అప్పటికే సుమారు మధ్యాహ్నం పన్నెండు గంటలు కావస్తోంది. వెంట ఒక ఏర్ బేగ్ లో విరాట్ సహస్రలకు దుస్తులు కూడ తీసుకొచ్చారు.

విశాల తల్లి కాంచన మాలకు దీక్షను పరిచయం చేసాడు చందూ. విరాట్ కు స్పృహ వచ్చిందని టిఫిను చేసి తిరిగి నిద్ర పోతున్నాడని కాంచనమాల వివరించాక కొంత మన స్థిమితం ఏర్పడిన్ది. ఆవిడతో చెప్పి ఇద్దరూ మేడ మీదకు వచ్చారు.

గాఢ నిద్రలో ఉంది విశాల. మూడో గదిలో విరాట్ కూడ నిద్ర పోతూ కన్పించాడు. ఇద్దరూ మధ్యలోని సహస్ర గదిలోకొచ్చారు. అచేతనంగా పడున్న ప్రాణ స్నేహితురాలు సహస్రను చూసి దు:ఖంతో గొంతు పూడుకు పోగా పక్కనే కూచుండి పోయింది దీక్ష. ఆమెకు ధైర్యం చెప్పి తనను సహస్ర వద్దే ఉంచి విరాట్ గదిలోకెళ్ళాడు చందూ.

మామూలుగా అయితే విరాట్ ను లేపేవాడు కాదు. పరిస్థితులు విషమించాయి. చందూ మనసులో ఆందోళనగా వుంది. అందుకే విరాట్ ను తట్టి లేపాడు.

కాస్సేపటికి కళ్ళు తెరిచాడు విరాట్.

"సారీరా...........ఒక ముఖ్యమైన విషయం నీతోచెప్పాలి. అందుకే లేపాను." అంటూ ఒక ఛేర్ ని దగ్గరకు లాక్కుని కూచున్నాడు. అతడి ముఖంలో ఆందోళన చూడగానే ఏదో జరిగిందని గ్రహించాడు విరాట్. వెంటనే లేచి కూచుంటూ "ఏమైంది ?" అనడిగాడు.

"చెన్నైలో ఆరంభమైన గొడవ ఇప్పుడు మధురైకి పాకి పోయింది" చెప్పాడు చందూ.

"నువ్వేమన్నా ధర్మాకు ఫోన్ చేసి మాట్లాడావా?"

"మధురైలో గొడవలేమిటి? దేని గురించి? రెండు మూడు రోజులవుతోంది వాడితో మాటాడి. నాకు స్పృహ వచ్చింది కూడ మూడు గంటల క్రితమే. అసలేమైంది? ఎవరెవరికి గొడవలు"

"సహస్ర తండ్రి మహ దేవనాయకర్ వర్గం, త్యాగరాజన్ వర్గం తలపడ్డంతో మధురై ప్రస్తుతం అట్టుడికినట్టు ఉడికిపోతోంది. నువ్వోసారి వెంటనే టివి వార్తలు చూడ్డం మంచిది" అన్నాడు.

‘‘డామిట్’’ అంటూ నుదురు రుద్దుకున్నాడు విరాట్.

చందు ధర్మ ప్రస్తావన ఎందుకు తెచ్చాడో ఇప్పుడర్ధమైంది. ధర్మ చెప్పకుండా మహా దేవ నాయకర్ కి విషయం తెలిసే అవకాశమే లేదు. బహుశ చెన్నైలో గొడవ టివిలో చూసి త్యాగరాజన్ ప్లాన్ ప్రకారం సహస్రను చంపడానికి తన కుర్రాళ్ళతో దాడి చేసుంటాడని ధర్మా పొరబాటు పడుండాలి. దాంతో మహా దేవ నాయకర్ కి జరిగిన విషయాలు చెప్పుంటాడు. లేకపోతే ప్రశాంతంగా వుండే మధురైలో ఈ రెండు వర్గాలూ తలపడే అవకాశమే లేదు.

‘‘ఎప్పుడు జరిగిందిది?’’ చందుని అడిగాడు విరాట్.

‘‘ఉదయం తొమ్మిది గంటల తర్వాతే ఆరంభమై ఉంటుంది. నేనింటికెళ్ళే సరికి టివిలో స్క్రోలింగ్ మొదలయింది. కాస్సేపటికే అక్కడి పరిస్థితి మీద ప్రత్యక్ష ప్రసారాలు ఆరంభమయ్యాయి. అది చూడగానే కదిరేషన్ తమ వాళ్ళకి ఫోన్ చేసి పరిస్థితి తెలుసుకున్నాడు. వెంటనే ఇద్దర్ని మాత్రం ఇక్కడ్నుంచి మిగిలిన వాళ్ళతో తమ వేన్ లో బయలుదేరి వెళ్ళిపోయాడు.’’|

‘‘పద నేను వెంటనే టివి చూడాలి’’ అంటూ బెడ్ దిగాడు విరాట్. మేడ మీద విశాల గదిలోతప్ప మిగిలిన గదుల్లో టివి లేదు. ఆ గదిలో విశాల నిద్ర పోతోంది.

విరాట్ ముందుగా వెళ్ళి విశాలను నిద్ర లేపాడు.

‘‘విరాట్ ఆర్ యు ఒకే’’ కంగారుగా లేచి కూచుంటూ అడిగింది విశాల.

‘‘ఒకె డియర్ డోన్ట్ వర్రీ, కాస్సేపు టివి చూడాలి మధురైలో పరిస్థితి బాగ లేదు. దీక్ష సహస్ర గదిలోవుంది. వెళ్ళి కాస్సేపు అక్కడ కూచో’’ న్నాడు.

‘‘మధురైలో ఏమైంది?’’ తెల్లబోతూ అడిగింది.

క్లుప్తంగా విషయం చెప్పి టివి ఆన్ చేసాడు విరాట్. విశాల దీక్ష వచ్చిందనగానే అటు వెళ్ళింది. చందూ విరాట్ లు టివి ముందు కూచుని న్యూస్ చానల్ ని ఆత్రంగా చూడనారంభించారు.

******************************************

మధురై...!

ఆ ఉదయం ఏడు గంటలకు మహ దేవ నాయకర్ కు ఫోన్ చేసిన పదో నిముషంలో ధర్మ బైక్ అక్కడికి చేరుకుంది. నలుగురికీ తెలికూడదనే ఉద్దేశంతో పైన బాల్కనీలో కూచున్నాడు మహా దేవ నాయకర్. ధర్మ రాగానే పైకి రమ్మని చేయి వూపాడు.

ధర్మ లోన కొచ్చేసరికి నాయకర్ భార్య మీనాంబికై ఆప్యాయంగా పలకరించింది. ఆమెతో రెండు మాటలు మాట్లాడి గబ గబా మెట్ల వెంట బాల్కనీలో కెళ్ళాడు.

"రా రా ధర్మ, ఆలా కూచో నీ కోసం ప్రయాణం ఆపాను. నాకు తెలీని విషయాలన్నావ్ అవేమిటో త్వరగా చెప్పు. ఇంతకీ మా అమ్మాయిని లవ్ చేసిన కుర్రాడు నీక్లోజ్ ఫ్రెండన్నావ్ పేరేమిటి ఎక్కడివాడు?" అనడిగాడు మహ దేవ నాయకర్.

"అంకుల్ అతని గురించి తర్వాత చెప్తాను గాని ముందు నాకో విషయం చెప్పండి. మీ అమ్మాయి లక్ష్మీ సహస్ర రచయిత్రి సహస్రని మీకు తెలుసు గదా?"

"సందేహమా? ఆ విషయం తెలిసిందే గదా"

"మరి..................జర్నలిస్టు లహరి కూడ తనే అని మీకు తెలుసా?"

ఈ ప్రశ్నకు బిత్తర పోయి చూసాడు మహా దేవ నాయకర్? నమ్మలేకపోయాడు.

"ఏమిట్రా అబ్బాయ్ పొద్దునే జోకులేస్తున్నావ్ నేను కూడ జర్నలిస్టు లహరి ఫాన్ ని. ఆమె రాసిన ఎన్నో రాజకీయ విశ్లేషణలు వ్యాసాలు చదివిన వాడ్ని. ఏ రోజూ సహస్ర డాడీ మీరు అనుకుంటున్న లహరి నేనే అని చెప్పలేదే?"

“లహరి ఎవరో అనుకుంటున్నాం గాబట్టి ఆమె ధైర్యాన్ని సాహసాన్ని మెచ్చుకొంటున్నారు. అదే మీ అమ్మాయని తెలిస్తే మెచ్చుకోగలరా? ఆడపిల్లవు ఈ జర్నలిజం నీకెందుకు త్యాగరాజన్ లాంటి వ్యక్తితో గొడవలెందుకు. అంటూ తిట్టి ఇంట్లో కూచోబెట్టేవారు. అందుకే ఈ విషయాన్ని మీకు తెలికుండా గోప్యంగా ఉంచింది. ఇందులో కీలకమైన వ్యక్తి ఎ.యస్.పి ప్రకాష్. మా చేతిలో చావు దెబ్బలుతిని ఆస్పత్రిలో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. చెన్నై నుండి విరాట్ ఫోన్ చేసి నాకు చెప్పే వరకు నిజానికి ఈ విషయాలేవీ నాకూ తెలీదు. నాకు తెలిసినంత వరకు చెప్తాను వినండి” అంటూ ధర్మ జరిగిందంతా చెప్తుంటే అంతటి మహా దేవ నాయకర్ కూడ స్టన్నయి పోయి వింటూ కూచున్నాడు. చివరిగా....

“అంకుల్ మీరు తెచ్చిన సంబంధం ఇష్టంలేక సహస్ర ఇల్లొదిలి వెళ్ళిపోయిందని ఇంతకాలం మీరనుకుంటున్నారు. ఆ రోజు నిజం గానే ఆ సంబంధం ఇష్టం లేదు. మీరు పట్టుదలగా నిశ్చితార్ధానికి ఏర్పాట్లు చేసారు. అటు చూస్తే త్యాగరాజన్ మనుషులు తనను చంపే ప్రయత్నంలో ఉన్నారు. కోర్టు మెట్లు ఎక్కనివ్వరు. ఈ రెంటి నుంచి తప్పించు కోవటం కోసమే తను వెళ్ళిపోయింది. చెన్నైలో తన స్నేహితురాలు దీక్ష ఇంట్లో ఉంటోంది.

మూడు రోజులుగా విరాట్ నాకు ఫోన్ చేయలేదు. రాత్రి చూస్తే ఇలా జరిగింది. టివిలో ఆ యిద్దరూ తప్పించుకున్నట్టు ప్రచారం చేస్తున్నా ఇంత వరకు ఇంటికి చేరనట్టు తెలిసింది. విరాట్ పక్కనుండగా సహస్ర కేమీ కాదు. ఇద్దరూ గొప్ప ఫైటర్స్. విరాట్ తన ప్రాణాలొడ్డి కాపాడుకుంటాడు. ఎట్టయప్ప పంపిన ధనగిరి మనుషులవల్ల సాధ్యం గాక పోవటంతో త్యాగరాజన్ తేనాంపేట గుండా శిఖామణికి ఆ బాధ్యతను అప్పగించి వుండాలి దాని ఫలితమే నిన్నటి మారణ హోమం.

ఇప్పుడు నేను, మా ఫ్రెండ్ పాతిక మంది ప్రత్యేక బస్సులో ఏం జరిగిందో తెలుసుకోడానికి చెన్నై వెళ్తున్నాం. ఇప్పుడు కూడ మీకు నిజం తెలిక పోతే తర్వాత తెలిసే అవకాశం ఉండదని ఇలా వచ్చాను. ఇవాళ న్యూస్ పేపర్ మీరు చూసారో లేదో ధనగిరి మనుషుల్లో గన్ షూటర్స్ విక్కీ డేవిడ్ లతో బాటు ఫైరింగ్ లో మరి కొందరు చావగా ధనగిరి తప్పించుకున్నాడని వాళ్ళ వేన్ బురద గుంటలో పడి కొందరు మరణించారని పేపర్లో వచ్చింది. మరో ముఖ్య వార్త ఏమంటే....

ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీకి ఇంకో మూడు మాసాలు గడువు కోరిన సెంట్రల్ గవర్నమెంట్ అభ్యర్ధనను సుప్రీం కోర్టు తిరస్కరించి వెంటనే విచారణ చేపట్ట వలసిందిగా ఆదేశించింది. కొద్ది రోజుల్లోనే ఈ కేసు తిరిగి మధురై కోర్టులో విచారణ కొచ్చే అవకాశం వుంది. ఈ లోపలే ఈ కేసును చెన్నై హైకోర్టుకు బదిలీ చేయమని మధురైలో తనకు రక్షణ లేదని సహస్ర సుప్రీం కోర్టుకు అభ్యర్ధిస్తే మంచిది. చెన్నైలో ప్రశాంతంగా పనులవుతాయి కాబట్టి.

ప్రస్తుతం మీరు చెన్నై రావటం ముఖ్యం కాదు. నేను వెళ్ళాక పరిస్థితి చూసి మీకు ఫోన్ చేస్తాను. ఈ లోపల మీరోసారి త్యాగరాజన్ కి గట్టి వార్నింగ్ ఇస్తే మంచిదనుకుంటాను. సో........నేను వెళ్ళొస్తాను. అక్కడ బస్సు దగ్గర కుర్రాళ్ళంతా నా కోసం ఎదురు

చూస్తుంటారు.'' అంటూ లేచాడు ధర్మ.

''ఒకె. నీ మాటలు నమ్ముతున్నాను. నిజంగానే ఈ విషయాలేవి ఇంత వరకు నాకు తెలిదు'' అంటూ తనూ లేచాడు. మహ దేవ నాయకర్.

''ఆ ఎ.యస్.పి ప్రకాష్ కి మూడిన్ది. వాడ్ని పట్టుకుంటే మొత్తం కథ బయటికొస్తుంది. నా కూతుర్ని బ్లాక్ మెయిల్ చేసి నా యింటికే అల్లుడయిపోవాలన్నంత ధైర్యం ఎక్కడ్నుంచి వచ్చింది? తేల్చుకుంటా. ఇప్పుడే బయలుదేరతా. నీ ఫోన్ కోసం ఎదురు చూస్తుంటాను మర్చిపోకు'' అంటూ హెచ్చరించాడు.

''అలాగే అంకుల్ వస్తాను'' అంటూ కదిలాడు ధర్మ.



‘ధర్మ ఒక్క నిముషం’’ పిలిచాడు మహదేవ నాయకర్.

‘‘చెప్పండి అంకుల్’’

‘‘అంతా చెప్పి ఒక విషయం చెప్పకుండా వెళ్ళిపోతున్నావేరా?’’

“ఏ విషయం ?”

“అదేరా నా కూతుర్ని ప్రేమించిన కుర్రాడు అతడి పేరు విరాట్ అన్నావ్. వివరాలేమిటి?”

“వద్దంకుల్ ఇప్పుడు మీరు తెలుసుకోకుండా వుంటనే మంచిది”

“ఎందుకు?..... నాకిప్పుడే తెలియాలి. ఎవరా కుర్రాడు?”

“ఒకె మీరు కోప్పడనంటే చెప్పేస్తాను. విరాట్ ఎవరో కాదు, కోయంబత్తూర్ వెంకట రత్నం నాయుడు గారి చిన్న కొడుకే ఈ విరాట్” అని చెప్పి ఇక ఒక్క నిముషం కూడ అక్కడుండకుండా వెళ్ళి పోయాడు.

మహదేవ నాకర్ మాత్రం షాక్ లో కొద్ది నిముషాలు అలాగే ఉండి పోయాడు.

ఆ వెంకట రత్నం నాయుడికి తనకు పడదు, గతంలో తమ మధ్య జరిగిన గొడవలు తనింకా మర్చి పోలేదు. అలాంటి వెంకట రత్నం నాయుడి కొడుకుని ప్రేమించటం ఏమిటి? ఆలోచనలు ఓ కొలిక్కి రాక ముందే భార్య మీనాంబికై మాటలు విని తిరిగి చూసాడు ఆమె అంత సేపు వారి సంభాషణ వింటూనే వుంది.

“ధర్మ చెప్పిందంతా నిజమే మీరెందుకలా షాక్ అయ్యారోనాకు తెలుసు, కాని ఆ కుర్రాడు చాలా మంచి వాడు, మనమ్మాయి తప్పు చేయ లేదు, విరాట్ కి మనమ్మాయంటే ప్రాణం” అంది.

“ఏమిటే అంటున్నావ్ ? నీకీ విషయాలు తెలుసా?” నమ్మలేనట్టు అడిగాడు.

“తెలుసు. ఆ రోజు పేపరు ప్రకటన వచ్చిన రోజే నేను ఫోన్ చేసి ఆ అబ్బాయితో మాటాడాను. సహస్ర తోనూ మాటాడాను. తన ఫోన్ నంబరు నాకిచ్చింది. అప్పట్నుంచి మేం ఫోన్ టచ్ లో వున్నాం. ఆ అబ్బాయి వెంకటరత్నం నాయుడు గారి కొడుకని తెలిసి ప్రేమించలేదు. ప్రేమించాకే దానికి తెలిసింది.

మనమ్మాయి లాగే ఆ అబ్బాయీ తన మేన కోడల్ని చేసుకోవాలని తండ్రి బలవంతం చేస్తుంటే ఇష్టం లేక చెన్నై వెళ్ళిపోయి అజ్ఞాతంగా ఉంటున్నాడు. తండ్రి కాదంటే మనమ్మాయిని చేసుకోడని మనం భయపడాల్సిన అవసరం లేదు. కులం వేరన్న ఒకే ఒక్క అభ్యంతరం తప్ప మన కన్నా ఎందులోనూ వాళ్ళు తీసిపోరు. ఒక్కగానొక్క కూతురు. దాని ఇష్టాన్ని మనం కాదనటం మంచిది కాదు ఆలోచించండి.

దీనికంతా కారణం ఆ త్యాగరాజన్ వాడికి మన కూతురని తెలిసే దాన్ని చంపించాలని కంకణం కట్టుకున్నాడు. ప్రధాన శత్రువు ఆ త్యాగరాజన్ గాని, వెంకటరత్నం నాయుడు గారు కాదు. ఆలోచించండి. బిడ్డ ఇప్పుడెలా వుందో ఏమిటో ఎన్నిసార్లు ఫోన్లు చేసినా దాని ఫోను స్విచ్చాఫ్ లో వుంది. విరాట్ కి ఫోన్ చేసినా అదే పరిస్థితి నాకెందుకో భయంగా వుంది'' అంటూ చెప్పాల్సింది చెప్పి కన్నీళ్ళు పెట్టుకుని అక్కడ్నుంచి వెళ్ళిపోయింది ముగాంబికై.

భార్య మాటలు వినగానే మహదేవ నాయకర్ కి కర్తవ్యం బోధ పడినట్టయింది. ఆవేశం కట్టలు తెంచుకుంది. ప్రాణంలా పెంచుకున్న ఒక్కగా నొక్క కూతురు ఇల్లొదిలి ఆరు మాసాలు కావస్తోంది. దాన్ని చూడలేక పోయారు. జరిగింది తెలుసుకోలేక పోవటం నిజంగా తన అమాయకత్వమే.

ఎవడీ త్యాగరాజన్? చెన్నై నుంచి వచ్చి ఇక్కడ రియల్ ఎస్టేట్ ఆరంభించి క్రమంగా ఇప్పటికి భూ కుంభకోణాల పుట్టగా మారాడు. తాత మాజీ సియం ప్రస్తుత ప్రతి పక్ష నాయకుడు, అటు తండ్రి సెంట్రల్ మినిస్టర్, వాళ్ళ అండ చూసుకొని ప్రశాంతంగా వుండే మధురైలో గూండా సంస్కృతిని పెంచి పోషిస్తూ చుట్టు పక్కల అయిదారు జిల్లాల్లోని ఖనిజ సంపదను ఎడా పెడా దోచేసి ప్రజా ధనాన్ని కొల్లగొడుతూ విదేశీ బాంకులకి తరలించుకుంటున్నాడు.

మధురైలో తనకున్న పలుకుబడి ప్రజాభిమానం తెలిసి కూడ తన కూతుర్ని చంపించడానికి తెగించాడంటే ఇక వాడ్ని క్షమించ కూడదు.

కోపావేశాలతో వూగి పోయాడు మహదేవ నాయకర్. వెంటనే తన సెల్ అందుకొని ఎవరెవరికో ఫోన్ చేసాడు. గబ గబా క్రిందికొచ్చేసరికి భార్య ముగాంబికై ఎదురైంది.

''ఇంటి దగ్గర జాగ్రత్తగా ఉండండి. మధురైలో నేనా, త్యాగరాజనా అని తేలి పోవాల్సిన సమయం వచ్చింది. బయటికి వెళ్తొస్తాను'' అంటూ చర చరా బయటికి నడిచాడు మహదేవ నాయకర్. భర్తను ఆపలేదు ముగాంబికై.

మహదేవ నాయకర్ కారు బయలుదేరే సరికి ఇంటిక్కాపలా ఉండే వాళ్ళలో సంగం మంది రెండు వేన్ లలో ఎక్కేసి కారుని వెంబడిన్చారు. వీధిలో కొచ్చే సరికి ఆయన కారు వెనక అర డజను కార్లు ఫాలో అయ్యాయి. నేరుగా మహాదేవ నాయకర్ కాన్వాయ్ ఆస్పత్రి వైపు దూసుకెళ్ళింది.

అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎ.యస్.పి ప్రకాష్ కి గాయాలు పూర్తిగా తగ్గు ముఖం పట్టాయి. ఫ్రీగా లేచి అటు యిటు తిరగ్గలుగుతున్నాడు. ఆ లోపే అతడ్ని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేయబోతున్నారు. ఇన్ని రోజులూ సిక్ లీవులో వున్నాడు. వెళ్ళి డ్యూటీలో జాయిన్ అవగానే అంతు చూడాని పట్టుదలతో వున్నాడు. అలాగే ఓసారి చెన్నై వెళ్లి సహస్రను వెదకాలని, ఆమె ప్రియుడు దొరికితే ఎన్ కౌంటర్ చేసేయాలని ఏవేవో పిచ్చి ఆలోచనల్లో హుషారుగా వున్నాడు. అంతే గాని తన మీద కొద్ది క్షణాల్లో ఒక సునామియే విరుచుకు పడ నుందని వూహించ లేక పోయాడు.

ఇంతలో పది మంది దృఢమైన మనుషులు ఆస్పత్రి వార్డు లోకి దూసుకొస్తుంటే అక్కడున్న వాళ్ళలో కొందరు నాయకర్ మనుషులు ఎవడేం తప్పు చేసాడో తప్పుకోండి తప్పుకోండి అంటూ పక్కలకు పరుగులు తీసారు.

అక్కడే వున్న ఎ యస్ పి ప్రకాష్ కి ఏం జరుగుతోందో అర్ధమయ్యే లోపలే వచ్చిన వాళ్ళు అతడ్ని పట్టుకొని కొట్టుకొంటూ బయటకు లాక్కుపోయారు.

కారు దిగుతున్న మహదేవ నాయకర్ ని చూడగానే ఎ.యస్.పి కి పై ప్రాణం పైనే పోతున్నంత కంగారు పట్టుకుంది. తన గురించి తెలిసి పోయుంటుందనే సందేహం ఏర్పడిన్ది. డిపార్ట్ మెంట్ వాళ్ళు నన్నెందుక్కొడుతున్నారు? అంటూ విడిపించు కోడానికి గింజుకున్నాడు.

తన గుబురు మీసం దువ్వి క్రూరంగా చూసాడు మహదేవ నాయకర్ కారులోంచి. తమ వంశ పారం పర్యంగా వస్తున్న పొడవాటి ఖడ్గాన్ని, తన లైసెన్స్డ్ రివాల్వర్ని తీసి కారు బోనెట్ మీద ఉంచి పక్కన కూచున్నాడు. వాటిని చూస్తేనే గుండెల్లో వణుకు పుట్టింది ప్రకాష్ కి.

“సార్ ఎ.యస్.పి గారు మీకు శ్రమ కలిగిస్తున్నందుకు క్షమించాలి. మీకు నాకూతురు లక్ష్మీ సహస్ర తెలుసునా?” గంభీరంగా అడిగాడు నాయకర్.

“తెలీదు” అన్నాడు ప్రకాష్.

‘‘పోనీ జర్నలిస్టు లహరి తెలుసా?’’

‘‘తెలిదు నాకేం తెలిదు’’

‘‘స్వయంగా లహరి తనుఎంతో శోధించి సాధించిన ఇన్ఫర్మేషన్ త్యాగరాజన్ భూ బాగోతం మీద తయారు చేసిన ఫైలు నకలుతో బాటు రిపోర్ట్ వ్రాసిచ్చి నిన్ను కేసు బుక్ చేయమని కోరింది. ఆ ఫైలు ఏమైంది.’’

‘‘లేదు లేదు….. మీకెవరో రాంగ్ ఇన్ఫర్మేషన్ ఇచ్చారు. నాకెవరూ అలాంటి ఫైలు యివ్వలేదు’’ అంటూ అడ్డంగా బొంకాడు ప్రకాష్.

‘‘ఇంకా బొంకి ఎక్కడికి తప్పించుకుంటావ్రా. నా కూతుర్ని బ్లాక్ మెయిల్ చేసి నాకే అల్లుడయిపోవాలను కుంటావ్ రా. కొట్టండ్రా….. వాడు నిజం చెప్పే వరకు విరగొట్టండి’’ అనరిచాడు కోపంతో మహదేవ నాయకర్ అంతే.

ప్రకాష్ ని చితగొట్టడం ఆరంభించారు ఆయన మనుషులు. ఇంతలో ఆస్పత్రి డాక్టర్లు బయటకు పరుగులెత్తుకొచ్చారు.

‘‘సార్……. ఆయన ఇప్పుడే కోలుకున్న మనిషి. ఈ పూట డిశ్చార్జ్ చేద్దామనుకున్నాం. మీరిలా కొడితే చచ్చిపోతాడు. వదిలేయండి’’ అంటూ రిక్వెస్ట్ చేసారు.

‘‘ప్రాణం పోసే మీకు ప్రాణం విలువేమిటో తెలుసు. కాని ఇలాంటి వెధవలకి ప్రాణం విలువ తెలిదు. వీడు నిజం చెప్తే బ్రతికి పోతాడు. చెప్పక పోతే ఛస్తాడు. ప్రాణం వుంటే లోనకొస్తాడు. పోతే కాటికి పోతాడు. మీరు లోన కెళ్ళండి’’ అంటూ ఖడ్గం అందుకుని సర్కున ఒరలోంచి కత్తి తీసాడు మహదేవ నాయకర్.

‘‘ఆగండిరా…… వీడ్ని కొట్టి అనవసరంగా టైంవేస్ట్ చేయొద్దు. వీడు నిజంచెప్పడు. వీడి తలనరికి పట్టుకుపోదాం. తప్పుకోండి’’ అంటూ ఖడ్గాన్ని పైకి లేపాడు.

అంతే…

ప్రకాష్ భయంతో ఒక్కసారిగా ''వద్దు నన్ను చంపొద్దు అంతా చెప్తాను'' అంటూ అరిచాడు.

''ఈ బుద్ధి ముందే ఉండాల్సింది. ఒరలో కత్తిదూసాక నెత్తురు చూపకుండా లోనపెట్టకూడదు'' అంటూ కత్తి మొనతో ప్రకాష్ చెంపమీద గాటుపెట్టి దాన్ని తిరిగి ఒరలో ఉంచాడు.

''చెప్పరా ఆ ఫైలు ఏం చేసావ్ ఇప్పుడు ఎక్కడుంది ?'' అడిగాడు నాయకర్.

అంతే!

ఎ.యస్.పి ప్రకాశ్ నోటినుంచి నిజాలు తన్నుకొంటూ బయటికొచ్చేసాయి. ధర్మా చెప్పిన విషయాలతో ప్రకాష్ చెప్పిన విషయాలు సరిపోవటంతో మహాదేవనాయకర్ కి కోపం తారా స్థాయికి చేరుకుంది. ఇంత కాలం తను ఎంత అమాయకంగా ఉండి పోయాడో తెలిసొచ్చింది.

సరిగ్గా ఇదే సమయంలో`

మహాదేవ నాయకర్ సెల్ ఫోన్ మోగింది.

అవతల మధురై సిటీ పోలిస్ కమీషనర్ లైన్ లో ఉన్నాడు. ఎవరో ఇక్కడి విషయాలు ఫోన్ చేసినట్టున్నారు.

''సార్... మీరు దగ్గరుండి ఎ.యస్.పిని కొట్టిస్తున్నట్టు తెలిసింది. అతను డిపార్ట్ మెంట్ మనిషి సార్. వెంటనే వదిలేయండి'' అటునుంచి రిక్వెస్ట్ చేసాడు కమీషనర్.

''డిపార్ ట్మెంట్ మనిషి. నాకు తెలుసు కమీషనర్ డిపార్ట్ మెంట్ మనిషే, కాని వాడే డిపార్ట్ మెంట్ కాదు కదా. అర్హత లేని

ఇలాంటి కుక్కల్ని ఉన్నత పదవిలో కూచోబెట్టిన మీ అధికారుల్ని అనాలి. డిపార్ట్ మెంట్ మనిషిగా ప్రజల తరపున పనిచేయాల్సిన మనిషి కాకీ బట్టలేసుకుని త్యాగరాజన్ లాంటి వాడికి కాపలా కుక్కలుగా మారుతుంటే ఏం చేయాలి? మీ డిపార్ట్ మెంట్లో వాడి దగ్గర లంచం మెక్కని వాడెవడో చెప్పగలరా? ఈ ఒక్కరోజు మీరు కళ్ళు చెవులు నోరు మూసుక్కూచోండి. నా కూతుర్ని చంపాలని చూస్తుంటే నేను చేతులు ముడుచుక్కూచోలేను.'' అంటూ ఫోన్ కట్టేసి జేబులో వేసుకొని ఎ యస్ పి ప్రకాశ్ వంక చూసాడు.

''నీకు బ్రతకాలనుందా?'' కౄరంగా చూస్తూ అడిగాడు.

''అవును. ఇంకెప్పుడూ తప్పు చేయను. నన్నొదిలేయండి ప్లీజ్'' నెత్తురోస్తున్న చెంపను తుడుచుకొంటూ అడిగాడు.

''సరి ఇప్పుడే ఈ క్షణమే... నువ్వు మధురై వదిలి వెళ్ళిపోవాలి. రేపు తెల్లవారే సరికి నీ ముఖం మధురైలో కన్పించకూడదు. తర్వాత నీ యిష్టం వచ్చిన చోటుకి ట్రాన్స్ ఫర్ చేయించుకో. వెళ్ళిపో మరోసారి నా కంట బడితే చంపేస్తాను. రేయ్ వీడికి ట్రీట్ మెంట్ చేయించి నేరుగా ఇంటికి తీసుకెళ్ళి వదిలేసి రండి'' అంటూ ఆర్డర్ వేసి రివాల్వర్ జేబులో వేసుకొని ఖడ్గాన్ని అందుకొని కారెక్కాడు. ''పోనీరా నేరుగా త్యాగరాజన్ అడ్డా, టేకు తోట గెస్ట్ హౌస్ కి కారు పోనీ'' అన్నాడు.

************************

పక్క జిల్లా కలక్టరయిన లక్ష్మి ముందురోజు సాయంకాలమే త్యాగరాజన్ టేకు ఎస్టేట్ గెస్ట్ హౌస్ భవంతికి వచ్చింది. రాత్రికి త్యాగరాజన్ ఆమెతో ఎస్టేట్ భవనం లోనే ఉండి పోయాడు. రెండంతస్థుల విశాలమైన ఆ భవనంలో ఫస్ట్ ఫ్లోర్ లో టేకు తోటలో పని వాళ్ళుగా వుంటూ గుండాయిజం చలాయించే త్యాగరాజన్ మనుషులుంటారు. ఆ భవంతికి నిరంతరం కాపలా ఉంటుంది. అనుమతి లేందే ఎవరినీ లోనకు రానివ్వరు.

ఆ తోటను చుట్టి వున్న ఎత్తయిన కాంపౌండ్ వాల్ని ఆనుకొని దక్షిణం వైపున గోడ అవతల మరో పాత కట్టడం వుంది. గెస్ట్ హౌస్ నుంచి ఆ కట్టడంలోకి రహస్య మార్గం ఉందన్న సంగతి ఎవరికీ తెలీదు. ఎట్టయ్యప్పలాంటి ఒకరిద్దరు ముఖ్యమైన వాళ్ళకి మాత్రం తెలుసు.

త్యాగరాజన్ కి మధురైలో అర డజను ఆఫీసులు, పది ఇళ్ళు ఉన్నాయి. అతని భార్య పిల్లలు చెన్నైలోనే ఉంటారు. చెన్నైలో చాలా ఆస్థి పాస్థులున్నాయని వేరే చెప్పక్కర్లేదు. ఇవి గాక బెంగళూరు, మైసూరు, బాంబే, హైదరాబాద్ ల లోనూ ఆస్థులున్నాయి. చెన్నై నుండి భార్యా పిల్లలు వస్తే ఉండేందుకు మధురైలో తన పర్మనెంట్ అడ్రస్ కోసం ఒక ఇంటిని అట్టి పెట్టుకున్నాడు. రాత్రంతా ఎస్టేట్ బిల్డింగ్ లో వున్నా తెల్లవారు జామునే లేచి ఇంటికెళ్ళి పోయి స్నానాదికాలు ముగించి పూజ

చేసుకోవటం త్యాగరాజన్ అలవాటు. తిరిగి పది గంటల తర్వాత ఓసారి గెస్ట్ హౌస్ కొచ్చి తర్వాత మెయిన్ ఆఫీస్ కు వెళ్తాడు. అతను వచ్చే వరకు ఉండి తర్వాత తను బయలుదేరి వెళ్ళిపోతుంది లక్ష్మి.

ఆ రోజు సాయంత్రం త్యాగరాజన్ ఇంట్లోనే వున్నాడు. లక్ష్మి వచ్చిందని తెలిసి బయలు దేరబోతుండగా ఎవరో వచ్చారు. వాళ్ళతో మాట్లాడేసరికే రాత్రి ఏడుగంటలు దాటింది సమయం. అంతలో టివిలో చెన్నైలో గొడవ గురించి వార్తలు ప్రసారం గావటంతో చాలాసేపు టివికి అతుక్కుపోయాడు. టివి చూస్తూనే తన మనుషులు ధనగిరికి ఫోన్ చేసి వాళ్ళని గొడవ జరుగుతున్న ప్రాంతానికి డైవర్ట్ చేసాక రాత్రి పది గంటలకి ఎస్టేట్ గెస్ట్ హౌస్ కి చేరుకున్నాడు.

ఈ ఎస్టేట్ ఉత్తర భాగంలో ఎటుపక్క తవ్వినా ఎముకల గుళ్ళు బయట పడతాయని జనం గుసగుసలు పోతుంటారు. అది నిజం కూడ తనకు కిట్టని వాళ్ళు తన మాట వినని అధికారులు, భూస్వాములు ఇలా చాలా మందిని నమ్మకంగా అక్కడికి రప్పించి ఫినిష్ చేసి టేకు తోట లోనే భూస్థాపితం చేసి అడ్రసు గల్లంతు చేసిన సందర్భాలు చాలా వున్నాయి.

ఆ రాత్రి లక్ష్మితో ఎంజాయ్ చేస్తూ సుమారు రెండు గంటలవరకు మేలుకోనే వున్నాడు. ఒంటి గంట ప్రాంతంలో ధనగిరికి ఫోన్ చేయగా విక్కీ డైమండ్లతో బాటు ఫైరింగ్ లో కొందరు మరణించిన సంగతి వేన్ ఆక్సిడెంట్ లో కొందరు పోయిన సంగతి తెలిసింది.

లక్ష్మి ఏకాంతంలో చాలా ఓపెన్ గా ఉంటుంది. హేపీగా మందు కొడుతుంది. సిగరేట్ తాగుతుంది. పచ్చిగా మాట్లాడి మగాడికి కిక్ ఎక్కిస్తుంది. తనకేం కావాలో తీసుకుని ఎదుటి వాళ్ళకివ్వవలసింది ఇచ్చేస్తుంది. అందుకే లక్ష్మి అంటే త్యాగరాజన్ కి స్పెషల్ మోజు ఆ పైన తన వ్యాపారాలకు ఆమె సహకారం ఎంతో ఉపకరిస్తోంది గాబట్టి ఆమెకు కోట్లాది రూపాయలిస్తున్నాడు.

రాత్రంతా ఆమెతో గడిపిన త్యాగరాజన్ అలవాటు ప్రకారం తెల్ల వారు జామున అయిదు గంటలకు లేచి ఇంటి కెళ్ళి పోతూ తను వచ్చే వరకు ఉండమని చెప్పి మరీ వెళ్ళాడు.

ఉదయం ఏడు గంటలకు నిద్ర లేచిన లక్ష్మి స్నానాదికాలు ముగించి ఫ్రష్ గా తయారైంది. పని వాళ్ళిచ్చిన కాఫీ టిఫిన్లు తీసుకొని త్యాగరాజన్ కోసం ఎదురు చూస్తూ అతడి ఆఫీసు గదిలో కూచుంది.

ఇదే సమయంలో అక్కడ ఆస్పత్రి వద్ద ఎ.యస్.పి ప్రకాష్ ను మహ దేవ నాయకర్ తన మనుషులతో స్వయంగా వచ్చి దగ్గరుండి కొట్టించి విచారిస్తున్న విషయాన్ని ముందుగా ఎవరో త్యాగరాజన్ కి ఫోన్ చేసి చెప్పారు.

ఆ వార్త విన్న మరు క్షణం హడావుడిగా బయలు దేరాడు త్యాగరాజన్ కాని అప్పటికే ఆలస్యమైంది.

జగన్మోహన్ కారు ఆ ప్రాంతం చేరుకునే సరికే మహ దేవ నాయకర్ ఎస్టేట్ వద్దకొచ్చాడు. మిగిలిన కార్లను బయటే ఉండమని చెప్పి తన కారు వెంట మరో రెండు వేన్ లను మాత్రం తీసుకొని గేటు లోపలికి వెళ్ళి పోయాడు వెంటనే జగన్మోహన్ గేటువైపు వెళ్ళకుండా తన కారును పాత కట్టడం కాపౌండ్ లోకి పోనిచ్చి కారు దిగి ఎట్టయప్పకు ఫోన్ చేసాడు.

"సార్ పరిస్థితి ఉద్రిక్తంగా మారేట్టుంది. లక్ష్మి గారు మహా దేవ నాయకర్ తో వాదానికి దిగి అతన్ని చెంప మీద కొట్టబోయింది. దాంతో ఆవిడ్ని దారుణంగా తిట్టి పక్కకు గెంటేసి మీ ఆఫీసు గది మొత్తం గాలించి జర్నలిస్టు లహరి ఫైల్ ను తీసుకున్నారు............"

"ఇక చెప్పకు బ్లడీ ఫూల్. లక్ష్మి నోరు పారేసుకునుండ కూడదు. మహ దేవ నాయకర్ వర్గం ఇక ఆగదు. తాడో-పేడో తేల్చేసుకుందాం. గేట్లు మూసి లోపలున్న అందర్నీ అటాక్ చేయండి. దొమ్మిలో సందు చూసి మహ దేవ నాయకర్ ని వేసేయండి, మిగిలిన విషయాలు నేను చూసుకుంటాను. లక్ష్మిని రహస్య మార్గం నుంచి తప్పించి నా వద్దకు పంపించండి. ఇక్కడ నేను రెడీగా వున్నాను" అంటూ ఆర్డర్ వేసి ఆ వెనకే సిటీ లోని తన వర్గానికి చెందిన గుండాలు రౌడీ గ్రూపుల లీడర్స్ కు చక చకా ఫోన్లు కొట్టాడు.

ఇక్కడే త్యాగ రాజన్ కూడ లక్ష్మి లాగే తొందర పడ్డాడు. ఈ గొడవ ఎక్కడకు దారి తీస్తుందో వూహించి వుంటే అటాక్ చేయమని ఆర్డర్ వేసే వాడు కాదు. ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టి కోట్లాది ప్రజా ధనం మెక్కిన మదం, అహంకారం, తననెదిరించే మగాడెవడనే గర్వం ఆ క్షణంలో త్యాగరాజన్ వివేకాన్ని నశింప చేసి మధురైలో దారుణ మారణ హోమానికి బీజం పడేలా చేసాయి.

నిజానికి మహ దేవ నాయకర్ వచ్చింది గొడవ పెట్టుకోడానిక్కాదు. తన కూతురు జోలికొచ్చినా ప్రాణహాని కలిగించినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించిపోవాలనే వచ్చాడు. కాని మూర్ఖుడైన ఎట్టయప్ప కేవలం తన వెంట రెండు వేన్ లలో పాతిక మందితో లోన కొచ్చిన మహ దేవ నాయకర్ ని చూడగానే బలమైన కాంపౌండ్ వాల్ మెయిన్ గేటు మూయించటంతో రగులుకుంది చిచ్చు. ఆ పైన త్యాగ రాజన్ తెలివి తక్కువగా వేసిన ఆర్డర్ ఆ చిచ్చుకు ఆజ్యం పోసింది.

ఈ లోపల బోరున ఏడుస్తూ లక్ష్మి రహస్య మార్గం గుండా బయటి కొచ్చేసింది. తన ఆంతరంగికురాలయిన లక్ష్మి ఏడుపు చూసి త్యాగ రాజన్ తెగ ఫీలయి పోయాడు. రా కారెక్కు వాళ్ళ సంగతి మన వాళ్ళు చూసుకుంటారు. అంటూ కారు స్టార్ట్ చేసాడు.

“నా కారు..... నా ఏభై లక్షల కారు లోపలే ఉండి పోయింది” అంది గాభరా పడుతూ లక్ష్మి.

“ఏయ్ ఇపుడు కావలసింది కారు కాదు ప్రాణాలు, లోనకెళ్ళటం ఇప్పుడు అసాధ్యం. నువ్విక్కడున్న సంగతి మీడియా వాళ్ళు పసిగడితే ఇద్దరి పరువులు గాలి పటాల్లా ఎగురుతాయి. ముందు నువ్వుసేఫ్ గా సిటీ వదిలి పోవటం ముఖ్యం.

నీ కోసం వేరే కారు ఏర్పాటు చేసాను, హర్రీ” అంటూ డోర్ తెరిచాడు లక్ష్మి కూచోగానే కారును వేగంగా పక్క దారుల వెంట దూకించాడు.

చాలా సేపటి తర్వాత  ఊరు చివర ఒక కాలనీ దగ్గర ఆపాడు కారు.

అక్కడ వీళ్ళకోసం

మరో కారు సిద్ధంగా ఉంది

లక్ష్మిని ఆ కారు ఎక్కించి పంపించాక గాని త్యాగరాజన్ కి మనశ్శాంతి కలగ లేదు, ఆ కారు కను మరుగు కాగానే తన కారును వెనక్కు మళ్ళించాడు. అయితే సిటీలోకి ఎంటర్ కావటానికి ధైర్యం చాల్లేదు. త్యాగరాజన్ లాంటి వాళ్ళు ఎప్పుడూ ముందు తమ సేఫ్టీ చూసుకుంటారు. జనాన్ని రెచ్చ గొట్టడమే గాని జనం మధ్యకు వెళ్ళి పోట్లాడే దమ్ము ధైర్యం వీళ్ళకుండవు, కారును పక్క దారుల వెంట పరుగెత్తించి చెన్నై వెళ్ళే రూట్ కి చేరుకున్నాడు, ఆ రూట్లో అయిదు కిలో మీటర్ల దూరం వెళ్ళాక ఎవరూ లేని చోట చెట్ల కింద కారాపి కూచొని సెల్ ఫోన్ అందుకున్నాడు, ఎప్పటి కప్పుడు తన మనుషులకు ఫోన్ చేసి పరిస్థితి తెలుసుకుంటూ వాళ్ళని మరింతగా రెచ్చగొట్టనారంభించాడు.

ఆస్పత్రి నుంచి బయలు దేరిన మహా దేవ నాయకర్ కారు నేరుగా టేకు తోట కాంపౌండ్ మెయిన్ గేటును చేరుకొని ఆ గేటు చూడ్డానికి ఒక కోట సింహ ద్వారంలా ఉంటుంది. రెండు వాహనాల్ని మాత్రం తనతో లోనకు రమ్మని మిగిలిన వాహనాన్ని బయటే ఉండమని ఆర్డర్ వేసి గేటు తలుపు కొట్టించాడు.

గేటు లోపల ఇద్దరు సెంట్రీలు కాపలా ఉంటారు ఎవరన్నా వచ్చి తలుపు కొడితే కిటికీ తెరిచి చూసి పర్మిషనుంటేనే గేటు తీసి లోనకు పంపిస్తారు. బయట కలకలం విని అప్పుడే కిటికీ తెరిచి చూస్తున్నాడో సెంట్రీ తలుపు తట్టడం వాడు కిటికీ తెరవటం ఒకే సారి

జరిగింది. నాయకర్ మనిషి చట్టున వాడి పీకపట్టుకున్నాడు.      గేటు తెవరక పోతే చస్తావ్ అంటూ హెచ్చరించాడు. లోపలి రెండో సెంట్రీ కంగారుపడి గేటు తెరిచాడు.

వెంటనే మహా దేవ నాయకర్ కారు వెనకే రెండు వాహనాలూ లోనకు దూసుకొచ్చాయి. మిగిలినవి బయట ఆగి పోయాయి. అప్పుడే బాల్కనీలో కొచ్చిన ఎట్టయప్ప పరిస్థితి చూసి తొందర పడి గేటు మూసి తాళం వేయమంటూ గేటు దగ్గర సెంట్రీలకి సిగ్నలిచ్చాడు. మరు క్షణం వాళ్ళు గేటు మూసి తాళం వేసేసారు. బయటి అనుచరులు జాగ్రత్త పడేలోనే జరిగి పోయిందంతా.

లోన కెళ్ళిన మహా దేవ నాయకర్ గాని మిగిలిన వాళ్ళు గాని తమ వెనకే గేటు మూసి తాళం వేసిన సంగతి గమనించలేదు. గెస్ట్ హౌస్ లోనే ఉన్నాడని అభిప్రాయంలో వున్నాడు. నేరుగా మెట్ల వెంట పైకి పోబోతుంటే ఇరవై మంది గుండాలు మెట్ల దారిని బ్లాక్ చేసేసారు. బాల్కనీలో నిలబడిన ఎట్టయప్పన్.

''హలో మహా దేవ నాయకర్ గారూ ఏంటీ దౌర్జన్యం? సార్ ఇక్కడ లేరు. ఏమన్నా మాటాడ దలుచుకుంటే ఆయన వచ్చాక మాటాడండి. మీరు వెళ్ళి పోతానంటే ఆ గేటు తెరుచుకుంటుంది. లేదు గొడవ పడాలనుకుంటే వచ్చిన      వాళ్ళలో ఒక్కడూ బయటకి పోలేడు'' అంటూ వేలెత్తి చూపిస్తూ హెచ్చరిక జారీ చేసాడు.



ఎట్టయప్ప ధోరణి ఆ మాటలు పుండు మీద కారం చల్లినంత ఘాటుగా భగ్గుమన్పించాయి. ఒక్కసారిగా మహ దేవ నాయకర్ ముఖం కోపంతో ఎర్రబారింది. కళ్ళు చింత నిప్పుల్లా మారాయి ''రేయ్ ఎట్టయప్పా ఎవడ్రానువ్వు? నాకే వేలెత్తి చూపించి సవాల్ విసిరేంత మగాడివయ్యావా? నేను వస్తున్నారా ఏ మాత్రం ఆప గలవో ప్రయత్నించు'' అంటూ అడ్డంగా నిలబడిన రౌడీల్లో ఇద్దర్ని ఎత్తి అవతల పడేసి ముగ్గురి ముఖాలు పిడి గుద్దులతో పగల గొట్టి మెట్ల వెంట పైకి దూసుకెళ్ళాడు. వెనకే ఆయన అనుచరులు అక్కడి గుండాలతో తలపడ్డంతో ఆరంభమే అక్కడ యుద్ధ వాతావరణం నెలకొంది.

ఈలోపల

ఎప్పుడైతే సింహద్వారం లాంటి గేటు తలుపులు మూసి తాళం వేయబడ్డాయో మరు క్షణం బయట వున్న వాళ్ళలో ఒక్కసారిగా

అలజడి చెలరేగింది. కార్లలో వాళ్ళందరూ దిగి గేటు వద్దకొచ్చేసారు. ఇంకేముంది లోన మన నాయకర్ గారిని వెంట వెళ్ళిన వాళ్ళని చంపాలని చూస్తున్నారు గేటు విరగొట్టండి అనరిచారెవరో. అంతే బయటి నుంచి దృడమైన ఆ గేటు తలుపుల్ని పగల గొట్టే ప్రయత్నాలు ఆరంభించారు. ఈ లోపల కొందరు గోడకు వేయటానికి నిచ్చెన్ల కోసం పరుగు తీసారు. ఈ గందరగోళ పరిస్థితిలోనే న్యాయం అడగటానికెళ్ళిన మహా దేవ నాయకర్ గార్ని వారి మనుషుల్ని టేకు తోట ఎస్టేట్ లో త్యాగరాజన్ మనుషులు గేటు మూసి చంపబోతున్నారు, అనే వార్త దావనంలా సిటీ అంతా పాకిపోయింది. ఫోన్ల మీద సమాచారం అందగానే దొరికిన ఆయుధం పట్టుకొని నాయకర్ అభిమానులు వీధుల్లోకి బయలుదేరారు. ఇదే సమయంలో అటు నుంచి త్యాగరాజన్ సిటీలో తన వర్గం గుండా నాయకులకి ఫోన్లు కొట్టడంతో మరో పక్క వాళ్ళు కూడ ఆయుధాలతో వీరంగం చేస్తూ వీధుల్లోకి వచ్చేసారు. దాంతో ప్రధాన వీధుల్లో రెండు వర్గాలు మోదుకొని పరిస్థితి అదుపు తప్పి ఘర్షణలకు దారి తీసింది.

అక్కడ మెట్ల వెంట దారి చేసుకొని దొరికిన వాడ్ని దొరికినట్టు విరగ దీస్తూ మహా దేవ నాయకర్ వచ్చేస్తుంటే ఆయన కంట పడే ధైర్యం లేక ఎట్టియప్ప పక్కకు తప్పుకున్నాడు. సరాసరి ఆఫీసు డోర్ ని సమీపిస్తుండగా బయట గొడవ విని ఏం జరగుతుందో తెలుసుకోడానికి తలుపు తీసి బయటి కొచ్చింది కలక్టర్ లక్ష్మి.

మహా దేవ నాయకర్ తో ఆమెకు పరిచయం లేదు గాని గతంలో ఒకటి రెండు సార్లు చూసింది, విని వుంది అయినా సరే తను కలెక్టరన్న అధికార దర్పం అహంకారం తో ధైర్యంగా గుమ్మానికి అడ్డంగా నిలబడి కళ్ళెర్ర చేసింది ‘‘ఎవర్నువ్వు? ఎక్కడికి సరాసరి వచ్చేస్తున్నావ్? ఇది త్యాగరాజన్ గారి ఎస్టేటని తెలిసే వచ్చావా? ప్రాణాలతో తిరిగి వెళ్ళాలనుందా? ఆగు..........అక్కడే ఆగి పో’’ అంటూ హూంకరించింది.

కాని మహ దేవ నాయకర్ ఆగలేదు

గుబురు మీసం దువ్వుతూ బెబ్బులిలా పెద్ద పెద్ద అంగలతో ఆమె ముందుకొచ్చి కళ్ళలోకి ఉరిమి చూసాడు.

‘‘నన్నాగమని చెప్పటానికి నువ్వెవరు? త్యాగరాజన్ పెళ్ళానివా? ఉంపుడు గత్తెవా? లేపు కొచ్చిందానివా? ఎవరే నువ్వు? ఇక్కడ నీకేం పని? ఆడదానివి మర్యాదగా పక్కకి తప్పుకో’’ అంటూ హెచ్చరించాడు.

ఆ మాటలకు లక్ష్మి అహం దెబ్బ తింది.

“ఏయ్ మర్యాద.... నాలుక దగ్గరుంచుకొని మర్యాదగా మాటాడు. నన్నెవరునుకుంటున్నావ్?” అనరిచింది.

“ఎవరా !” అంటూ నవ్వాడు మహ దేవ నాయకర్.

“మధురై రాజ వంశీకుడ్ని. నువ్వెవరో తెలికుండా వచ్చాననుకుంటున్నావా? ఎక్కడి వాళ్ళు అక్కడుంటే మర్యాద. కాని చోట వుండి తప్పుడు వేషాలేస్తూ మర్యాద గురించి అడక్కూడదు కలక్టరమ్మా, పక్క జిల్లా దానివి మా జిల్లాతో నీకేం పని ఎందుకిక్కడున్నావని నేనడగను. నీ మొగుడిది ఎక్కడో ఉద్యోగం, నీ పిల్లలు అమెరికాలో, నీ ఉద్యోగం పక్క జిల్లాలో కాని నువ్వుండేది నెలకు పది రోజులు మా మధురైలో. నీ పదవిని హోదాని త్యాగరాజన్ కి తాకట్టు పెట్టి వాడికి ఉంపుడు గత్తెగా మారావ్. వాడి భూ కుంభ కోణాల్లో నీకు ప్రధాన పాత్ర ఉంది. ఇదేనా నీ బతుకు?” అంటూ కడిగి పారేసాడు. ఆ మాటలకి రెచ్చిపోయి లక్ష్మి “నన్ను ఉంపుడు గత్తె అంటావా? నిన్నూ” అంటూ కొట్టడానికి చేయెత్తింది. మరు క్షణం ఆమె చెంప చెళ్ళుమంది.

“నా మీదికే చేయెత్తే ధైర్యం ఎక్కడిది నీకు? ఛీ డబ్బు పిశాచి. అర్హత లేని నీలాంటి నీతి మాలిన వాళ్ళకి ఉన్నత పదవులు దక్కబట్టే ప్రజాస్వామ్యం యిలా నవ్వుల పాలవుతోంది. నా కూతుర్ని చంపటానికి మీరంతా చెన్నైకి మనుషుల్ని పంపిస్తారా. మీ అంతు చూస్తా తప్పుకో” అంటూ ఆమెను పక్కకు ఒక్క తోపు తోసి లోనకెళ్ళిపోయాడు మహ దేవ నాయకర్.

ఆ విసురుకు తూలి కిందపడిన్ది లక్ష్మి. “రేయ్ నీ కూతురు బతకదురా. మా గురించి పేపర్లకు ఎక్కించి కోర్టులో కేసు వేసాక అదింక బతకదు. చూస్తుండు” అనరిచింది ఆవేశం పట్టలేక.

మరు క్షణం సర్రున కత్తిదూసి ఆమె పీక మీద ఉంచాడు మహ దేవ నాయకర్. కళ్ళు నిప్పు కణాల్లా ఎర్రబారాయి. చేతిలో యమ పాశంలా రుస్తున్న ఖడ్గాన్ని, ఆయన ఆవేశాన్ని చూసి ఒక్కసారిగా వణికి పోయింది లక్ష్మి. చంపేస్తాడని భయపడిన్ది.

“ఆడ దానివై పోయావ్. స్త్రీ హత్య పాతకం నాకక్కర్లేదు. బతికి పోయావ్ పో. ఇదే మగాడివైతే ఇప్పుడే నీ తల నరికి తీసుకు పోయే వాడ్ని. నా గురించి ఏమనుకుంటున్నావ్ ? నా కూతురికి ఏమన్నా జరిగిందంటే చూడు త్యాగరాజన్ తో బాటు మీలో ఒక్కరు ఒక్కరూ ప్రాణాలతో వుండరు. నా కళ్ళ ముందు నుంచి వెళ్ళిపో” అనరిచాడు. సింహ ఘర్జనలా వున్న ఆ గొంతు విన్నాక ఇక లక్ష్మికి నోరు పెగల్లేదు. అటు పక్క తలుపు తీసుకుని పక్క గదిలోకి వెళ్ళిపోయింది.

వెంటనే త్యాగరాజన్ టేబుల్ తాళం పగల గొట్టి వెతగ్గా లోపలున్న లహరి ఫైల్ దొరికింది. దాన్ని మడిచి జేబులోకి తోసి వెను తిరిగాడు. ఇదే సమయంలో బయట మరో పక్క వున్న ఎట్టయప్ప లక్ష్మిని రహస్య మార్గం వెంట బయటికి పంపించేసి తనో ఇనప రాడ్ అందుకొని మహ దేవ నాయకర్ మనుషుల మీదికి దూసుకెళ్ళాడు.

ఇక మహ దేవ నాయకర్ తనకు త్యాగ రాజన్ కనబడలేదన్న కోపంతో ఖడ్గాన్ని చేత బట్టి వృద్ధ కిషోరంలా ఆ భవనమంతా కలతిరిగాడు. తన మీది కొచ్చిన గుండాల్ని కరవాలంతో నిర్దాక్షిణ్యంగా గాయ పరిచాడు. ప్రాణాలు మాత్రం తీయ లేదు. కాని సహస్రను చంపటానికి ధన గిరి బేచ్ ను చెన్నైకు పంపకం చేసిన ఎట్టయప్పను మాత్రం క్షమించే ఉద్దేశం ఆయనకి లేదు. వాడ్ని చంపాలనే వెదుకుతూ మరీ వెళ్ళాడు.

కాని ప్రమాదం గ్రహించిన ఎట్టయప్ప మహ దేవ నాయకర్ కి దొరక్కుండా మేడ పైనుంచి కిందకు దూకేసి తప్పించుకున్నాడు. కాళ్ళు విరిగినంత బాధను కూడ లెక్క చేయకుండా లేచి పరుగెత్తాడు. సరిగ్గా ఇదే సమయంలో బయట వాళ్ళు కాంపౌండ్ ఎంట్రన్స్ గేటు తలుపుల్ని విరగొట్టుకొని ప్రవాహంలా మహ దేవ నాయకర్ కు సాయంగా దూసుకొచ్చేసారు.

ఇక ఆ తర్వాత పరిణామాల్లో టేకు తోటలో అర్ధ గంట పైగా సాగిన పోరాటంలో త్యాగరాజన్ మనుషులు చిత్తుగా ఓడి పోయి పారి పోయారు. వాళ్ళు మరి కొంత మంది కూడ గట్టుకొని వచ్చేలోన మహా దేవ నాయకర్ మనుషులు ఎస్టేట్ భవంతికి నిప్పు పెట్టారు.

సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో నాయకులనే వాళ్ళు తప్ప ధనిక కుటుంబాల్లో ఎవరూ కలుగ జేసుకోరు. గోడ మీద పిల్లి వాటంగా తటస్థంగా ఉండిపోతారు. ఏ వర్గం మీద అభిమానం వున్నా అది మనసులోనే గాని బయటకు చూపించరు. కాని మధ్య తరగతి దిగువ స్థాయి ప్రజలు అలా కాదు వారికి అభిమానం వున్నా ఆగ్రహం వున్నా బయట పడతారు వెంటనే.

మధురైలోని పేద మధ్య తరగతి ప్రజల్లో మహా దేవ నాయకరన్నా ఆయనా కూతురు సహస్రన్నా విపరీతమైన అభిమానం వుంది. నగంరలో ఎక్కడ ఏ మూల ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకోడానికి ముందుంటారు. గతంలో ఇళ్ళు తగలబడినప్పుడు, గ్యాస్ సిలిండర్లు పేలి ప్రమాదాలు జరిగినప్పుడు, వరదల్లో లోతట్టు ప్రాంతాలు మునిగి పోయినప్పుడు, విష జ్వరాలు సోకి బాధ పడుతున్నప్పుడు ప్రభుత్వం కన్నా ముందు స్పందించి తమ వంతు సాయం అందించి వారిని ఓదార్చి వచ్చిన సందర్భాలున్నాయి. అంతే కాదు పేద వాడ్ని నాకీ సాయం చేయండి అంటూ ఎవరు అర్థించినా కాదనకుండా లేదనకుండా సాయం అందిస్తారు. ఎవరికన్నా అన్యాయం జరిగితే ఆ విషయం వెళ్ళి చెప్పుకుంటే చాలు మహ దేవ నాయకర్ తన మనుషుల్ని పంపించి అవసరమైతే తనే వెళ్ళి దగ్గరుండి న్యాయం జరిగించిన సందర్భాలున్నాయి.

నాయకర్ కుటుంబం మీద అక్కడి ప్రజలకున్న అభిమానం అపారమైంది. ఎప్పుడైతే మహా దేవ నాయకర్ టేకు ఎస్టేట్ కు బయలుదేరాడో అప్పుడే అసలు విషయం ప్రజల మధ్యకు వెళ్ళి పోయింది.

సహస్రను చంపించడానికి త్యాగరాజన్ చెన్నైకి మనుషుల్ని పంపించాడని, మహా దేవ నాయకర్ న్యాయం అడగటానికి వెళ్తే టేకు ఎస్టేట్ గేట్లు మూసి లోన చంపాలని ప్రయత్నిస్తున్నారని దొమ్మి జరుగుతోందని నగరమంతా వార్తలు వ్యాపించాయి. దాంతో ఒక్కసారిగా ప్రజాభిమానం పెల్లుబికింది ఎవరికి వారు చేతికి దొరికిన ఆయుధం అందుకొని వీధుల్లోకొచ్చేస్తున్నారు. ఎదురు పడుతున్న గుండాల్ని భరతం పడుతున్నారు. గొడవ ఆరంభంలో ఆస్పత్రి వద్ద వుండగానే నగర పోలీస్ కమీషనర్ మహా దేవ నాయకర్ కు ఫోన్ చేసి ఎ యస్ పి ప్రకాష్ ను వదిలేయమని అడగ్గా మహా దేవ నాయకర్ ఒక హెచ్చరిక చేసాడు.

ఈ ఒక్క రోజు మీరు కళ్ళు చెవులు నోరు మూసుక్కూచోండి అంటూ. ఆ వెంటనే సిపి హోం మినిస్టర్ కి ఫోన్ చేసి పరిస్థితి వివరించటం జరిగింది. పరిస్థితి విషమించక ముందే అదనపు బలగాల్ని పంపించమనీ అర్థించాడు.

ఆ ఫోన్ చేసిన కాస్సేపటికే ముఖ్యమంత్రి చెల్వి చెందామరై ఫోన్ కాల్ వచ్చింది. కమీషనర్ ని అడిగి మధురైలో పరిస్థితిని తెలుసుకుంది. మహా దేవ నాయకర్ కమీషనర్ చేసిన హెచ్చరిక గురించి వింది.

సాధారణంగా ఏ రాజకీయనాయకుడైనా సమకాలీన పరిణామాల్లో రాజకీయ లబ్ధిని ఆశించటం సహజం కొన్ని సందర్భాల్లో ప్రజా జీవితం అస్తవ్యస్తమవుతున్నా పట్టించుకోరు. ఇక్కడా అక్షరాలా అదే జరిగింది.

అక్రమార్కుడు కుంభకోణాల పుట్ట అయిన త్యాగరాజన్ సాక్షాత్తు మాజీ సి యం కి మనవడు. పార్టీలో ముఖ్యుడు కూడ కాబట్టి త్యాగరాజన్ ని దెబ్బ తీస్తే మాజీ సి యం ని దెబ్బ తీసినట్టే. ప్రతి పక్ష పార్టీ పరువు మరింత దిగజారుతుంది. ఆ పార్టీ ప్రతిష్ట దెబ్బ తింటుంది. తమ పార్టీకి తిరుగుండదు. కాబట్టి జగన్ మోహన్ ని మరింత ఇరుకున పెట్టే వ్యూహం తోనే స్పెషల్ ఫోర్స్ రావటం ఆలస్యమవుతుంది. ఈ లోపల పరిస్థితిని గమనిస్తుండండి. ఉన్న పోలిసు బలగంతోనే ఇరు వర్గాల్ని అదుపు చేయటానికి ప్రయత్నించండి. మహా దేవ నాయకర్ ని సేఫ్ గా ఇంటికి చేర్చి రెండ్రోజులు హౌస్ అరెస్ట్ లో వుంచండి. మిగిలిన విషయాలు లా అండ్ ఆర్డర్ అదుపు లోకి వచ్చాక చూద్దాం అంటూ ఆదేశించింది.

ఆ ఆదేశాన్ని బట్టి అల్లర్లు వెంటనే అదుపులోకి తేవటం సియం గారికి ఇష్టం లేదని కమీషనర్ కి అర్థమై పోయింది. ఆ తర్వాత ఏం జరిగి వుంటుందో వూహించు కోవచ్చు.

ఇరు వర్గాలూ స్ట్రీట్ ఫైట్స్ కి తెగ బడ్డంతో మధురై జన జీవనం స్తంభించింది. ఇదే అదనుగా అల్లరి మూకలు చెలరేగాయి.

ఉదయం తెరచిన షాపులే చకచకా మూత పడి షట్టర్లు దించి తాళాలు వేసేసారు. లాఠీలు వూపుకుంటూ వచ్చిన పోలీసులు ప్రేక్షకుల్లా మిగిలి పోయారు తప్ప కత్తులు కర్రలు బరిసెలు ఇనుప రాడ్ ల వంటి మారణాయుధాలతో తలపడుతున్న ఇరు వర్గాల్ని అదుపు చేసే ప్రయత్నాలు చేయలేదు. వారి మారణాయుధాల ముందు తమ లాఠీలు ఎందుకు కొరగావని వాళ్ళకు తెలుసు.

అల్లర్లు మొదలయిన అర్ధ గంట లోపే మిగతా వాళ్ళు రంగం లోకి దిగి వార్తలు పంపించటం ఆరంభించారు. యుద్ధ రంగాన్ని తలపిస్తున్న మధురై మెయిన్ వీధుల్లోకి వేన్ మీద వెళ్ళి వీడియో కెమెరాతో షూట్ చేస్తే ప్రమాదమని వాళ్ళకు తెలుసు. కెమెరా భుజాన వేసుకొని బిల్డింగ్ లు గోడలు కవర్ చేసుకొని షూట్ చేస్తుండగా నేరుగా టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం ఆరంభమైంది.

గొడవ మొదలయిన గంట తర్వాత ఎలాగో పోలీసులు మహ దేవ నాయకర్ ను అదుపు లోకి తీసుకొని సురక్షితంగా ఆయన ఇంటికి చేర్చి పటిష్టమైన పోలీసు కాపలాతో హౌస్ అరెస్ట్ లో వుంచారు. ఇక బయట పరిస్థితి నగరంలో ఎక్కడ చూసినా బీభత్సంగా వుంది. అంతకంతకూ పెరిగి పోతున్న ప్రజాభిమానం చూసి త్యాగరాజన్ గుండాలు రెచ్చి పోయారు. వాళ్ళకి అల్లరి మూకలు తోడయ్యాయి.

అరుపులు, కేకలు, ఆర్తనాదాలతో మధురై వీధులు హోరెత్తి పోయాయి. ఈ ఘర్షణల్లో అధిక భాగం నష్ట పోయింది త్యాగ రాజన్ ఆస్తులే. మహా దేవ నాయకర్ ఆస్థుల్ని స్వచ్చందంగా కాపలా వుండి అల్లరి మూకలు గాని గుండాలు గాని అటాక్ చేయకుండా ఆయన అభిమానులే కాపాడుతున్నారు.

సుమారుగా పదకొండు గంటల తర్వాత అంటే ఘర్షణలు ఆరంభమైన సుమారు మూడు గంటల తర్వాత అనేక వేన్ లలో స్పెషల్ ఫోర్సు మధురై వీధుల్లోకి ప్రవేశించాయి. వారి రాక తో స్థానిక పోలీసులకు ధైర్యం చిక్కింది. ఆ తర్వాతనే అల్లరి మూకల పని పట్టే కార్యక్రమం మొదలైంది. ఒంటి గంటకంతా నగరమంతటా కర్ఫ్యూ విధించారు. అయినా సాయంత్రానికి గాని నగరం అదుపులోకి రాలేదు. అప్పటికే అక్కడ నగర శివార్లో వున్న త్యాగరాజన్ సెల్ ఫోన్ ద్వారా ఎప్పటి కప్పుడు పరిస్థితిని తెలుసుకుంటూనే వున్నాడు రిజర్వు పోలీసులు రంగ ప్రవేశం చేసారని తెలిగానే ఇక ఒక్క క్షణం కూడ అక్కడ ఆగకుండా కారు స్టార్ట్ చేసుకొని డైరెక్ట్ గా చెన్నైకి బయలు దేరాడు.

ఈ లోపల

రిజర్వు పోలీసులు రాక ముందు

ఒకటి వి ఛానల్ కు చెందిన వీడియో గ్రాఫర్ మహా దేవ నాయకర్ మీద ప్రజలకున్న అభిమానం చాటే హృదయాన్ని కదిలించే కొన్ని దృశ్యాల్ని షూట్ చేసాడు. అది లైవ్ టెలికాస్ట్ గాబట్టి నేరుగా టివిలోకి వచ్చేసింది.

''ఓ మైగాడ్............మధురైలో సహస్ర కింత ఫాలోయింగ్ వుందని ఇంత వరకూ నాకే తెలీదు'' అన్నాడు అంత వరకు టివి వార్తలు చూస్తున్న విరాట్. ''అవున్రా బాబూ'' అన్నాడు సంభ్రమంతో చందూ.

అప్పటికే మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటింది సమయం మధురై పట్టణంలోకి రిజర్వు పోలీసు దళాలు ఎంటరైన విషయాల్ని అప్పుడే టివి స్క్రోలింగ్ లో వేస్తున్నారు. ఎప్పుడు వచ్చారో గాని సహస్ర గది లోంచి వచ్చి విశాల దీక్షలు కూడ ఆసక్తిగా వార్తలు చూస్తున్నారు. విరాట్ లేవటం చూసి విరాట్ నువ్వెళ్ళి స్నానం చేసి బట్టలు మార్చుకో. నీ బట్టలు అక్కడే ఉంచాను. భోజనం వేళవుతోంది'' అంది విశాల.

''సహస్ర ఎలా వుంది?'' అడిగాడు.

''ఇంకా స్పృహలోకి రాలేదు'' అంది దీక్ష.

''విశాలా నా సెల్ ఫోను ఎక్కడుంది? సహస్ర ఫోను కూడ ఇవ్వు. ఓసారి ఫోన్ మాట్లాడాక స్నానానికెళ్తాను'' అన్నాడు.

ఫోన్లున్న కవర్లు రెండూ తెచ్చింది విశాల.

ముందుగా సహస్ర సెల్ అందుకొని ఆన్ చేసాడు. సహస్ర తల్లి మూగాంబికై నంబర్ కు ఫోన్ చేసాడు. వెంటనే లైన్ లో కొచ్చిందావిడ. ఫోన్ చేసింది తన కూతురనుకొని అమ్మాయ్ సహస్రా అంది ఆమె గొంతులో ఆందోళన ధ్వనిస్తోంది.

‘‘ఆన్టీ నేను ...... విరాట్ ని’’ అన్నాడు.

టివి సౌండ్ తగ్గించి...

లేచి ఇవతలికొచ్చాడు.

‘‘సహస్ర ఎక్కడ? పక్కనుందా? మీరు క్షేమంగా వున్నారా?’’ ఆత్రంగా అడిగింది మూగాంబికై.

‘‘క్షేమంగా వున్నాం ఆన్టీ. మీరు కంగారు పడకండి. సహస్ర నాతోనే వుంది.’’

‘‘కంగారు పడకుండా ఎలా ఉంటాం విరాట్. ఎన్నిసార్లు ఫోన్ చేసినా మీ యిద్దరి ఫోన్లూ స్విచ్చాఫ్ లోనే వున్నాయి.’’

‘‘అవును ఇక్కడ పరిస్థితులు బాగలేదని ఫోన్ లు స్విచ్చాఫ్ లోనే వుంచాం’’

‘‘ఓసారి సహస్రతో మాట్లాడతాను. ఫోనివ్వు’’

ఫోనివ్వటానికి సహస్రకి స్పృహ వస్తే గదా!

మూగాంబికై అభ్యర్ధన విరాట్ కి ఒకింత గాభరా పుట్టిచ్చింది. ఏదో ఒకటి చెప్పి మేనేజ్ చేయక పోతే కంగారు పడతారు.‘‘రాత్రంతా మాకు నిద్ర లేక పోడంతో చాలా అలసిపోయాం. సహస్ర ఇంకా గాఢ నిద్ర లోనే వుంది. ఇప్పుడే టివి వార్తలు చూసాను. మధురైలో గొడవల గురించి వార్తలొస్తున్నాయి. మీరక్కడ క్షేమమే గదా ఆంటీ?’’

‘‘మేం క్షేమమే బాబూ........      చెన్నై గుండాలతో త్యాగ రాజన్ సహస్ర మీద దాడి చేయించుంటాడని ధర్మ చెప్తేనూ........’’

‘‘లేదు లేదు...... ఆ గొడవకి త్యాగరాజన్ కి సంబంధం లేదు ఆన్టీ. ధర్మ టివి వార్తలు చూసి పొరబాటు పడ్డాడు. సహస్రకి బాగా తెలిసిన ఒక ఆన్టీ. శిఖామణి అనే గుండా కిడ్నాప్ చేస్తుండగా సహస్ర అడ్డుకోవటంతో ఆ గొడవ ఆరంభమైంది మేం సేఫ్ గానే తప్పించుకున్నాం’’

‘అలాగా అంతా ఆ మీనాక్షి తల్లి దయ. మీరు క్షేమంగా వున్నారు చాలు. ఇక్కడ ఇవాళ గాక పోతే రేపయినా గొడవలు ఆరంభమయ్యేవే. మా గురించి కంగారు వద్దు. గొడవలు పెరక్కూడదని పోలీసులు అంకుల్ని తీసుకొచ్చి హౌస్ అరెస్ట్ లో ఉంచారు. పక్కనే వున్నారు ఓసారి మాటాడతావా?’’

‘‘వద్దులే ఆన్టీ. అంకుల్ నామీద చాలా కోపంగా వుండుంటారు.’’

‘‘అదేం లేదయ్యా. అయిందేదో అయింది మాటాడు’’ అంది మూగాంబికై. క్షణం తర్వాత అటునుంచి ‘‘హాలో!’’ అంటూ గంభీరంగా వినవచ్చింది మహ దేవ నాయకర్ గొంతు.

‘‘నమస్తే అంకుల్’’ అన్నాడు విరాట్

‘‘చెప్పు విరాట్ రాత్రి అక్కడ ఏం జరిగింది?’’ గాభరాగా అడిగాడు మహా దేవ నాయకర్.

‘‘అంకుల్ ఏం జరిగిందో చెప్పే ముందు మీకు ఓ మాట చెప్పాలి. మీకు నామీద కోపం ఉండొచ్చు సహజం. ముక్కు ముఖం తెలిని ఓ కుర్రాడు తన కూతుర్ని లవ్ చేస్తే ఏ తండ్రికయినా కోపం వస్తుంది. కాని అదేమిటో నాకే తెలీదు. చూడగానే సహస్ర నాకు నచ్చింది. నేనూ తనకు నచ్చాను. ఇక ఈ పాటికే మీకు నా వివరాలు తెలిసి ఉంటాయి. మీకో మాట మాత్రం ఇవ్వగలను నన్ను దాటకుండా సహస్రను ఎవరూ ఏమీ చేయలేరు. సహస్ర నా ప్రాణం. ఎలా కాపాడుకోవాలో నాకు తెలుసు. కాబట్టి మీరు మా ప్రేమను అర్ధం చేసుకొని నన్ను నమ్మితేనే ఇక్కడ ఏం జరిగిందో చెప్పగలను.’’

‘‘నేను నిన్ను నమ్ముతున్నాను. మీ ప్రేమను అర్ధం చేసుకున్నాను. మీ మీద కోపం లేదు. సరేనా? సహస్ర నిజంగా క్షేమంగా ఉంది

గదా?"

"క్షేమంగా ఉంది భయపడాల్సిన పనిలేదు. రాత్రి మేమిద్దరం గొప్ప ప్రమాదం నుంచి బయట పడ్డాం" అంటూ ఇక దాచకుండా చకచకా రాత్రి విషయాలు వివరించాడు. అయితే విశాల పేరు చెప్పకుండా. ఫ్రెండు తమను కాపాడినట్టు చెప్పాడు. అంతా విని బాధగా నిట్టూర్చాడు మహ దేవ నాయకర్.

"ఒకె విరాట్ అమ్మాయి స్పృహలోకి రాగానే మాకు ఫోన్ చేయించి మాట్లాడిన్చు. ఈ హౌస్ అరెస్ట్ నుండి బయట పడగానే ఆన్టీ నేను చెన్నై వస్తాం" అన్నాడు.

కాస్సేపు ఆయనతో మాటాడి లైన్ కట్ చేసాడు. తర్వాత తన సెల్ ఆన్ చేసి ధర్మా సెల్ కి ఫోన్ చేసాడు.

వెంటనే లైన్ లో కొచ్చాడు ధర్మ

అప్పటికే వాళ్ళంతా మధురై చెన్నై మార్గం మధ్యలో ఎక్కడో బస్ ఆపి హోటల్లో భోంచేస్తున్నారు. విరాట్ ఫోన్ రాగానే ధర్మా భోజనం ఆపి..."ఏమిట్రా విరాట్ మూడు రోజులుగా నీ ఫోన్ లేదు. రాత్రి చెన్నైలో గొడవ టివిలో చూడగానే మీరెలా వున్నారో తెలీక చాలా కంగారు పడ్డాం. అందుకే మన వాళ్ళందరితో బస్ లో బయలు దేరి వస్తున్నాం" అన్నాడు ధర్మ.

"వచ్చే వాడివి నేరుగా రాకుండా మహ దేవ నాయకర్ కి ఎందుకు లీక్ చేసావ్...? అక్కడ మధురై గొడవలతో భగ్గుమంటోంది తెలుసా? మహ దేవ నాయకర్ ని పోలీసులు హౌస్ అరెస్ట్ లో వుంచారు. రెండు వర్గాలు వీధిన పడి కొట్టుకుంటున్నారు. త్యాగరాజన్ జాడ తెలీటం లేదంటున్నారు పోలీసులు. చెన్నై పారి పోయాడని కొందరంటున్నారు. టివి వార్తలు చూసావా?" అంటూ విరాట్ అడుగుతుంటే అవతల ధర్మ....

"సారీ..... సారీ విరాట్. మేం ఇప్పుడే ఇక్కడ హోటల్లో టివి చూస్తున్నాం. మధురై పరిస్థితి చాలా దారుణంగా వుంది. సందేహం లేదు. ఇలా జరుగుతుందనుకోలేదు. ఇప్పుడు కూడ నాయకర్ కి అసలు విషయం తెలీక పోతే బాగుండదని వెళ్ళి చెప్పాను. త్యాగరాజన్ని ఓసారి హెచ్చరిస్తాడని దీనివలన ప్రయోజనం ఉంటుందని ఆశించాను కాని రెండు వర్గాలు కొట్టుకుంటూ వీధిన పడతాయనుకోలేదు. టేకు ఎస్టేట్ భవనం తగలబడ్డం టివిలో చూసాను."

‘‘చూసావ్ గదా, ప్రస్తుతం మీరు చెన్నై రావద్దు మదురైకి వెళ్ళిపొండి’’

‘‘లేదు లేదు మిమ్మల్ని కలవకుండా మీరెలా వున్నారో చూడకుండా వెనక్కి వెళ్ళేప్రసక్తే లేదు. ఎలాగు ఇంత దూరం వచ్చేసాం. చెన్నై వచ్చేస్తాం.’’

ధర్మ నిర్ణయం విన్నాక

ఏం చెప్పాలో విరాట్ కి అర్థం కాలేదు

అభిమానంతో తన కోసం వస్తున్న మిత్ర బృందాన్ని రావద్దని అడ్డు చెప్పలేదు. అలాగని వాళ్ళంతా ఇక్కడికొచ్చేస్తే తమ ఉనికి బయట పడిపోతుంది. ఒక పక్క పోలీసులు మరో పక్క శత్రువులు తమకోసం గాలిస్తున్నారు.



“ఒకె ధర్మా ఓ పని చెయ్యండి. మీరు నేరుగా సిటీ లోకి రావద్దు. చెన్నై సిటీ లిమిట్స్ పరిసరాల్లో ఏదో ఒక హోటల్లో బస చేయండి. వీలు చూసి నేను ఫోన్ చేస్తాను. అప్పుడు రావచ్చు” అంటూ రాత్రి సంఘటనల్ని క్లుప్తంగా వివరించి లైన్ కట్ చేసాడు విరాట్.

తర్వాత ఇంటి వద్ద తల్లి మంగ తాయారు కంగారు పడుతుందనే ఉద్దేశంతో కోయంబత్తూరు ఫోన్ చేసాడు.

“విరాట్..........ఎలా ఉన్నావ్ రా.......... ఏమైందిరా?” అంటూ ఏడ్చేసిందావిడ.

‘‘మమ్మీ ఏం కాలేదు వూరుకో.        మేం క్షేమంగా వున్నాం. మీరేం కంగారు పడొద్దు’’ అంటూ విరాట్ ఓదార్చాక గాని ఆమె స్థిమిత పడలేదు.

‘‘డాడీతో కలసి చెన్నై వస్తున్నాను, మిమ్మల్ని చూడాలి’’ అంది స్థిరంగా.

ఆ మాట వినగానే కంగారు పడ్డాడు విరాట్. ఇప్పుడున్న పరిస్థితిలో ఒకరి తర్వాత ఒకరు యిలా చెన్నై వచ్చేస్తే అంతా గందరగోళమైపోతుంది. ఆ పైన బలవంతంగానయినా తనను తీసుకెళ్ళి సాగరికతో పెళ్ళి జరిపించాలని చూస్తారు డాడీ. అందుకే విరాట్ అంగీకరించలేదు.

‘‘మమ్మీ ఇక్కడ పరిస్థితులేం బాగలేదు. వీలు చూసి నేను ఫోన్ చేస్తాను. అప్పుడు రావచ్చు. ప్రస్తుతం వద్దు. ఉంటాను’’ అంటూ ఇక మాటలు పొడిగించకుండా లైన్ కట్ చేసాడు.

మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటినా...

సహస్ర ఇంకా స్పృహలోకి రాలేదు.

ఆ విషయంలో అందరిలోనూ ఆందోళన వుంది. ఈ లోపల విరాట్ తన గదిలోకి వెళ్ళి జాగ్రత్తగా భుజాన బాండేజి తడవకుండా స్నానం చేసి బట్టలు మార్చుకొని వచ్చాడు. ఈ లోపల విశాల డైనింగ్ రూలో అందరికీ భోజనాలు ఏర్పాటు చేస్తూ కింద వుండిపోయింది. ఆమెకు సాయంగా దీక్షక్కూడ వెళ్ళింది. విరాట్ చందూతో ఏదో మాట్లాడుతుండగా విరాట్ సెల్ ఫోన్ మోగింది. తీసి చూస్తే అది తన పర్సనల్ నంబర్ కొచ్చిన కాల్. కాల్ చేసింది సాక్షాత్తూ స్టేట్ సియం చెల్వీచెందామరై.

‘‘నమస్తే మేడం’’అన్నాడు.

‘‘చూడు బాబు నీ పేరు విరాట్ కదూ?’’ అడిగిందావిడ.

“హానరబుల్ సియం గారు స్వయంగా నాకు ఫోన్చేసి విచారిస్తున్నందుకు చాలా చాలా కృతజ్ఞుడ్ని మేడం. నా పేరు మీకు తెలిసి పోయిందంటే ఖచ్చితంగా మధురై నుండి మహ దేవ నాయకర్ గారు మీకు ఫోన్ చేసుండాలి యామై కర్ట్.”

“యస్ యు ఆర్ కరక్ట్” అంటూ నవ్విందావిడ.

“నువ్వు చాలా తెలివైన వాడివి విరాట్. ఆ విషయం మొదటి సారిగా నీతో మాట్లాడినప్పుడే గ్రహించాను. సహస్ర స్పృహలోకి వచ్చిందా? నీ గాయం ఎలా వుంది.”

“ట్రీట్ మెంట్ జరిగింది గాబట్టి నా గాయం గురించి భయం లేదు మేడం. సహస్ర ఇంకా స్పృహలోకి రాలేదు. ఇంకో రెండు మూడు గంటలు పట్టొచ్చు.”

“ఇప్పుడు ఎక్కడున్నారు? మీ క్షేమం కోసమే చెప్తున్నాను. మీకు ప్రొటెక్షన్ ఏర్పాటు చేస్తాను.”

“సారీ మేడం. మా మీద దయతో ఇంత శ్రద్ధ చూపిస్తున్న మీకు కృతజ్ఞుడ్ని. కాని మేం ఎక్కడుందీ చెప్పను. నాయకులు ఎవరయినా సరే సందర్భాన్ని అనుకూలంగా మార్చుకొని లబ్ది పొందాలని చూస్తారు. ఇక్కడ జరుగుతున్నది త్యాగరాజన్ కి జర్నలిస్టు లహరికి మధ్య పోరాటం. లహరి స్పృహలోకి రాకుండా నేను సొంత నిర్ణయాలు తీసుకునే అవకాశం కూడ లేదు. కాబట్టి దయచేసి వివరాలు అడక్కండి” అన్నాడు నిర్మొహమాటంగా.

“ఒకె అడగను. కాని మీ కోసం పోలీసులే కాదు చాలామంది గాలిస్తున్నారు తెలుసా?” అంది సియం చెందామరై.

“తెలుసు మేడం. అందుకే మా జాగ్రత్తలో మేం వున్నాం.”

“ఒకె విరాట్ నీ అభిప్రాయాల్ని కాదనలేను. కాని చెప్పాగా సహస్ర మా పార్టీకి ముఖ్యుడయిన మహ దేవ నాయకర్ కూతురు. కాబట్టి మీకే సాయం కావాలన్నా నేనున్నానని మర్చిపోవద్దు. టేక్ కేర్ ఉంటాను.”

“మేడం.............ఒక్క విషయం.”

“చెప్పు విరాట్.”

“రాత్రి జరిగిన గొడవలో మా మనుషులు అయిదుగురు పోలీసులకు పట్టుబడ్డారు. వాళ్ళు అమాయకులు. వాళ్ళని విడిచి పెడ్తే చాలు మీ మేలు మర్చిపోలేం”

““ఒకె వాళ్ళ పేర్లు చెప్పు”

పక్కన వున్న చందూ రాసిచ్చిన అయిదుగురి పేర్లు చదివి చెప్పాడు విరాట్. అందులో ముగ్గురు మునుసామి మనుషులు, ఇద్దరు కదిరేషన్ మనుషులు, సి యం తో మరి కాస్సేపు మాట్లాడిన తర్వాత అటు నుంచి లైన్ కట్ అయింది. విరాట్ తన సెల్ జేబులో వేసుకొని సహస్ర సెల్ స్విచ్ ఆఫ్ చేసి కవర్ లో ఉంచాడు.

ఇంతలో దీక్ష వచ్చి పిలవటంతో విరాట్ చందూలు భోజనానికి కిందకు వెళ్ళారు దీక్ష వెంట.

**************************************************

మధురైలో అల్లర్లు సాయంత్రం మూడు గంటలకి గాని అదుపులోకి రాలేదు. అల్లరి మూకల్ని రౌడీల్ని అదుపు చేయటంలో స్పెషల్ ఫోర్స్ తో బాటు నగర పోలీసులు చాలా శ్రమ పడవలసొచ్చింది. అక్కడ పోలీసులు మధురైని అదుపు లోకి తెచ్చిన అదే సమయానికక్కడ త్యాగరాజన్ ప్రయాణిస్తున్న కారు చెన్నై నగరంలో ప్రవేశించింది.

**************************************************

సాయంత్రం సరిగ్గా మూడు గంటలు కావస్తోందనగా సడెన్ గా స్పృహలోకి వస్తూ ఇటు నుంచి అటు కదిలింది సహస్ర కదిలిన కొద్ది సేపటికే ఆమె పూర్తిగా స్పృహలోకొస్తూ చిన్నగా కళ్ళు తెరిచింది కళ్ళు రెండూ మసకబారి కంటి ముందు ఏముందీ కన్పించలేదు.

వెలుతురు చూడలేక పోతోంది తలంతా దిమ్ముగా వుంది. భరించరాని శిరోవేదన అంతకు మించి ఒంట్లో కదల్లేనంతగా నీరసం ఏం జరిగింది? కొద్దిసేపు ఆమె మస్తిష్కం మొద్దు బారి పోయింది. తను ఎవరు ఎక్కడుంది? ఏ విషయం గుర్తు లేకుండా పోయింది. కాని తన పాదాల వద్ద ఎవరో వున్నారు. పాదాలు నొక్కుతూ అరికాళ్ళు మర్దిస్తూ సేవలు చేస్తున్నారు. ఎవరయి ఉంటారు? తనకేమైంది? ఎందుకిలా బెడ్ మీద ఉంది? తలకి ఈ బాండేజ్ దేనికి? కళ్ళు మూసుకొని కొద్దిసేపు అలాగే ఉండిపోయింది. ఆమెకు తెలియకుండానే కనుకొలకుల్లోంచి కన్నీరు ముత్యాల్లా జాలువారుతోంది. అతి ప్రయత్నం మీద....

క్రమంగా జరిగిన సంఘటనలన్నీ...

ఒక్కటొక్కటిగా గుర్తు రానారంభించాయి.

జియన్ చెట్టి రోడ్ లో గొడవ, సుకుమారి ఆన్టీని పంపించేసాక శిఖమణి వాడి మనుషులతో ఫైటింగ్ తనకు సాయంగా వాళ్ళంతా రావటం, విరాట్ శిఖమణిని అటాక్ చేయటం, పోలీసుల రంగ ప్రవేశంతో తాము తప్పించుకునే ముందు విరాట్ భుజానికి బలమైన గాయం, అంతా గుర్తొచ్చింది. చివరిగా వేన్ లోంచి కాల్పులు జరుపుతుండగా తను రాళ్ళు విసరటం గుర్తుంది. అంతలో తల మీద ఏదో పిడుగులా పడిరది. అంతే తర్వాత ఏంజరిగిందో తెలీదు. తను తెలివి తప్పి ఎంత సేపయిందో కూడ తెలిదు. విరాట్.........విరాట్ ఎలా వున్నాడు? విరాట్ గుర్తు రాగానే బలవంతంగా కళ్ళు తెరిచి చూసింది పది క్షణాల తర్వాత స్పష్టంగా చూడగలిగింది.

పాదాల వద్ద నడి వయస్సు స్త్రీ ఒకామె కూచునుంది. తన రెండు పాదాలను ఒడిలో ఉంచుకొని సేవ చేస్తోంది. ముఖాన బొట్టు లేదు కాని చూడగానే నమస్కరించాలనిపించే శాంత గంభీర వదనం. ఆవిడ ఎవరు? తనకింత శ్రద్ధగా ఎందుకు సేవలు చేస్తోంది ఏమీ అర్థంకాలేదు. చట్టున పాదాలు వెనక్కు తీసుకుంది సహస్ర.

‘‘అమ్మా...............ఎవరు మీరు? నాకు మీరు సేవలు చేయటం ఏమిటి? అనడిగింది బలహీనంగా వుండి ఎక్కడో నూతిలోంచి వస్తున్నట్టుంది మాట. బహుశ ఆవిడ సేవలు చేయటం వల్ల తనకి స్పృహ ఏర్పడిన్దనిపించింది.

సహస్రకి స్పృహ రావటం చూసి...

ఆవిడ ఎంతో సంతోషిస్తూ లేచి...

తల దిళ్ళు సర్ది సహస్ర వెనక్కి వాలి కూచునేలా సాయం చేసింది.

''నన్ను అమ్మా అన్నావ్ గా నేనూ నీ తల్లిలాంటి దాన్నే. నీకు స్పృహ రాలేదని అంతా కంగారు పడుతున్నారు. పిలుచుకొస్తానుండు'' అంటూ సంతోషంతో పాబోతుంటే చేయి పట్టి ఆపింది సహస్ర.

''కాస్సేపు నా పక్కన కూచోండి. వాళ్ళని పిలవచ్చులే.......విరాట్ ............. విరాట్ ఎలావున్నాడు?'' అడిగింది.

''నువ్వు చాలా బలహీనంగా వున్నావ్ తల్లీ. నిన్నెప్పుడు తిన్నావో ఏమిటో. ఇప్పుడు సాయంత్రం మూడు గంటలు. రాత్రి నుంచి నువ్వు స్పృహలోనే లేవు. ఏమన్నా తెస్తాను కనీసం కాఫీ........''

''అవన్నీ తర్వాత.........విరాట్ ఎలా వున్నాడు?''

''తను క్షేమంగానే వున్నాడు. అర్ధరాత్రి కంతా మిమ్మల్ని ఆస్పత్రికి చేర్చటం, మూడు గంటలకి ఆపరేషన్ చేయటం జరిగింది. విరాట్ ఉదయమే స్పృహ లోకి వచ్చాడు''

''మీరెవరు?..............నన్ను కాపాడిన్ది ఎవరు?''

''నా పేరు కాంచన మాల'' చెప్పిందావిడ.

''నాకు తెలిసింది చెప్తాను, రాత్రి నీ తల మీద పైన వేలాడుతున్న పూల కుండీ తెగి పడ్డంతో తల వెనక బాగంలో దెబ్బ తగిలి స్పృహ కోల్పోయావ్. నీ పరిస్థితి చూడగానే ఆవేశంలో వేన్ లో నలుగుర్ని విరాట్ షూట్ చేసి చంపేసాడు. నిన్ను భుజాన వేసుకుని ప్లే గ్రౌండ్ చివరి కొచ్చే లోన భుజం గాయం నుంచి ఎక్కువ రక్తం పోడంతో పక్కన చెత్త కుప్పలో ఎవరి కంటా పడకుండా నిన్ను పడుకోబెట్టి తను తెలివి తప్పే లోన విశాలకు ఫోన్ చేసి చెప్పాడు. ఆ అర్ధరాత్రి చందూతో వెళ్ళి విరాట్ ని నిన్ను కార్లో తీసుకొచ్చి తన ఫ్రెండు డాక్టర్ గుణ దీపిక క్లినిక్ లో మీకు ఆపరేషన్ చేయించి గండం గడిచిందని డాక్టర్ చెప్పాక ఎవరికీ తెలీకుండా

ఇక్కడికి చేర్చింది విశాల.''

''అంటే...........విశాల........''

''అది ఎవరో కాదమ్మా నా కూతురే. నాకంతా తెలుసు. నువ్వు నిశ్చింతగా ఉండి త్వరగా కోలుకుంటే మా అందరికీ అదే సంతోషం. బయట శత్రువులతో బాటు పోలీసులూ మీ కోసం వెదుకుతున్నారు. మీకు ఇంత కన్నా సేఫ్ ప్లేస్ ఉండదని విశాల మిమ్మల్నిక్కడ ఉంచింది. అంచేత నువ్వు ఎలాంటి సంకోచాలు పెట్టుకోవద్దు, దీక్ష ఇక్కడే వుంది. చందూ ఇంటికెళ్ళొస్తానని వెళ్ళాడు. విరాట్ నిద్రపోతున్నాడు. నేవెళ్ళి వాళ్ళని పంపిస్తాను'' అంటూ కాంచన మాల హడావుడిగా బయటి కెళ్ళిపోయింది.

తనకు స్పృహ రావటం చూసి ఆవిడ పడుతున్న సంతోషం చూస్తుంటే తన కూతురికి స్పృహ వచ్చినట్టే సంబర పడుతోంది. ఎంత మంచి మనసు. భుజం మీద చెయ్యేసి మాట్లాడినందుకే విశాల గురించి విరాట్ తో అంత గొడవ పడి తను విశాలను ద్వేషించింది. కాని విశాల? ఓ మొగాడ్ విరాట్ తనను ప్రేమించాడని తెలిసి కూడ ఏ మాత్రం పక్షపాతం చూపకుండా విరాట్ తో బాటు తననూ కాపాడిన్దంటే ఎంత మంచి మనసై ఉండాలి?

ఆలోచించే లోపలే...

సహస్రకు స్పృహ వచ్చిందని తెలిసి కింద నుంచి విశాల దీక్షలు ఇద్దరూ మేడ మీదకు పరుగులెత్తుకొచ్చారు ఈ సంఘటనికి రెండు గంటల సమయం వెనక్కి వెళ్తే...

**************************************************

మధ్యాహ్నం పన్నెండు గంటల తర్వాత అంతా భోజనం చేసాక సుమారు ఒంటి గంట వరకూ విరాట్ వద్ద వున్నాడు చందూ. తర్వాత ఓసారి ఇంటి కెళ్ళి సాయంత్రం వస్తానంటూ తన బైక్ మీద వెళ్ళిపోయాడు. విరాట్ కాస్సేపటికి తన గదిలోకి వెళ్ళి నిద్ర పోయాడు. కాంచన మాల బయటి గార్డెన్ లో పని వాళ్ళ చేత ఏవో పనులు చేయిస్తోంది.

''మమ్మీ గది చూపిస్తాను నాతో రా'' అంటూ దీక్షను తల్లి కాంచన మాల పడగ్గదిలోకి తీసుకెళ్ళింది విశాల.

గది చాలా విశాలంగా అందంగా తీర్చి దిద్దబడి వుంది. ఆ గదినానుకొని ఈశాన్యంలో చిన్న పూజ గది వుంది. డబుల్ కాట్ బెడ్ వేసి ఉంది. ఎటు చూసినా ఖరీదైన ఫర్నీచర్ వీటన్నిటికన్నా గదిలో అడుగు పెట్టినప్పుడే ఒక పక్క గోడకు తిగిలించబడి వున్న బ్లాక్ అండ్ వైట్ ఫోటో ఒకటి దీక్షను ఆకర్షించింది.

ఈ రోజుల్లో ఇంకా బ్లాక్ అండ్ వైట్ ఫోటోలు ఎవరు తీస్తున్నారు. బహుశ ఏదో పాత ఫోటో అయి వుంటుంది అనుకుంది. ఆ ఫోటోలో ఒక నడి వయస్సు వ్యక్తి పక్కన వయసు లోని యువకుడు నిలబడి వున్నారు. యధాలాపంగా చూడ్డంలో ఆఫోటో గురించి పట్టించుకోలేదు దీక్ష.

ఇద్దరూ గదిలో కూచొని మాటల్లో పడ్డంలో కాంచన మాల మేడ మీదకు ఎప్పుడు వెళ్ళిందో గమనించలేదు. సుమారు అర్ధగంట గడిచాక తిరిగి ఆ ఫోటో మీదకు వెళ్ళింది దీక్ష దృష్టి. ఆ విషయం గమనించిన విశాల ఏమిటలా చూస్తావ్? ఆ ఫోటోలో వుంది మా తాత గారు, ఆయన కొడుకు అంటే మమ్మీకి అన్నగారు'' అంది నవ్వుతూ విశాల.

''అవునా......!'' అంటూ లేచి దగ్గర కెళ్ళి పరీక్షగా చూసింది దీక్ష.

పెద్దాయన పక్కనున్న యువకుడ్ని.

ఎక్కడో చూసినట్టనిపిస్తోంది.

ఎవరు? ఎక్కడ?

ఎక్కడ అని ఆలోచించే లోపలే దీక్ష కళ్ళముందు వెంకట రత్నం నాయుడు గారు మెదిలాడు.

''విశాల ............... ఈ ఫోటోతీసి ఎంత కాలమవుతుంది?'' వెనక్కి వచ్చి కూచుంటూ అడిగింది దీక్ష. ఆమె మనసులో ఒక సందేహం పుట్ట గొడుగులా విచ్చుకుంటోంది.

''అది ఎప్పుడో పూర్వం తీసిన ఫోటో. ఎందుకడుగుతున్నావ్?''

“ఉత్తినే తెలుసుకోవాలని. ఇంతకీ మీ తాతగారి పేరేమిటి? పక్కనుంది నీకు మావయ్య అవుతాడుగా ఆయన పేరేమిటి? వాళ్ళది ఏవూరు?” కుతూహలంగా అడిగింది.

పెదవి విరిచింది విశాల.

“వాళ్ళది ఏ వూరో తెలీదు, వాళ్ళ పేర్లు తెలీదు, మమ్మీ డాడీతో వచ్చేసేప్పుడు ఆ ఫోటో వెంట తెచ్చుకుందట కాని డాడీకి భయపడి ఎప్పుడూ బయటికి తీయలేదు. డాడీ పోయాకే ఈ ఫోటోనిక్కడ తగిలించింది. ఎన్నిసార్లడిగినా ఎప్పుడూ వీళ్ళ పేర్లుగాని వూరు గాని చెప్పలేదు. ఇద్దరిదీ ఒకే వూరు. అక్కడ బంధు వర్గం చాలా వుందని మాత్రం చెప్పింది అంతే,”

దీక్షకి అర్థమైపోయింది......

ఫోటోలోని యువకుడిలో విరాట్ తండ్రి వేంకట రత్నం నాయుడు గారి పోలికలు కన్పిస్తున్నాయి. అంతే కాదు అన్నా చెల్లెళ్ళు గాబట్టి కాంచన మాల ముఖంలో కూడ గమనిస్తే వెంకట రత్నం నాయుడి గారి పోలికలు కన్పిస్తున్నాయి. అప్పట్లో మదురైలో ఆయన తమ ఇంటికొచ్చి పోతూండటం చేత ఆయన తనకు బాగా తెలుసు.

అంటే విరాట్ కి విశాల స్వయాన మరదలు.... ఓ మైగాడ్...

కాని ఈ విషయం ఇటు విశాలగ్గాని అటు విరాట్ గ్గాని తెలీదు. తన అంచనా తప్పదు. ఫోటోలో వున్నది ఖచ్చితంగా వెంకట రత్నం నాయుడు గారే.

“అవునూ విరాట్ ని ఇంత గాఢంగా ప్రేమిస్తున్నావ్ గదా అతడి వివరాలు ఏమన్నా తెలుసా లేదా?” అసలు విషయం బయట పెట్టకుండా అడిగింది దీక్ష.

“వివరాలా?” అంటూ అందంగా నవ్వింది విశాల.

‘‘వివరాలు తెలిసి ప్రేమించలేదుగా. వాటితో నాకు పనేంటి? నేనడగలేదు, తనూ చెప్పలేదు’’ అంది.

‘‘అలాగా అయితే నువ్వు ఆశ్చర్య పోయే సంఘటనలు త్వరలోనే జరుగుతాయి.’’

‘‘అదెలా చెప్తావ్? ఇందులో ఆశ్చర్యం ఏముంది? ఇవాళ గాకపోయినా రేపు తన వివరాలు ఎలాగూ తెలుస్తాయి గదా’’

‘‘అది సరి. కోయంబత్తూర్లో లక్ష్మీ క్లాత్ మిల్స్ గురించి విన్నావా? మీ గార్మెంట్ ఫ్యాక్టరీకి క్లాత్ మెటీరియల్ అక్కడ్నుంచి వస్తుందా?’’

‘‘వస్తుంది ఒక్క కోయంబత్తూరేమిటి? బాంబే సూరత్, అహ్మదాబాద్, కలకత్తా నుంచి కూడ మాకు మెటీరియల్ వస్తుంది. ఆర్డర్ పెట్టగానే వాళ్ళు పంపిస్తారు. నెల తర్వాత మిల్లు తరఫున ఏజంట్ వచ్చి బిల్లు కలక్ట్ చేసుకొని వెళ్తుంటాడు. అవునూ ఎందుకిదంతా అడిగావ్?’’

విశాలకు సందేహం రాకూడదు వస్తే అసలు విషయం చెప్పేవరకు వదలదు. అందుకని ఏదోచెప్పి తప్పించుకుంది దీక్ష. ఇప్పుడే ఈ విషయం బయట పెట్టడం ఆమెకిష్టం లేదు కాని తను బయట పెట్టే లోపలే తెలిసి పోయే క్షణాలు దగ్గరపడుతున్నాయని దీక్షకు తెలీదు.

విధి చాల బలీయమైందంటారు.

వీళ్లను చూస్తుంటే...

అది నిజమే అన్పిస్తుంది.

లేకపోతే మేనరికం వద్దనుకున్న విరాట్ కి వివరాలు తెలియకుండానే మరదలు విశాల దగ్గరవటం ఏమిటి..? ఈ విషయం తెలిస్తే సహస్ర ఎలా స్పందిస్తుందో చూడాలి.

దీక్ష ఆలోచనలు ఓ కొలిక్కి రాముందే కాంచన మాల హడావుడిగా లోనకొచ్చింది. సహస్రకు స్పృహ వచ్చిందని ఆవిడ చెప్పగానే ఆతృతగా విశాల దీక్షలు ఇద్దరూ మేడ మీదకు పరుగు తీసారు.

**************************************************

సహస్ర గదిలోకి అడుగు పెట్టగానే...

లేచి తల దిళ్లకు ఆనుకుని కూచున్న సహస్ర కన్పించింది.

ప్రాణ స్నేహితురాల్ని ఆ స్థితిలో చూడగానే దుఃఖం ఆగలేదు. దీక్ష కళ్ళ వెంటా జల జలా కన్నీరు పొంగింది.

ఒక్క దూకులో బెడ్ వద్ద కెళ్ళి పక్కన కూచుంటూ సహస్రను కౌగిలించుకుని ఏడ్చేసింది దీక్ష. విశాల కళ్ళలోనూ నీరు నిలవగా బెడ్ సమీపంలోకి వెళ్ళి నిలబడింది. సహస్ర దీక్ష భుజం తడుతూ ఏడవకే ప్రాణాలతో వున్నాను సంతోషించు అంటూ ఓదార్చింది.

''ఒంట్లో ఎలా ఉందిప్పుడు? నీకింకా స్పృహ రాలేదని మేమంతా ఎంత కంగారు పడుతున్నామో తెలుసా? విశాలయితే మేడ పైకి కిందకి తిరుగుతూ మాట మాటకీ వచ్చిచూసి పోతూనే వుంది.'' అంటూ లేచి కళ్ళు తుడుచుకుంది దీక్ష.

సహస్ర విశాల వంక అభిమానంగా చూస్తూ...

దగ్గరకు రమ్మని సైగ చేసింది.

దగ్గర కెళ్ళి పక్కన కూచుంది విశాల.

‘‘ఒంట్లో ఎలా ఉందక్కా?’’ అంటూ అడిగింది.

‘‘ఫరవాలేదు.’’ అంది హీనస్వరంతో సహస్ర.



‘అమ్మ అంతా చెప్పింది. ఇంతసేపు నా పక్కన కూచుని పాదాలు వత్తి సేవలు చేసింది. అందుకే స్పృహ తెలిసింది. అమ్మ మనసు లాగే నీ మనసూ ఇంత మంచిదని తెలుసుకోలేక విరాట్ తో గొడవ పడ్డాను. అందుకే భగవంతుడు నన్నిలా శిక్షించి వుంటాడు.’’ అంటుంటే విశాల అడ్డు పడిన్ది.

“అక్కా అలా ఎందుకనుకుంటున్నావ్. గండం గడిచి క్షేమంగా బయట పడ్డందుకు సంతోషించాలి. ఇలా గతం గురించి బాధ పడ కూడదు. చాలా బలహీనంగా వున్నావ్. ముందు ఏమన్నా తిని మందులు వేసుకోవాలి. డాక్టర్ వచ్చే టైమైంది. తర్వాత మాట్లాడుకుందాం. లేవగలవా?” అంటూ లేపింది విశాల.

“నడవ లేనేమో కళ్ళు తిరుగుతున్నాయి. తల చాలా భారంగా వుంది. దీక్ష నన్ను కాస్త బాత్రూం తీసుకెళ్ళవే” అంది బెడ్ దిగటానికి ప్రయత్నిస్తూ.

దీక్ష విశాల చెరోపక్క సాయం పట్టి బాత్రూంకి తీసుకెళ్ళారు. విశాల బయట ఆగిపోతూ “అక్కా లోన కొత్త బ్రష్షు పేస్టు అన్నీ ఉన్నాయి. బ్రష్ చేసుకురా” అంది.

వాళ్ళిద్దరూ లోనకెళ్ళగానే...

వెంటనే పక్కనున్న విరాట్ గదిలోకి పరుగెత్తి.

నిద్రపోతున్న విరాట్ ను లేపింది విశాల.

సహస్ర స్పృహలో కొచ్చిందని తెలిసి విరాట్ చాలా సంతోషించాడు. సింక్ వద్ద ముఖం కడుక్కొని పోబోతూ ఎందుకో అనుమానం వచ్చి విశాల వంక చూసాడు.

“సహస్ర నిన్ను చూసిందా?” అడిగాడు.

“వూ ”

“నిన్నేమన్నా అందా? కోప్పడిన్దా?”

“లేదు లేదు”

“మరి ఆ కన్నీళ్ళేమిటి?”

“అక్కని చూస్తే నాకు, దుఃఖం ఆగలేదు. దీక్ష కౌగిలించుకొని ఏడ్చేసింది”

“నిజం చెప్పు నీతో మాటాడిన్దా?”

“మాటాడిన్ది” అంటూ జరిగిందంతా చెప్పింది విశాల.

“అమ్మ మనసు లాగే నీ మనసూ  ఇంత మంచిదని తెలిక విరాట్ తో గొడవ పడ్డాను అందుకే భగవంతుడు నన్నిలా శిక్షించి ఉంటాడు అంది. ఆ మాటతో నాకు దుఃఖం ఆగలేదు.” అంటూ వివరించింది. ఆ మాటలు విన్నాక విరాట్ మనసు తేలిక పడిన్ది. లేదంటే నన్నిక్కడికెందుకు తెచ్చారని గొడవ చేస్తుందని భయపడ్డాడు.

ఇద్దరూ సహస్ర గదిలో కొచ్చారు....

అప్పటికింకా లోన కెళ్ళిన వాళ్ళు బయటికి రాలేదు. అక్కడే ఎదురు చూస్తు సోఫాలో కూచున్నారు. ఇంతలో తనకు ఓపిక

లేకపోయినా ఒక గ్లాసు నిండుగా బత్తాయి రసం, ఒక ఫ్లాస్కులో టీ, కొన్ని టీ కప్పులు ట్రేలో ఉంచుకొని స్వయంగా తిరిగి మేడ మీది కొచ్చింది కాంచనమాల.

“ఆన్టీ.... మీరు మెట్లెక్కి రావటం శ్రమ గదా. పని వాళ్ళకిచ్చి పంపించ వచ్చుగా” అన్నాడు విరాట్.

“మీ ఆరోగ్యం కన్నా నా ఆరోగ్యం ఎక్కువా ఏమిటయ్యా, నా తృప్తి నాది. అయినా రోజూ తిరుగుతానా ఏమిటి? ఈ బత్తాయి రసం సహస్ర కియ్యవే విశాలా కాస్త ఓపిక వస్తుంది. పాపం చాలా బలహీనంగా వుంది. జూస్ తాగాక మందులివ్వు. మీరు టీ పోసుకు తాగండి. నేను కిందకెళ్ళి మీరు తినటాని కేమన్నా పంపిస్తాను.” అంటూ ట్రేని టీపాయి మీద వుంచి తిరిగి కిందకి వెళ్ళి పోయింది కాంచన మాల.

ఇంతలో భుజాన్ని ఆసరా చేసుకొని బయటికొచ్చింది సహస్ర ఆమెను గుండెలకు హత్తుకొని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు విరాట్.

ఆ స్థితిలో యిద్దర్నీ చూస్తున్న విశాల దీక్షలకూ దుఃఖం ఆగ లేదు, సహస్ర జుత్తు నిమిరి ప్రేమగా కన్నీరు తుడిచాడు విరాట్.

“వద్దు ఏడవ కూడదు, గొప్ప ప్రమాదం నుండి బయట పడ్డాము. సంతోషించాలి. రాత్రి విశాల మన కోసం చాలా రిస్క్ తీసుకొని సేవ్ చేసింది” అన్నాడు.

“విన్నాను. విశాలకి చాలా రుణపడ్డాం” అంది సహస్ర.

విరాట్ సహస్రను జాగ్రత్తగా తీసుకొచ్చి బెడ్ మీద కూచుండ జేసాడు. విశాల ఆమె వెనుక తల దిళ్ళను సర్ది వెనక్కి వాలి కూచునేలా చేసింది. దీక్ష బత్తాయి రసం గ్లాసు సహస్రకు అందించింది.

“నువ్వు త్వరగా కోలుకోవాలి. ఈ రసం తీసుకో విశాల. సహస్రకి మందులు తెచ్చివ్వు” అంది.

సహస్ర కాదనకుండా బత్తాయి రసం తాగింది. విశాల విరాట్ లు సహస్ర పక్క నుండి గమనిస్తుండగా దీక్ష బయటికి వచ్చి వరండా చివర బాల్కనీ వద్ద కొస్తూ తన సెల్ అందుకొని చందూకి ఫోన్ చేసింది. వెంటనే లైన్ లో కొచ్చాడు చందూ.

“ఎక్కడున్నావ్.” అడిగింది.

“ఇక్కడే ఇంటి దగ్గరున్నాను. బయల్దేరుతున్నాను”

“నీకో ముఖ్యమైన, ఆశ్చర్యకరమైన విషయం చెప్పాలి”

“ఏమిటది? సహస్ర స్పృహ లోకి వచ్చిందా లేదా?”

“ఇంత క్రితమే స్పృహ వచ్చింది. ముఖం కడుక్కొని జ్యూస్ తాగింది. విరాట్ విశాల తన దగ్గరున్నారు.”

“ఇందులో ఆశ్చర్యం ఏముంది”

“వుంది చందూ ఇప్పుడే ఈ విషయం ఎవరికీ చెప్పకు. విషయం ఏమిటంటే విశాల ఎవరోకాదు విరాట్ కి సొంత మరదలు”

“వ్వాట్?” నిజంగానే చందూ షాకయినట్టు అరిచాడు.

“అవును కాంచన మాల ఎవరో కాదు వెంకటరత్నం నాయుడుగారి చెల్లెలు. ఆవిడ గదిలో ఫోటో చూసాకే నాకీ విషయం తెలిసింది. విచిత్రం ఏమిటంటే విరాట్ వివరాలు ఇప్పటికీ విశాలకి పూర్తిగా తెలీదు”

“ఈ విషయం వాళ్ళతో చెప్పావా?”

“లేదు లేదు నీకే చెప్పాను”

“ఒక మును సామి విరాట్ సహస్రలను చూడాలని గొడవ చేస్తున్నాడు. ఆయన్ని తీసుకొస్తున్నాను. కాస్సేపట్లో అక్కడుంటాను. ఈ విషయం ప్రస్తుతం ఎవరికీ చెప్పకు. వచ్చేస్తున్నా” అంటూ లైన్ కట్ చేసాడు చందూ.

***********************

చందూ వెంటనే వస్తున్నా అన్నాడు గాని వేరే పని చూసుకొని రావటంలో ఆలస్యమైంది. ఈ లోపల....

సహస్ర స్పృహలో కొచ్చిన గంట తర్వాత డాక్టర్ గుణ దీపిక డ్యూటీ దిగి ఇంటి కెళ్తూ సహస్ర విరాట్ లను చూడ్డాని కొచ్చింది. విరాట్ కూడ ఇప్పుడే ఆమెను చూడ్డం. ఉదయం డాక్టర్ వచ్చినప్పుడు అప్పటికింకా విరాట్ కు స్పృహ రాలేదు.

విశాల తన స్నేహితురాలు డాక్టర్ గుణ దీపికను అందరికీ పరిచయం చేసింది. విరాట్ సహస్రల పట్ల చాలా శ్రద్ధ చూపించింది గుణ దీపిక. తమను సకాలంలో ఆపరేషన్ చేసి కాపాడినందుకు విరాట్ సహస్ర ఇద్దరూ డాక్టర్ కు తమ కృతజ్ఞతలు చెప్పుకున్నారు. ఆమెతో మాట్లాడుతుంటే టైమ్ తెలీదు. చాలా సరదా మనిషి. విరాట్ కి మందులు కంటిన్యూగా వాడితే సరి పోతుందని చెప్పింది. సహస్ర విషయంలో ఇక భయపడాల్సిందేమీ లేదు. ఏమన్నా తేడా అన్పిస్తే అప్పుడు స్పెషలిస్టుకు చూపిద్దాం. ప్రస్తుతం ఇవే మందులు వాడమని చెప్పి ఇద్దరికీ చెరో ఇంజెక్షను ఇచ్చి వెళ్ళి పోయింది. సహస్రకీ డాక్టర్ గుణదీపిక నచ్చింది. ఉన్న ఆ కాస్సేపట్లోనే క్లోజయిపోయారంతా.

డాక్టర్ని సాగనంపి...

తిరిగి మేడ మీదికొచ్చింది విశాల.

సహస్రకి స్పృహ వచ్చినా బలహీనంగా ఉందని ఎవరూ మధురై విశేషాలు ఆమెతో చెప్పలేదు. ముందుగా జ్యూస్ తాగి మందులు వేసుకున్నాక వేడి ఇడ్లీ తిని టీ తాగ్గానే కాస్త తేరుకుంది. అందుకే డాక్టర్ గుణ దీపిక వచ్చే సరికి మామూలుగా మాట్లాడ గలుగుతోంది. డాక్టర్ వెళ్ళగానే అప్పుడు విరాట్ మధురైలో గొడవల గురించి చెప్పి ఫోన్ చేసి సహస్రతో తల్లి దండ్రులయిన మహ దేవ నాయకర్ మూగాంబికలతో మాట్లాడిన్చాడు. విశాల అక్కడి కొచ్చే సరికి సహస్ర ఇంకా వారితో మాట్లాడుతోంది.

ఆ తర్వాత అంతా విశాల గదిలోకి షిఫ్టయి టివి ఆన్ చేసి న్యూస్ ఛానల్ చూస్తూ కూచున్నారు.

ఈ లోపల...

సరిగ్గా సాయంత్రం అయిదు గంటల వుతుండగా చందూ మునిసామిని తన బైక్ మీద అక్కడికి తీసుకొచ్చాడు.

బైక్ ని విశాల కారు పక్కనే పోర్టికోలో లాక్ చేసి మును సామి తో లోన ప్రవేశించాడు.

హాల్లో ఎవరూ లేకపోడంతో నేరుగా హాలు చివర మెట్ల వైపు దారి తీసాడు చందూ. అతన్ని అనుసరించాడు మునుసామి. ఇంతలో...

తన పడగ్గది తలుపు తెరుచుకొని బయటికొస్తూన్న కాంచనమాలను ఇద్దరూ గమనించలేదు. కాని చందూ వెంట వెళ్తున్న మును సామిని చూసి తన గది డోర్ లోనే ఆగిపోయింది కాంచనమాల. వయసు మళ్ళినా మునిసామిని గుర్తించటంలో తను పొరబడలేదనిపించింది. ఒక్క సారిగా గతం కళ్ళ ముందు మెదిలి గుండె వేగంగా కొట్టుకుంది. కాళ్ళు తడబడుతున్నాయనిపించింది. మెట్లెక్కుతూ మునుసామి హాల్లోకి చూడ్డం గమనించి చట్టున తలుపు వెనక్కి తప్పుకుంది. అంతే... ఇక దుఖ్ఖం ఆగలేదు ఆవిడకు. తలుపు దగ్గరగా మూసి వెళ్ళి తన బెడ్ మీద వాలిపోయింది.

మును సామి అన్నయ్యేమిటి ఇక్కడికి రావటం ఏమిటి? ఎలా వచ్చాడు? ఎందుకొచ్చాడు ? తనిక్కడునట్టు తెలిసి అన్న వెంకట రత్నం నాయుడు మునుసామిని పంపించాడా..... తనలో తను దుఖ్ఖిస్తూనే పరి పరి విధాలా ఆలోచిస్తున్న కాంచన మాలకు ఒక్క సందేహానికీ సమాధానం లభించలేదు.

మును సామిని వెంట బెట్టుకొని చందూ కూడ మీదకు వెళ్ళే సరికి అప్పటికింకా టివిలో వార్తలు చూస్తు విశాల గదిలోనే వున్నారు. మును సామిని చూడగానే లేచి టివి వాల్యూమ్ తగ్గించి ''రండి గురువు గారు'' అంటూ మునుసామిని ఆహ్వానించాడు విరాట్.

లోన కొస్తూనే మనసులో బాధను ఆపుకోలేక విరాట్ ను కౌగిలించుకొని కంట నీరు నించాడు మునుసామి.

''నేను మీ వెంట వుంటే ఇలా జరిగుండేది కాదు చిన బాబు. మన వెధవలు ఎక్కడ తప్పి పోతారోనని నేను వెళ్ళటం పొరబాటయింది. పెద్ద గండం నుంచి మీరిద్దరూ బయట పడ్డారు. చందూ అంతా చెప్పాడు. మీకేమన్నా జరిగుంటే పెద్దయ్య గారికి ముఖం చూపించ లేక పోయే వాడ్ని.

అమ్మా సహస్ర మీ యిద్దరూ అదృష్టవంతులే తల్లీ. రాత్రి విశాల చూపిన సమయస్ఫూర్తి ధైర్యాన్ని మెచ్చుకోవాలి'' అన్నాడు బాధ పడుతూ.

''గురువు గారు దేవుడు మనందుండి మన సైడు పెద్ద నష్టం ఏమీ జరగ లేదు, అందుకు సంతోష పడదాం, బాధ పడకండి. మన మనుషులు కూడ బయటి కొచ్చేస్తారు కంగారు పడక్కర్లేదు కూచోండి'' అన్నాడు విరాట్.

ఇంతలో సహస్ర ఓపిక చేసుకొని లేచి మును సామి ముందుకొచ్చింది. విరాట్ చెప్పే వరకు మీ గురించి నాకు తెలీదు బాబాయ్. మమ్మల్ని ఆశీర్వదించండి. విశాలా ఇలారా'' అంటూ విశాలను కూడ పిలిచి ఇద్దరూ మును సామి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు మునుసామి వారి వినయానికి పులకించి పోతూ అభీష్ట సిద్ధిరస్తు అంటూ ఇద్దర్నీ ఆశీర్వదించాడు ఆయన కూచోగానే నలుగురూ కబుర్లలో పడ్డారు.

చందూ దీక్షకు సైగచేసి

బయటకు తీసుకెళ్ళాడు

ఇద్దరూ వరండా చివరి కెళ్ళి

బాల్కనీ వద్ద ఆగారు

"ఫోన్లో నువ్వేదో సందేహం చెప్పావ్ ఏమిటది? నాకు సరిగా అర్థం కాలేదు" అనడిగాడు.

"అంత చెప్పినా అర్థంకాలేదా? ట్యూబ్ లైటు..."

"ఏయ్ ట్యూబ్ లైటు నేనా నువ్వా? ... ఎలా చెప్తున్నావ్ ? నువ్వు చూసిన ఫోటోలో అదీ బ్లాక్ అండ్ వైట్. ఫోటో లోని మనిషిలో వెంకటరత్నం నాయుడు గారి పోలికలు ఉంటే ఉండొచ్చు. ఆయన కాంచన మాల ఆన్టీకి అన్నయ్య కావచ్చు కాని ఆయనే వెంకట రత్నం నాయుడని, కాంచన మాల ఆయన చెల్లెలని ఎలా నమ్మకంగా చెప్పగలవ్?. తీరా ఆయనకి చెల్లెళ్ళు లేరనుకో. ఈ విషయం బయట పెట్టి మనం నవ్వుల పాలవ్వాలి తెలుసా? అందుకే ఈ విషయం ఎవరికీ చెప్పొద్దన్నాను. నీతో ఇక ఈ విషయం మర్చిపో" అంటూ హెచ్చరించాడు.

"ఎలా మర్చిపోతాను?" అంది పట్టుదలగా దీక్ష.

"నాకు డౌటు రానే కూడదు. వస్తే వదలను. ఇప్పుడే తేలి పోవాలి. విరాట్ కి తెలీకుండా వుంటుందా తనకు మేనత్త ఉందని?.... "

"ఏయ్ వద్దు విరాట్ ని కదపటం మంచిది కాదు."

"సరి మునుసామికి తెలీకుండా ఉండదు గదా. విషయం చెప్పకుండా వెంకట రత్నం నాయుడు గారికి అన్నదమ్ములు అక్క చెల్లెళ్ళు ఎంత మందో అడిగి తెలుసుకుందాం."

"అలా అన్నావ్ బాగుంది ఏదోటి చెప్పి ఆయన్ని బయటికి తీసుకొస్తాను. నువ్విక్కడే ఉండు," అంటూ దీక్షను అక్కడే వుంచి వెనక్కి వెళ్ళాడు చందూ.

అయిదు నిముషాల తర్వాత...

ముని సామిని వెంట బెట్టుకొచ్చాడు

"ఏంటమ్మాయ్ దీక్షా ఏదో మాట్లాడాలన్నావట. ఏంటది?" అనడిగాడు వస్తూనే మునుసామి.

"ఏంలేదు బాబాయ్ చందూకి నాకు చిన్న గొడవ మీరే తీర్చాలి" అంది నవ్వుతూ దీక్ష.

"గొడవ? .......... ఎందుకు ? పెళ్ళి గాకుండానే మీరిలా రోజూగొడవ పడేట్టయితే నా అభిప్రాయం ప్రకారం మీరు పెళ్ళి చేసుకోవటం అనవసరం" అన్నాడు సీరియస్ గా మునుసామి.

"అదేంటి?..... జీవితకాలం ఇలా మమ్మల్ని ప్రేమికులుగానే ఉండిపొమ్మంటారా?" అన్నాడు చందూ.

"ఉండిపో. జీవితం ప్రశాంతంగా ఉంటుంది. ఇప్పుడే యిలా వుంటే రేపు పెళ్ళయ్యాక సంసారం స్వర్గంలా ఉండదు, నరకంలా ఉంటుంది."

"అయ్యో బాబాయ్ ఇదేమంత పెద్దగొడవకాదు," అంది దీక్ష.

“కాదా…  అయితే మంచిదే. చిన్న చిన్న గొడవలు నేను తీర్చను. నేవెళ్తాను.”

“ఆగు బాబాయ్. పోనీ పెద్దగొడవే అనుకో. విషయం వినుకోనంటావేంటి?”

“సరి వింటాను. చెప్పు చెప్పు”

‘ఏం లేదు బాబాయ్ వెంకట రత్నం నాయుడు గారికి అన్నదమ్ములు అక్క చెల్లెళ్ళు ఎవరూ లేరంటాడు చందూ, లేకపోవటం ఏమిటి ఉండే ఉంటారంటాను నేను. విరాట్ ని అడుగుదామంటే ఇది వాళ్ళ ఫ్యామిలీ వ్యవహారం, బాగుండదు అడగ వద్దంటాడు, పొద్దుటి నుంచి మాకిదే గొడవ.’ అంది దీక్ష.

‘అవును . ఆ ఫ్యామిలీ గురించి నీకన్నా తెలిసిన వాళ్ళు ఎవరుంటారు?’

‘అవును ఆ మాట కరక్టే గదా!’

‘ఈ తగువు ఎవరు తీరిస్తే వాళ్ళకి మా ఇద్దర్లో ఓడిపోయిన వాళ్ళు ఓ ఫుల్ బాటిల్ మందు కొనివ్వాలని పందెం కూడా వేసుకున్నాం’

‘అరె చెప్పు… ఇందులో పందెం కూడా వుందా? నిజమేనా?

‘నిజం బాబాయ్’

‘ఏదీ?… తూతూ మంత్రంలా ఏదో చీప్ లిక్కరా?’

‘ఛ ఛ… జానీవాకర్’

‘ష్యూర్?’

‘తర్వాత మాట తప్పకూడదు’

‘తప్పటం జరగదు’

‘అయితే నువ్వు ఓడిపోయావ్ రా అల్లుడూ. అమ్మాయ్ దీక్ష గెలిచింది. ఆనక నాకోసం జానీవాకర్ రెడీగా వుంచు’

‘ఇదన్యాయం, అక్రమం విషయం చెప్పకుండా ఓడిపోయానంటే ఒప్పుకోను.’

‘ఒప్పుకు తీరాలి, దీక్ష చెప్పిందై రైటు. వెంకట రత్నం నాయుడికి ఓ చెల్లెలుంది.’

మునిసామి మాటలకు`

చందూ దీక్షలు ముఖ ముఖాలు చూసుకున్నారు.

‘ఒకే చెల్లెలా!’ అన్నాడు చందూ.

‘అవును, ఒకే చెల్లెలు’ అంటూ బదులిచ్చాడు మునుసామి.

‘సరి వివరాలు చెప్పు ఓడిపోయానని ఒప్పుకుంటాను, ఆవిడ పేరేమిటి?’

‘కాంచన మాల’

‘కాంచన మాలా!’ ఉద్వేగంతో ఒకేసారి పలికారు దీక్ష చందూలు.

‘అవును కాంచన మాలే. ఎందుకలా ఆశ్చర్యపోతారు? అప్పట్లో మేమంతా ముద్దుగా కాంచనా అని పిలుచుకునే వాళ్ళం. ఎంత అందంగా ఉండేదో మా బంగారు తల్లి’

‘నిజంగానా!’

‘అవును. మీకు తెలీదు. ఏదో ముని సామి వెంకట రత్నం నాయుడు గారి నూలు మిల్లులో మేస్త్రీగా పని చేసే వాడే గదా అనుకుంటారు. కాని ఆ కుటుంబంతో నాకున్న అనుబంధం ఎవరికీ తెలీదు’

“కాంచన మాల ఇప్పుడెక్కడుంది? విరాట్ తన మేనత్త ఇంటికెళ్ళొస్తుంటాడా? విరాట్ ఈ విషయం నాతో ఎప్పుడూ చెప్పలేదే...”

“తెలిస్తేగా చెప్పడానికి. మీరింతగా అడుగుతున్నారు గాబట్టి చెప్తా వినండి”

“చెప్పు బాబాయ్ ఏం జరిగింది?” కుతూహలంగా అడిగింది దీక్ష.

“వెంకట రత్నం నాయుడు నేనూ బాల్య స్నేహితులం. అరే ఒరే అనుకునేంత చనువు. ఎప్పుడూ కలిసి తిరిగే వాళ్ళం. వాడి ఒక్కగా నొక్క చెల్లెలు కాంచన మాల. వారి తండ్రి విశ్వేశ్వర నాయుడు నాకు తెలుసు.

కాంచన మాల మాతోనే ఆడుకునేది. తన అన్నతో బాటు నన్ను నోరారా అన్నయ్యాని పిలిచేది. నాకూ అన్నదమ్ములే గాని చెల్లెళ్ళు లేనందున సొంత చెల్లెల్లా చూసేవాడ్ని. తనకి ఏం కావాలన్నా ముందు నాతోనే చెప్పేది. ఈ చేతులతో ఎత్తుకొని తిప్పిన బంగారు తల్లి.

నాయుడు బాగా చదువుకున్నాడు. నేను కాస్త మొద్దు, ఆపైన నాకు చదువు మీద కన్నా సాము గరిడీలు, కత్తిసాము వంటి వీర విద్యలంటే ఇష్టం. అవి నేర్చుకునే వాడ్ని, ఇక జల్లి కట్టులో నేను బరి లోకి దిగితే ఎలాంటి కోడె గిత్తయినా మెడలు వంచి లొంగి పోవలసిందే. అలా మా తండ్రిగారి పనుల్లో సాయం చేస్తూ అల్లరి చిల్లరిగా తిరిగే వాడ్ని. అలాగే అందరం పెద్ద వాళ్ళమయ్యాం. మాలో ముందుగా వెంకట రత్నం నాయుడికి పెళ్ళయింది. నాకూ సంబంధం కుదిరింది కానీ ఇంకా పెళ్ళి కాలేదు. కాంచన మాలకు సంబంధాలు చూస్తున్నారు. ఈ లోపలేమయ్యిందంటే రంగనాథ చౌదరి అని ఒక చాకు లాంటి యువకుడు. టైలరింగ్ లో మాస్టారు. సొంత షాపు ఉండేది. పెళ్ళి కాలేదు. ఎలా జరిగిందో మొత్తానికి కాంచన మాల రంగనాథ చౌదరిలు ప్రేమలో పడ్డారు. ఈ విషయం పెద్దల దృష్టి కొచ్చింది” అంటూ కాస్సేపు చెప్పటం ఆపాడు మునుసామి.

“చెప్పు బాబాయ్. తర్వాత ఏమైంది?” అనడిగింది కుతూహలంగా దీక్ష.

“ఏముందమ్మా షరా మామూలే. వాళ్ళ ప్రేమ కూడా కష్టాల్లో పడింది. వారి పెళ్ళికి ఇరు వర్గాలు అంగీకరించ లేదు” అన్నాడు మునుసామి.

“ఎందుకని అబ్బాయి నచ్చలేదా, అమ్మాయి తరుపు నుండి కట్నం రాదనా, ఎందుకు అంగీకరిన్చలేదు?” అడిగాడు చందూ.

‘‘అవేం కాదు గాని ఆస్థి, అంతస్థు, చదువు యిలా ఎందులో చూసినా రంగనాథ చౌదరి తక్కువే. కాని తెలివైన వాడు. తన కూతుర్ని ఒక దర్జీ కిచ్చి పెళ్ళి చేయటానికి పెద్దాయన విశ్వేశ్వర నాయుడు గారు అంగీకరించ లేదు.



ఇక రంగనాథ చౌదరి తరపు వాళ్ళకి కులం అడ్డంకి అయింది. తమ కులం గాని అమ్మాయి కోట్లు కట్నంగా తెచ్చినా అంగీకరించమన్నారు వాళ్ళు. ఈ గొడవలో ఎటూ చెప్పలేక వెంకటరత్నం నాయుడు మౌనం వహించాడు…’’

కొద్ది క్షణాలాగి చెప్పటం ప్రారంభించాడు.

‘‘మా పెద్దాయన విశ్వేశ్వర నాయుడికి మన కులాలు ఆచారాలు కట్టుబాట్లు అంటే ఎంతో గౌరవం. కాబట్టి పెళ్ళికి అంగీకరించక

పోగా కాంచనమాలకు వేరే సంబంధాలు చూడ్డం ఆరంభించాడు. అటు చౌదరి ఇంట్లోను అదే పరిస్థితి.

ఇక తమ పెళ్ళి చేయరని అర్ధం కాగానే ఆ జంట వేరే దారిలేక ఒకరాత్రికి రాత్రి కోయంబత్తూరు వదిలేచిపోయారు. అంతే ఆ తర్వాత వాళ్ళెక్కడున్నారో, ఏమయ్యారో ఎవరకీ తెలీదు. ఎంత వెదికించినా వారి జాడ తెలీలేదు. పెద్దాయన పోయేవరకు పట్టుదలగా వున్నా చివరిరోజుల్లో కూతుర్ని చూడలేక పోయానే అనే బెంగతోనే ఆమెపేరు కలవరిస్తూ కన్ను మూసాడు. ఆ తర్వాత`

అల్లరి చిల్లరగా తిరుగుతున్నానని నన్ను పిలిచి తమ నూలుమిల్లులో పనిచ్చి మేస్త్రిని చేసాడు వెంకటరత్నం నాయుడు.

అందుకే ఎంత బాల్యమిత్రులమైనా వాడ్ని పెద్దయ్యగారు అనే పిలుస్తాను. లేదంటే పదిమందిలో వాడ్ని అలవాటులో పొరబాటుగా అరే ఒరే అంటే బాగుండదు గదా. తండ్రి పోయాక కూడా దొరికితే చెల్లిని బావను తెచ్చి తన వద్ద ఉంచుకోవాలని వాళ్ళకోసం చాలా చోట్ల గాలించాడు. ప్రయోజనం లేకపోయింది. మా గారాల చిట్టితల్లి కాంచనమాల భర్తతో ఇప్పుడెక్కడుందో ఎలాఉందో పిల్లలెంతమందో'' అంటూ చెమర్చిన కళ్ళు తుడుచుకున్నాడు మునుసామి.

చందూ దీక్షలు ముఖముఖాలు చూసుకున్నారు.

మునుసామి చెప్పిందాన్ని బట్టి చూస్తే నూటికి నూరు శాతం వెంకటరత్నంగారి చెల్లెలే ఈ కాంచనమాల కావచ్చని నమ్మకం ఏర్పడులోంది. ఇక మునుసామి ఆవిడ్ని చూసి ధృవీకరించటమే మిగిలింది. ఇంతలో మునుసామి తిరిగి మాట్లాడ్డంతో ఇద్దరూ అతడివైపు చూసారు.

''వెంకటరత్నంనాయుడిది ఎంత గొప్ప మనసో మీకు తెలీదు. అంత గొప్పమనసు గాబట్టే మా కార్మికులంతా ఆయన్ని దైవంలా భావిస్తారు. కార్మికుల్లో ఏ ఇంట శుభకార్యం జరిగినా కుటుంబపెద్దలా భార్యా సమేతంగావచ్చి దగ్గరుండి జరిపిస్తారు. సగం ఖర్చు ఆయనే ఇస్తాడు. తనకూతురు కనకమహాలక్ష్మి వివాహం జరిపించినట్టే నా ముగ్గురు కూతుళ్ళకి తనే దగ్గరుండి వైభవంగా పెళ్ళి జరిపించాడు. ఈ రోజు నా కొడుకులిద్దర్లో ఒకడు అమెరికాలోను ఒకడు జర్మనీలోను సాఫ్ట్వేర్ ఇంజనీర్లుగా సెటలయ్యారంటే అది ఆయన చలవే. స్నేహానికి బంధుత్వానికి ప్రాణమిచ్చే మనిషి. అలాంటివాడు తన సొంత చెల్లెల్ని కాదనుకుంటాడా. ఇప్పటికీ ఆయన గుండెల్లో చెల్లెలు బావ వాళ్ళ జాడ తెలీలేదన్న బాధ ముల్లులా గుచ్చుతూనే వుంది.

నా భార్య పోయి నాలుగేళ్ళయింది. దాన్ని మర్చిపోలేక మందుకి అలవాటు పడ్డాను. ఈ విషయంలో నాయుడికీ నాకూ ఎప్పుడూ గొడవే. అయినా ప్చ్. మానుకోలేను'' అంటూ బాధగా చూసాడు. తిరిగి తనే...

‘‘సరి సరి మనం ఎక్కడినుండి ఎక్కడికో వెళ్ళిపోయాం. ఇదిగో అల్లుడూ నాకు జానీవాకర్.. మర్చిపోవుగా’’ అంటూ తిరిగి గుర్తు చేసాడు.

‘‘దాందేముంది మామా. ఇస్తానన్నాగా ఇప్పుడు ఇక్కడ మాకు తెలిసిన కాంచనమాల ఒకావిడ వుంది. నువ్వామెను చూసి ఒకవేళ మీ చెల్లెలు కాంచనమాల అవునో కాదో తేల్చి చెప్పేస్తే ఓ పనయిపోతుంది’’ అన్నాడు చందూ.

ఆ మాటతో మునుసామి...

ఒక్కసారిగా ఆశ్చర్య చకితుడయ్యాడు.

‘‘అంటే... ఇంతసేపూ నాతో మాట్లాడించింది. మీ డౌట్ క్లియర్ చేసుకోడానికా!’’ అనడిగాడు.

చందూ నవ్వి...

‘‘మామా నీ జానీవాకర్ గురించి భయంలేదు. నేను గ్యారంటీ సరేనా. నువ్వోసారి చూసి ఆవిడ కాంచనమాల అవునో కాదో చెప్పుచాలు’’ అన్నాడు.

‘‘అల్లుడూ. తను గనక మా కాంచనమాలయితే నువ్వుకాదురా. నేనే నీకు రెండు జానీవాకర్ బాటిల్లు కొనిస్తాను. కాని మీ పిచ్చిగాని లోకంలో ఆ పేరుతో ఎంత మంది లేరు’’ అన్నాడు నిరుత్సాహంగా మునుసామి.

‘‘మామా ఓ మాట చెప్పు. ఇప్పుడు చూసినా తనను గుర్తుపట్టగలవు గదా?’’ అడిగాడు చందూ.

‘‘అందులో డౌటు....’’

‘‘బాబాయ్ అసలు విషయం చెప్తా విను’’ అంటూ దీక్ష తను కాంచనమాల గదిలో చూసిన బ్లాక్ అండ్ వైట్ ఫోటో సంగతి బయట

పెట్టింది. ఆ మాట వినగానే మునుసామి ముఖం ఒక్కసారిగా విప్పారింది.

''ఆగాగు'' అన్నాడు కంగారుగా.

''ఫోటోలో పెద్దాయనకి పెద్ద మీసాలు తలమీద తెల్లటర్బను నల్లకోటు ధరించి వున్నాడా?''

''అవును'' అంది ఎగ్జయిటే గా దీక్ష.

''అర్థమైందమ్మా. ఇంకేం చెప్పక్కర్లేదు. ఎక్కడుందావిడ. పక్క ఇల్లా, వీధి చివరా. నన్నక్కడికి వెంటనే తీసుకెళ్ళండి'' అన్నాడు ఉత్కంఠగా.

మునుసామి ఆతృత చూసి ఇప్పుడే విషయం చెప్పేయాలనుకుంది దీక్ష కాని చెప్పొద్దని కళ్ళతోనే సైగచేసాడు చందూ. ''కంగారు పడకండి అక్కడికేవెళ్దాం. కాని ఈ విషయం ఇప్పుడే విరాట్ కి తెలికూడదు నిశ్శబ్దంగా మా వెనకే కిందకు వచ్చెయ్'' అంటూ వరండా చివరికి దారితీసాడు చందూ.

ఆవెనకే మునుసామి...

చివరిగా దీక్ష ఒకరి తర్వాత ఒకరు...

వరండా దాటి మెట్లవెంట కిందకు వెళ్ళిపోయారు. టివిలో వార్తలు చూస్తున్న విరాట్ గాని విశాల సహస్రలు గాని వాళ్ళు కిందకు వెళ్ళటం గమనించలేదు.

వాళ్ళు వెళ్ళిన అయిదు నిముషాల తర్వాత....

ఉన్నట్టుండి ఎవరో ఏడుస్తున్న శబ్దం విన్పించి అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందో అర్థంగాక వెంటనే టివి స్విచ్ ఆఫ్

చేసాడు విరాట్.

"ఆగొంతు మమ్మీ గొంతులా వుంది. నేవెళ్ళి చూసొస్తాను." అంటూ గాబరాలో బయటకు పరుగెత్తింది విశాల.

ఆమె వెనకే విరాట్ కూడ పరుగెత్తాడు. మెట్లు దిగి వెళ్ళేంత ఓపిక లేని సహస్ర మాత్రం గాబరాపడుతూ అక్కడే ఉండిపోయింది.

ముందుగా మెట్లు దిగి హాల్లోకొచ్చిన విశాలకి పనిమనిషి కంగారుగా తన కోసం రావటం కన్పించింది.

"ఏమైంది? మమ్మీ ఎందుకేడుస్తోంది?" అనడిగింది విశాల.

"తెలీదమ్మా మీకోసమే వస్తున్నాను. చందూగారి వెంట ఓపెద్దాయన వచ్చారు. అన్నయ్యా అంటూ అమ్మగారు ఏడుస్తున్నారు. మాకేం అర్థంగావటంలేదు." అంది పని మనిషి. ఆమాటలు విని...

వెనకే మెట్లుదిగిన విరాట్ కూడ...

ఆశ్చర్యపోయాడు.

"కాంచనమాల ఆంటీ మునుసామిగారి చెల్లెలా. ఇదేం ట్విస్టో ఏ రకంగా చెల్లెలో అర్థంకాలేదు. పదచూద్దాం" అంటూ విశాల వెంట కాంచనమాల గదిలోకి పరుగుతీసాడు.

ఇద్దరూ లోనకెళ్ళేసరికి...

బెడ్ చివరగా కూచునుంది కాంచనమాల. పైట చెంగు నోటికి అడ్డంపెట్టుకొని ఏడుస్తోంది. పక్కన కూచున్న దీక్ష ఆవిడ్ని ఓదారుస్తోంది. ఇటు సోఫాలో కూలబడి ఏడుస్తున్న మునుసామిని చందూ ఓదారుస్తున్నాడు.

విరాట్ కి గాని, విశాలకి గాని ఏమీ అర్థంగాక సస్పెన్స్ తో ఉక్కిరి బిక్కిరవుతున్నారు.

"చందూ ఏమిట్రాయిది? ఏమైంది? ఆంటీ గురువుగారి చెల్లెలా!" అడిగాడు.

ఆ మాటకి చివ్వున తలతిప్పి...

విరాట్ వంక చూసాడు మునుసామి.

దుఖ్ఖాన్ని దిగమింగి కళ్ళుతుడుచుకొంటూ "అవును చినబాబు నాకు ఈ కాంచనమాల చెల్లెలే కాని అసలు అన్న నేను కాదు. తను ఎవరి చెల్లెలో తెలుసా? అటు చూడు ఆ బ్లాక్ అండ్ వైట్ ఫోటోలో ఇద్దర్నీ చూడు నీకే అర్థమవుతోంది" అన్నాడు.ఇంత వరకు విరాట్ ఆ గదిలోకి రాలేదు గాబట్టి ఫోటో గురించి తెలీదు. ఇప్పుడే ఆ ఫోటోని చూడగానే మరోషాక్. "అరే, ఇది మా ఇంట్లో కూడ వుంది. మా తాతగారు డాడీ కలిసిఎప్పుడో తీయించుకొన్న ఫోటో ఇదిక్కడికెలా వచ్చింది?" అనడిగాడు.

"ఎలా అంటే వెంట తెచ్చుకుంటే వస్తుంది చినబాబు. మీకో మేనత్త ఉందని ఎప్పుడన్నా విన్నావా?"

"ఎప్పుడో విన్న గుర్తు. కాని తెలీదు."

"ఇప్పుడు తెలుసుకో. కాంచనమాల ఎవరోకాదు నీకు స్వయానా మేనత్త. మీ డాడీకి తోడబుట్టిన చెల్లెలు విశాల ఎవరో కాదయ్యా నీ మరదలు" అంటూ మునుసామి క్లుప్తంగా వివరిస్తుంటే విరాట్ తో బాటు విశాల కూడ విభ్రాంతి చెందారు.

విశాలకి అప్పుడు అర్థమైంది ఉదయం దీక్ష ఆ ఫోటోగురించి తనను తరచి తరచి ఎందుకడిగిందో. తను ప్రాణాధికంగా ప్రేమిస్తున్న విరాట్ స్వయానా తనబావ అనితెలీగానే ఆమెకు ఎంతో థ్రిల్లానూ పులకింత గానూ వుంది. మునుసామి మాట్లాడుతూనే వున్నాడు."దైవమా నువ్వున్నావయ్యా లేక పోతే ఏనాడో చేజారి పోయిందనుకున్న రత్నం తిరిగి మాకిప్పుడు దొరికేదా! ఎంతకాలం ఎన్ని

సంవత్సరాలు..........మేనరికం వద్దాన్నాడని ఈ విధంగా మరదల్ని జతకలిపావే నీ లీల వర్ణింపతరమా!'' అంటూ ఆనందంతో కళ్ళు తుడుచుకున్నాడు.

ఆమాటలు వింటూ గబగబా తల్లివద్ద కెళ్ళింది విశాల ''మమ్మీ ఇదంతా నిజమేనా? బాబాయ్ చెప్పింతా నిజమా?'' అనడిగింది.దుఃఖందిమింగుతూ...

అవునన్నట్టు తలూపింది కాంచనమాల.

''ఆయన బాబాయ్ కాదమ్మా నీకు మావయ్యవుతాడు. నాకు అన్నయ్యవుతాడు. నా సొంత అన్నయ్య ఎంతో మునుసామి కూడ అంతే'' అంది.

''అయితే ఎందుకింత దుఃఖం? సంతోషించాలిగదా!''

''ఎలా సంతోషించను? పుట్టింటికి దూరమైనబాధ ఇన్నేళ్ళూ నా గుండెల్లో గూడుకట్టుకొనుంది. అందుకే మునుసామి అన్నయ్యను చూడగానే దుఃఖం ఆవుకోలేక పోయాను. అయినా వద్దు మనకెవ్వరూ లేరు అంతే. వాళ్ళతోకలవటం మీ డాడీకి ఇష్టంలేదు'' అంది కాంచనమాల.

అప్పుడు ముందుకొచ్చాడు విరాట్.

''అత్తయ్య మావయ్య ఇప్పుడు లేరు. ఉంటే అభ్యంతరం చెప్పేవారుకాదు. ఎవరూ లేరనుకుంటే ఎలా? విశాల ఏమైపోవాలి? ఆగు ఇప్పుడే ఫోన్ చేసి మమ్మీ డాడీ యిద్దర్నీ బయలుదేరి రమ్మంటాను'' అంటూ ఫోన్ అందుకోబోయాడు.

అతడి ప్రయత్నాన్ని వారించాడు మునుసామి.

''తొందర పడకు చినబాబు. ఒకటి రెండ్రోజుల్లో ఎలాగూ వాళ్ళిక్కడికి వస్తున్నారు. వాళ్ళకి మనమిచ్చే అపురూపమైన కానుక ఈ

తల్లీ కూతుళ్ళు కాబట్టి ఇప్పుడే ఈ విషయాలేవీ ఫోన్లో వాళ్ళకి చెప్పకు'' అంటూ కాంచనమాల వంక చూసి...

'చూడమ్మా నీ భర్తకు ఇష్టంలేకపోవచ్చు. ఆయన పోయిన విషయాన్ని మాకు చెప్పకపోయిన కనీసం నీ భర్తతాలూకు బంధువులకయినా అప్పట్లో తెలియపర్చి ఉండాల్సింది. వాళ్ళు జరిపించాల్సిన కర్మాకాండ లేవీ జరిపించలేదుగదా. ఇప్పుడీ విషయం తెలిస్తే వాళ్ళెంత బాధపడుతారో ఆలోచించావా?

వాళ్ళిప్పటికీ మిమ్మల్ని మర్చిపోలేదమ్మా! రంగనాథ చౌదరి అన్నదమ్ములు దారిలో నేనెక్కడ కన్పించినా మీ వివరాలేమన్నా తెలిశాయోమోనని అడుగుతుంటారు. అంతేకాదు మీరు ఎప్పుడు తిరిగొచ్చినా నీ భర్తవాటా ఆస్థిమీకు అప్పగించాలని అలాగే ఉంచారు.అపోహలు వద్దు తల్లీ. ఈ రోజు మీరింత ఉన్నత స్థితిలో ఉన్నారంటే నాకు చాలా గర్వంగా ఉంది. నీ భర్త పట్టుదల కృషి అర్థమవుతుంది. మీరు కోయంబత్తూరు వస్తే అంతా అక్కున చేర్చుకునే వాళ్ళేగాని మిమ్మల్ని ద్వేషించేవాళ్ళిపుడు ఎవరులేరు. మిమ్మల్ని చూస్తే వెంకటరత్నం నాయుడుదంపతులు ఎంత ఆనందిస్తారో నాకు తెలుసు''... అంటూ మునుసామి కాంచనమాలకు నచ్చచెప్పే ప్రయత్నంచేస్తున్నాడు.

ఇంతలో ఉన్నట్టుండి వేగంగా పరుగెత్తింది విశాల. ఎందుకంటే ఓపిక లేకపోయినా ఏం జరిగిందో తెలుసుకోవాలన్న ఆత్రంలో రెయిలింగ్ ను పట్టుకొని నెమ్మదిగా మెట్లు దిగుతున్న సహస్రను ఆమె చూసింది. వేగంగా పరుగెత్తి మెట్లమీద ఎదురువెళ్ళి తూలుతున్న సహస్రను ఒడిసి పట్టుకుంది. ఈలోపల ఏమైందో అర్థంగాక అటు చూసారంతా.

''అక్కా! నేవచ్చి చెప్తానన్నాను గదా. ఇంత నీరసంతో నువ్వెందుకు మెట్లు దిగిరావటం?'' అంటూ కోప్పడిం ది విశాల.

''నేను కళ్ళు తెరవగానే చూసి ఎవరమ్మా నువ్వని అడిగితే నేను నీ అమ్మలాంటి దాన్నే అంది. అలాంటి అమ్మకి ఏకష్టం వచ్చిందో ఎందుకు ఏడుస్తోందో తెలుసుకోవాలని నాకుమాత్రం ఆరాటంగా ఉండదా?'' అంది సహస్ర.

''కష్టం ఏమీ లేదక్కా. సంతోషించే విషయమే. మమ్మీకి గతం గుర్తొచ్చి ఏడ్చింది. మునుసామి మూలంగా ఈ విషయం ఇప్పుడు బయటపడింది. మమ్మీ వెంకటరత్నం నాయుడుగారి చెల్లెలు. విరాట్ ఎవరోకాదు. మమ్మీకి మేనల్లుడు. నాకు బావ'' అంటూ జరిగింది క్లుప్తంగా వివరించింది విశాల.

ఆ మాటలకు...

సహస్ర కూడ సంతోషించింది.

"ఇకనేం శుభవార్త చెప్పావ్. వాడు నీకు బావయితే నాకు బావేకదా. పద నన్నక్కడకి తీసుకెళ్ళు" అంటూ విశాల భుజం మీద చెయ్యేసి పట్టుకుంది సహస్ర. జాగ్రత్తగా మెట్లు దించి సహస్రను కాంచనమాల గదిలోకి తీసుకెళ్ళింది విశాల. ఇక ఆ తర్వాత ఆనందంతో హేపీగా కబుర్లలో మునిగిపోయారంతా.

సియం శెల్వి చెందామరై మరునాడు మరోమారు విరాట్కి ఫోన్ చేసుండేదేమో. కాని ఆ రోజు నుంచి పక్షం రోజులపాటు అసెంబ్లీ సమావేశాలుండటంతో తిరిగి ఫోన్ చేయలేదు. కాని విరాట్ కిచ్చిన మాట నిలబెట్టుకుందామె. సియం ఆర్డర్ తో అరెస్టయిన కదిరేషన్ మునుసామి మనుషులు అయిదుగుర్ని ఆ ఉదయమే వదిలేసారు పోలీసులు. వాళ్ళు క్షేమంగా తిరిగి రావటంతో అంతా సంతోషించారు.

******************************

ఆ రోజు ఉదయం పదకొండు గంటలకు..

తమిళనాడు అసెంబ్లీ సమావేశాలు.

గందరగోళంగా ఆరంభమయ్యాయి.

మధురై అల్లర్ల సంఘటన ప్రతి పక్షాలకు ముఖ్యంగా త్యాగరాజన్ తాతగారి పార్టీకి ఒక ఆయుధంగా లభించింది. ఆ అల్లర్లను తమ పార్టీకి అనుకూలంగా మార్చుకుని అధికార పార్టీది అసమర్ధపాలన అంటూ ఎండగట్టాలన్న వ్యూహ రచనతోనే సమావేశాలకు హాజరవటం జరిగింది.

సభలో ప్రవేశపెట్టాల్సిన పెండింగు బిల్లుల్ని గాని ప్రశ్నోత్తరాల సమయాన్ని గాని అంగీకరించకుండా వాయిదా తీర్మానం పైన మధురై సంఘటనల గురించి వెంటనే చర్చ జరగాలంటూ ప్రతి పక్షాలు పట్టుబట్టాయి.

నా మనవడు త్యాగరాజన్ అమాయకుడు. చట్టాన్ని గౌరవించే వ్యక్తి. న్యాయమైన పద్ధతిలో తన వ్యాపారాలేవో తను చూసుకుంటున్నాడు. గిట్టని వాళ్ళు మా ప్రతిష్టను మా పార్టీపరువును దిగజార్చే వుద్దేశంతో తప్పుడు నేరాలను దొంగ సాక్ష్యాలను ఆపాదిస్తూ సుప్రీంకోర్టు నాశ్రయించారు. ఆ జర్నలిస్టు వెనక ఎవరు ఉందీ మాకు తెలుసు.

అయినా చట్టాన్ని గౌరవించి మౌనం వహించాం. కాని నా మనవడు మధురైలో లేని సమయంచూసి అధికార పార్టీ సానుభూతి పరుడైన మహదేవనాయకర్ అల్లరి మూకల్ని రెచ్చగొట్టి స్వయంగా ముందుండి మా ఆస్తులమీద దాడి చేయటమేగాక ఎస్టేట్ భవంతిని తగలబెట్టించటం అమానుషం. అరాచకం. ప్రభుత్వ అసమర్ధతకి పరాకాష్ట.

సకాలంలో అదనపు బలగాల్ని గాన్ని స్పెషల్ఫోర్స్ని గాని పంపించకుండా కావాలనే ఈ ప్రభుత్వం కళ్ళు మూసుకోబట్టే మధురైలో అంతటి హింసాకాండ విధ్వంసం చోటుచేసుకున్నాయి. దీనికి తనేపూర్తి బాధ్యత వహిస్తు సభలో దీనిపై చర్చ జరగాల్సిందే. ఈ ప్రభుత్వం బదులు చెప్పాల్సిందే అంటూ చిందులుతొక్కాడు మాజి సియం.

ఒక దశలో ఎవరేంమాట్లాడుతున్నారో అర్ధంగానంత గందరగోళం అరుపులు కేకలతో సభ హోరెత్తిపోయింది. స్పీకర్ సభ్యుల్ని శాంతింపచేయటానికి చేసిన ప్రయత్నాలుగాని ఇచ్చిన హామీలుగాని ఏవీ పనిచేయలేదు. దాంతో మధ్యాహ్న విరామంలోపే సభ రెండుసార్లు వాయిదాపడిరది.

అయితే ఇలా జరుగుతుందని ముందే వూహించిందిగాబట్టి సియం శెల్వీ చెందామరై తొందరపడలేదు. తిరిగి సభ ఆరంభంకాగానే తప్పని పరిస్థితిలో చర్చకు అనుమతిచ్చారు స్పీకర్. అప్పుడు సియం ఒక్కసారిగా ప్రతి పక్షాలమీద విరుచుకు పడిరది. చాలా ఘాటుగా ప్రతిస్పందిస్తూ గతంలో మాజి సియంగారి హయాంలో ఆయన రెచ్చగొట్టిన అల్లర్లు చేసిన ఘనకార్యాల గురించి ఆధారాలతోసహా సభలో బయటపెట్టి ప్రతిపక్షాల నోళ్ళు మూయించే ప్రయత్నం చేసింది.

ఇలా ఓ పక్క అక్కడ అసెంబ్లీ సమావేశాలు హాటు హాటుగా ఘాటుగా సాగుతుంటే, మరో పక్క కూల్ కూల్గా సమాధాలిస్తున్న త్యాగరాజన్ లైవ్ ఇంటర్వ్యూను ఒక ప్రయివేట్ టివి ఛానల్ వాళ్ళు ప్రసారం చేయటం ఆరంభించారు.

ఆ ఇంటర్వ్యూని ఓల్డ్ మాంబళం ముదలియార్ స్ట్రీట్లోని ఇంట్లో వున్న విరాట్, సహస్ర, విశాల అంతా ఆసక్తిగా వీక్షింపసాగారు. మధురైలో నిన్న జరిగిన అల్లర్లకు కారణం ఏమిటంటారు? ఇంటర్వ్యూ చేస్తున్న వ్యక్తి చాలాహుషారైన వాడు. ప్రశ్నల్ని సూటిగా

సంధించటంలో దిట్ట. అతడి ప్రశ్న విని చిరునవ్వుతో భుజాలెగరేసాడు త్యాగరాజన్.

ఈ విషయం నాకన్నా మీకే ఎక్కువ తెలియాలి. నేను వాస్తవ వాదిని. వూహించి కారణాలు చెప్పటం నాకిష్టం ఉండదు. ఆ పైన ఇక్కడ చెన్నైలో వున్న నన్ను కారణాలు అడిగితే ఏం చెప్పగలను అన్నాడు.

కాని మీరు మధురైలోనే ఉన్నారని అల్లర్లు ఆరంభంకాగానే మీరు అక్కడినుంచి చెన్నైకి పారిపోయి వచ్చేసారని ఓమాట జనంలో వినబడుతోంది. దీని మీద మీస్పందన ఏమిటి?

ఇంటర్వ్యూ చేస్తున్న వ్యక్తి చాలా సూటిగా ముఖమాటంలేకుండా అడిగిన ప్రశ్న యిది దీనిక్కూడ ఏమాత్రం తొణక్కుండా చిరునవ్వు నవ్వాడు త్యాగరాజన్ ్.

సమస్యల్ని ఫేస్ చేయటమేగాని పారిపోవటం అంటే ఏమిటో నాకింతవరకు తెలీదు. అయినా పారిపోయి రావాలసిన అవసరం నాకేముంది? తప్పుచేసిన వాళ్ళే భయపడి పారిపోతారు. నేనే తప్పుచేయలేదు మీరు విన్నది అవాస్తవం. కట్టుకథ. నిజానికి నేను మధురైలోనే ఉండుంటే పరిస్థితి అంత ఘోరంగా ఉండేదికాదు.

ఇక్కడ మా హెడ్డాఫీసులో పనిమీద నాలుగురోజుల క్రితమే నేను చెన్నై వచ్చాను. అప్పట్నుంచి ఇక్కడే ఉన్నాను. ఉన్నానడానికి సాక్ష్యం మా ఫ్యామిలీ మా ఆఫీసు స్టాఫ్ నా ఫ్రెండ్స్, సో........నా గురించి ప్రత్యర్థులు కావాలని చేస్తున్న దుష్ప్రచారం అది అంటూ బదులిచ్చాడు.''జర్నలిస్టు లహరి అసలు పేరు లక్ష్మీ సహస్ర. ఇంట్లో సహస్రగా పిలుస్తారు. రచయిత్రి సహస్రగా కూడ ఆమెకు మంచి పేరుంది. అభిమానులున్నారు.

జర్నలిస్టు అయ్యాక తన పేరును లహరిగా పాపులర్ చేసుకుంది. ఇంతకాలం జర్నలిస్టు లహరి తన కూతురు సహస్రని మహదేవనాయకర్కు తెలీదు. మీ మనుషులే కోర్టుబయట లహరిమీద హత్యాప్రయత్నం చేసారని అందుకే ఆమె అజ్ఞాతంలోకి వెళ్ళిపోయిందని తెలిసాకే మహదేవనాయకర్ వర్గం దాడికి తెగబడిరదని మధురైలో అల్లర్లకు ప్రధాన కారణం ఇదేనని అంటున్నారు.తన ఇంటర్వ్యూలో మహదేవనాయకర్ కూడ ఈ వి షయాన్నే ప్రస్తావించారు. ప్రస్తుతం లహరి ఇక్కడే చెన్నైలో ఎక్కడో అజ్ఞాతంగా ఉంటోంది. మొన్నటికి మొన్న తేనాంపేట రౌడీ శిఖామణి అంతటి వాడ్ని వాడి రైడీ మూకను చీల్చి చెండాడిరది కూడ ఈ సహస్రే అని పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి.



కాబట్టి మధురైలో మీరెండు వర్గాలు అల్లర్లకు తెగబట్టానికి కారణం ఇదేనా లేక వేరే కారణం ఏదైనా వుందంటారా ? దీనిక్కూడ త్యాగరాజన్ తొణక లేదు తడబడ లేదు మీకు నేనో విషయం ముందుగా చెప్పాలనుకుంటున్నాను.

చెప్పండి నేను కాదు మా ప్రేక్షకులు కూడ మీ సమాధానం కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నారు అన్నాడు.

మీకు తెలిసో తెలికో మీ రెండు వర్గాలు అన్నారు. మహదేవనాయకర్ కి రౌడి వర్గం ఉందేమో నాకు తెలీదు గాని నాకు మాత్రం ఏ వర్గం లేదు. ఆ అల్లర్లను తిప్పికొట్టాలని ప్రయత్నించిన వాళ్ళు పోరాడిన వాళ్ళు అంతా నా పనివాళ్ళు. తామంతా నామీద నా వ్యాపారాల మీద ఆధార పడి బతుకుతున్నారు. కాబట్టి నా ఆస్థుల్ని కాపాడుకోవాలనే సదుద్దేశంతో స్వచ్ఛందంగా ప్రాణాలకు తెగించి ప్రత్యర్ధుల దాడుల్ని తిప్పికొట్టే ప్రయత్నం చేసారు. అంతే గాని నాకంటూ ఏ వర్గం లేదు.

జరిగిన అల్లర్లలో ఎక్కువ భాగం నష్ట పోయిందీ నేనే. అయినా నేను బాధ పడ్డం లేదు. మహా దేవ నాయకర్ పెద్దవారు. ఆయనంటే నాకెప్పుడూ గౌరవం వుంది. అలాగే జర్నలిస్టు లహరి మీద నాకెలాంటి కోపం లేదు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది కాబట్టి ఇందులో మనం ఆవేశాలు కావేషాలు పెంచుకోవాల్సిన అవసరం లేదు. అంటూ వివరణ ఇచ్చాడు త్యాగరాజన్.

వాడి మాటలు వింటున్న సహస్ర కోపం పట్టలేక చేతికి దొరికిన పేపర్ వెయిట్ని టివి మీదకు విసిరి కొట్టబోయింది. సమయానికి విరాట్ పట్టుకొని ఆపాడు గాని లేదంటే టివి ముక్కలు చెక్కలయ్యేదే. సహస్ర ఆవేశం చూసి చటుున లేచి టివి ఆఫ్ చేసింది విశాల.

''సహస్ర ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్. ఏమిటీ ఆవేశం? నువ్విలా ఆవేశ పడితే తల మీద పడ్డ కుట్లు తెగే ప్రమాదం వుంది. కూల్ డౌన్'' అంటూ హెచ్చరించాడు విరాట్.

''ఆవేశ పడకుండా ఎలా ఉండ గలను? వాడి నక్క వినయం చూడు. మానవ మృగం. వాడు చెప్పినవన్నీ పచ్చి అబద్దాలు. ప్రజల్ని మోసం చేసి వారి సానుభూతి పొందటం కోసమే ఈ ఇంటర్వ్యూకి వచ్చినట్టున్నాడు. నా చేతికి దొరికితే ఖచ్చితంగా వాడ్ని చంపేస్తాను.'' అంది కోపంగా సహస్ర.

''నువ్వంతగా ఆవేశపడాల్సిన అవసరం లేదు. వీడి సంగతి చట్టం చూసుకుంటుంది. ముందు నీ ఆరోగ్యం బాగు పడాలి. నువ్వు మధురై కోర్టుకెళ్ళటం నాకిష్టం లేదు. ధర్మ కూడ ఇదే సలహ యిచ్చాడు. ఈ కేసును చెన్నై కోర్టుకు బదిలీ చేయమని సుప్రీం కోర్టుకు అప్పీలు పంపించు. రేపే ఆ పని చేయాలి. ఇక్కడయితే త్యాగరాజన్ మనుషుల్ని అడ్డుకోడానికి మేమంతా ఉన్నాం'' అంటూ గుర్తుచేసాడు విరాట్.

ఎందుకో అవునని గాని కాదని గాని సమాధానం చెప్పకుండా మౌనంగా వెళ్ళి బెడ్ మీద పడుకుంది సహస్ర. కారణం తెలీక విశాల విరాట్ లు ముఖ ముఖాలు చూసుకున్నారు.

ఆ రోజు మధురైలో చెలరేగిన అల్లర్ల గురించి టివిలో వార్తలు చూసిన తక్షణం, కదిరేషన్ తన మనుషులతో బయలుదేరి వెళ్ళి పోయాడు. కాని అలా వెళ్ళిన వాళ్ళు వెళ్ళినట్టే తిరుగు టపాలా మరునాడు ఉదయానికంతా చెన్నైకి వచ్చేసారు.

ఎందుకంటే మధురై పొలిమేరల్లోనే అన్ని రూట్లలోనూ పోలీసులు అన్ని చెక్ పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీ చేసి గాని ఏ వాహనాన్ని సిటీలోకి అనుమతించటం లేదు. సాయంత్రానికి మధురై పొలిమేరల్లోకి చేరుకున్న కదిరేషన్ మహదేవనాయకర్ కి ఫోన్ చేసాడు. అప్పటికే ఆయన్ని హౌస్ అరెస్ట్ లో వుంచారు పోలీసులు. మహ దేవ నాయకర్ కదిరేషన్ ని ముఖం వాచేలా చివాట్లు పెట్టాడు.

''అక్కడ అమ్మాయి సహస్రను ఒంటరిగా వదిలేసి మధురై రమ్మని ఎవర్రా మీకు చెప్పింది. వెళ్ళిపోండి వెనక్కి వెళ్ళిపోయి అమ్మాయికి రక్షణగా మీరంతా అక్కడే ఉండండి'' అంటూ ఆర్డర్ వేసాడు.

ఆ క్షణంలో మహ దేవ నాయకర్ అసలు కదిరేషన్ బృందాన్ని తను పంపిపంచిందే సహస్రను పట్టి ఇంటికి తీసుకు రాటానికనే విషయాన్నే మర్చిపోయాడు. ఆ విధంగా కదిరేషన్ తన మనుషులతో తిరిగి విరాట్ ఇంటికి చేరుకున్నాడు.

ఈ లోపల అటు సిటీ అవుట్ స్కర్ట్స్ లో హోటల్లో దిగిన ధర్మ బృందం విరాట్ ను చూడాలని తొందర పడుతోంది.

తన మీద ఎంతో అభిమానంతో ఇంత దూరం వచ్చిన వాళ్ళని ఎక్కువ రోజులు కలవకుండా ఉండటం న్యాయం కాదు. తన చేతి గాయం ఇప్పుడిప్పుడే ఆరుతోంది. ఇంకా పచ్చి మీద వున్నందున చేయి కదిపితే పెయిన్ స్టార్టవుతుంది. అయినా తప్పదు.

జగన్మోహన్ ఇంటర్వ్యూను టివిలో చూసిన సాయంకాలమే విశాలను వెంట తీసుకొని మిత్రబృందాన్ని కలవటానికి బయలుదేరాడు విరాట్. బలహీనంగా వుంది. తల మీద బాండేజ్ అలాగే వుంది.

విశాల స్టీరింగ్ తీసుకుంది.

పక్కన కూచున్నడు విరాట్.

తననెవరూ గుర్తుపట్టకుండా తలకు తుండు చుట్టుకున్నాడు. సీటు మీదకు వాలి ప్రశాంతంగా కళ్ళు మూసుకున్నాడు.

“బావా........ నాకో విషయం అర్థం గావటం లేదు” అంది దారిలో విశాల.

“నువ్వు కాస్త జనరల్ నాలెడ్జ్ లో వీక్. అందుకే చప్పున ఏదీ అర్థం కాదు. ఏ విషయం అర్థం కాలేదో అడుగు” అన్నాడు కళ్ళు తెరవకుండానే.ఆ మాటకి విశాలకి రోషం ముంచుకొచ్చింది.

“ఏంటి? నేను జనరల్ నాలెడ్జ్ లో వీకా?” అంది.

కళ్ళు తెరిచి చిన్నగా నవ్వాడు విరాట్

“కాదా? అందుకేగా విషయం అర్థం కాలేదంటున్నావ్.” అన్నాడు నిటారుగా కూచుంటూ.

“నీకర్థమైందా?”

“యా!”

“అయితే      ఏంటో చెప్పుచూద్దాం”

వెరీ సింపుల్. వరసయిన బావ పక్క గదిలోనే వున్నాడు. నీకు వయసు అలజడి. రాత్రుళ్ళు నిద్ర పట్టక పక్కమీద దొర్లుతున్నావ్. దాంతో తెల్లవారే సరికి కళ్ళు ఎరుపులెక్కి నీ అందమైన ముఖం వాడి పోతోంది. అలాగని ఏ అర్ధరాత్రో వెళ్ళి బావమీద పడదామంటే మధ్య గదిలోని అక్క సహస్ర ఏమనుకుంటుందోనని భయం....... ఇక మీ యిద్దరి మధ్యన ఎవరు ఏరాత్రి వచ్చి మీద పడతారోనని బావకి భయం. తలుపు లాక్ చేసుకొని నిద్రపోవలసి వస్తోంది.”

విరాట్ విశ్లేషణకి పగలబడి నవ్వింది విశాల.

‘‘చాలు బావా. ఇక చాలు. జనరల్ నాలెడ్జ్ లో నువ్వు నాకన్నా వీకని అర్ధమైపోయింది’’ అంది నవ్వాపుకుంటూ.

‘‘అలాగా సరి ఒప్పుకుంటాను. ఇంతకీ నీకర్థం గాని విషయం ఏంటి చెప్పు’’ అడిగాడు.

‘‘ఆ త్యాగరాజన్ అల్లర్లు ఆరంభం కాగానే మధురై నుంచి చెన్నై పారిపోయి వచ్చాడు. ఆ సంగతి మనకు తెలుసు. కాని నాలుగు రోజులుగా ఇక్కడే ఉన్నానంటూ ఇంటర్వ్యూలో బొంకాడు. ఇంతకీ వాడు ఇక్కడే ఉంటాడా మధురై వెళ్ళిపోతాడా? వాడేం చేస్తాడనేది అర్ధం గావడం లేదు.’’ అంటూ తనకు అర్ధం గాని సందేహాన్ని బయట పెట్టింది విశాల.

‘‘ఇందులో అర్ధం గానిదేముంది? మధురైలో ఉండి సాధించ లేనిది చెన్నైలో ఉండి సాధించాలని ఇక్కడే ఉంటాడు. సహస్ర ఇక్కడే ఉందని వాడికి తెలుసుగా’’ అన్నాడు విరాట్.

‘‘అంటే అక్కను చంపించాలనేనా?’’

‘‘డౌటా? కేసు విచారణ వస్తే తనకి ఉచ్చు బిగుస్తుందని వాడికి తెలుసు. ముందు కేసు బలహీన పడితే తర్వాత ఎలాగో తప్పించుకోవచ్చు. అలా జరగాలంటే సహస్ర బతక్కూడదు. అడ్రస్ వెతికి మరీ చంపించాలని చూస్తాడు.’’

‘‘ఈ లోపల మనమే వాడ్ని చంపేస్తే అక్క క్షేమంగా ఉంటుంది గదా?’’

‘‘ఏయ్.... సమస్యకు అది సొల్యూషన్ కాదు. మనం క్రిమినల్స్ కాదు. ఆ కోణంలో ఎప్పుడూ ఆలోచించకు’’ హెచ్చరించాడు విరాట్.

‘‘అయితే పరిష్కారం ఏమిటి? అక్కను మనం కాపాడుకోవాలి గదా’’ అంది విశాల.

‘‘మనమంతా ఉండగా తనకేమీ కాదు. డోన్ట్ వర్రీ అయినా ప్రశాంతమైన నీ బుర్రలోకి ఈ క్రిమినల్ థాట్స్ ఎలా వస్తున్నాయి. ఆ విషయాలు మేం చూసుకుంటాం గాని అనవసరంగా బుర్ర పాడు చేసుకోకు. కారును రైట్ రోడ్లోకి పోనీ’’ అన్నాడు విరాట్.

అప్పటికే చెన్నై అవుటర్లోకి వచ్చేసింది కారు. విరాట్ చెప్పిన వైపు కారును మళ్ళించింది విశాల.

''ఒకె బావా రాత్రికి నీ గదికొచ్చేస్తాను'' అంది వున్నట్టుండి

తృళ్ళిపడ్డాడు విరాట్.

''ఇదెక్కడి గోల......... ఎందుకు?'' అనడిగాడు అమాయకంగా.

''పో బావా నీకన్నీ వివరంగా చెప్పాలి... అందుకే'' అంది సిగ్గును ఎరువు తెచ్చుకుంటూ.

''అందుకే అంటే...........అమ్మో ఒప్పుకోను. పెళ్ళికిముందే తొందరపడ్డం ఆచార విరుద్ధం.........చట్ట విరుద్ధం........లోక విరుద్ధం'' కంగారుగా అరిచాడు.

''ఓహో! అందుకే అనగానే నువ్వక్కడికి వెళ్ళిపోయావా? పోబావా అంత విరుద్ధమైన పని నేనెందుకు చేస్తాను?'' అంది.

''మరి గదిలోకొచ్చేస్తానంటున్నావ్.''

''అవును నిజంగా నువ్వు డోర్ లాక్ చేసుకుంటున్నావో లేదో వచ్చి చెక్ చేస్తాను.''

''హమ్మయ్యా బతికించావ్. అయినా.... లాక్ చేయకపోతే........ లోనకొచ్చేస్తావా?''

''వచ్చి''

‘‘నిన్ను కొరుక్కు తినేస్తాను’’

‘‘అంత పని చేయమాక. నాకింకా చాలాకాలం బతకాలనుంది’’

‘‘నాకు మాత్రం లేదా?’’ అంటూ చటుక్కున పెదవుల మీద ముద్దు పెట్టేసింది.

‘‘ఓర్నాయనో నువ్విలా కవ్వించకు పుణ్యం వుంటుంది. అసలే భుజం గాయం నొప్పితో చస్తున్నాను. నువ్వు వేరే పాడు ఆలోచన పుట్టించి చంపకు. అదో హోటల్ కొచ్చేసాం. పక్కకు తిప్పి కారును ఆ ఖాళీ స్థలంలో చెట్టు కింద ఆపు’’ అన్నాడు.

కారును అటు మళ్ళించి...

చెట్టు కింద ఆపింది విశాల.

‘‘నేను కూర్చొనే వుంటాను. నువ్వు వెళ్ళిరా’’ అంది.

తన సెల్ అందుకొని కారు దిగాడు విరాట్. ఎసి కార్లోంచి బయటకు రావటంతో బయటి వాతావరణం వేడిగా తోచింది. ఓసారి చుట్టు చూసాడు. హోటల్ ముందు భాగం లోనే ఆగుంది ఒక లగ్జరీ మినీ బస్సు. ధర్మ బృందం బస్సు అదేనని వూహించాడు. ధర్మ సెల్ కి ఫోన్ చేసి తను చెట్టు కింద వున్నట్టు చెప్పాడు.

ఫోన్ చేసిన మూడో నిముషం లోనే ఏ హడావుడి లేకుండా ఇద్దరు ముగ్గురు జట్టుగా ధర్మతో సహా పాతిక మంది మిత్రబృందం హోటల్లోంచి బయటికొచ్చేసారు. వాళ్ళని చూసి చిరునవ్వుతో చేయి వూపాడు విరాట్.

వస్తూనే విరాట్ ను కౌగిలించుకున్నాడు ధర్మ. యోగ క్షేమాలనంతరం వచ్చిన స్నేహితులందర్ని పేరు పేరున పలకరించి క్షేమ

సమాచారాలడిగి తెలుసుకున్నాడు విరాట్. తర్వాత ప్రస్తుత పరిస్థితి గురించి ధర్మతో కాస్సేపు చర్చించాడు.

“సారీరా విరాట్ మధురైలో వూహించని సంఘటనలే జరిగాయి. ఇప్పటికైనా మహ దేవ నాయకర్ కి నిజం తెలియాలని చెప్పాను. తెలిగానే ఆయన విలయ తాండవం చేస్తాడని వూహించలేదు. చాలామంది చనిపోవటం బాధగా వుంది” అన్నాడు ధర్మ.

“అయిపోయిందాని గురించి ఇప్పుడు బాధపడి ప్రయోజనం లేదు. ఈ రోజు త్యాగరాజన్ ఇంటర్వ్యూ చూసావా?”

“చూసాం లేరా వాడు చెప్పిన సమాధానాలన్ని అబద్ధాలే. వాడిక్కడే వున్నాడు గాబట్టి సహస్ర విషయంలో నువ్వు మరింత కేర్ తీసుకోవాలి. మా గురించి నువ్వు టెన్షన్ పడాల్సింది లేదు. మీకు సాయంగా కొద్ది రోజులిక్కడ ఉండాలనే వచ్చాం. తెల్లవారు జామున సిటీలో ప్రవేశించి ఏదో హోటల్లో దిగి తర్వాత గోస్వామి కాలనీకొస్తాం” తన అభిప్రాయం చెప్పాడు ధర్మ.

“తెల్లవారు జామున అంతగా పోలీస్ చెకింగ్ ఉండదు కాని మీరంతా గుంపుగా ఒకే హోటల్లో దిగటం మంచిది కాదు. ఓ పని చేయండి మీరు సైదాపేట ఆ పరిసరాల్లో మూడు నాలుగు హోటళ్ళలో విడి విడిగా గదులు తీసుకొని బస్సును గోస్వామి కాలనీ మనింటికి పంపించేయండి. డ్రయివరు అక్కడే ఉంటాడు. రోజు బస్ లో వచ్చి పికప్ చేసుకుంటాడు మిమ్మల్ని. త్యాగరాజన్ కేసు ప్రాథమిక విచారణకు సైదాపేట కోర్టుకే వస్తుంది. మీరూ ఆ ప్రాంతంలోనే ఉంటే సహస్ర రక్షణకి అందుబాటులో వుంటారు. ఏమంటారు?” అన్నాడు విరాట్. ఈ సలహా అందరికీ నచ్చింది.

“ఏరా సహస్రని కార్ లోనే ఉంచేసినట్టున్నావ్. మాకు పరిచయం చేయవా?” అనడిగాడు నవ్వుతూ ధర్మ.

“ఓ సారీరా. ఆ సంగతి చెప్పటం మర్చిపోయాను. సహస్ర ఇంకా పూర్తిగా కోలుకోలేదు. తను ఇంటి దగ్గరే వుంది. ఇప్పుడు నాతో వచ్చింది విశాల” అన్నాడు విరాట్.

“విశాలా..........” ఒకే సారి అరిచారంతా. విశాల గురించి ధర్మకి కూడ తెలిదు.

“అవున్రా విశాల” అన్నాడు విరాట్.

‘‘తనెవరు?’’

‘‘చెప్తా’’ అంటూ వెళ్ళి కారు డోర్ తట్టాడు విరాట్.

డోర్ తెరిచింది విశాల.

‘‘వాళ్ళు నిన్ను చూడాలంటున్నారు. ఓసారి బయటికొస్తావా?’’ అడిగాడు.

కారు దిగింది విశాల.

అందరికీ నమస్కరించింది.

పుత్తడి బొమ్మలా వున్న విశాలను చూసి రెప్ప వాల్చటం మర్చిపోయారంతా.

‘‘ఈ అమ్మాయి పేరు విశాల. నా మేనత్త కూతురు. నాకు మరదలు.’’ పరిచయం చేసాడు. అలాగే తన మిత్రబృందాన్ని విశాలకి పరిచయం చేసాడు. ధర్మ మనుసులో ఏదీ దాచుకోడు డౌటు వస్తే వెంటనే అడిగేస్తాడు. కాస్త హాస్య ప్రియుడు కూడ.

‘‘ఏరా విరాట్ మహాలక్ష్మిలా మరదలుండగా నువ్వు సహస్రని లవ్ చేయటం ఏమిట్రా?’’ అని వెంటనే అడిగేశాడు.

‘‘ఏం చేయమంటావ్ రా. సహస్ర కూడ నాకు మహాలక్ష్మి లాగే కన్పించింది. ఇపుడూ పార్వతి సగం దేహమై ఉండగా శివుడు గంగను నెత్తికి ఎందుకెత్తుకున్నాడంటావ్? శ్రీవళ్ళి అమ్మవార్ని లవ్ చేసిన కుమార స్వామి దేవ సేనను ఎందుకు పెళ్ళి చేసుకున్నాడు? అలివేలుమంగను ప్రేమించిన ఆ వెంకన్న పద్మావతి అమ్మవార్ని కాదనలేక పోయాడే……… కొన్నిటికి కారణాలుండవు ధర్మ. అలా జరిగిపోవాల్సిందే. చీకటి పడుతోంది మేం బయలుదేరతాం. ఫోన్ లో టచ్ లో ఉంటాలే’’ అంటూ కారెక్కేసాడు విరాట్. విశాల కారు

స్టార్ట్ చేసింది. వెళ్ళిపోతున్న కారును ఆయోమయంగా చూస్తూ నిలబడి పోయారంతా.

కాస్సేపు అక్కడే వుంటే వాళ్ళేవో జోకులు పేల్చకుండా వదలరు. విశాలకి అలాంటివి నచ్చదు. అందుకే వెంటనే బయలుదేరి వెళ్ళిపోయాడు విరాట్. కాని అతడి సమాధానం మిత్రబృందాన్ని ఆయోమయంలో నెట్టేసింది.

''నువ్వేమడిగావు వాడేం చెప్పాడు. శివుడంటాడు వెంకన్నంటున్నాడు ఏమన్నా సంబంధం వుందంటావా?'' అన్నాడు ధర్మ పక్కనున్న చిన్నా.

''ఉందిలేరా......... సూటిగా చెప్పటం ఇష్టంలేక మనోడు ఉపమానాలనతో సరిపెట్టి వెళ్ళిపోయాడు నాకర్థమైంది ఏంటో తెలుసా?

'''ఏంటి.......... ఏంటి?'' ముక్త కంఠంతో అరిచారంతా.

''వీడు మామూలోడు కాదురా బాబు. సహస్రని, విశాలని ఇద్దర్ని లవ్ చేస్తున్నాడు.'' అన్నాడు ధర్మ పెద్దగా నవ్వుతూ.

అంతే...

ఆ.......... అంటూ తెరిచిన నోళ్ళు మూయటం మర్చిపోయారంతా. అప్పటికే విరాట్ విశాల ప్రయాణిస్తున్న కారు వీధి మలుపు తిరిగి అదృశ్యమైంది.

*************************

కీల్పాక్కం!

కీల్పాక్కం మెంటలాస్పత్రికి కూత వేటు దూరంలోనే చుట్టూ ఎత్తైయిన కాంపౌండ్ మధ్య మూడంతస్థుల పాత భవనం ఒకటుంది. కాస్త

విసిరేసినట్టున్న మారుమూల ప్రాంతం అది. త్యాగరాజన్ కి గల అనేక భవంతుల్లో ఇది ఒకటి. పాత భవనంలా కన్పించినా లోపల అన్ని వసతులతో చాలా అధునాతనంగా కన్పిస్తుంది. ఎవరి దృష్టి ఇటు ఆకర్షించకుండా ఉండేందుకు అలా ఉంచబడిన్ది.

ఇక్కడ ప్రత్యేక కార్య కలాపాలంటూ ఏమీ జరగవు. మధురై నుండి పని మీద, తన స్టాఫ్ లో ముఖ్యులు గాని, తన కింద పనిచేసే వాళ్ళలో ముఖ్యులు గాని చెన్నై వస్తే బస చేయటానికి హోటళ్ళకి పోకుండా ఈ భవనం వసతి గృహంలా ఉపయోగపడుతోంది. దిగువ రెండస్థులు అందుకోసం వదిలేయగా పైన టెర్రస్ మీది విశాలమైన డబుల్ కాట్ బెడ్ ఎసితో అన్ని వసతులు కలిగిన ఫ్లాట్ వుంది. అది సగం వరకే ఉండగా మిగిలిన ఓపెన్ టెర్రస్ మీద చిన్న గార్డెన్ తో బాటు ఓపెన్ గా వుండి రిలాక్స్ గా కూచోడానికి అనువుగా తీర్చి దిద్దబడిరది. ఈ ఫ్లాట్ మాత్రం త్యాగరాజన్ పర్సనల్. ఇక్కడికి ఎవరికీ ప్రవేశం లేదు. అనుమతి లేకుండా ఎవరినీ పైకి రానీయరు.

ప్రస్తుతం త్యాగరాజన్ కీల్పాక్కం లోని ఆ ఫ్లాట్ లో వున్నాడు. ఈ సంగతి బయటి ఎవరికీ తెలీదు. ఇంటి వద్ద వుంటే మీడియా వాళ్ళు లేదా పోలీసులు ప్రశ్నలతో విసిగించేసే ప్రమాదాన్ని వూహించి తన మకాంని ఇక్కడికి మార్చుకున్నాడు.

అప్పటికి రాత్రి ఎనిమిది గంటలవుతోంది.

డిమ్ లైట్ల కాంతిలో ప్రశాంతంగా ఓపెన్ టెర్రస్ లో కూచుని మందు కొడుతున్నాడు త్యాగరాజన్. అతనికి ఎడంగా నలుగురు అనుచరులతో నిలబడున్నాడు ఎట్టయప్ప. మధురైలో అయితే త్యాగరాజన్ ఎదురుగా కూచొనేవాడు ఎట్టయప్ప. కాని ఇప్పుడున్న పరిస్థితిలో కూచోడానికి ధైర్యం చాలటం లేదు. సాయంకాలమే చెన్నైకి చేరుకున్నాడు. మధురై అల్లర్లలో భారీ నష్టమే జరిగింది. ఆపటం తన వల్ల కాలేదు.త్యాగరాజన్ నోరువిప్పి మాట్లాడలేదు. ఆ మౌనం అందరికీ ఇబ్బందిగా వుంది. గుండెల్లో దడపుట్టిస్తోంది. ముఖ్యంగా ఎట్టయప్ప తనకు అప్పగించిన ఏ పనిలో కూడ ఇంత వరకు అపజయమంటూ ఎరుగడు. అలాంటిది ధనగిరిని నమ్ముకొని లహరిని అంతం చేయటంలో ఫెయిలయ్యాడు. ఇక మధురై అల్లర్లలో విఫలమై పారిపోవటం రెండో విషయం. ఈ రెండు కారణాల వల్ల తనిప్పుడు యజమాని ముందు తల దించుకోవలసి వచ్చిందనే బాధ ఎట్టయప్ప గుండెల్లో ముల్లులా గుచ్చుతోంది. ఏమంటాడోనని గాభరా చెందుతున్నాడు.

కాని త్యాగరాజన్ ఎవరిని ఏమీ అనలేదు.

చాలా సేపటి తర్వాత ‘‘దిష్టిబొమ్మల్లా అలా నిలబడకపోతే తలో పెగ్గు వేసుకుని పోయి భోంచేసి రావచ్చుగా వెళ్ళండి’’ అన్నాడు.ఎట్టయప్ప బాధగా చూసాడు.

‘‘క్షమించండి సార్……… ఓడిపోయాను. ఎస్టేట్ ను కాపాడలేక పోయాను. లహరిని చంపించలేక పోయాను. అసమర్ధుడిగా మిగిలిపోయాను.’’ అంటూ కళ్ళు తుడుచుకున్నాడు.

‘‘రేయ్ ఎట్టయప్పా ఎందుకురా బాధ పడతావ్. ప్రవాహమైతే ఏదో పది బస్తాల ఇసక మూటలు వేసి ఆపుతాం. అదే సునామి వస్తే ఎవరు ఆపగలరు? మధురై సంఘటన సునామి లాంటిది. నీ స్థానంలో ఎవరున్నా ఆపలేరు. ఇక లహరి విషయంలో నువ్వు నేను కూడ తప్పు చేసాం. ఎంతో అనుభవం వున్న ధనగిరి కూడ చావు దెబ్బ తినటం ఇది నిజంగా వాడి అసమర్ధతే. అంచేత ఇప్పుడు మనం ఆలోచించాల్సింది జరిగిందాని గురించి కాదు. జరగ వలసిన దాని గురించి. అల్లర్లలో జరిగిన నష్టం మనకి పెద్ద నష్టం కాదు. కాని అసలు నష్టం లహరి బ్రతికుండటం. అందుకేం చేయాలో ఆలోచించి ప్లాన్ చేద్దాం. నాకు మీ మీద కోపం లేదు. అనవసంగా ఫీలవకండి’’ అన్నాడు.

‘‘థాంక్యూ సార్’’ అన్నాడు ఎట్టయప్ప. ‘‘ధనగిరి టచ్ లో ఉన్నాడా?’’ మరో పెగ్గు విస్కీ కలుపుకొంటూ అడిగాడు త్యాగరాజన్.‘‘ఉన్నాడు సర్, ప్రస్తుతం పాండీ బజార్ లోని హోటల్ నుంచి పరశువాక్కంలోని చంద్రా లాడ్జికి షిఫ్టయ్యాడు. ఎలాగైనా లహరి అడ్రసు తెలుసుకొని ఆమెను చంపించాకే తిరిగి మన ముందుకొస్తానంటున్నాడు.’’ చెప్పాడు ఎట్టయప్పన్.

‘‘వద్దు ఇక వాడ్ని నమ్ముకొని ప్రయోజనం లేదు. అయ్యవారొచ్చే దాకా అమావాస్య ఆగదు. ఎప్పటి పనులు అప్పుడు జరిగి పోవాలి. అవతల ప్రభుత్వం నియమించిన ఎంక్వైరీ కమీషన్ని ఎలాగో మేనేజ్ చేసాను. కానీ కమీషన్ కోరిన మరో మూడు మాసాల గడువును సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఆరు మాసాలు పూర్తి కావస్తోంది. సిబిఐ ఎంక్వయిరీకి ఆదేశిస్తే పరిస్థితి దారుణంగా వుంటుంది. ఇన్ని సమస్యల మధ్య ధనగిరి ఎప్పుడో ఏదో చేస్తానంటే ఇంకా నమ్మి కూచోలేం.



నేను కొంతకాలం ఇక్కడే ఉంటాను. వేరే ఏర్పాటు కూడా చేసాను. హర్యానా నుంచి రివాల్వర్ షూటింగ్ లో సిద్ధహస్తులయిన ఆరుగురు షూటర్స్ ని పిలిపిస్తున్నాను. ఈలోపల కొందరు లోకల్ క్రిమినల్స్ ని కలుపుకొని స్వయంగా లహరి కోసం గాలించి నివాసం ఎక్కడో తెలుసుకో. వాళ్ళు రాగానే పని ముగించటం తేలిక. అర్ధమైందిగా?'' వివరించాడు త్యాగరాజన్.

అర్ధమైనట్టు తల వూపాడు ఎట్టయప్పన్.

''ఒక్క విషయం గుర్తు పెట్టుకో. పొరబాటున కూడ ఆ పిల్లతో హ్యాండు టు హ్యాండ్ ఫైటింగ్ కి పోవద్దు. శిఖామణితో ఎలా పోరాడిందో టివిలో చూసావ్ గదా? గప్ చుప్ గా షూట్ చేయటం ఒక్కటే దీనికి పరిష్కారం'' తిరిగి తనే హెచ్చరించాడు త్యాగరాజన్.

‘‘లహరికి తోడుగా ఒక యువకుడున్నాడు. టివిలో చూసాం. అతడి విషయం ఏమిటి? వాడి జోలికి పోవద్దంటారా?’’ సందేహం తెలియబుచ్చాడు ఎట్టియప్ప.

‘‘వద్దు. మన టార్గెట్ లహరి అంత. రేపు ఉదయం మరింత వివరంగా చర్చిద్దాం. వెళ్ళి భోంచేసి రెస్ట్ తీసుకోండి వెళ్ళండి’’ అన్నాడు త్యాగరాజన్.

తేలిక పడ్డ మనసుతో తన మనుషుల్ని తీసుకొని కిందకు వెళ్ళి పోయాడు.

అదే రాత్రి ఆమూల ఓల్డ్ మాంబళం విశాల యింట్లో మరో సంఘటన చోటు చేసుకుంది.

*****************************************

అర్ధరాత్రి కావస్తోంది సమయం...

ఇల్లంతా ప్రశాంతంగా వుంది.

ఎవరి గదుల్లో వారు నిద్రపోతున్నారు.

కాని తన గదిలో విశాల మాత్రం నిద్ర పట్టక బెడ్ మీద అటు యిటు దొర్లుతోంది. తనువు మనసు ఎంత నచ్చచెప్పినా వినుకోమంటున్నాయి. విరహాన్ని మించిన తీపి బాధ మరోటి లేదంటారు. ఎందుకో ఇప్పుడర్థమవుతోంది.

కావ్య నాయికల్లో విరహోత్కంఠిత అనే నాయిక వుంది. ఇపుడు ఆలోచిస్తే తనకీ ఆ నాయికకూ తేడా లేదనిపిస్తోంది. పక్క గదిలో బావ దగ్గరకు వెళ్ళమని మనసు లాగేస్తోంది.

తనెవరో తెలీనప్పుడే గాఢంగా ప్రేమించింది. సొంత బావని తెలిసాక ఆ ప్రేమ రెట్టింపయింది. బావ చాలా గడుసు వాడు. లేకపోతే కార్లో వెళ్ళేప్పుడు రాత్రిళ్ళు తన అవస్థ గురించి అంత స్పష్టంగా ఎలా చెప్పగలిగాడు? నిజంగానే తను డోర్ లాక్ చేసుకుని పడుకుంటున్నాడా?ప్రేమికులకు చూపులు, మాటలు, స్పర్శ, కౌగిలి, ముద్దులు ఇవన్నీ విరహాన్ని శాంతింపజేసే చర్యలే, తను అవే కోరుకుంటోంది. అంతే గాని పెళ్ళికి ముందే పరువాన్ని ఆరబోసి విందారగించాలనే తొందరే కాదు. అయినా తనకేనా ? బావకి మాత్రం విరహముండదా? అక్క సహస్రకి ఉండదా? తనింకా కోలుకోలేదు గాబట్టి ఈ ఫీలింగ్స్ ఏవీ అక్కని బాధించవు. బాధంతా తనకే.అయినా ఇన్ని ఆలోచనలెందుకు? నిజంగా తలుపు లాక్ చేసుకుంటున్నాడో లేదో ఓసారి పోయి చెక్ చేస్తే పోలా? తన ఆలోచనకి తనే నవ్వుకుంది.ఏయ్ కోతి....... వాడు లాక్ చేసుకోలేదనుకో ఏం చేస్తావ్ లోనకెళ్ళి పోతావా' కొంటెగా వెక్కిరించింది మనసు. వెళ్తే తప్పేంటి? వాడు నా బావే కదా ? అని మనుసును తనే వెక్కిరిస్తూ బెడ్ దిగింది విశాల.జుత్తు లాగి జారు ముడి వేసుకుంది. నైటీ సరిచేసుకుంది. అద్దం ముందుకెళ్ళి ఓసారి తన రూపాన్ని తనే చూసుకుంటూ బయలుదేరింది. బయటి వరండాలో అడుగు పెట్టింది. ఎందుకైనా మంచిది ఎవరూ చూడకుండా వుంటారని వరండాలో లైటు కూడ ఆఫ్ చేసింది.

పక్కన సహస్ర గది ముందుకొచ్చి ఓరగా తొంగి చూసింది. లోన బెడ్ మీద గాఢ నిద్రలో ఉంది సహస్ర. బెడ్ లైటు డిమ్ గా వెలుగుతోంది.ఆ గది దాటి విరాట్ గది ముందుకెళ్ళింది.డోర్ మీద చేయి వేయగానే చప్పుడు గాకుండా తెరుచుకుంది. లోన బెడ్ లైట్ కాంతిలో విరాట్ కూడ గాఢనిద్రలో వున్నాడు. గుమ్మానికి జేరబడి కాస్సేపు అలాగే చూస్తూ నిలబడింది. అతన్ని చూసే కొద్ది శ్వాస వేడెక్కుతోంది. ఛాతీ బరువైనట్టుంది. మనసు ఆగనంటోంది.బావా..........నేనిక్కడ విరహంతో కాలిపోతుంటే నువ్వు ప్రశాంతంగా నిద్రపోతావా ఆగు నీ పని చెప్తా డోర్ లాక్ చేసుకుంటున్నానంటూ బడాయి కబుర్లు వేరేనా.... చెప్తా అనుకుంటూ గదిలోకి అడుగు పెట్టింది.

సరిగ్గా అదే సమయంలో

వరండా చివర చిన్నగా ఏదో అలికిడి విశాల చాలా చలాకీ అమ్మాయి. వుషారుగా ఉంటుంది. దేన్నీ అశ్రద్ధ చేయదు. ఆ చప్పుడేమిటీ అనుకుంటూ గిరుక్కున తిరిగి వరండా చివర బాల్కనీ వైపు చీకట్లోకి దృష్టి సారించింది. అంతే...ఆమె గుండె ఝల్లుమంది.నీడ లాంటి ఆకారం ఏదో వాటర్ పైపు వెంట పైకెక్కి బాల్కనీలోకి దిగుతోంది.ఎవడు వాడు? దొంగా........... ఇంతవరకు ఎప్పుడూ ఇలా జరగలేదు. భయాన్ని కంగారును అణుచుకొంటూ ఒక్క దూకులో గదిలోకెళ్ళి తలుపు దగ్గరగా మూసింది. బెడ్ వద్దకెళ్ళి.బావా........బావా......... అంటూ చిన్నగా పిలిచింది.

విరాట్ కదల్లేదు.దాంతో కోపంగా భుజంమీద తట్టింది.తృళ్ళిపడి లేచాడు విరాట్.విశాలను చూసి కంగారు పడుతూ ఏదో అడగబోతుంటే "ష్" అంటూ నోటి మీద వేలు అడ్డంగా ఉంచి సైగ చేసింది."దొంగ బావా........ దొంగ" .............. అంది."ఏయ్ నేను దొంగనేమిటే...........అర్ధరాత్రి అంకమ్మ శివాలని ఏంటి నీగోల?" అన్నాడు విసుగ్గా."అయ్యో మొద్దు మనింట్లోకి దొంగ

వచ్చాడు. వరండా చివర బాల్కనీలో ఉండగా చూసా....'' అంది.దొంగ అనగానే విరాట్ నిద్ర మత్తు...మంత్రం వేసినట్టు మాయమైంది.వాడు నిజంగా దొంగాడా లేక సహస్ర కోసం వచ్చిన శత్రు మనిషా......... ఆలోచించే టైం లేదు. వెంటనే బెడ్ దిగి సీలింగ్ ఫ్యాన్ స్విచ్ ఆఫ్ చేసాడు. విశాల చేయి పుచ్చుకొని వేగంగా తలుపు వెనక్కి లాక్కుపోయాడు. వచ్చిన అవకాశాన్ని వదలకుండా విరాట్ ని వాటేసుకొని చప్పుడు రాకుండా ముద్దులు పెట్టింది విశాల.ఇదే టైంలో నెమ్మదిగా డోర్ తెరుచుకుంది. ఎవరో లోనకు తొంగి చూసారు. వాడులోనకొస్తే అటాక్ చేయటానికి సిద్ధంగా వున్నాడు విరాట్. కాని అవతలి వ్యక్తి గదిలోఎవరూ లేరని నిర్ధారించుకుంటూ తిరిగి తలుపు దగ్గరగా మూసాడు.

తలుపు వెనకే వున్న విరాట్ విశాలను అక్కడే ఉండమని సైగచేసి డోర్ కొద్దిగా తెరిచి చిమ్మచీకటిగా వున్న వరండాలోకి తొంగి చూసాడు. నీడలా కదులుతున్న ఆ ఆకారం పక్కన సహస్ర గది డోర్ కూడ నెట్టి లోనకు తొంగి చూసింది. బెడ్ లైట్ కాంతి పడి వాడు తలకు ధరించిన మంకీ క్యాప్ తెలుస్తోంది వాడి చేతిలో పదంగుళాల పొడవున తళతళ మెరుస్తోంది డాగర్. దాన్ని చూడగానే ఉలిక్కి పడ్డాడు విరాట్. సందేహం తీరిపోయింది. వచ్చిన వాడు శత్రు మనిషి. ఎవడు వాడు ఎలా వచ్చాడు? ఆలోచించే టైం లేదు. వాడు పిల్లిలా సహస్ర గదిలోకి పోతున్నాడు.ఇక ఆలస్యం చేయలేదు విరాట్. క్షణం ఆలస్యమైన అది సహస్ర ప్రాణాన్ని బలి తీసుకోవచ్చు. సమయానికి విశాల పసిగట్టి లేపింది. లేకపోతే ఘోరం జరిగి పోయేది.వేగంగా బయటికి కదిలాడు విరాట్. చప్పుడు గాకుండా తనూ అనుసరించింది విశాల. విరాట్ సహస్ర గదిలో ప్రవేశించే సరికి అగంతకుడు బెడ్ పక్కన చేతిలో డాగర్ పైకి లేస్తోంది. క్షణం ఆలస్యమైతే అది సహస్ర గుండెల్లో పిడివరకు దిగబడి పోయేది. వెను తిరిగాడు అగంతకుడు. తిరిగీ తిరక్క ముందే విరాట్ కుడి చేతి పిడికిలి వాడి మెడనరాన్ని దారుణంగా తాకింది. ఏం జరిగిందో కూడ వాడికి అర్ధం కాలేదు. నిలుచున్న వాడి చేతిలో డాగర్ జారి కింద పడి ఖంగున శబ్దం చేసింది. ఆ శబ్దానికి సహస్ర ఉలిక్కి పడి లేచి కూచుంది.

క్షణ కాలం ఏం జరుగుతుందో సహస్రకి అర్ధం కాలేదు. కింద పడున్న అగంతకుడ్ని ఇంకా చూడలేదామె. ఎదురుగా విరాట్ ఆ వెనకే విశాల యిద్దర్ని చూస్తూ ''ఏంజరిగింది?'' అనడిగింది. ఏం జరిగిందా! క్షణం ఆలస్యమైతే నీ ప్రాణాలు పోయుండేవి. కట్లపామొకటి నీ గదిలో ప్రవేశించింది. దీని సంగతి చూద్దాం అంటూ వెళ్ళి లైటు స్విచ్ ఆన్ చేసాడు.

గది నిండుగా ట్యూబ్ లైట్ కాంతి పరుచుకుంది.

అప్పుడు గమనించింది సహస్ర అగంతకుడ్ని.బెడ్ దిగింది. క్షణంలో విషయం అర్ధమైందామెకు. విశాల పక్కకొచ్చి నిలబడింది. ఎంత ప్రమాదం తప్పిందో వూహించుకుంటేనే గుండె దడ పుట్టింది.

విరాట్ తెలివి తప్పిన అగంతకుడ్ని లాగి కుర్చీలో కూచొ బెట్టి చేతులు కుర్చీ వెనక్కి కట్టేసాడు. వాడి ముఖాని కున్న మంకీ క్యాప్ తొలగించాడు. పాతిక సంవత్సరాల యువకుడు. వాడ్ని ఎప్పుడూ చూసిన గుర్తు లేదు. జేబులు వెతగ్గా ఒక రివాల్వర్ సెల్ ఫోన్

మనీ పర్సు దొరికాయి. వివరాలు తెలిపే ఆధారాలేవీ దొరకలేదు. సెల్ ఫోన్ మనీపర్స్ వాడి జేబులోనే వుంచి రివాల్వర్ని తన వద్ద ఉంచుకున్నాడు. ముఖాన చల్లటి నీళ్ళు కొట్టగానే స్పృహ వచ్చింది వాడికి. భయం భయంగా విరాట్ ని సహస్రని విశాలని మార్చి మార్చి పిచ్చి చూపులు చూసాడు.ఓ కూర్చీ దగ్గరకు లాక్కుని...

వాడికి ఎదురుగా కూచున్నాడు విరాట్.

''చెప్పరా నీ పేరేమిటి?'' అడిగాడు.

వాడికి నోరు పెగల్లేదు.

గొంతులో ఏదో అడ్డం పడ్డట్టుంది.

వచ్చిన పని పూర్తవుతోందన్న ఆనందంలో వెనక నుంచి ముంచుకొచ్చిన ప్రమాదాన్ని గమనించలేదు. దొరికిపోయాడు. కర్తవ్యం బోధ పడక కొట్టుమిట్టాడుతున్నాడు వాడు.

''నిజం చెప్పకపోతే ఇక్కడే నిన్ను చంపి తీసుకెళ్ళి కూనం నదిలో పడేస్తాను'' హెచ్చరించాడు విరాట్.

''వద్దు సార్ చంపొద్దు నిజం చెప్పేస్తాను'' ఎలాగో నోరు పెకల్చి బదులిచ్చాడు వాడు.

''చెప్పు ఎక్కడ్నుంచి వచ్చావ్? ఎవరు పంపించారు?''

''నేను ధనగిరి మనిషిని సార్. మీ చేతుల్లో చచ్చిన వాళ్ళు చావగా మిగిలిన ముగ్గుర్లో నేనొక్కడ్ని.''

''ఇప్పుడు ఎంత మంది వచ్చారిక్కడికి? కింద ఎంత మంది వున్నారు?''

‘‘ఎవరూ లేరు. ఒక్కడ్నే వచ్చాను.’’

‘‘మిగిలిన వాళ్ళకు కూడ ఈ అడ్రసు తెలుసా?’’

‘‘లేదు. ఎవరికీ తెలీదు. నాకు మాత్రమే తెలుసు.’’

‘‘నీకు మాత్రం ఎలా తెలిసింది? మేం ఇక్కడున్న విషయం చాల రహస్యంగా ఉంచాం. ఎవరు చెప్పారు నీకు?’’

‘‘చందూ.... మీ ఫ్రెండు చందూ మూలంగా తెలిసింది.’’

వాడా మాటన్న మరుక్షణం విరాట్ కొట్టిన చెంప దెబ్బకి వాడి చెంప పేలిపోయినట్టయింది. కెవ్వుమన్నాడు.

‘‘మా మధ్య కలతలు రేపాలని చూస్తే ఇప్పుడే నిన్ను చంపేస్తాను. రాస్కెల్ నిజం చెప్పు’’ గద్దించాడు.

‘‘లేదు లేదు మీరు నా మాటల్ని తప్పుగా అర్థం చేసుకున్నారు. నా ఉద్దేశం అది కాదు’’ అన్నాడు ఏడుపు ముఖంతో అగంతకుడు.

‘‘ఇంకేమిటి? చందూ ఎలా తెలుసు నీకు?’’

‘‘చెప్తాను. మేం చెన్నై వచ్చి లహరి కోసం గాలిస్తుండగా చందూ మీరు ఒకే బైక్ మీద తిరగటం చాలా సార్లు చూసాను. మామూలుగా అయితే మీరు గుర్తుండే వారు కాదు. నాకు బైక్ లంటే ఇష్టం. మీది ఫారెన్ బైక్. అలాంటిది మరో బైక్ ని నేను చూళ్ళేదు. అందుకే ఆ బైక్ మీద తిరుగుతున్న మీ యిద్దరు గుర్తుండి పోయారు.

ఆ రోజు శిఖామణి వర్గంతో జరిగిన పోరులో మీరు ఉండటం టివిలో చూసాక గుర్తు పట్టాను. చందూ మీ ఫ్రెండు గాబట్టి చందూని పట్టుకుంటే లహరి ఆచూకీ దొరుకుతుందనుకున్నాను. మూడు రోజుల క్రితం చందూని గుర్తించాను అతని బైక్ ని ఫాలో చేసి గోస్వామి కాలనీకి వెళ్ళాను. అక్కడే ఇరుగు పొరుగు వల్ల తెలిసింది మీ పేరు విరాట్ అని మీ ఫ్రెండు పేరు చందూ అని మీరు అక్కడ ఉండటం లేదనీ తెలిసింది. తర్వాత చందూ బైక్ ని ఫాలో చేస్తూ ఈ ఇంటి వరకు వచ్చాను. చందూ మేడపైకి రావటం వీధిలోంచి గమనించి గాయ పడిన మీరిద్దరూ ఎవరికీ తెలీకుండా పై అంతస్థులో ఉంటున్నారని వూహించాను.

వచ్చిన పని పూర్తి గాక, తన మనుషుల్ని కోల్పోయి ధనగిరి చాలా బాధలో వున్నాడు. ఏభై వేలు రెడీగా ఉంచు. ఈ రాత్రికే లహరిని చంపి వస్తానంటూ సవాల్ విసిరి బయలుదేరాను. నా బేడ్ టైం దొరికి పోయాను" అన్నాడు బాధగా వాడు. వాడు అబద్ధం చెప్పటం లేదని ముగ్గురికీ అర్ధమైంది. విరాట్ సీరియస్ గా చూసాడు.

"నువ్వు చాలా తెలివైన వాడివిరా. అందుకే ఇంత దూరం వచ్చేసావ్. నిన్ను మెచ్చుకోవాలి. చెప్పింది చేస్తావా? అనడిగాడు.

"ఏం చేయాలి?"

"ధనగిరిని చంపేయాలి"

"నేనా!"

"అవును నువ్వే. నిన్నక్కడికి తీసుకెళ్తాను. ఏదో వంకతో వాడ్ని కిందకు పిలిచి పొడిచి చంపెయి. నేను కార్ లో ఉంటాను. నీకు బోలెడు డబ్బులిస్తాను. వాడ్ని చంపి హేపీగా ఇష్టమైన చోటుకి వెళ్ళిపో. కాని మోసం చేయాలని చూస్తే అక్కడే చంపేస్తాను. నీ రివాల్వర్ నా దగ్గరుంది. అది నిన్ను గమనిస్తూనే ఉంటుంది."

విరాట్ ఆఫర్ విని.

కాస్సేపు తటపటాయించాడు వాడు.

ముందు నుయ్యి వెనక గొయ్యిలా వుంది పరిస్థితి. ఇంత కాలం పోషించిన ధనగిరి తనకు గురువు లాంటి వాడు. చంపటానికి మనసంగీకరించటం లేదు. కాదంటే విరాట్ చంపేస్తాడు. అవునంటే బతికిపోవచ్చు. అయినా తామంతా క్రిమినల్స్ తమకు నీతేమిటి జాలేమిటి చంపటం తమ వృత్తి. పైగా బోలెడు డబ్బు వస్తుంది. అంతే వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంటే బతికిపోవచ్చు ఆలోచిస్తున్నాడు.''నీ పేరేమిట్రా?'' అడిగాడు విరాట్

''ఇళంగో''........చెప్పాడు.

''ఏంటి?''

''నన్ను ఇళంగో అంటారు సార్''

''చూడు ఇళంగో ఉన్న పళంగా పార్టీ మర్చేయాలంటే కొంచెం కష్టమే. కాని నువ్వు బ్రతకాలంటే లహరిని చంపాలని కంకణం కట్టుకున్న ధనగిరి చావాలి. చంపుతావా చస్తావా? త్వరగా తేల్చుకో'' హెచ్చరించాడు.''చంపుతాను సార్ ధనగిరిని చంపేస్తాను'' చివరికి అంగీకరించాడు.''ఇళంగో''''వెరీ గుడ్ అయితే ఇప్పుడే బయలుదేరుతున్నాం. మీరు దిగిన లాడ్జి ఎక్కడుంది?''''పరశువాక్కం మెయిన్ రోడ్ లో సర్. పోస్టాఫీస్ కు సమీపంలో చంద్రా లాడ్జి.''

''వెరీ గుడ్'' అంటూ ఇళంగో నోటికి టేప్ అంటించాడు విరాట్. దారిలో అరిచి గోలచేసి తప్పించుకునే ప్రయత్నం చేయకుండా ముందు జాగ్రత్త చర్య అది.

తన గది లోకి వెళ్ళి ప్యాంటు షర్టు ధరించి వచ్చాడు. రివాల్వర్ జేబులో వేసుకున్నాడు. విశాలను కారు తీయమని చెప్పి ఇళంగోను తీసుకుని బయలుదేరాడు.

మరో సారి తన ప్రాణాన్ని కాపాడిన విరాట్ కి థాంక్స్ చెప్తూ దుఃఖం ఆపుకోలేక కౌగిలించుకొని ఏడ్చేసింది సహస్ర. ఆమె వెన్ను తట్టి ఓదార్చాడు.''నువ్వు చెప్పిన థాంక్స్ నిజానికి విశాలకి చెందాలి. సమయానికి గమనించి వచ్చి నన్ను లేపటం వల్లనే నిన్ను కాపాడుకోగలిగాను.'' అన్నాడు విరాట్.ఆ మాటతో సహస్రకి విశాలమీద మరింత అభిమానం ఏర్పడింది. ఆప్యాయంగా దగ్గరకు

తీసుకొని కృతజ్ఞతగా చూసింది ''నీ రుణం తీర్చుకోలేనిది విశాల. ఇంత నిస్వార్థంగా నన్ను రక్షిస్తున్నావే.....నీ స్థానంలో ఎవరున్నా వదిలేస్తారు తనకి లైన్ క్లియరవుతుందని. కాని ........నువ్వు........ నాకో చెల్లెలున్నా నా గురించి ఇంత శ్రద్ధ తీసుకొనేది కాదేమో.....'' అంటుంటే ''వద్దక్కా మనలో మనకి పొగడ్తలు వద్దు. నాకు స్వార్థం లేదు. నువ్వు విరాట్ నేను అందరం క్షేమంగా ఉండాలి. అదే నా ఆశ'' అంటూ సహస్ర కన్నీరు తుడిచింది.''ఒకె టైం ఒంటి గంట కావస్తోంది. బయలుదేరటం మంచిది. సహస్ర ఎందుకైనా మంచిది డోర్ లాక్ చేసుకుని పడుకో. ఓ గంటలోపే తిరిగి వచ్చేస్తాం'' అంటూ ఇళంగోను తీసుకొని బయలుదేరాడు విరాట్.

విశాల తన గదిలోకెళ్ళి కారు తాళాలు టార్చిలైటు తెచ్చింది. అదృష్టం ఏమంటే కింద ఎవరూ నిద్ర లేవకపోటం. లైట్లు ఆన్ చేయకుండానే టార్చ్ లైటు సాయంతో ఇంట్లోంచి బయటికొచ్చి బయట వీధి గుమ్మానికి తాళం పెట్టింది విశాల. అంతా కార్ లో బయలుదేరే సరికి సరిగ్గా ఒంటి గంట సమయం.

****************************

పరుశువాక్కం చంద్రా లాడ్జి.


గదిలో మంచి నిద్రలో ఉండగా ధనగిరి సెల్ ఫోన్ మోగింది. ధనగిరి బద్ధకంగా ఇటు తిరిగి టేబుల్ మీది సెల్ అందుకుని చూసాడు. అవతల తన మనిషి ఇళంగో లైన్లో వున్నాడు.

''ఆ... చెప్పరా ఎక్కడున్నావ్?'' ఫోన్ చెవికి ఆనించుకొంటూ అడిగాడు.

''అన్నా ఇక్కడే లాడ్జ్ బయట రోడ్ మీదున్నాను'' అటునుంచి ఇళంగో సమాధానం విన్పించింది.''అక్కడేం చేస్తున్నావ్ రా అర్ధరాత్రి లోనకు రావచ్చుగా'' విసుకున్నాడు.''రాలేనన్నా. వెళ్ళిన పని పూర్తయింది. నీకు చూపించాలని సహస్ర తల నరికి సంచిలో వేసి తెచ్చాను. నువ్వు కిందికొస్తే చూపించి తీసుకెళ్ళి దూరంగా పారేసి వస్తాను.''ధనగిరి తన చెవుల్ని నమ్మలేక పోయాడు.ఇన్ని రోజుల్లో తామెవరూ చేయలేని పని ఇళంగో సాధించాడంటే ఆనందంగా వుంది. అనుమానంగా వుంది. లేచి గబగబా బాల్కానిలో కొచ్చి చూసాడు. దిగువన వీధి లైటు కాంతిలో బరువుగా చేతి సంచితో నిలబడి చూస్తున్న ఇళంగో కన్పించాడు.

''సరి. అక్కడే వుండు వచ్చేస్తున్నా'' అంటూ గబ గబా షర్టువేసుకున్నాడు. రివాల్వర్ లేకుండా బయట అడుగు పెట్టే అలవాటు

ధనగిరికి లేదు. రివాల్వర్ జేబులో వేసుకుని గది లోంచి బయటికొచ్చాడు. పక్క గదిలో నిద్ర పోతున్న అనుచరులిద్దర్ని లేపాలని వున్నా చివరి క్షణంలో విరమించుకొని ఒంటరిగానే చకచకా లాడ్జి మెట్లు దిగి కిందకొచ్చాడు. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. ఎవరూ తిరుగుతున్న జాడలేదు. లాడ్జికి కాపలా ఉంటే సెంట్రీ కూడా ఎటువెళ్ళాడో అక్కడ మాత్రం లేడు.



అటు ఇటు రోడ్డు పక్కగా కొన్ని కార్లు పార్కు చేయబడున్నాయి. వడివడిగా ఇళంగోని సమీపించాడు ధనగిరి.

''ఏమిట్రా. నువ్వు చెప్పేది నిజమేనా!'' ఉత్సాహంగా అడిగాడు.

''అవునన్నా నిద్ర పోతుంటే చంపి తల నరికి తెచ్చాను. చూడు'' అంటూ సంచిని నమ్మకంగా ధనగిరికిచ్చాడు ఇళంగో. ధనగిరి

నమ్మాడు.

సంచిలో సహస్ర శిరస్సును ముఖాన్ని చూడాలన్న కుతూహలంతో సంచి విడదీసి లోనకు చూసాడు. వీధి లైటు కాంతిలో సంచి అడుగున శిరస్సు బదులు రెండు ఇటుక రాళ్ళు కన్పించాయి. కోపంతో ముఖం ఎర్రబడగా సంచిని కిందపడేసి ఇళంగో వంక చూడబోయాడు, కాని`

అప్పటికే ఆలస్యమైపోయింది.

ఇళంగో చేతిలో ప్రత్యక్షమైన డాగర్ పిడి వరకు గుండెల్లో దిగబడిపోగా 'మోసం... దగా...' అనరిచాడు ధనగిరి. అరుస్తూనే జేబులోంచి రివాల్వర్ తీసి ఇళంగోని షూట్ చేసాడు. క్లోజ్ రేంజ్లో షూట్ చేయటంతో బుల్లెట్ ఇళంగో ఛాతినుండి వెన్నులోంచి బయటికి దూసుకుపోయింది. నేలకు ఒరిగిపోతూనే మూడు రౌండ్లు కాల్పులు జరిపాడు ధనగిరి. అంతే అటు ధనగిరి ఇటు ఇళంగో చెరో ప్రక్క నేలకు విరుచుకుపడి ప్రాణాలు వదిలారు. రివాల్వర్ మోతలు వాళ్ళ చావు కేకలతో ప్రశాంతంగా వున్న ఆ ప్రాంతం ఒక్క సారిగా మారుమోగింది.

సరిగ్గా అక్కడికి వంద అడుగుల దూరంలో ఒక పక్కగా ఆగుంది విశాల కారు. ఫ్రంట్ సీట్లో కూచొని జరిగిందంతా చూస్తూనే ఉంది, కారు దిగలేదు. జరిగిన పరిణామానికి విరాట్ ఆశ్చర్యపోలేదు. కాని విశాల షాక్తో శిలాప్రతిమలాగయిపోయింది.

''కారు స్టార్ట్ చేసి వెనక్కి తిప్పు, మన కారును ఎవరూ గుర్తించకముందే ఇక్కడ్నుంచి వెళ్ళి పోవాలి. క్విక్.'' అంటూ విరాట్ హెచ్చరించటంతో షాక్ నుంచి బయటపడి కారు స్టార్ట్ చేసింది విశాల. క్షణంలో రివర్స్ తీసుకుని వేగంగా ఎగువకు పోనిచ్చింది. హత్య జరిగిన చంద్రా హోటల్ ప్రాంతానికి చుట్టు పక్కల వాళ్ళు పరుగులెత్తుకొచ్చేసరికి విశాల డ్రైవ్ చేస్తున్న కారు చాలా దూరం వెళ్ళిపోయింది.

''బావా. ధనగిరి ఇళంగోని చంపేస్తాడని ముందే తెలుసా?'' దారిలో అడిగింది విశాల ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ.

చిన్నగా నవ్వాడు విరాట్.

“తెలుసు. పంచతంత్రం అని మనకు నీతి కథలున్నాయి. అందులో ఒక తంత్రాన్ని ప్రయోగించాను. అది వర్కవుటయింది. మన చేతికి మట్టి అంటకుండానే ఇద్దరూ అయిపోయారు.” అన్నాడు.

“కాని ఇళంగో... పాపం చిన్న వయసు...” అంది విశాల.

‘అవును, వయసు చిన్నదే కాని సహస్రను చంపాలని వచ్చాడు. పాము చిన్నదయినా పెద్దదయినా పగ బట్టిందంటే ఎప్పటికయినా ప్రమాదమే. నిర్దాక్షిణ్యంగా చంపేయాలి.’ అన్నాడు విరాట్.

కారు వేగంగా ఓల్డ్ మాంబళం దిశగా దూసుకు పోతూనే వుంది.

************************************

కీల్పాక్కం!

పాత భవనం.

సమయం ఉదయం ఏడు గంటలు.

మబ్బులు పట్టిన ఆకాశంలో సూర్యుడింకా తొంగి చూడ్డం లేదు. వాతావరణం చలి చలిగా ఆహ్లాదంగా వుంది.

ఆ సమయంలో హడావిడిగా మేడ మీదకొచ్చాడు ఎట్టయప్ప. మనిషి కొంచెం గాబారాగా వున్నాడు. వాడు వచ్చే సరికి ఆరు బయట డంబుల్స్‌తో వ్యాయామం చేస్తున్నాడు త్యాగరాజన్ వంటి మీద పైజామా మాత్రం వుంది. షర్టు లేదు. విశాలమైన ఛాతీ, కండలు తిరిగిన దండాలు. చేస్తున్న వ్యాయామానికి శరీరం చెమటలతో తడిసింది.

ఎట్టయప్పను చూసి డంబుల్స్ కింద పెట్టాడు త్యాగరాజన్. తాడు పైనుంచి టవల్ అందుకొని చమటలు తుడుచుకొంటూ ముందు కొచ్చాడు. 'ఏంట్రా ఏదో షాక్లో వున్నట్టున్నావ్. పీడకల ఏదన్నా వచ్చిందా? ఏమైంది?' అనడిగాడు సీరియస్గా.

''ఇప్పుడే టివి వార్తలు చూసొస్తున్నాను సర్. ఘోరం జరిగింది. ధనగిరి రాత్రి చనిపోయాడు'' వచ్చిన విషయాన్ని బాధగా చెప్పాడు ఎట్టయప్ప.

నమ్మలేనట్టు చూస్తూ టవల్ భుజంమీద వేసుకున్నాడు జగన్మోహన్.

''నిజమా... వాడు చనిపోవటం ఏమిట్రా? ఎలా జరిగింది?'' అంటూ అడిగాడు.

''వాడే కాదు. ఇళంగో కూడా చనిపోయాడు. చంద్రా లాడ్జి బయట రాత్రి ఎప్పుడో రోడ్డు పక్కన గొడవ పడినట్టున్నారు. ఇళంగో డాగర్తో పొడవగా ధనగిరి రివాల్వర్తో షూట్ చేసాడు. అలా ఒకరినొకరు చంపుకున్నారు. టివిలో సంఘటనా స్థలాన్ని శవాల్ని చూపిస్తున్నారు. అరుపులు విని లాడ్జి సెంట్రీ అక్కడికొచ్చేసరికే వాళ్ళిద్దరూ చనిపోయారట. ఆ సమయంలో అక్కడికి కొంత దూరంలో ఒక కారు బయలుదేరి వెళ్ళిపోడం సెంట్రీ చూసాట్ట. కాని నంబరు తెలీదు. ఆ కారుకి ఈ హత్యలకి ఏదన్నా సంబంధం ఉందేమోనని పోలీసులు అనుమానిస్తున్నారట'' అంటూ టివిలో విన్న విషయాలు చెప్పాడు ఎట్టయప్ప.

ఆ విశేషాలు విని త్యాగరాజన్ ఏ మాత్రం ఆశ్చర్య పడలేదు. చిన్నగా నవ్వి... ''పోలీసుల అనుమానాలన్ని నిజం కావురా. ఏదో టైంలో ఏదో కారు బయలు దేరి పోతూనే ఉంటుంది. బట్టతలకి బొటన వేలికి ముడి వేస్తానంటే ఎక్కడో కార్లో వున్నవాళ్ళేం చేస్తారు? ఇంతకీ ధనగిరి మనుషులెంతమంది మిగిలారు. వాళ్ళేమయ్యారు?'' అనడిగాడు.

''ఇద్దరు వేరే గదిలో నిద్ర పోతున్నారట సర్. హత్యల గురించి తెలీగానే వాళ్ళిద్దరూ పోలీసులకు బయపడి తెల్లవారక ముందే గది వదిలి పారిపోయారట. వాళ్ళ గురించి కూడా పోలీసులు గాలిస్తున్నారట. ఈ రోజు టివి ఆన్ చేయగానే స్పెషల్ న్యూస్ యిదే'' అన్నాడు ఎట్టయప్ప.''కాని ఇది మనకు ఏమాత్రం ఉపయోగ పడే న్యూస్ కాదు. అవునా?'' అనడిగాడు త్యాగరాజన్.అవునన్నట్టు తలూపాడు ఎట్టయప్ప.

''సో... మనం ఎలాగూ ధనగిరిని వదులుకున్నాం. వేస్ట్ ఫెలోస్ ఛస్తే ఏంటి బతికితే ఏంటి! మర్చిపో. వాళ్ళ గురించి మర్చిపో. హర్యానా షూటర్స్ ఎల్లుండి ఉదయం దిగుతున్నారు. నీకు లోకల్ మనుషుల్ని వేరే ఏర్పాటు చేయటానికి కాస్సేపట్లో మనిషి

వస్తాడు. మీరు తొందరగా రెడీ అయితే వాడి వెంట వెళ్ళి ఆ పనులు చూడొచ్చు. గెట్ రెడీ. వెళ్ళు" అన్నాడు ఆర్డర్ వేస్తున్నట్టు.

గంగిరెద్దులా తలూపి వెళ్ళిపోయాడు ఎట్టయప్ప. వాడు వెళ్ళగానే టవల్ భుజాన వేసుకొని స్నానానికి వెళ్ళి పోయాడు త్యాగరాజన్.

*********************************

ఉదయం ఏడు గంటల సమయం.....

మునుసామి స్నానాదికాలు ముగించి తెల్ల లుంగీ షర్టు ధరించి పూజ కూడ ముగించుకొని నుదుట విభూది పూసుకున్నాడు. హాల్లోకొచ్చే సరికి కమ్మటి కాఫీ వాసన ముక్కు పుటాల్ని తాకింది. బండ శివ కిచెన్లో పనులు చూస్తున్నాడు. వాడికి తోడుగా చందూ కూడా అక్కడే వున్నాడు. ఇద్దరూ కూడా వంట వార్చటంలో మాస్టర్లు. ఇక వేరే చెప్పాలా.. అర్జంటుగా కాఫీ తాగే ఉద్దేశంతో కిచెన్ వైపు అడుగులు సారించాడు మునుసామి. దీక్ష సహస్రకు తోడుగా విశాల ఇంట్లోనే ఉంటోంది. ఇద్దరూ షాపింగ్ మాల్ జాబ్కి రిజైన్ చేసేసారు. విరాట్ లాంగ్ లీవ్లో ఉన్నాడు. చందూ మాత్రం ఆఫీస్కి వెళ్తున్నాడంతే. దీక్ష ఇంటికి కాపలా కోసం కదిరేశన్ కొందరు తన మనుషులతో ఇక్కడ ఉంటున్నాడు. మిగిలిన మనుసామి మనుషులు కదిరేశన్ మనుషులు అంతా లాడ్జిల్లోనే ఉంటూ వచ్చిపోతున్నారు.

మునుసామి కిచెన్ డోర్లో కాఫీ కోసం అడుగు పెట్టబోతుండగా కాలింగ్ బెల్ మోగింది. పొద్దుటే ఎవరొచ్చారో అర్థం కాలేదు. విసుక్కొంటునే వెళ్ళి డోర్ తెరిచాడు.

తలుపు తెరిచీ తెరవగానే పెద్ద షాక్.

ఎదురుగా ఆరడుగుల గంభీర రూపం, వెంకట రత్నం నాయుడు గారు నిలబడున్నారు. పక్కన ఆయన ధర్మపత్ని మంగ తాయారు. ఆ వెనకే పెద్ద కొడుకు విక్రాంత్ పక్కన భార్య ఇద్దరు పిల్లలు మెట్లెక్కి వస్తున్నారు. పోర్టికోలో రాజ హంసలా నిలబడుంది వారు వచ్చిన బెంజ్ కారు. డ్రయివరు డిక్కీ లోంచి సామాన్లు దించుతున్నాడు. సకుటుంబంగా వచ్చేసాడాయన.

తను చూస్తోంది కలో నిజమో అర్థం కాలేదు మునుసామికి. కళ్ళు నులుముకొని చూసాడు. సందేహం తీరిపోయింది. ''పెద్దయ్య గారు. మీరా!'' అన్నాడు తేరుకుంటూ.

'నేనేరా. ముందు లోనకు పద.'' అన్నాడు గంభీరంగా వెంకట రత్నం నాయుడు.

''నేనాగనుగదా. వెళ్ళి పోతున్నాను'' అంటూ వెనక డోర్ వైపు పరుగెత్తాడు మునుసామి.

''ఒరే ఆగరా'' అంటూ లోనకొచ్చేసాడు వెంకట రత్నం నాయుడు.

''ఆగను గాక ఆగను. ఎందుకాగాలి? ఒరే వెధవా నీకు చెప్పిందేమిటి చేసిందేమిటి? చినబాబును కాళ్ళు చేతులు కట్టి కోయంబత్తూరు తీసుకు రమ్మంటే వాడికి వత్తాసు పలుకుతూ ఉండి పోతావా.. నీ కాళ్ళు విరగ్గొడతాను. చేతులు విరిచేస్తానంటూ మీ చేత చీవాట్లు తినడానికా. నేనే తప్పు చేయలేదు. నే వెళ్ళిపోతాను'' పెద్దగా అరుస్తూ వెనక డోర్ దాటి బయటికెళ్ళి పోయాడు మునుసామి.

''ఆగుతావా లేదా నిజం గానే కాళ్ళు విరిచేస్తాను'' అంటూ తనూ వెనక డోర్ లోంచి మునుసామిని పెద్ద పెద్ద అంగలతో తరుముకెళ్ళాడు వెంకట రత్నం నాయుడు.

ఈ లోపల నవ్వుకొంటూ మిగిలిన కుటుంబ సభ్యులంతా లోనకొచ్చేసారు. కిచెన్ లోంచి గొంతు విని గబగబా బయటకొచ్చిన బండ శివా ''అమ్మ నమస్కారం రండి రండి.'' అంటూ అందర్నీ పలకరించాడు.

''అమ్మా ఇతని పేరు చందూ అని మన చిన బాబు ఫ్రెండు. ఉసిలం పట్టి గ్రామం...'' అంటూ చందూని పరిచయం చేస్తుంటే ''చందూ తెలీక పోడం ఏమిట్రా. ఏమయ్యా చందూ. నువ్వూ ఇక్కడే ఉంటున్నావా?'' అంది మంగ తాయారు.

''అవునమ్మా. విరాట్ తను పని చేసే ఆఫీస్ లోనే నాకూ ఉద్యోగం ఇప్పించాడు. రండి కూచోండి. పెద్దయ్య గారు మునుసామి గొడవ పడేట్టున్నారు చూసొస్తాను.'' అంటూ చందూ బయటకి పోతుంటే ఆపిందావిడ.

‘‘నువ్వేం కంగారు పడకయ్యా. వాళ్ళ గొడవ కొత్త కాదు చూస్తుండు’’ అంది. అలా లోన పలకరింపలు జరుగుతుండగా బయట... మునుసామి ఆగనంటే ఆగనంటూ వెంకట రత్నం నాయుడ్ని ఇంటి చుట్టూ తిప్పుతున్నాడు.

‘‘ఆ కొట్టేస్తాడండి... చిన్నప్పుడు రాళ్ళతో మామిడికాయలు కొట్టిన వయసనుకుంటున్నాడు. ఏదీ కొట్టు చూస్తాను’’ అంటూ నడక వేగం పెంచాడు మునుసామి.

‘‘ఈ బండ వెధవతో ఛస్తున్నా. ఇలా కాదు’’ అనుకుంటూ వెనక డోర్ లోంచి లోనకొచ్చేసి వీధి గుమ్మం దాటి అరుగు మీద కూర్చున్నాడు. అది గమనించని మునుసామి ఇంటిని చుట్టి వస్తూ దొరికిపోయాడు.

‘‘ఇదన్యాయం. దుర్మార్గం. నా వెనక రావలసిన మీరు ఇలా అడ్డ దారినొచ్చి పట్టుకోవడం నేనొప్పుకోను’’ అన్నాడు ఉడుక్కొంటూ మును సామి. ‘‘నోర్మూయ్యరా. పిచ్చి వేషాలు నువ్వూను’’ కసురుకున్నాడు వెంకట రత్నం నాయుడు.

‘‘అది కాదు పెద్దయ్య గారు....’’

‘‘చంపేస్తాను వెధవాని వెధవ మర్యాదలూ నువ్వూను. ఇక్కడుంది మనమేగా బయటి వాళ్ళేవరూ లేరుగా. మామూలుగా పిలుస్తావా రెండు తగిలించనా?’’

‘‘వద్దులేరా బాబు. నువ్వు కొట్టినా కొడతావ్. ఈ మయసులో మనం గొడవ పడ్డం చూసేవాళ్ళకు బాగుండదు. అయినా లేడికి లేచిందే ప్రయాణమన్నట్టు ఇలా చెప్పా పెట్టకుండా వచ్చేయటమేనా. ఫోన్ చేయొచ్చుగా’’ అంటూ అరుగు మీద కూచున్నాడు. ‘‘చెప్తే ఏం చేస్తావ్? బ్యాండు మేళంతో స్వాగతం పలుకుతావా. ముఖం చూడు. ఓ సిగరెట్ ఉంటే ఇలాపడెయ్’’ అంటూ వచ్చి పక్కన కూర్చున్నాడు. ‘‘ఏరా వదిన చేత నన్ను తిట్టిస్తే గాని నీకు మనశ్శాంతి ఉండదా? నేను సిగరెట్లు మానేసాను. లేవు’’ అన్నాడు మునుసామి.

‘‘ఒరే నువ్వు సిగరెట్లు మందు మానేసానంటే చీమలు తుమ్ముతాయి గాని ఇవ్వరా’’

“ఏంటి చీమలు కూడా తుమ్ముతాయా?”

“నువ్వు చూళ్ళేదా. సరిగా చూడు తుమ్మి ముందు కాళ్ళతో మూతి తుడుచుకుంటాయి. కాదంటే మనలా చప్పుడు రాదు”.

“సర్లే నావేమి నీలా ఏనుగుకాళ్ళు కాదుగాని సిగరెట్లు లేవు” అంతే.

“అరే ఇమ్మంటుంటే” అంటూ మునుసామి జేబులోంచి లాక్కుని సిగరెట్ ముట్టించుకున్నాడు వెంకట రత్నం నాయుడు.

“ఒరే! ఇక్కడున్న మూడు రోజులూ నాకు స్వాతంత్ర్యం వచ్చినట్టే. రోజుకి రెండు సిగరెట్లు రాత్రికి ఒక పెగ్గు మందు పర్మిషన్ తీసుకున్నాలే” గుండెల నిండా పొగ పీల్చి వదులుతూ చెప్పాడు వెంకట రత్నం నాయుడు.

“అంటే.... రాత్రికి మందు పార్టీ వుందా?”

“ఉంది. మూడేళ్ళ తర్వాత చిన్నోడ్ని చూడబోతున్న ఆనందం రా. ఎవరితో చెప్పక. రాత్రికి గప్ చిప్ గా బార్కెళ్ళొచ్చేద్దాం.”

ఉన్నట్టుండి లేచి పోబోయాడు మునుసామి.

భుజం పట్టి లాగి కూచోబెట్టాడు వెంకట రత్నం నాయుడు.

“ఎక్కడికిరా?” అనడిగాడు.

“ఏం లేదురా. నిజంగా నీకు సర్మిషనుందో లేదో ఓసారి వదిన్ని అడిగొస్తాను”.

‘‘ఏంటి నా మాట మీద నమ్మకం లేదా?’’

‘‘లేదా అంటే.... లేదంతే’’

‘‘ఇప్పుడు నువ్వు నా మాట నమ్మాల్సిందే’’

‘‘అది కాదురా బాబూ’’

‘‘ష్. నోర్ముసుక్కూర్చో. ఇంతకీ ఈ ఇల్లెవరిది? అద్దె కొంపా?’’

‘‘ఛ ఛ మీదేరా. చినబాబు ఎప్పుడో దీన్ని కొనేసాడు.’’

‘‘వాడు లోపలున్నాడా? ఆ అమ్మాయి... సహస్ర. తనెక్కడుంది?’’

‘‘ఇద్దరూ ప్రస్తుతం ఇక్కడ లేరు. ట్రీట్మెంట్ చేస్తున్న ఆస్పత్రికి దగ్గరగా వుంటుందని ప్రస్తుతం అక్కడే ఓ ఇంట్లో ఉంటున్నారు. మీరు కోయంబత్తూరు లో అర్ధరాత్రి ఎప్పుడు బయలుదేరారో. మీరు స్నానాలు చేసి కాఫీ, టిఫిన్లు ముగిస్తే అందరం విరాట్ వద్దకెళ్దాం. లోనకి పద’’ అంటూ లేచాడు మునుసామి. అంతే గాని పొరబాటున కూడా కాంచన మాల గురించో విశాల గురించో చిన్న మెత్తు కూడా చెప్పలేదు. వెంకట రత్నం నాయుడు సిగరెట్ పూది పారేసి మునుసామి వెంట లోనకు నడిచాడు. మునుసామి లోనకు రాగానే విక్రాంత్ పిల్లలిద్దరూ తాతయ్యా! అంటూ అతడి చంక ఎక్కేసారు. అంతా పలకరింపులు కుశల ప్రశ్నలు అయ్యాక ముందుగా కాఫీ తాగారు. వచ్చిన వాళ్ళకు విరాట్, చందూ గదుల్ని కేటాయించి లగేజి లోన పెట్టించాడు చందూ. వాళ్ళంతా లోనకెళ్ళగానే మునుసామి బయట కొచ్చి విరాట్ సెల్కి ఫోన్ చేసాడు.

‘‘చెప్పండి గురువుగారు. నేనే మీకు ఫోన్ చేద్దామనుకుంటున్నాను’’ అన్నాడు అటు నుంచి విరాట్.

‘‘దేనికి? మీ మమ్మీ డాడీ వచ్చినట్టు కలేమన్నా వచ్చిందా?’’ ఉత్సాహంగా అడిగాడు మునుసామి.

‘‘అదేం కాదు. రాత్రి సహస్రకి మరో గండం గడిచింది’’ అంటూ రాత్రి జరిగిన సంఘటన క్లుప్తంగా చెప్పాడు విరాట్. అది విని షాకయ్యాడు మునుసామి.‘‘లాభం లేదు చిన బాబూ అక్కడ కూడా మన వాళ్ళిద్దర్ని సెంట్రీలుగా వేద్దాం లేదంటే ఇలాంటి ప్రమాదాల్ని ఫేస్ చేయక తప్పదు’’ అన్నాడు. ‘‘నేనూ అదే ఆలోచిస్తున్నాను...’’ ‘‘సరిసరి నేవచ్చాక ఆలోచిద్దాం గాని ఇప్పుడు ఫోన్ చేయటానికి కారణం వుంది. ఇంత క్రితమే మమ్మి డాడి వచ్చారు. వెంట అన్నయ్య వదిన వాళ్ళ పిల్లలు అంతా దిగి పోయారు.’’ ‘‘నిజంగానా...’’ ‘‘కొంప దీసి అబద్ధం అనుకుంటున్నావా ఏంటి చినబాబు. నిజంగానే వచ్చారు. అంతా స్నానాలకి వెళ్ళారు. కాఫీ టిఫిన్లు ఇక్కడ జరిగి పోతాయనుకో. భోజనం ఏర్పాట్లు అక్కడా? ఇక్కడా? ఆ విషయం అడుగుదామనే ఫోన్ చేసాను.’’

‘‘భోజనాలకు ఇక్కడికొచ్చేయండి. ఆ ఏర్పాట్లు విశాల చూసుకుంటుంది. ఇంతకీ అసలు విషయం చెప్పేసావా? అత్తయ్య గురించి, విశాల గురించి...’’ ‘‘లేదు లేదు. చివరి క్షణం వరకు ఆ విషయం సస్పెన్స్‌లోనే ఉంచాలి. టిఫిన్లు తిని వాళ్ళు కాస్త విశ్రాంతి తీసుకున్నాక పన్నెండు గంటలకి అక్కడికొస్తాం’’. ‘‘అప్పటి దాకా ఎందుకు. పదకొండు ఆ ప్రాంతానికి వచ్చేయండి. మమ్మి నాకు ఫోన్ చేసినా అదే చెప్తాను.’’ ‘‘ఒకే చిన బాబు’’ అంటూ లైన్ కట్ చేసాడు మునుసామి.

**********************************

ఓల్డ్ మాంబళం`

ముదలియార్ స్ట్రీట్`

కాంచన మాల నివాసం.

ఉదయం కోయంబత్తూరు నుంచి అంతా బయలు దేరి వచ్చిన వార్త తెలిగానే అక్కడ హడావుడి మొదలైపోయింది. విందు భోజనాలకి చక చకా ఏర్పాట్లు చేయించింది విశాల.

తను ముందుగానే వాళ్ళ కంట పడకూడదన్న ఉద్దేశంతో విరాట్ సహస్ర వద్దే ఉండిపోయాడు. వెంకట రత్నం నాయుడు గారికి దీక్ష

తెలుసు. ముందుగా తనను గుర్తు పడతారని తనూ సహస్రతోనే ఉండి పోయింది దీక్ష. విశాల పెద్దగా ఆర్భాటం లేకుండా సింపుల్గా సాంప్రదాయ బద్ధంగా చక్కగా డిజైన్తో కూడిన చీర జాకెట్ ధరించి మెడలో సన్నటి బంగారు గొలుసును మాత్రం వేసుకుని బంధు వర్గం రాక కోసం ఎదురు చూస్తోంది.

హడావిడిలో బాగా నలిగి పోయింది మాత్రం తల్లి కాంచన మాల. ఓ ప్రక్కన చిర కాలం తర్వాత అన్న గారి కుటుంబాన్ని చూడబోతున్న ఆనందం, మరో పక్క తన ముఖాన్ని ఎలా చూపించాలన్న సంకోచంలో ఆవిడ ఉక్కిరి బిక్కిరవుతోంది. అంత వరకు బయట తిరిగినా, పదకొండున్నర గంటలకి వాళ్ళంతా బయలు దేరారని తెలిగానే తన గదిలోకి వెళ్ళి పోయి తలుపు దగ్గరగా మూసుకుంది.

సరిగ్గా పన్నెండు పది నిముషాలు కావస్తుండగా ముందుగా కారు గేట్లోకి తిరిగి నేరుగా పోర్టికోలో కొచ్చి ఆగింది. విశాల గబ గబా కారు వద్దకెళ్ళింది.

ఫ్రంట్ సీట్లోంచి ముందుగా ముని సామి ఆ వెనకే వెంకట రత్నం నాయుడు కారు దిగారు. వెనక సీట్లోంచి మంగ తాయారు, కోడలు నాలుగేళ్ళ బాబు రెండేళ్ళ పాప అంతా కారు దిగారు.

“నమస్తే మావయ్యా. రండి రండి’ అంటూ తనను ఆహ్వానిస్తున్న విశాలను అబ్బురంగా చూసాడు వెంకట రత్నం నాయుడు. తననే కాదు, రండి అత్తయ్యా రండి రండి!” అంటూ తన భార్య మంగ తాయారును, “రా అక్కా” అంటూ తన కోడల్ని ఎంతో తెలిసినట్టు కలివిడిగా చిరునవ్వుతో ఆహ్వానిస్తున్న అందమైన అమ్మాయి ఎవరో అర్థం గాక బుర్ర చించుకొంటున్నాడాయన. పైగా మునుసామిని చూస్తూ ` చిన మావయ్యా , పెద బావ వచ్చారన్నారు ఎక్కడా? అంటూ ఆరా తీస్తోంది.

“వస్తున్నాడమ్మా వెనకే వేన్లో చందూ వెంట వస్తున్నాడు” అంటూ బదులిచ్చాడు మునుసామి. ఇక సస్పెన్స్ భరించ లేక మునుసామిని పక్కకి లాకి` “ఏమిట్రా యిది. ఆస్పత్రి దగ్గర్లో అంటే అద్దె కొంపనుకున్నాను. చూస్తే ఇదేదో సొంత ఇంటిలా వుంది. పైగా



"లేదు లేదు. సహస్ర మేడమీద ఉంది"

"మరి ఈ అమ్మాయెవరు?"

"ఎవరేమిట్రా వరసయిన అమ్మాయి గాబట్టి వరసలు కలిపి ఆహ్వానిస్తోంది. తినబోతూ రుచి అడగటం ఏంటి కాళ్ళు కడుక్కొని లోనకు పద" అన్నాడు మునుసామి.

ఇంతలో వేన్ కూడా లోనకు రావటంతో చందూ వెంట విక్రాంత్ కూడా వేన్ దిగాడు. వాళ్ళని వరస కలిపి ఆహ్వానించింది విశాల.

స్వయంగా తనే అందరికీ కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళందించింది.

వచ్చిన వాళ్ళలో ఒక్క చందూ తప్ప`

అందరికీ విశాల ఒక సస్పెన్స్ అయిపోయింది.

"విరాట్ ఎక్కడ్రా?" అంటూ మునుసామిని అడిగాడు సోఫాలో కూచుంటూ వెంకటరత్నంనాయుడు.

"వస్తాడ్రా. వాళ్ళు ఇక్కడే ఉన్నారు. ముందు కాస్త రిలాక్సవండి" అన్నాడు మునుసామి. అంతా హాల్లో సోఫాలో సెటలయ్యారు. విశాల అందరికీ జ్యూస్ గ్లాసులు అందించింది.

"అమ్మా విశాల ఓ సారి రా తల్లీ" అంటూ ` అంతా జ్యూస్ తాగి స్థిమితపడ్డాక పిలిచాడు మునుసామి.

"చెప్పండి మావయ్య ఏంకావాలి?" అంటూ దగ్గర కొచ్చింది విశాల.

"మరేం వద్దుగాని ఒక్కనిముషం ఆగు. ఏరా సరిగా చూడు. ఈ అమ్మాయిని ఎప్పుడన్నా చూసిన గుర్తుందా?" వెంకటరత్నం నాయుడ్ని అడిగాడు.

"అదేగా ఆశ్చర్యంగా ఉంది. ఎప్పుడూ చూసిన గుర్తులేదే!" అన్నాడాయన.

"ఒకె. ఇక్కడ ఎగ్మోర్లో 'స్మైల్ రెడీ మేడ్స్' అని పెద్ద రెడీమేడ్ దుస్తుల కర్మాగారం ఒకటుంది. మూడువందల మంది పనిచేస్తారు. వారి దుస్తులు విదేశాలకీ ఎక్స్పోర్ట్ అవుతాయి. అక్కడ ఫ్యాషన్ డిజైనర్ కమ్ ఓనర్ విశాల... తెలుసా"

"అవును విన్నాను. మన లక్ష్మీమిల్స్ నుంచి కూడా వాళ్ళకి క్లాత్ మెటీరియల్ సప్లై అవుతుంది. మనకున్న పర్మనెంట్ కస్టమర్లలో

వాళ్ళు ఒకరు.      ఇంతకీ..."

"అక్కడికే వస్తున్నా. ఆ కంపెని ఓనర్ విశాల.... ఎవరో కాదు ఈ అమ్మాయే"

వెంకటరత్నం నాయుడికి ఆశ్చర్యంగా వుంది. అప్పటికీ విషయం అర్థం కాలేదు.

"సంతోషం కాని మమ్మల్ని వరసలు కలిపి పిలుస్తోందంటే మరేదో కారణం ఉంది. ఏమిటది?" అనడిగాడు.

"ఏమిటంటే ఆ కంపెనీ వ్యవస్థాపకుడు రంగనాథ చౌదరి అని మన కోయంబత్తూరు వాడే. ప్రస్తుతం ఆయన లేడు. సమీపకాలంలోనే గుండెపోటుతో మరణించాట్ట.ఈ అమ్మాయి ఆయన కూతురు..."

ఆయన మాటలు వింటున్న మంగతాయారు భర్త కన్నా ముందే చట్టున లేచి నిలబడుతూ` 'మరిదీ మునుసామి ఏమిటయ్యా నువ్వంటున్నది గనాథ చౌదరి కాలం చేసారా... ఈ అమ్మాయి ఆయన కూతురా... మరి మా ఆడబిడ్డ... కాంచన మాల.. కాంచనమాల ఎక్కడ?' అంది ఒక్కసారిగా గుడ్లనీరు నించుతూ.

అప్పటికి విషయం అర్థమై తనూ లేచి ఆశ్చర్యంగా విశాలను చూసాడు వెంకటరత్నంనాయుడు. చెల్లెలు కాంచనమాల గుర్తొచ్చింది. విశాల ఎవరోకాదు. తన మేనకోడలు. అందుకే వరసలు కలిపింది.

"చెప్పరా మునుసామి మా కాంచనమాల ఎక్కడ? చెప్పమ్మ విశాల నువ్వెవరో ఇప్పుడు కదా అర్థమైంది. అమ్మ ఎక్కడా? తనయినా క్షేమంగా ఉందా?" అంటూ బొంగురు పోయిన గొంతుతో ఆయన అడుగుతుంటే విశాలకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

మునుసామి చెమరించిన కళ్ళు తుడుచుకుంటూ లేచి అందర్నీ చూసాడు. "మీరేమి కంగారు పడకండి. తను క్షేమంగా ఇక్కడే వుంది. మూడు రోజుల క్రితం ఇక్కడికి వచ్చేవరకూ నాకూ వీళ్ళగురించి తెలీదు. ఇందులో మరో విశేషం ఏమంటే వీళ్ళెవరో తెలీకుండానే విరాట్కి ఈ కుటుంబంతో అనుబంధం ఏర్పడటం. నేను చెప్పేవరకు మన చినబాబుకి తెలీదు తను వున్నది స్వయాన మేనత్త ఇంట్లో అని విశాల తన మరదలని.

ఆ రోజు ఎక్కడో చెత్తకుప్పలో శవాల్లా తెలివి తప్పి పడున్న సహస్ర విరాట్లిద్దర్నీ చందూ సాయంతో ఎవరికీ తెలికుండా కార్లో తీసుకొచ్చింది విశాల. పక్కవీధిలోని తన స్నేహితురాలు డాక్టర్ గుణదీపిక చేత ఆపరేషన్ చేయించి కాపాడి తెచ్చి తన ఇంట్లో ఇద్దర్నీ ఉంచుకుంది విశాల'' అంటూ మునుసామి వివరిస్తుంటే మంగతాయారు విశాలను దగ్గరకు తీసుకుంది.

ఇంతకాలం బంధువర్గానికి దూరంగా వున్న విశాలకి ఇప్పుడు తమ వాళ్ళందర్నీ చూస్తుంటే దు:ఖం ఆగటంలేదు 'అత్తయ్యా' అంటూ మంగతాయారు కౌగిలించుకొని ఏడ్చేసింది. ఆమె కళ్ళు తుడిచి ఓదార్చింది మంగతాయారు.

''ఇంతకి చెల్లమ్మ ఎక్కడ్రా?'' ఇక సస్పెన్స్ భరించలేక ఆత్రంగా అడిగాడు వెంకటరత్నంనాయుడు.

''అదో మీకు ముఖం చూపించలేక తనలో తను కుమిలిపోతూ ఆగదిలో వుంది. వెళ్ళి పలకరించండి.'' అంటూ ఎదురుగా గదివైపు చూపించాడు మునుసామి.

అంతే...

ముందు వెంకటరత్నంనాయుడు ఆ వెనకే కుటుంబమంతా ఆగదిలోకి పరుగు తీసింది. అదే సమయంలో కళ్ళు తుడుచుకొంటూ విరాట్ కోసం మేడమీదకు పరుగు తీసింది విశాల.

''మనం కూడా లోనకెళ్దాం.పాపం అంతా దుఖ్ఖంలో వున్నారు'' అన్నాడు చందూ.

''పిచ్చోడా, ఆ దుఖ్ఖమంతా కాస్సేపేరా. నవ్వులతో అంతా బయటికొస్తారు చూడు'' అంటు తాపీగా కూచున్న చోటునుంచి కదలకుండా బదులిచ్చాడు మునుసామి.

అతడికి అనుబంధం నేర్పిన పాఠం. చిరకాలం తర్వాత కలుసుకున్న ఆనందలో అన్నా చెల్లెల్లు కాస్సేపు కౌగిలించుకొని ఏడుస్తారు. తర్వాత పరామర్శలు పరిచయాలు. సంతోషంతో కేరింతలు కొడతారు, నిజంగా ఈ రోజు వాళ్ళందరికీ సుదినం. పండగ రోజు.

వాళ్ళకేనా. తనకి కూడ. ఈ శుభసందర్భంలో రాత్రికి మందువేయాల్సిందే.

ఆలోచిస్తున్నాడు మునుసామి.

ఈ లోపల విరాట్ విశాల యిద్దరూ ముందు మెట్లు దిగివచ్చారు. ఆ వెనకే దీక్ష సాయంతో జాగ్రత్తగా తనూ కిందకొచ్చింది సహస్ర. గత సాయంకాలమే డాక్టర్ గుణదీపిక సహస్ర తలకి వేసిన బాండేజిలను తొలగించింది. కుట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేస్తూ తిరిగి గాయానికి డ్రస్సింగ్ చేసి తలవరకు చిన్న బాండేజి మాత్రం వేసి వదిలింది.

వాళ్ళంతా మెట్లు దిగిరావటం చూసి సోఫాలోంచి లేచాడు మునుసామి. ''ఏమిటీ తల్లీ నువ్వెందుకు దిగిరావటం. ఇంత నీరసంలో అవసరమా? మేమే వచ్చేవాళ్ళంగదా'' అన్నాడు సహస్రనుద్దేశించి.

''ఫరవాలేదు. అందర్నీ చూడాలనిపించింది'' అంది నవ్వుతూ సహస్ర.

ఇంతలో ముందుగా వెంకటరత్నంనాయుడు, ఆ వెనకే విక్రాంత్ కూతుర్ని చంకనేసుకుని కాంచనమాల తర్వాత మిగిలిన వాళ్ళు అంతా ఆనందంతో బయటకు రావటం చూసి మురిసిపోయారు.

''రా రా మిమ్మల్ని చూడాలని తనే కిందికొచ్చింది సహస్ర'' అంటూ మునుసామి సహస్రను వెంకటరత్నంనాయుడుకి మిగిలిన వారికి పరిచయం చేసాడు.

నేరుగా చూళ్ళేదుగాని సహస్రతో చాలా సార్లు ఫోన్లో మాట్లాడిరది మంగతాయారు. సింపుల్గా పసిడి బొమ్మలా మెరిసిపోతున్న సహస్రను చూసి అంతా సంతోషించారు.

''నీకు తెలుసో తెలీదో అమ్మాయ్. లహరిగా నీకు నేనూ ఫాన్నే. నువ్వు మాకోడలివి గావటం మాకు ఆనందంగా ఉంది.'' అన్నాడు వెంకటరత్నంనాయుడు.

‘‘థ్యాంక్యూ మావయ్యా. ఏయ్ విశాలా ఇలారావే!’’ అంటూ విశాలను దగ్గరకు పిలిచింది. వెంకటరత్నం నాయుడు మంగతాయారు దంపతుల్ని పక్కన నిలబడమని చెప్పి...

‘‘సాక్షాత్తు ఆది దంపతుల్లా వున్నారు. మమ్మల్ని ఆశీర్వదించండీ’’ అంటూ విశాలతో కలిసి ఇద్దరికీ పాదాభివందనం చేసింది.

వాళ్ళిద్దరూ ఇకే సారి దండంపెడుతుంటే అర్థంగాక అయోమయంగా ముఖముఖాలు చూసుకున్నారు నాయుడు దంపతులు.

సరి పెళ్ళికావలసిన యువతులు కాబట్టి యిద్దరూ ఆశీర్వాదం కోరుతున్నారు అనుకుని, వారి వినయానికి మురిసిపోతూ... ‘అభీష్ట సిద్ధిరస్తు’ అంటూ మంగతాయారు, శ్రీఘ్రమేవ కళ్యాణప్రాప్తిరస్తు’ అంటూ వెంకటరత్నంనాయడు యువతులిద్దర్నీ దీవించేసారు.

‘‘ఇదిగో అమ్మాయ్ సహస్ర. నువ్వు మాకు తెగనచ్చావమ్మా. మా పాత గొడవలు మరే కారణాలయినా మనసులో పెట్టుకుని మీ డాడీ మహాదేవనాయకర్ కాదన్నా నువ్వే మా కోడలివి.’’ అంటూ ఆనందంతో భరోసా ఇచ్చేసాడు వెంకటరత్నంనాయుడు.

‘‘అయ్యో మావయ్యా. మీకింకా తెలీదా? మా డాడీ అభ్యంతరం ఏమీ లేదు. మావ అల్లుడూ రోజూ ఫోన్లో మాట్లాడుకుంటున్నారు. మీ అబ్బాయి నడగండి’’ అంటూ సహస్ర అసలు విషయం చెప్పగానే అంతా నవ్వుకున్నారు.

‘‘ఇంతకీ ఎక్కడ్రా వీడు? చిన్నోడా?’’ అంటూ చుట్టూ చూస్తూ తండ్రి పిలవగానే అప్పుడు ముందుకొచ్చాడు విరాట్.

చాలా కాలంతర్వాత చిన్నకొడుకును చూసిన ఆనందలో కాస్సేపు ఉక్కిరిబిక్కిరయ్యాడు వెంకటరత్నంనాయుడు. ఎడం చేతి గాయానికి వేసిన బాండేజ్ను తడిమి చూసాడు. ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు.

‘‘సారీ డాడీ.. మిమ్మల్ని చాలా బాధపెట్టాను’’ అన్నాడు విరాట్.

‘‘లేదు పిల్లల మనసు తెలిసీ పట్టుదలకు పోవటం పెద్దల తప్పే. నేనే పొరపాటు చేసాను. కోపం పోయిందిగా? మేనకోడలు సాగరికను కాదన్నా, ఆణిముత్యంలాంటి సహస్రను కోడలిగా తెస్తున్నావ్. నీ మీద నా కిప్పుడు కోపం లేదు. అక్కకి ఎలాగో నచ్చచెప్తాలే.

ఇవేమి మనసులో పెట్టుకోకు. ఆ త్యాగరాజన్ ఓ గుంటనక్క. సహస్రను కాపాడి వాడ్ని కటకటాల వెనక్కి నెట్టే వరకు విశ్రమించకు. మీ వెనక మేం వున్నాం. విజయం మీదే. ఈలోపల సాగరికతో బాటు మన విశాలకీ మంచి సంబంధం చూస్తే మీ మూడు జంటలకీ ఒకేసారి వైభవంగా పెళ్ళి జరిపించేస్తాం'' అన్నాడు.

ఆమాట, ముఖ్యంగా చివరి మాటలు వినగానే అంతా సైలెంట్ అయిపోయారు. ఎందుకంటే అసలు విషయం అటుకాంచనమాలకీ తెలుసు ఇటు మునుసామి మిగిలిన వాళ్ళకీ తెలుసు. విశాల విరాట్ని ఇష్టపడుతున్న విషయాన్ని ఇప్పుడే చెప్పటం ఇష్టంలేక చందూ దీక్షలతో బాటు అంతా మౌనం వహించారు. కాని మునుసామి సుచాయగానయినా ముందే హింట్ యివ్వటం మంచిదనుకుంటూ... ''ఒరే. నువ్వప్పుడే పెళ్ళిళ్ళవరకు వెళ్ళమాకు. సాగరికకు సంబంధం చూస్తునన్నావ్ ఒకే. విశాల విషయంలో ఆ అవసరం లేదు. తనూ ఓ అబ్బాయిని లవ్ చేసిందట. సమయం వచ్చినప్పుడు చెప్తానంటోంది. కాబట్టి ఆ విషయం వదిలెయ్'' అంటూ సూచించాడు.

''అలాగా అయితే మంచిదేగా ఈ కాలం పిల్లలు తప్పు చేయరని తమ పార్టనర్స్ని ఎంచుకోవటంలో పొరపాటు పడరనీ నాకు అర్థమైంది. ఒకే అవునూ ఇలారా అమ్మాయ్. నిన్నెక్కడో చూసినట్టుంది. నువ్వు  మాఫ్రండు మధురై మాసిలామణి కుతూరు దీక్షవికదూ?'' అంటూ దగ్గరకు పిలిచాడు.

''అవునంకుల్ గుర్తుపట్టారు'' అంటూ వినయంగా వచ్చి దంపతుల పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకుంది దీక్ష.

''ఒరే. ఈ అమ్మాయికీ సంబంధాలు చూద్దాం అనకు. ఎందుకంటే ఆల్రెడీ మన చందూతో లవ్ అయిపోయి పెళ్ళికి ఎదురు చూస్తున్నారు. తన అన్నలెలాగు పట్టించుకోరు. వీళ్ళ పెళ్ళికూడా మనమే దగ్గరుండి జరిపించాలి.'' అని మునుసామి అంటుంటే అంతా నవ్వుకున్నారు.

అంతా స్థిమితంగా కూచుని కబుర్లు చెప్పుకుంటున్న సమయానికి కదిరేశన్ వేన్లోనకొచ్చింది. అందులోంచి కదిరేశన్ వెంట బండశివా, ధర్మ మరో ముగ్గురు విరాట్ ఫ్రండ్సు అంతా దిగారు.

తిరిగి ధర్మతో అందరికీ పరిచయాలు పరామార్శలు. సహస్రను వాళ్ళు ఇప్పుడే చూడ్డం.

ఆ తర్వాత విందు భోజనాలు మొదలయ్యాయి. కాంచనమాలకి బంధువులరాకతో చాలా ఆనందంగా వుంది. సమీపకాలంలో

తల్లిని ఇంత సంతోషంగా ఎప్పుడూ చూళ్ళేదు విశాల. ఇక వెంటరత్నంనాయుడు గార్ని ఒక సందేహం బలంగా పీడిరచటం ఆరంభించింది.

''కాంచనమాలను విశాల మమ్మీ అని పిలుస్తోంది. సహస్ర మమ్మీ అంటుంది. విరాట్ని కూడా విశాల బావా అనటంలో అర్థం వుంది. కాని సహస్ర కూడా బావా అనే పిలుస్తోంది. అంతే కాదు. భోజనాలప్పుడు ముచ్చట్లాడుతున్నప్పుడు కూడా బావా బావా అంటూ రాజుకుపూసుకు తిరుగుతోంది విశాల. కొంపదీసి సహస్రతో బాటు విశాల కూడా విరాట్ను ప్రేమించటం లేదుకదా! ఆల్రెడీ ఎవరో ` అబ్బాయిని లవ్ చేస్తోందని మునుసామి చెప్పనే చెప్పాడు. ఆ అబ్బాయి విరాట్ కాదుగదా? వూహ ఈ సస్పెన్స్ తెలియాలంటే మునుసామి పిలక పుచ్చుకుంటే గాని తెలిదు. వీడిసంగతి రాత్రికి చెప్తా'' అనుకున్నాడు వెంకటరత్నంనాయుడు.

రాత్రంతా కారు ప్రయాణంలో అలసిపోయి వున్నారు గాబట్టి కిందగదుల్లోనే ఓ గదిలో వెంకటరత్నంనాయుడు మరో గదిలో భార్య, కోడలు పిల్లలు అంతా నిద్రకుపక్రమించగా దీక్ష విశాల సహస్ర ముగ్గురూ కాంచనమాల గదిలో చేరిపోయారు.

మేడమీద విరాట్ గదిలో మిగిలిన వాళ్ళు సమావేశమయ్యారు. విశ్రాంతి సంగతి కూడా మర్చిపోయి తమ్ముడు విరాట్ వెంట వచ్చి తనూ ఆ సమావేశంలో కూచున్నాడు విక్రాంత్.

ధర్మ, మునుసామి, కదిరేశన్, ఇంకా మిగిలిన వాళ్ళు అంతా ఈ రోజువరకు సహస్ర విషయంలో జరిగిన సంఘటనల్ని విరాట్తో ఓ సారి కూలంకషంగా సమీక్షించుకున్నారు.

ఇప్పటికే త్యాగరాజన్ కేసును మధురై నుండి చెన్నై కోర్టుకు బదిలీ చేయమని కారణాలు వివరించి అర్థిస్తూ సహస్ర సుప్రీంకోర్టు ధర్మాసనానికి లెటర్ వ్రాయటం జరిగింది కాబట్టి ఖచ్చితంగా సహస్ర సైదాపేట సెషన్స్ కోర్టుకి హాజరుకావలసి ఉంటుంది. అంత వరకు సహస్రను వేయికళ్ళతో శతృకంటపడకుండా రక్షించుకోవాలి.

త్యాగరాజన్ కూడా చెన్నైలోనే ఉన్నాడు. ఏదో విధంగా ఈలోపల లేదా కోర్టుబయట సహస్రను తుదముట్టించే పథకరచనలో ఉంటాడు. కాబట్టి ఒకనిర్దిష్టమైన ప్లాన్తో సహస్ర రక్షణకు తామంతా చర్యలు తీసుకోవాలి.

తన మనుషుల్ని ఆరుగుర్ని విశాల యింటి వద్ద నిరంతర కాపలాకి ఏర్పాటు చేసాడు కదిరేశన్. పగలు రాత్రి ఇద్దరిద్దరుగా ఇరవై నాలుగ్గంటలూ పటిష్టంగా కాపలా ఉంటారు.

తన మనుషుల్ని అటు గోస్వామి కాలనీలోను ఇటు ఓల్డ్ మాంబళంలోను మొహరించి అనుమానితుల్ని పసిగట్టి తగిన చర్యతీసుకునేలా ఏర్పాటు చేస్తానన్నాడు మునుసామి. ఇక ధర్మ తన మిత్ర బృంధంతో లాడ్జిమీద నిఘా వుంచి త్యాగరాజన్ మనుషుల జాడ తెలుసుకునే ఏర్పాటు చేస్తానన్నాడు.

చాలాసేపు వాళ్ళ చర్చలు వ్యూహాలు వింటూ మౌనంగా కూచున్నాడు విక్రాంత్. ఉన్నట్టుండి అసహనంగా అటూయిటూ కదిలి తమ్ముడు విరాట్ వంక విసుగ్గా చూసాడు.

“ఏరా! మీ మాటలు వింటుంటే ఎంతసేపూ ఏటి వాలుకు కొట్టుకుపోయే ధోరణి కన్పిస్తోంది గాని ఏటికెదురీది త్వరగా ఒడ్డుకి చేరాలన్న ఆలోచనే వున్నట్టులేదే” అన్నాడు.

ఆ మాటలతో ఒక్కసారిగా అందరిదృష్టి విక్రాంత్ వైపు మళ్ళింది. అతడి ఉద్దేశం తెలీక ముఖముఖాలు చూసుకున్నారు.

“ఏంటన్నయ్యా, ఏమంటున్నావ్” అనడిగాడు విరాట్.

“అవును పెదబాబు ని అభిప్రాయం ఏమిటో వివరంగా చెప్తే గదా మాకూ అర్థమవుతుంది” అన్నాడు మునుసామి.

“మీరంతా సహస్ర రక్షణకి తగిన ఏర్పాట్లు చేయటం మంచిదే”

“ఇక్కడ రెండు ముఖ్య విషయాల్ని మీరు పట్టించుకోడం లేదు. గట్టు తెగి వరదనీరు ముంచెత్తాక తీసుకునే జాగ్రత్తల కన్నా అసలాగట్టు తెగకుండా ముందే పటిష్టమైన చర్యలు తీసుకోవటం తెలివైన పని. ఇది నా అభిప్రాయం.

మీరు పట్టించుకోని మొదట విషయం త్యాగరాజన్ కుడి భుజం ఎట్టయప్ప. వాడు మధురైలో లేడని ఓపక్క ధర్మ చెప్తూనే ఉన్నాడు. అల్లర్ల తర్వాత వాడక్కడ కన్పించటం లేదంటే అర్థం ఏమిటి? వాడు కూడా మరికొందర్ని తీసుకొని చెన్నై వచ్చేసాడని అర్థం. వాడ్ని ట్రేసవుట్ చేసి వాళ్ళకదలికల్ని ముందే గమనించటం తెలివైన పని.

ఇక మీరు వదిలేసిన రెండవ విషయం త్యాగరాజన్ ్. వాడు ఇక్కడే ఉన్నాడని తెలుసుగదా. ఎక్కడున్నాడు ఏం చేస్తున్నాడు సహస్ర విషయంలో వాళ్ళ వ్యూహం ఏమిటి? అది తెలియాలి. కాని వాళ్ళు అటాక్ చేస్తే తిప్పి కొట్టడం గురించి మాత్రమే మీరు ఆలోచిస్తున్నారు. అసలు వాళ్ళ వ్యూహం ఏమిటో ముందే తెలుసుకుంటే వాళ్ళని దెబ్బకొట్టడం సులువనేది నా అభిప్రాయం.

చెన్నైలో కూడా త్యాగరాజన్ ్కి చాలా ఇళ్ళున్నాయని విన్నాను. కాని కాపురం ఉండేది మాత్రం ఆర్కె నగర్లోని కలైంజర్ స్ట్రీట్లోని ఇంట్లో.కాని ఇప్పుడున్న పరిస్థితుల్లో వాడాయింట్లో ఉంటాడని అనుకోను. మధురై పరిస్థితులమీద పోలీసులు వచ్చి ప్రశ్నించవచ్చు లేదా మీడియావాళ్ళు వెంట పడొచ్చు. కాబట్టి మరోచోట ఎక్కడో వుంటూ ఏదో టైంలో ఇంటికి వచ్చి పోతుంటాడు. అలాగే ఎట్టయ్యప్ప వాడి మనుషులు కూడా సిటీలోని లాడ్జిల్లో దిగరు. అక్కడ వెదికినందువల్ల ప్రయోజనం ఉండదు. వాళ్ళు కూడా త్యాగరాజన్కి చెందిన ఏదో ఇంట్లోప్రస్తుతం షెల్టర్ తీసుకునుంటారు.

కాబట్టి మన ధర్మ మిగిలిన ఫ్రెండ్స్ స్థానికులుగాబట్టి ఎట్టయప్పను వాడిమనుషుల్ని సులువుగా గుర్తించగలరు. జగన్మోహన్ ఇంటి సమీపాల్లో కూచుంటే జగన్మోహన్ గాని వాడి మనుషులుగాని దొరక్కపోరు. వాళ్ళని ఫాలో చేస్తే ఎక్కడ ఉండేది తెలిసిపోతుంది. ఆ తర్వాత వీలుచూసి ఎట్టయ్యప్ప మనుషుల్లో ఏ ఒక్కడ్ని పట్టితెచ్చినా వాళ్ళ ప్లాన్స్ ్ ఏమిటో మనకి తెలిసిపోతాయి. ఇలా చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం. తర్వాత మీ యిష్టం'' అన్నాడు విక్రాంత్

అన్నగారి మాటలకి విరాట్ ముగ్ధుడైపోయాడు. ఆ ఆలోచనలు అందరికీ ఆమోదయోగ్యంగా వున్నాయి.

''ఓ మైగాడ్ అన్నయ్యా డాడీ లాగే నువ్వు పక్కా బిజినెస్మేన్వి అనుకున్నాను. నీలోకూడా ఇంత లౌక్యం, ఆలోచన ఉన్నాయనుకోలేదు. థ్యాక్సన్నయ్య'' అన్నాడు అభినందిస్తూ.

విక్రాంత్ నవ్వాడు.

''ఏరా! వ్యాపారంలో శత్రువులుండరనుకుంటున్నావా? అక్కడే ఎత్తుకు పైఎత్తులు వేసి శత్రువుల్ని కిందకి తొక్కకపోతే మనం పైకి రాలేం. లౌకిక విషయాలకీ అదే సూత్రం వర్తిస్తుంది. వ్యవహారాన్ని జాగ్రత్తగా డీల్ చేయండి. మీరెక్కడున్నారో ఆ త్యాగరాజన్కి తెలిసేలోపు వాడెక్కడున్నాడో తెలిసి ఉంచుకోవటం చాలా అవసరం. నాకునిద్రొస్తోంది'' అంటూ చెప్పాల్సింది చెప్పి విరాట్ బెడ్మీదే పడుకున్నాడు విక్రాంత్.

త్యాగరాజన్ ఎట్టయప్పల జాడతీసే బాధ్యతను తనుతీసుకుని ధర్మ మిగిలిన వాళ్ళతో అక్కడినుండి బయలు దేరాడు. కదిరేశన్తోబాటు వాళ్ళంతా వెళ్ళిపోగానే విరాట్ అన్న విక్రాంత్ పక్కనే పడుకున్నాడు. మునుసామి పక్కన సోఫాలో నడుంవాల్చాడు. కాస్సేపటికి విశాల వచ్చి ఆ గదిలోకి తొంగిచూసే సరికి వాళ్ళంతా గాఢనిద్రలో వున్నారు. అప్పటికి సాయంకాలం మూడు గంటలు సమయం.

I I I

రాత్రి ఎడుగంటలు.....

గోస్వామి కాలనీ.....

వెంకటరత్నం నాయుడు మునుసామి యిద్దరూ విరాట్ గదిలో ప్రశాంతంగా కూచుని విస్కీ బాటిల్ ఓపెన్ చేసారు. సాయంత్రం అయిదు గంటలకి నిద్రలేవగానే స్నానాదికాలు ముగించి మునుసామిని తీసుకుని వచ్చేసాదు వెంకటరత్నంనాయుడు.

"ఏదో అడగాలన్నావ్! ఏమిట్రా?" ఒక పెగ్గులాగించేసాక అడిగాడు మునుసామి.

"ఏం లేదుగాని..."

"ఇంత క్రితం ఏదో ఉందన్నావ్గా..."

"ఉంది ఇంతకాలానికి చెల్లెమ్మను కలుసుకోవటం చాలా ఆనందంగా ఉంది. విశాల... నా మేనకోడలు. అందంగా వుంది. తెలివైనది. తండ్రి స్థాపించి వెళ్ళిపోయిన సంస్థని ఇంత ఉన్నత స్థితికి తెచ్చింది. సాగరికను కాదంటే సరే, కనీసం విశాలనన్నా మనోడు పెళ్ళిచేకుంటే బంధుత్వం కలిసేది. కాని వీడేమిట్రా, సహస్రని ప్రేమించాడు. నాకేమీ అర్థం గావటం లేదు."

మునుసామి వెంకటరత్నంనాయుడి డొటేమిటో గ్రహించాడు. సూటిగా అడక్కుండా విషయాన్ని చుట్టు తిప్పి తీసుకొచ్చి తన చేతే నిజం చెప్పించాలని చూస్తున్నాడు. కాని తను చెప్పడుగా.

ఇంత అందమైన అమ్మాయి మమ్మల్ని ఆహ్వానిస్తోంది. వరసలు కలిపి పిలుస్తోంది. ఏమిటిదంతా.. సహస్ర ఈ అమ్మాయేనా?" అడిగాడు.



"ఇంకా ఏమర్థం కావాల్రా నీకు? విరాట్ సహస్రలు ప్రేమించు కున్నారు. ఉన్న సమస్యలనుంచి వాళ్ళు బయట పడగానే పెళ్ళి చేసుకుంటారు. మనం నాలుగక్షింతలు వేసి దీవించేస్తే ఓ పనైపోతుంది. అంతేగా" అన్నాడు తేలిగ్గా నవ్వేస్తూ.

“అంతేనా?”

“అంతకు మించి ఏముంది?”

“ఉంది. నీకంతా తెలుసు. చెప్పరా. విశాల ప్రేమించిన అబ్బాయి ఎవరు?”

“ఈ మాట నీ మేనకోడల్ని అడగాలి. నన్ను అడిగితే నాకేంతెలుసు?”

“నీకు తెలుసు... చెప్పాలి.”

“నాకు తెలీదురా బాబు. చెప్పనంటోంది.”

“విరాట్ ఎవరో తెలిక ముందే ఆ ఇంటింతో అనుబంధం వుందని చెప్పింది నువ్వేకదా?”

“అయితే?”

“ఆ అనుబంధం ఎలా ఏర్పడిరదో చెప్పు”

“ఒరే... ఇన్ని ప్రశ్నలెందుగ్గాని అసలు నీ సందేహాలేమిటో నీ మనసులో ఏముంది అడిగెయ్. నాకు తెలిస్తే చెప్పేస్తాను.”

“వచ్చినప్పట్నుంచి చూస్తున్నాను ‘బావా బావా’ అంటూ మన విరాట్తో రాసుకు పూసుకు తిరుగుతోంది విశాల. పరాయివాడెవడ్నో తను ప్రేమించి ఉంటే ఎంత సొంత బావయినా విశాల అంత చనువుగా వుండగలదా? ఇది డౌట్ నంబర్ వన్.

సహస్ర తనే మాకు పాదాభివంతనం చేసి ఆశీర్వదాలు తీసుకోవచ్చు. కాని విశాలను కూడా పిలిచి ఇద్దరూ ఒకేసారి దండం పెట్టి ఆశీస్సులు పొందారు. ఎందుచేత? ఇది డౌడ్ నెంబర్ టు.

ఇక సొంత తల్లిగాబట్టి విశాల మన చెల్లెమ్మను అమ్మాని పిలిస్తే అర్థం వుంది. కాని విశాలతో బాటు సహస్ర కూడా అమ్మ అంటోంది ఎందుకని? ఇది డౌట్ నెంబర్ త్రీ...''

అంతా వింటున్న మునుసామి ఇంకా ఆయన్ని ఇబ్బంది పెట్టలేక ఫక్కున నవ్వేసాడు. ''ఒరే నీ డౌట్స్ అన్నీ కలిపి చెత్త బుట్టలో పడేయరా. ముందే ఈ విషయాలు చెప్పేస్తే మీరు కంగారుపడతారని చెప్పలేదంతే నీకు డౌట్ వద్దు. విశాల ప్రేమించిన కుర్రాడు ఎవరోకాదు. మన విరాటే.'' అంటూ అసలు విషయం బయటపెట్టేసాడు.

ఆ మాటవింటూనే...

తెరిచిన నోరు మూయటం మర్చిపోయి...

అలా చూస్తుండిపోయాడు వెంకటరత్నంనాయుడు.

''ఏంట్రా? షాకయ్యావా?.. ఇదికూడా లాగించేసి కాస్తరిలాక్సవు'' అని నవ్వుతూ తిరిగి చెరోపెగ్గు విస్కీకలిపాడు మునుసామి.

''అంటే.. ఈ విషయం విరాట్కి తెలుసా?'' తిరిగి గ్లాసులు ఖాళీ అయ్యాక షాక్ నుంచి తేరుకుంటూ అడిగాడు వెంకటరత్నంనాయుడు.

''తెలుసు'' అన్నాడు మునుసామి.

''సహస్రకి తెలుసా?''

“సహస్రకి తెలుసు. చెల్లెమ్మ కాంచనమాలకీ తెలుసు. మా అందరికీ తెలుసు. అమ్మాయిలిద్దరూ మన చినబాబుని ప్రేమిస్తున్నారని”

“ఈ విషయం మహాదేవనాయకర్కి తెలుసా?”

“ఆ విషయం నాకు తెలీదు. నువ్వు మరీ ఆశ్చర్యపోమాకు. అసలు ఏం జరిగిందో చెప్తేగాని ఈ సస్పెన్స్ నీకు అర్థంగాదు. అటు సహస్ర యిటు విశాల యిద్దరూ ఒకేరోజు కాస్త అటు యిటుగా మన చినబాబుని చూసి లవ్లో పడ్డం జరిగింది. కాని మన చినబాబు ముందుగా ప్రేమించింది మాత్రం సహస్రనే. న్యూస్ పేపర్లో ప్రకటనిచ్చింది తెలుసుగా. అది చూసాకేగా నువ్వు మమ్మల్ని చెన్నై పంపించింది” అంటూ మునుసామి జరిగిందంతా వివరిస్తుంటే వెంకటరత్నంనాయుడు నమ్మలేక పోయాడు. కాని ఇది నమ్మాల్సిన నిజం.

“మీరంతా ఆశ్చర్యపోతారని నాకు తెలుసు. కాని అలా జరిగిపోయిందంతే. విశాల తన మంచి తనంతో స్వచ్ఛమైన ప్రేమతో విరాట్ మనసునే కాదు. సహస్ర మనుసును జయించింది.

ఇపుడు విశాలకి సహస్ర విరాట్లు ప్రాణమైతే సహస్రకి విశాల విరాట్లు ప్రాణం. ఇక విరాట్కయితే వాళ్ళిద్దరూ రెండు కళ్ళు. ఏ కంటినీ ఒదులుకోలేడు. ఆ విషయం గ్రహించే చెల్లెమ్మ కాంచనమాల కూడా వాళ్ళకి అడ్డుచెప్పకపోగా సహస్రనీ తన కూతురులాగే అంతప్రేమగానూ చూసుకుంటోంది. ఇక ఫైనల్గా నేను చెప్పొచ్చేదేమంటే ఇది వాళ్ళ ముగ్గురి సమస్యగాబట్టి వాళ్ళే పరిష్కరించుకుంటారు. మనం పట్టించుకోవాల్సిన పనిలేదు” అంటూ ముగించాడు.

“కాని మహాదేవనాకర్కి పట్టింపు ఉంటుంది. విషయం తెలిసాక ఎలా స్పందిస్తాడో ఏమిటో” అన్నాడు వెంకటరత్నంనాయుడు.

“కూతురు ఇష్టపడ్డాక అయనేం చేస్తాడ్రా నీ పిచ్చిగాని, ఇక ఆ విషయాలు వదిలెయ్” అన్నాడు మునుసామి.

సుమారు రాత్రి ఎనిమిది గంటల సమయంలో వెంకటరత్నంనాయుడ్ని కార్లో ఓల్డ్ మాంబళం పంపించేసి లోనకొచ్చాడు మునుసామి.“అన్నా నాదో డౌటన్నా” అన్నాడు బండశివా ఎదురొస్తూ.

‘‘ఏంటో అడుగు’’ అంటూ సోఫాలో కూచున్నాడు మునుసామి.

‘‘ఏం లేదన్నా. రామావతారం కృష్ణావతారం ఈ రెండు అవతాలెత్తిందీ ఆ శ్రీహరేగదా?’’ దగ్గరకొచ్చి నిలబడుతూ అడిగాడు బండశివా.

‘‘ఓర్నీ ఇదా నీ డౌట్? ఆయన అవతారమూర్తిరా రెండేమిటి? దశావతారాలూ ఆయనేగదా’’ అన్నాడు మునుసామి.

‘‘కాని.. నా కర్థంగానిదీ రెండవతారాలేనన్నా’’ అన్నాడు బుర్రగోక్కుంటూ బండశివా.

కాస్త విసుగ్గా చూసాడు మునుసామి.

‘‘ఏరా ఈ టైంలో అడగాల్సిన ప్రశ్నరాయిది? బండ వెధవ. రామాయణం భారతం కథలు వినలేదా సినిమాలు చూళ్ళేదా? ఇంకా ఏమర్థంకావాల్రానీకు?’’ అని కసురుకున్నాడు.

‘‘కోప్పడకన్నా. తెలీకేగా అడిగాను? రామావతారం ఎత్తి సీతమ్మను పెళ్ళాడి ఒకే పెళ్ళాం ఒకటే బాణమంటూ ఆదర్శ మూర్తి అయ్యాడు రాముడు. మరి కృష్ణావతారం వచ్చేసరికి అదే శ్రీహరి ఒకటేమిటి ఏకంగా ఎనిమిదిమందిని పెళ్ళాడాడు. చిన్నప్పుడే చిన్న చిన్న దొంగతనాలు చేసాడు. అబద్ధాలాడాడు, అల్లరి చిల్లరగా తిరిగాడు. అయినా కూడ మనం రాముడ్ని కొలుస్తున్నాం. కృష్ణుడ్ని పూజిస్తున్నాం. మరి మనం ఆదర్శంగా రాముల వార్ని తీసుకోవాలా కృష్ణుడ్ని తీసుకోవాల?’’

‘‘ఏ విషయంలో ఆదర్శం? పెళ్ళి విషయంలోనా?’’

‘‘అవును’’

‘‘మన చినబాబు సహస్ర విశాల యిద్దర్నీ లవ్ చేయటంతో నీకీ డౌట్ వచ్చిందా?’’

‘‘అవునన్నా’’

‘‘ఓరి పిచ్చోడా లోకంలో ఇద్దరు పెళ్ళాల మొగుళ్ళు లేరనుకుంటున్నావా ఏంటి?’’

‘‘అంటే అన్నా. ఇపుడు ఎవరయినా రెండు, మూడు, నాలుగు పెళ్ళిళ్ళు చేసేసుకోవచ్చా? చట్టం ఒకర్ని మించి చేసుకో కూడదంటుంది గదా’’‘‘ఎవరూ అభ్యంతరం చెప్పనంతవరకే, చెప్తే విలుకాదు’’‘‘మరి శ్రీహరి అవతారాల లక్ష్యం ధర్మసంస్థాపనే గదన్నా. అలాంటప్పుడు ఈ అవతారాలకు భిన్న స్వభావాలెందుకు?’’

‘‘ఓరీ నాయనో. నీ ప్రశ్న వింటుంటే నాకు తాగింది దిగిపోయేలా వుందిరా బండవెధవాని. దేశకాల పరిస్థితుల్ని బట్టి న్యాయధర్మాలు ఆచార వ్యవహారాలు మారిపోతుంటాయని పెద్దల మాట వినలేదా?’’

ఇపుడు రామాయణాన్నే తీసుకుందాం. శ్రీరామచంద్రుడు చేసిన ధర్మ సంస్థాపన ఏమిటి? నిశితంగా పరిశీలిస్తే నీకేం కన్పించదు. ఆయన చేసిందంతా రాక్షస సంహారం. ధర్మసంస్థాపన చేసింది రామావతారానికి కాస్త ముందుగా వచ్చిన పరశురామావతారం. దుష్టులైన క్షత్రియ రాజుల మీద అనేకసార్లు భూమండలమంతా చుట్టి యుద్ధం చేసి సంహరించి ధర్మసంస్థాపన చేసి రామ చంద్రుడికి ఆ శ్రమలేకుండా చేసాడు. కాబట్టి అక్కడ ధర్మ సంస్థాపన పరశురాముని ద్వారా జరగ్గా లోకకంటకులయిన రావణ కుంభకర్ణాది రాక్షసుల్ని సంహరించి లోక కళ్యాణం జరిపించాడు రాముడు.

అందుకే పరశురామావతారం లక్ష్యం ముందే నెరవేరింది గాబట్టి ఒకానొకసందర్భంలో శ్రీరాముడు పరశురాముని తాకగానే ఆయనలోని నారాయణాంశ రామునిలో ప్రవేశించింది. ఆ తర్వాత పరశురాముడు తపస్సు కెళ్ళిపోయాడు.

కాబట్టి రామాయణ భారతాల విషయంలో నేను చెప్పొచ్చేదేమంటే రామాయణం కుటుంబగాధ, మహాభారతం రాజకీయ చరిత్ర. నీ బుర్రకి సులువుగా అర్థం కావాలంటే ఓ మాట చెప్తాను విను. భక్తులు రాముడ్ని కృష్ణుడ్ని కూడా కలిపి రామ రామ కృష్ణ కృష్ణ రామ కృష్ణ హరే హరే అని ప్రార్థిస్తారు ఎందుకో తెలుసా?’’

‘‘నువ్వు చెప్పన్నా నాకేం తెలుసు?’’

‘‘ఆ రామచంద్రుడు కుటుంబంలో సుఖశాంతుల్ని యిస్తాడు. శ్రీకృష్ణుడు తన భక్తులకు లౌకిక విజయాన్నిస్తాడు. కాబట్టి ఇంటా బయటా కూడా తమకు విజయం చేకూరాలని ఆ రెండు అవతారాల్ని కలిపి రామ కృష్ణ హరే హరే అని ప్రార్థిస్తారు. అర్థమైందా?’’

‘‘అర్థమైందన్నా’’

‘‘ఇంకేందిరా నీ డౌటు?’’

‘‘ఏం లేదన్నా నేను కూడా....’’

‘‘వూ... నీవుకూడా? ఆ నాన్చుడేందిరా చెప్పి తగలడు!’’

‘‘అదేనన్నా నేనుకూడా ఇంకోపెళ్ళి చేసుకొని ఇద్దరు పెళ్ళాలకి మొగుడవ్వాలనుంది. చేసుకోవచ్చా?’’

‘‘ఓరినీ... ఇంకోపెళ్ళి చేసుకుంటావా. ఆ మాట నా దగ్గరంటే అన్నావ్ గాని నీ పెళ్ళాం దగ్గరనమాక. ఒంటి స్తంభానికి కట్టేసి వారంరోజులు కూడు నీళ్ళు లేకుండా మాడ్చి చంపేస్తుంది. తింగరెదవా. నీ జీతమెంత నువ్వెంత నీకు మరోపెళ్ళా! చినబాబు ఇద్దరమ్మాయిల్ని ప్రేమించాడు గాని ఇంకా పెళ్ళి చేసుకోలేదు. ఇద్దర్లో ఒకర్ని చేసుకుంటాడో ఇద్దర్నీ చేసుకుంటాడో తెలీదు. ఇప్పుడే నువ్వు ఇంకో పెళ్ళి కావాలంటున్నావ్. చంపేస్తానొరే. పోరా. పోయి పని చూసుకో. సోంబేరి వెధవా’’ అంటూ విసుక్కుని లోనకెళ్ళి పోయాడు.

ఆ సాయంకాలం చందూ ధర్మ వెంట సైదాపేట వాళ్ళుంటున్న లాడ్జికి వెళ్ళాడు. ఇంకా తిరిగి రాలేదు. ‘‘చందూ వచ్చాక లేపు భోంచేస్తాం’’ అని చెప్పి తన గదిలోకి పోయి పడుకున్నాడు మునుసామి.

****************************************

మరునాడు ఉదయం...

మధురైనుండి మహాదేవనాయకర్ ఆయన సతీమణి మూగాంబికై చెన్నై రావటం ఎవరూ వూహించని పరిణామం. మూడోరోజునే మధురై పోలీసులు ఆయన్ని హౌస్ అరెస్ట్ నుండి తప్పించారు. నాలుగోరోజు తెల్లవారుజామున కార్లో బయలుదేరి ఉదయం పదిగంటల ప్రాంతానికి చెన్నై చేరుకున్నారు.

వారు వస్తున్న విషయం సహస్రకు తప్ప ఎవరికీ తెలీదుతొమ్మిది గంటలప్పుడు సహస్ర విశాలని పిలిచి చెప్పింది. ''మమ్మీ డాడీ వస్తున్నారు నేరుగా తిరగటం క్షేమంకాదు గదా నువ్వే వాళ్ళని రిసీవ్ చేసుకోవాలి'' అంది.

విశాల చాలా సంతోషించింది.''అక్కా ఇంత మంచివార్త ఇంతలేటుగానా చెప్పటం! ఇక ఆ విషయం నాకు వదిలేయ్ ఇప్పుడే మనవాళ్ళందరికీ ఈ శుభవార్త చెప్పేస్తాను'' అంది ఉత్సాహంగా.

''ఏయ్ మొద్దూ చెప్పమాక. డాడీకి మావయ్య వెంకటరత్నం నాయుడు గారికి పడదు తెలుసుగదా. ముందే చెప్పేస్తే మావయ్య ముఖం చాటేయొచ్చు. వాళ్ళు గోస్వామి కాలనీకి పోకుండా నేచెప్పిన అడ్రసు ప్రకారం నేరుగా ఇక్కడికే వస్తున్నారు. కాస్సేపట్లో వచ్చేస్తారు. వచ్చాక అందరికీ చెప్పు'' అంది సహస్ర.

''అలాగే అక్క నేచూసుకుంటాలే'' అంటూ ఎప్పటిలాగే సింపుల్గా తయారై కిందికొచ్చింది. అయినా మునుసామి పసిగట్టేసాడు. అంత క్రితమే అక్కడికొచ్చాడాయన.

''ఏమ్మా విశాల ఏమిటి హడావుడీ? ఎవరన్నా వస్తున్నారా?'' అనడిగాడు.

''అవును మావయ్య'' అంది విశాల

''ఎవరమ్మా వాళ్ళు?''

''సస్పెన్స్. వచ్చాకమీరే చూస్తారుగా'' అంటూ విషయం చెప్పకుండా పోర్టికోలోకి వెళ్ళిపోయింది విశాల.సరిగ్గా ఇరవై నిముషాల తర్వాత...ఖరీదైన కారు నిశ్శబ్దంగా గేటులోకి వచ్చింది. విశాల సూచనతో డ్రయివరు కారును నేరుగా పోర్టికోలోకి తెచ్చి ఆపాడు. వెనకడోరు తెరుచుకొని ముందుగా మహదేనాయకర్ ఆయన వెనకే భార్య ముగాంబికై కారు దిగారు.

''రండి బాబాయ్గారూ........ రండి పిన్నిగారూ'' అంటూ వరసలు కలిపేసి ఇద్దర్నీ ఆహ్వానించింది విశాల కాళ్ళకు నీళ్ళిచ్చింది.విశాలను ముచ్చట పడుతూ గమనించారు దంపతులిద్దరూ.

''ఇదిగో అమ్మాయ్ విశాల నువ్వేకదూ?'' అడిగింది మూగాంబికై

''ఓసి పిచ్చిమొగమా తను విశాలగాకపోతే, పక్కింటమ్మాయనుకుంటున్నావా? ఆ అందం అణకువ తెలీటంలేదూ? చూడగానే గుర్తుపట్టేసాలే

విశాలని. మన సహస్ర చెప్పిన పోలికలన్నీ అచ్చుగుద్దినట్టు సరిపోయాయి.'' అన్నాడు మహాదేవనాయకర్.''థాంక్స్ బాబాయి గారు నన్ను సరిగ్గా గుర్తుపట్టేసారు. అక్క సహస్ర నా గురించి మీకు చెప్పేసిందన్న మాట. రండి'' అంది వాళ్ళని లోనకు తీసుకొస్తూ విశాల.''ఒక్కనీ గురించేమిటమ్మాయ్ మీ ఇంట్లో అందరి గురించి చెప్పింది. పైకి ఎంతకోపంగా వున్నా దానికి డాడీ అంటేనే ఎక్కువయిష్టం అందుకే ఆయన దగ్గర ఏదీదాచదు'' అంది మూగాంబికై. అంత క్రితం వరకు వెంకటరత్నం నాయుడు మునుసామి యిద్దరూ హాల్లోనే కూచుని మాట్లాడుకుంటున్నారు. మహదేవనాయకర్ దంపతులు వచ్చిన విషయం క్షణంలో యిల్లంతా పాకిపోయింది మునుసామి లేచి ఎదురొస్తూ.''నమస్తేసార్ మహాదేవనాయకర్ గారూ. అమ్మా నమస్కారం అనుకోకుండా తమ దర్శన భాగ్యం కలగటం నా అదృష్టం. నా పేరు మునుసామి........'' అంటుంటే.

''చాలు చాలు'' అన్నాడు నవ్వుతూ మహాదేనాయకర్.

''జల్లికట్టు మునుసామి నువ్వు. మాకు తెలీక పోడం ఏంటయ్యా. నాయుడికి జిగ్రీ దోస్తీవి. కత్తిసాము కర్రసాములో మాస్టర్వి. విరాట్కి ఆదిగురువువి నువ్వే కదా......... '' అంటుంటే ఆయన మాటలకి విస్తుపోయాడు మునుసామి.''అయ్యా బాబోయ్. నా గురించి ఇన్ని విషయాలు తెలిసాయంటే డౌట్ లేదు, అమ్మాయి సహస్ర మీకంతా చెప్పుండాలి.'' అన్నాడు ఉత్సాహంగా.''చెప్పాలా ఏంటి? టివిలో మనవాళ్ళతో బాటు నీ అద్భుతమైన ఫైటింగ్ చూసాంగదా. ఓసారి నీతోకత్తి కలిపి

ఫైట్చేయాలినుందయ్యా.''''అమ్మో మీతోనా? నేనా?........ నాయకర్ వంశీకులు. మీముందు నేనెంత? మీరు చేయి కలిపాల్సింది నాతో కాదు మా నాయుడితో. మీ యిద్దరూ ఫైట్ చేస్తే రెండు కొదమ సింహాలు పోరాడినట్టే.''

''అది సాధ్యంకాదు లేవయ్యా. ఇప్పుడు వియ్యమందే చేత్తో కయ్యం పొసగదు కదా'' అంటూ నవ్వేసాడు.

ఈలోపల నాయుడి కుటుంబ సభ్యులంతా హాల్లోకొచ్చేయటతో విశాల అందర్నీ పరిచయం చేసింది. ''వదినా'' అంటూ మంగతాయారు మూగాంబికైని లోనకు తీసుకుపోయింది. విశాల తల్లి కాంచనమాలను పరిచయం చేసినప్పుడు మహాదేవనాయకర్ రుద్ధకంఠంతో ''మా బిడ్డను నీ బిడ్డలా చూసుకుంటున్నావ్ నీ రుణం తీర్చుకోలేమమ్మా'' అంటుంటే ''అంత మాటనకన్నయ్య. సహస్ర ఇప్పుడు నా పెద్దకూతురులాంటిది. తన గురించి మీరేందిగులు పడొద్దు'' అంది.

మహాదేవనాయకర్ తనవైపు రావటంచూసి సోఫాలోంచి లేచివచ్చాడు వెంకటరత్నం నాయుడు. మహదేవనాయకర్ నాయుడి చేతిని స్నేహపూర్వకంగా అందుకున్నారు.

''ఎంతయినా ఆడపిల్ల వాళ్ళం. ఓమెట్టు దిగాలిగదా. ఒకప్పటి మన కయ్యం వియ్యంగా మారటం చాలా ఆనందంగా వుంది. గతాన్ని మర్చిపోదాం. కావాలంటే కోయంబత్తూరు వద్ద మీ పొలాల పక్కనున్న ఆ ఏభై ఎకరాల్ని కట్నంగా ఇప్పుడే ఇచ్చేస్తాను. మీ కిష్టమైన ఫ్యాక్టరీ ఏదైనా పెట్టుకోవచ్చు'' అన్నాడు.

వెంకటరత్నం నాయుడు ఆలోన చెతిమీదచేయివేసి నవ్వాడు. ''ఏమిటయ్యా నాయకర్ ఆ ఏభై ఎకరాలలో సరిపెట్టేద్దామనుకుంటున్నావా? మీ ఆస్థికి ఏకైక వారసురాలు అమ్మాయేగదా. కట్నం వేరే యివ్వాలా? మాకు పిల్లచాలు. కట్నం అక్కర్లేదు. వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు. పెద్ద మనుసుతో పట్టింపుల్ని పక్కనపెట్టి మీరు మా అబ్బాయిని అల్లుడిగా స్వీకరించటం ఆనందంగా వుంది'' అన్నాడు.

''ప్రేమించుకోడం ప్రేమ వివాహాలు ఈ రోజుకొత్తగదా నాయుడూ. ఏనాడో శకుంతలా దుష్యంతులు ప్రేమించి గాంధర్వ వివాహం చేసుకున్నారు. ఆ పరంపర ఈనాడు సర్వ సాధారణమై పోయింది. కాలంతో బాటు మనమూ మారాలిగదా తప్పదు. ఇంతకీ విరాట్ సహస్రలు ఎక్కడ?''''వాళ్ళు మేడమీద వున్నారు. కాస్సేపు రిలాక్సైకూచోండి. కాఫీ తీసుకున్నాక వెళ్దాం.''

మహదేవనాయకర్ దంపతులకు అతిథి మర్యాదలనంతరం స్వయంగా వెంకటరత్నం నాయుడు వార్ని సహస్ర

గదికితీసుకెళ్ళాడు. వెంట మునుసామి పెద్దకొడుకు విక్రాంత్ కూడ వచ్చాడు. వాళ్ళు వెళ్ళేసరికి విరాట్ సహస్ర వద్దే వున్నాడు.

చాలా రోజుల తర్వాత తల్లిదండ్రుల్ని చూడగానే దుఃఖం ఆగలేదు. చెంగున లేచి ఎదురెళ్ళి ఇద్దర్నీ కౌగలించుకొని ఏడ్చేసింది సహస్ర. "ఈ పోరాటంలో ప్రాణాలతో వుంటానో లేదో తెలిదు. ఈ లోపలే మిమ్మల్ని ఓసారి చూడాలనిపించింది. సారీ డాడీ మిమ్మల్ని చాలా బాధపెపట్టాను." అంటూ తల్లిదండ్రుల్ని పట్టుకొని ఏడ్చేసింది. మహాదేవనాయకర్ కూడ కన్నీరు తుడుచుకున్నాడు. మూగాంబికై కూతుర్ని అక్కున చేర్చుకొని ఓదార్చింది.

"ఈ బేలతనం, పిరికి మాటలు ఎలా వచ్చాయి నీకు? వీరవంశంలో పుట్టి, నరనరాన పౌరుషం నిపుంకున్న నీవు పలకాల్సిన మాటలు కావివి. చావు పుట్టుకలు మన చేతుల్లో లేవు. ధర్మం ఎప్పుడూ మనల్ని కాపాడుతుంది. ధర్మం నీ పక్షాన వుంది. పోరాడు..... జయించు. ప్రజాక్షేమంకోసం జీవితాలు ధారపోసిన నాయకరాజుల వంశంలో పుట్టిన వీరవనితవు. భయమెందుకుతల్లీ. మేమంతా నీవెకనవున్నాం." అంటూ ధైర్యం చెప్తుంటే తండ్రి మాటలకు నూతనోత్సాహం పొందుతూ కళ్ళు తుడుచుకుంది సహస్ర.

"కంగారు పడాల్సిందేమీ లేదమ్మా. నేను సియంగారితో మాటాడినీకు తగిన రక్షణ ఏర్పాట్లు కూడ చేయిస్తాను" అన్నాడు మహదేవనాయకర్."వద్దు డాడి. ఆ పనిమాత్రం చేయొద్దు." అంది వెంటనే సహస్ర.

"సియం నాకు రక్షణ కల్పించటమంటే ఇదంతా రాజకీయంగా మారిపోతుంది. నాయకులు పార్టీలు రాజకీయ లబ్ధికోసం రచ్చచేస్తాయి. ప్రతి పక్షాలు ఇదంతా సియం చేస్తున్న కుట్ర అంటాయి.

ఇదంతా అవసరమా? అందుకే మేంఎక్కడ ఉందీకూడ ఎవరికీ తెలికుండా జాగ్రత్తలు తీసుకున్నాం. విరాట్ సెల్నెంబర్ సియం వద్దవుంది. స్వయంగాతనే రక్షణ ఏర్పాట్లు చేస్తానన్నా మేం తిరస్కరించాం. అడ్రసు కూడ చెప్పలేదు." అంటూ వివరణ చెప్పింది.

"అవునంకుల్ ఈ ఇష్యూకి మీరుకూడ దూరంగా ఉండండి. మేమంతా సహస్ర వెంట వున్నాం. ఆ త్యాగరాజన్ని జైలుకి పంపించకుండా వదలం" అన్నాడు విరాట్.



ఓపిగ్గా విని ''సరి మీయిష్టం'' అన్నాడు మహదేవనాయకర్. సహస్ర తలమీద గాయాన్ని, విరాట్ భుజం మీద గాయాన్ని చూసి దంపతులిద్దరు చాలా గాబరపడ్డారు. జాగ్రత్తగా వుండమని హెచ్చరించారు. ఈ లోపల నాయకర్ దంపతులకోసం కింద హాలు దగ్గరగా మరోగదికేటాయించి వారిలగేజిలోన పెట్టించి మేడమీదకొచ్చింది విశాల.

ఆ విధంగా రెండు కుటుంబాలు కలిసిపోడంతో కబుర్లతో సమయం తెలిలేదు. తల్లిదండ్రుల రాకతోసహస్రకు నూతనోత్సాహం ఏర్పడిరది. ఎప్పుడూ ఒంటరితనంతో ఉండేయిల్లు ఒక్కసారిగా బంధువులరాకతో కళకళలాడుతోంది. కాంచనమాల ఆనందానికి హద్దేలేదు. ఇక విక్రాంత్ పిల్లలిద్దరూ ఆమెకు మంచి కాలక్షేపం.

ఆ సాయంత్రం గోస్వామి కాలనికి వచ్చేసి విరాట్ ఇంట్లో సిటింగ్ వేసారు వెంకటరత్నంనాయుడు, మహాదేవనాయకర్, మునుసామి.

ముగ్గురూ స్కాచ్విస్కీ ఓపెన్చేసి పుచ్చుకొంటుండగా ముందుగా మునుసామి అసలు విషయాన్ని ప్రస్తావించాడు. ''నాయకర్ సార్........మా విశాల మీద మీ అభిప్రాయం ఏమిటి?'' అంటూ.

మునుసామి ప్రశ్నకు విచిత్రంగా నవ్వాడు మహదేవనాయకర్. ''అభిప్రాయం? ఏ విషయంలో ?'' అంటూ ఎదురు ప్రశ్నించాడు

''అదేనండీ అమ్మాయిని చూసారుగదా మంచి చెడు ఏమన్నా వుంటే చెప్తారని'' అన్నాడు మునుసామి.

''భలేవాడివయ్యా చెడు గురించి చెప్పడానికేముందని? లక్షణమైన అందమైన అమ్మాయి. అంతకు మించి తెలివితేటలు అందం ఐశ్వర్యం వినయ విధేయత ఒకటేమిటి? అన్ని శుభలక్షణాలతో కూడిన అమ్మాయి ఇంకేం చెప్పాలి?''

''అమ్మాయి సహస్ర ఇంకేం చెప్పలేదా?''

''లేదే.......చెప్పటానికి వేరే ఏముందయ్యా?''

''ఉంది సార్ అందుకే అడుగుతున్నాను.''

''అదే ఏమిటంటున్నాను. ఇదిగో నాయుడూ మునుసామి మనసులో ఏముందో నాకర్థంగావటం లేదు. ఏంచెప్పాలో అడుగు.''

ఆయన కాస్సేపు మౌనం వహించాడు.

విశాల గురించి సహస్ర తన తల్లిదండ్రులకు చెప్పి వుండొచ్చు. కాని విశాల కూడ విరాట్ని లవ్ చేస్తోంది. ఆ విషయం చెప్పిందోలేదో తెలీదు. ఇద్దరూ విరాట్ని కోరుకుంటున్నారు. ఇది పెళ్ళి వరకు వెళ్ళేసరికి పరిస్థితి ఎలా ఉంటుందో తెలీదు. అప్పుడు నాయకర్ అభ్యంతరం చెప్తే అదోపెద్ద సమస్యవుతుంది. కాబట్టి ముందే ఆయన చెవిన ఓమాట వేసుంచటం మంచిదన్నది వెంకటరత్నం నాయుడి అభిప్రాయం. అందుకు అనుగుణంగా మునుసామి విశాల ప్రస్తావన తెచ్చాడు అయితే.

ఇంకా దాచటం ఎందుకనే ఉద్దేశంతో వెంకటరత్నం నాయుడు బయట పడిపోయాడు.

"నేను చెప్తాను విశాలకూడ మా విరాట్ని లవ్చేస్తోంది. చాలా సంవత్సరాలకు కలిసిన కుటుంబం మాది. నా చెల్లెలు కాంచన మాలను ధపెట్టలేను. కాబట్టి నేనుఎటూ చెప్పలేను. ఈ విషయం మా అందరికీ తెలుసు. సహస్ర నీకీ విషయం చెప్పిందో లేదో మాకుతెలీదు దుకే.........."

వెంకటరత్నం నాయుడి మాటలు పూర్తిగాకముందే ఫక్కున నవ్వాడు మహాదేవనాయకర్.

"ఈ మాత్రానికే నువ్వెందుకు టెన్షన్ పడతావు నాయుడు. నాకంతా తెలుసు. చేసుకునేది వాళ్ళుగదా. మనకెందుకు టెన్షన్ పడ్డం?

కష్టపడి పెళ్ళాం పిల్లల్ని పోషించాలా? ఇద్దరు భార్యలయితే భరించలేడనే బాధవుందా? లేదు గదా. ముగ్గురూ కోట్లాది ఆస్థులకు వారసులు. ముగ్గురూ ఒక్క ప్రాణంగా వున్నప్పుడూ మనమెందుక్కాదనాలి? మీకో విషయం తెలుసా?

మా రాజవంశంలో ఒక్కరికన్నా ఎక్కువ మంది భార్యల్ని కలిగి వుండటం పూర్వాచారం.

ఈ ఆచారాన్ని మానాన్నగారు తప్పించారు. ఆయన ఏక పత్నీ వ్రతుడు. ఆయన కొడుగ్గా నేనూ ఏక పత్నీ వ్రతుడ్నే, కాని మధురైలోని మా వంశీకుల్లో చాలా మందికి ఇద్దరేసి భార్యలున్నారు.

టేకిటీజ నాయూడూ. ఆ టైం రాగానే ఇద్దర్కీ ఇచ్చిపెళ్ళిచేసేద్దాం. మీ చెల్లెలు కాంచనమాలని బాధపెట్టడం నాకు మాత్రం ఇష్టమా. నాకూతుర్నికూడ తనకూతురిలా బావిస్తున్న మంచి మనసుతనది. అలాంటప్పుడు విశాలకూడ మా బిడ్డకాదా. విశాలతో కలిపి మాకూ యిద్దరు కూతుళ్ళు. కాళ్ళుకడిగి నీ కొడుక్కి నేను యిద్దర్నీ కన్యాదానం చేస్తాను చాలా?" అన్నాడు.

ఆ మాటలకు వెంకటరత్నం నాయుడు మునిసామి యిద్దరూ సంతోషించారు. గుండెలనుంచి పెద్ద భారం తొలగిపోయినట్టయింది. "చాలు నాయకర్ ఆ మాటన్నారు చాలు. ఇక మాకేచింతాలేదు." అన్నాడు వెంకటరత్నం నాయుడు.

రాత్రి తొమ్మిది గంటల వరకూ మందుకొట్టి, తర్వాత వెంకటరత్నం నాయుడు మహాదేవనాయకర్ లిద్దరూ కారులో ఓల్డ్ మాంబళంవెళ్ళిపోయారు. తర్వాత మునుసామితోపాటు చందూ, బండశివా మిగిలిన వాళ్ళు అంతా భోంచేసి పడుకున్నారు.

వెంకటరత్నం నాయుడు కుటుంబంతో బాటు మహాదేవనాయకర్ దంపతులు అయిదు రోజులు ఇక్కడే ఉన్నారు. అంతా చాలా సంతోషంగా గడిపారు. రోజూ ఏదో పూటవచ్చి సహస్ర విరాట్లను చెకప్చేసి వెళ్తాండంటంతో డాక్టర్ గుణదీపిక అందరికీ బాగాపరిచయమై వస్తే కాస్సేపు అందర్నీ పరామర్శించిగాని వెళ్ళటంలేదు. మంచి మందులు వాడటంవలన విరాట్ సహస్రలు చాలా త్వరత్వరగా కోలుకుంటున్నారు.

ఆరో రోజు ఉదయం ముందుగా మహదేవనాయకర్ మూగాంబికలు మధురైకు తమ కార్లో బయలుదేరి వెళ్ళిపోగా, మధ్యాహ్న భోజనాలనంతరం వెంకటరత్నం నాయుడి కుటుంబం కోయంబత్తూరుకు బయలు దేరింది.

చెల్లెలు కాంచనమాలను తమతో తీసుకెళ్ళాలని చూసాడు వెంకటరత్నం నాయుడు. కాని ప్రస్తుతం రానంది కాంచనమాల. పరిస్థితులు చక్కబడ్డాక సహస్ర విశాల యిద్దర్నీ తీసుకుని విరాట్ వెంటవస్తానంటూ మాటచ్చింది. ఆ విధంగా వెంకటరత్నం నాయుడి కుటుంబంకూడ వెళ్ళిపోడంతో ఒక్కసారిగా యిల్లంతా బోసిపోయినట్టయింది.

అంతవరకు విశాలకిష్టమైన కుక్కపిల్లలు రెండూ తమ డాగ్ హౌస్కే పరిమితమయ్యాయి. వాటిని వదల్లేదు. ఇపుడు వాటికి స్వేచ్ఛలభించింది. అవి విశాలతో బాటు సహస్రకీ బాగా అలవాటయ్యాయి. ప్రస్తుతం సహస్రకాలక్షేపం అవే. రోజులు గడుస్తున్నాయి...

విరాట్ సహస్రలు పూర్తిగా కోలుకుంటున్నారు.

ఈ లోపల...

అటు త్యాగరాజన్ కుడి భుజం ఎట్టయప్ప తన మనుషులతో సహస్ర జాడకోసం సిటీలో తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. హర్యానా నుండి ఆరుగురు షూటర్ని పిలిపించాడు త్యాగరాజన్్. జాలిదయ అనే పదాలకు అర్థం తెలిని మూర్ఖులు వాళ్ళు. డబ్బిస్తే

ఎవర్నయినా కాల్చి చంపేస్తారు. సహస్ర జాడ తెలిస్తే గాని వాళ్లనుపయోగించటం వీలు కాదు. గాబట్టి వాళ్ళంతా ప్రస్తుతానికి క్యాంప్కే పరిమితమయ్యారు.

మరోపక్క...

ఇక ధర్మ మిత్రవర్గం వుంది. వాళ్ళంతా చిన్న చిన్న జట్లుగా విడిపోయి ప్రస్తుతం త్యాగరాజన్ ఎట్టయప్పటల రహస్య స్థావరంకోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

ఇక మునుసామి మనుషులు కదిరేషన్ మనుషులు అటు విశాల యింటినీ, ఇక్కడ గోస్వామి కాలనీలోని రెండు యిళ్ళ రక్షణకోసం రేయింబవళ్ళు అప్రమత్తంగా ఉంటున్నారు.

ఇదిలా ఉండగా...

మధురై కోర్టుకు హాజరు కాలేని పరిస్థితి ఉందికాబట్టి కేసును చెన్నై కోర్టుకు బదిలీ చేయవలసిందిగా సవివరంగా సహస్ర పంపించిన వినతి పత్రాన్ని సహృదయంతో పరిశీలించిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఆమె కోరిన విధంగానే కేసును చెన్నైకోర్టుకు బదిలీచేసింది. ఈకేసు సైదాపేట సెషన్స్ కోర్టుకే రాబోతోంది. ఎటొచ్చి వాయిదా ఎపుడనేది కోర్టునుండి సమన్లు వస్తేగాని తెలీదు. త్యాగరాజన్కి గాని, తనకి గాని సమన్లు మధురై అడ్రసులకే వెళ్తాయని సహస్రకు తెలుసు. సమన్లు రాగానే మహదేవనాయకర్ ఫోన్చేసి చెప్పాడు.

అయితే యిది ప్రాథమిక స్టేట్మెంట్ రికార్డ్చేసుకునే ట్రయల్గాబట్టి సహస్రకోర్టుకు హాజరయినా త్యాగరాజన్ హాజరుగాకపోవచ్చు. కేసును తాత్సారంచేసే ఉద్దేశంతో తనకు చెన్నై అనుకూలం కాదు కాబట్టి మధురైకోర్టుకే హాజరవుతానంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించి అనుమతి పొందొచ్చు. అది మంజూరై మధురై కోర్టుకు హాజరుకమ్మని పర్మిషను వచ్చేలోపు సహస్రజాడ కనిపెట్టి అంతంచేయటానికి చాలా సమయం ఉంటుంది.

ఈ పరిస్థితుల్లో...

ఒక రోజు సాయంకాలం...

సడెన్గా విరాట్కి ఫోన్ చేసాడు ధర్మ.

“చెప్పు ధర్మా ఏంటి విశేషాలు?” కాజువల్గా అడిగాడు విరాట్.

“విశేషాలు చాల వున్నాయి. ఓసారి నువ్వు బయటికి రాగలవా?”

“ఎలుకలున్న కలుగు జాడ తెలిసిపోయింది. నువ్వొస్తే బాగుంటుందనుకుంటున్నాను” చెప్పాడు ధర్మ.

“వస్తాను అడ్రసు చెప్పు.”

చెప్పాడు ధర్మ.

“ఒకె అక్కడే ఉండు. వస్తున్నాను” అంటూ లైన్ కట్చేసాడు విరాట్.

సహస్ర తనూ వస్తానంటే వారించాడు.

చందూ ఆఫీస్నుంచి ఇంకా రాలేదు.

తన దుస్తుల ఫ్యాక్టరీకి వెళ్ళిన విశాలకూడ ఇంకా ఇంటికి రాలేదు. తను బైక్మీద వెళ్ళటం సేఫ్కాదు. ఇంటికి అవసరమైన సరుకులు తెచ్చే ప్ ది కాని అది ఓపెన్ జీప్ సహస్ర తనూ వస్తానంటే వారించి మునుసామికి ఫోన్చేసాడు. చేసిన అర్ధగంటలో తమ వేన్ తీసుకువచ్చేసాడు నుసామి. డ్రైవరుతోబాటు మునుసామి బండశివా కదిరేషన్కూడ వచ్చారు.అలా వేన్లో అంతా బయలుదేరి ధర్మ చెప్పిన అడ్రసుకు చేరుకునే రికి చీకటపడి వీధి దీపాలు వెలిగాయి. కీల్పాక్కంలోని మారుమూల వీధి కార్నర్లోని టీ బంక్ వద్ద ధర్మ విరాట్కోసం ఎదురుచూస్తున్నాడు. క్కన మరో యిద్దరు ఫ్రెండ్స్ వున్నారు. వాళ్ళంతా కూడ వేన్లోకి వచ్చేసారు. వేన్ని స్లోగా

పోనిమ్మని చెప్పాడు ధర్మ.

విశాలమైన ఆ వీధిలో...

ఎడంపక్క ఇరవైఏడో నంబరు ఇంటిని పరిశీలించి గుర్తుపెట్టుకోమన్నాడు ధర్మా. స్లోగా వెళ్తూన్న వేన్లోంచి జాగ్రత్తగా ఆయింటి పరిసరాల్ని గమనించారంతా. రెండంతస్థుల పాత భవనం, పైన టెర్రస్మీద సగం భాగం మూడో అంతస్థుగా ఫ్లాట్ కట్టబడుంది. ఆవరణలో కొన్ని శాల్తీలు అటుయిటు తిరుగుతున్నాయి. వేన్ ఆ భవనం దాటి ఎగువకు కెళ్ళిమరో వీధిలోకి మలుపు తిరగ్గానే ఒక పార్కు పక్కన వేన్ ఆపించాడు ధర్మా.

‘‘వాళ్ళంతా ఇక్కడే ఉంటున్నారా?’’ అడిగాడు విరాట్.

అవునన్నట్లు తలూపాడు ధర్మా.

‘‘కీల్పాక్కాంలో మారుమూల ప్రాంతం యిది. మూడు రోజుల క్రితం కాశిశెట్టి స్ట్రీట్లో ఏవో కొంటున్న ఎట్టయప్ప మనిషి ఒకడ్ని గుర్తించి జాగ్రత్తగా వాడ్ని ఫాలో అయి ఈ ఇంటిని గుర్తించగలిగారు మనవాళ్ళు. అప్పటినుంచి పగలు రాత్రి వంతులవారీగా ఈ ప్రాంతంలో తిరుగుతూ గమనించటంతో చాలా విషయాలు బయటపడ్డాయి.’’ అన్నాడు ధర్మ.

‘‘ఏంటా విషయాలు?’’ వెంటనే అడిగాడు విరాట్.

‘‘ప్రస్తుతం త్యాగరాజన్ అడ్డా ఆ ఇరవై ఏడో నంబరు యిల్లే. పైనున్న ఫ్లాట్లో త్యాగరాజన్ ఉంటాడు. దిగువ రెండంతస్తులూ వాడి మనుషులు మకాం ఉంటున్నారు. ఎట్టయప్పవెంట నలుగురు రాగా తర్వాత మధురై నుంచి మరోపదిమంది వచ్చిజాయినయ్యారు. వీళ్ళుగాక లోకల్ గుండాలు ఇరవైమందిని తీసుకున్నారు. అంతా ప్రస్తుతం ఇక్కడే ఉంటున్నారు.

త్యాగరాజన్ పగలు ఎక్కడికీ వెళ్ళటం లేదు. సాయంకాలం వెళ్ళి రాత్రి ఏదో టైంకి తిరిగి ఇక్కడికే వచ్చేస్తున్నాడు. తన ఇంటికెళ్ళినా అక్కడ ఎక్కువ సేపు ఉండటం లేదు.

అయితే ముఖ్యమైన విషయం ఉత్తరాది నుంచి బహుశ హర్యానా లేదా బీహార్ ప్రాంతం నుంచి కావచ్చు. ఆరుగురు షూటర్స్ని పిలిపించి రిజర్వ్లో ఉంచాడు. వాళ్ళు కూడా ఆ యింట్లోనే ఉంటున్నారు.

ఎట్టయప్ప కొందరు మనుషుల్ని తీసుకొని వేన్లో ఉదయం వెళ్తే తిరిగి రాత్రికే కేంప్లోకి వస్తున్నాడు. అంటే సహస్ర జాడకోసం వాళ్ళంతా ముమ్మరంగా సిటీలో గాలిస్తున్నారని వేరే చెప్పక్కర్లేదు.'' అంటూ ధర్మ తను తెలుసుకున్న విషయాల్ని వివరిస్తుంటే ఆసక్తిగా విన్నారంతా.

''అయితే ఇప్పుడేం చేద్దాం? వాళ్ళకన్నా ముందే మనం దాడిచేద్దామా? మధురైనుంచి పారిపోయి వచ్చినట్టుగా ఆ త్యాగరాజన్ చెన్నై కూడా వదిలి పారిపోవాలి. మన దెబ్బ ఎలా ఉంటుందో చూపిద్దాం. ఈ రాత్రికే దాడి చేద్దాం'' అన్నాడు ఆవేశంగా మునుసామి. కాని విరాట్ ఆవేశపడలేదు.

'''వద్దు మనం తొందర పడ్డం మంచిది కాదు. వాళ్ళ మకాం మనకు తెలిసిపోయింది. గాబట్టి ఎప్పుడన్నా ఆటాక్ చేయొచ్చు. ముందే మనం తొందర పడితే తప్పుమనదవుతుంది. ప్రస్తుతానికి వెళ్ళిపోదాం పదండి'' అన్నాడు.

ధర్మ కూడా అదే సలహా యివ్వడంతో...

అంతా తిరుగు ప్రయానమయ్యారు.

రెండోసారికూడా ఇరవై ఏడోనెంబరు ఇంటి ముందు నుంచి వేన్ని పోనిస్తూ ఆ పరిసరాల్ని జాగ్రత్తగా గమనించారు. పూర్తిగా చీకట్లు ముసురుకునే సమయానికి వారు ప్రయాణిస్తున్న వేన్ ముంబళందిశగా పరుగు తీసింది.

*************************************

ఆ రోజు శిఖామణితో గొడవ జరిగిన రాత్రి గాయపడిన తర్వాత సహస్ర విరాట్లు సుమారు నెలరోజులు ఓల్డ్ మాంబళం

ముదలియార్ స్ట్రీట్లోని విశాల యింట్లోనే రహస్యంగా ఉన్నారు.

కాని ఎక్కువ రోజులు అక్కడుంటం సేఫ్ కాదని ఇద్దరికీ తెలుసు. ముఖ్యంగా తామిక్కడున్నంత కాలం కాంచనమాల విశాల ఈ తల్లీ కూతుళ్ళిద్దరికీ ప్రమాదం పొంచి ఉన్నట్టే. తామిక్కడున్నట్టు తెలిసిన మరు క్షణం వీళ్ళని కిడ్నాప్ చేసి సహస్రని బ్లాక్ మెయిల్ చేయాలని చూస్తారు. కాబట్టి వాళ్ళిద్దరూ క్షేమంగా ఉండాలంటే తామిద్దరూ ఎంత తొందరగా ఇక్కడ్నుంచి వెళ్ళిపోతే అంత మంచిది. ఆరోగ్యం చక్కబడిరది గాబట్టి వెళ్ళి పోవటం మంచిది.

విరాట్ సహస్రలు చర్చించుకొని గోస్వామి కాలనికి వెళ్ళి పోవాలని నిశ్చయించుకున్నారు. కాని విశాల అంగీకరించలేదు. ఏమైనా సరే ఇక్కడే డాలంటూ పట్టుబట్టింది. కాంచనమాల కూడా ఉండిపొమ్మనే చెప్పింది. వాళ్ళకి నచ్చజెప్పడానికి చాలా శ్రమపడాల్సివచ్చింది. మునిసామి చందూ, దీక్షలతో సహా అంతా పరిస్థితి వివరించాక గాని ఇద్దరూ ఒప్పుకోలేదు. ఆ రాత్రి ఎనిమిదిగంటలకి విశాల స్వయంగా తనకార్లో తీసుకెళ్ళి దించి వెళ్ళింది. విరాట్ చందూలు మొదట వీధిలోని తమ యింటి కొచ్చేసారు. సహస్ర దీక్షలు మూడో వీధి చివర తమ ఇంటికి చేరుకున్నారు.

ఆరోజునుంచి కదిరేశన్ మనుషులు మునుసామి మనుషులు సహస్ర వుంటున్న దీక్ష ఇంటికి వేయికళ్ళలో కాపలా ఉంటున్నారు. కాలనికి వచ్చే కొత్త వాళ్ళని ఓ కంట గమనించసాగారు. ఈ లోపల సైదాపేట కోర్టుకి హాజరుకావలసిందిగా సమన్లు జారీ అయ్యాయి. ఇరవై రోజుల గడువుందింకా.

**********************************

త్యాగరాజన్ చాలా సీరియస్గా వున్నాడు. ఎందుకంటే మధురై వదిలి వచ్చి నెలరోజులు కావస్తోంది. తన మనుషులు వీధికుక్కల్లా సిటీలో గాలిస్తున్నారు. అయినా సహస్ర జాడ తెలీలేదు. తన మనుషుల చేతకాని తనం మీద కోపం. ఆరోజు సాయంకాలం తన ముందుకొచ్చిన ఎట్టయప్ప బృందాన్ని కోపంగా చూసాడు. ‘‘ఏమైంది? మనం వుంటున్నది మధురైలో కాదు. చెన్నైలో. ఆ పిల్ల సహస్రజాడ యిక్కడే ఉంది. అయినా మీ చేత కాలేదా? ఇన్నిరోజులయినా జాడ తెలీనేలేదా? ఏం చేస్తున్నార్రా మీరంతా? ఇంకా ఎన్నిరోజుల్రా? మన కొంప మునిగే వరకూ తెలుసుకోలేరా?’’ అంటూ సీరియస్గా అడిగాడు.

‘‘ఆ పనిమీదే వున్నాంసార్. ఆచూకీ తెలిసింది’’అన్నాడు ఎట్టయ్యప్ప.

‘‘తెలిసిందా? ఇంకా తెలుసుకోవాలా?’’ సందేహంగా ప్రశ్నించాడు జగన్మోహన్.

‘‘తెలిసింది సార్’’

‘‘అయితే చెప్పరా ఎక్కడ వుంది? అడ్రసేమిటి?’’ ఉత్సాహంగా అడిగాడు.

‘‘మీనబాక్కం ఏర్పోర్ట్ దగ్గర్లో గోస్వామి కాలనీ అని మూడు వీధులతో కూడిన కాలనీ వుంది. మూడో వీధిలో చిట్టచివర యింట్లో దీక్ష అనే అమ్మాయితో కలిసి ఉంటోంది.’’

‘‘ఇది తెలుసుకోడానికి ఇన్ని రోజులు పట్టిందా?’’

‘‘సార్ ఒకవిషయం మీరు మర్చిపోతున్నారు. నెల్లాళ్ళ కిందట శిఖామణితో జరిగిన గొడవ మీకు తెలుసు. ఆ సందర్భంగా పోలీసుల రాకతో సహస్ర ఆమె ప్రియుడు విరాట్లు పారిపోతుండగా మన ధనగిరి బేచ్ ఎదురు పడ్డం కాల్పులు, మనవాళ్ళు కొందరు చనిపోవటం మీకు తెలుసు. ఆ సందర్భంగా వాళ్ళిద్దరికీ బలమైన గాయాలే తగిలాయి. దాంతో వాళ్ళు గోస్వామి కాలనీకి రాకుండా ఆజ్ఞాతంలో ఎక్కడో వుండి ట్రీట్మెంట్ తీసుకున్నారు. ఇప్పుడే మూడు రోజుల క్రితం తిరిగి యిళ్ళకు చేరుకున్నారు’’.

ఆ మాటలు వింటూ విసుగ్గా నుదురు రుద్దుకున్నాడు త్యాగరాజన్ ‘‘ఎవడ్రా... ఎవడ్రా విరాట్. అగ్గికి ఆజ్యంతోడైనట్టు ఆ పిల్లదాంతో చేయికలిపాడు. వాడి వివరాలేమైనా తెలిసాయా?’’ అనడిగాడు.

‘‘లేదు సార్. ఆ కుర్రాడి వివరాలేమీ ఇంకా తెలీలేదు’’ చెప్పాడు ఎట్టయ్యప్ప.

‘‘సరి ఇప్పుడేం చేద్దాం? వాళ్ళు కాలనీకి తిరిగొచ్చేసారుగా వెళ్ళండి. రేపు ఉదయమే వెళ్ళి ఆజర్నలిస్టులేడీని ఇంటిదగ్గరే షూట్ చేసి చంపి పారేయండి. ఈ హర్యానా షూటర్స్ని పందుల్లా మేపుతున్నాం. వచ్చిన పని పూర్తయితే వాళ్ళని పంపించేయొచ్చు.’’

‘‘అదంత సులువు కాదు సార్. కాలనీ కెళ్ళి కాము పని ముగించుకు రావటం సాధ్యం కానిపని’’

‘‘ఎందుకురా? అక్కడ బలమైన కాపలా ఏమన్నా వుందా?’’

‘‘ఉందిసార్. కాపలా పటిష్టంగా వుంది. మధురైనుంచి సహస్ర తండ్రి మహాదేవనాయికర్ పంపించిన పదిహేనుమంది మెరికల్లాంటి ఫైటర్స్ కదిరేశననే వాడి నాయకత్వంలో ఆ యింటిని చుట్టి రేయింబవళ్ళు కాపలాకాస్తున్నారు. మరో పక్క ఆ విరాట్కి గురువట. పేరు మునుసామి. కత్తిసాము కర్రసాములో మాస్టర్. అతడి మనుషులు పదిమంది పైగా వుంటారు. వాళ్ళంతా నిరంతరం కాలనీలోకి వచ్చే పోయే మనుషుల్ని వెహికిల్స్ని ఓ కంట కనిపెట్టిచూస్తున్నారు. అనుమానం వస్తే ఆపేస్తున్నారు. వీళ్ళుగాక మరో పాతికమంది కుర్రాళ్ళున్నారు. వాళ్ళలో చాలామందిని మధురైలో చూసిన గుర్తు. ఆ సహస్రకు ఇంతమంది రక్షణగా వున్నారు. వీళ్ళందర్ని తప్పించుకొని వెళ్ళి పని ముగించటం అసాధ్యం. సహస్రను అంతం చేసేలోపు వాళ్ళు మమ్మల్ని ఫినిష్ చేసేస్తారు. కాబట్టి తొందరపడితే పనులు కావు. కాస్త ఆలోచించి అడుగు ముందుకేయాలి’’ అంటూ తనకు తెలిసిన సమాచారమంతా వివరించాడు ఎట్టయ్యప్ప.

ఆ మాటలు శ్రద్ధగా వింటూ...

కాస్సేపు అటుయిటు పచార్లు చేసాడు త్యాగరాజన్.

ఉన్నట్టుండి ఆగి...

ఎట్టయ్యప్ప వంక చూసాడు.

‘‘మనం శత్రువుని చేరటం సాధ్యంగానప్పుడు...      శత్రువునే బయటికి రప్పించటం తెలివైన పని. అవునా?’’ అనడిడగాడు.

‘‘కాని ఎలా సార్?’’

‘‘ఎలాగో చెప్తాను. కాలనీ దాటి సహస్ర బయటికి రాకపోవచ్చు. ఇంటికే పరిమితం కావచ్చు. కాని సహస్ర ఫ్రెండు... ఏం పేరన్నావ్?

దీక్ష యస్. క్షనే అమ్మాయి బయటకు రాకుంటా ఉంటుందా? ఉండదు. ఖచ్చితంగా ఏదో టైంలో వస్తుంది కదూ?''

అవునన్నట్టు తలూపాడు ఎట్టయప్ప.



త్యాగరాజన్ ప్లానేమిటో కొద్ది కొద్దిగా బోధపడసాగింది. అప్పటికప్పుడు ఒక దారుణమైన పథకాన్ని రూపొందించాడు త్యాగరాజన్్. దీక్ష కాలనీలోంచి బయటకురాగానే కిడ్నాప్ చేసి, ఆమెను అడ్డం పెట్టుకొని సహస్రను బయటకు రప్పించి, షూట్చేసి చంపటం ఆపథకంలోభాగం. అవసరమైతే రెండు మూడు రోజులు ఆలస్యమైనా ఫరవాలేదు. దీక్ష బయటకురాగానే కిడ్నాప్ చేయాలని నిర్ణయం జరిగిపోయింది.

ఒక తప్పటడుకు పది తప్పటడుగులకు కారణమవుతుంది. ఒక తప్పు పది తప్పులు చేయిస్తుంది. ఒక పొరపాటు పది పొరబాట్లకు మూలమవుతుంది. ఇక్కడ త్యాగరాజన్్ తీసుకున్న నిర్ణయం సత్ఫలితాన్నిస్తుందా లేక బెడిసికొట్టి, నేలకొ్కట్టిన బంతిలా ఎగిరి

తన ముఖాన్నే తాకుతుందా తెలిదు.ఎట్టయప్ప మాత్రం ఆ పథకాన్ని అమలు చేయటానికి అనువైన ప్రాంతాన్ని అన్వేషిస్తూ తన మనుషులతో అప్పటికప్పుడు బయలుదేరి పోయాడు.

I I I

విరాట్ సహస్రలు కాలనీకి వచ్చేసి వారం రోజులు గడిచాయి. ఇంత వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. సహస్ర రక్షణ కోసం మూడు బేచ్లు పనిచేస్తున్నాయి. వాళ్ళంతా సుమారు ఏభైమంది వుంటారు. అందరికీ వంటా వార్పు ఇంట్లో సాధ్యం గాదు గాబట్టి వాళ్ళంతా హోటళ్ళలో భోంచేయటమో లేదా హోటల్ నుండి కేరేజీలు తెచ్చుకోడమో జరుగుతోంది.

విరాట్ ఇంట్లో చందూ విరాట్ మునుసామి బండశివా ఈ నలుగురూ ఇంట్లోనే వంట చేసుకుంటున్నారు. అలాగే దీక్ష ఇంట్లో సహస్ర దీక్షలు తమవరకు వండుకుంటున్నారు.

ఇలా ఉండగా…

ఎనిమిదో రోజు ఉదయం…

ఉన్నట్టుండి మార్కెట్కి బయలుదేరింది దీక్ష.

‘‘వద్దు నువ్వెళ్ళకు. కదిరేశన్తో చెప్పి ఎవరో ఒకర్ని పంపిద్దాం’’ అంది సహస్ర.

‘‘ఎవర్ని పంపించినా ఈ మగళ్ళంతా యింతే. ఏదీ సరిగా చూసి కొనరు. నాలుగు రోజులక్రితం అలాగే చేసాంగా ఏమైంది? ముదిరిపోయిన బెండకాయలు, పుచ్చిన వంకాయలు సగానికి సగం పనికిరాకుండా పోయాయి. ఏం ఫరవాలేదు. నే వెళ్ళి తెస్తాను’’ అంది దీక్ష.‘‘దీక్షా, నామాట వినవే. ఇప్పుడున్న పరిస్థితిలో మనం బయటకెళ్ళటం క్షేమంకాదు’’ నచ్చ జెప్పాలని చూసింది సహస్ర. ఆమె మాటల్ని కొట్టిపారేసింది దీక్ష.

‘‘ఏయ్. సమస్య నీగ్గాని నాక్కాదుగదా? నా జోలికెవడొస్తాడు? మొన్న షాపింగ్కెళ్ళొచ్చాను ఏమైంది? ఏం కాలేదుగదా. ఇప్పుడూ అంతే. నువ్వేం టెన్షన్ పడకు. అర్ధగంటలో వచ్చేస్తాను’’ అంటూ స్కూటీ మీద వెళ్ళిపోయింది దీక్ష.

సహస్ర మనసెందుకో అనీజీగా ఫీలయింది. కీడును శంకించనారాంభించింది. ఎంత చెప్పినా వినకుండా బయటకెళ్ళిన దీక్షమీద కోపం ముంచుకొస్తోంది. చందూకి ఫోన్ చేసి చెప్పాలనుకొంది. తను ఆఫీస్కెళ్ళిపోయుంటాడు. టైం పది కావస్తోంది. విరాట్ ఇంట్లోనే ఉంటాడు. ఫోన్ చేసి చెప్పాలనుకుంది. కాని ముందే రచ్చ చేసావంటూ అదో గొడవ దీక్షతో. అది తిరిగి వచ్చేవరకు తనకీ టెన్షన్ తప్పదు.ఎలాగో అయిదు నిముషాలు ఓపిక పట్టింది. ఇక తన వల్లకాలేదు. వెంటనే కదిరేశన్ని పిలిచి దీక్షకి తోడుగా ఎవరినన్నా మార్కెట్ వరకూ పంపించమంది. సహస్ర సలహా మేరకు కదిరేశన్ తన మనుషుల్లో ఒకడ్ని మార్కెట్కి పంపించాడు.

అలా దీక్ష కోసం వెళ్ళిన వాడు వెళ్ళినట్టే పావుగంటలో వెనక్కి వచ్చేసాడు. వాడు ఉత్తినేరాలేదు. దీక్ష స్కూటీని తీసుకుని మరీ వచ్చాడు. వస్తూనే... ‘‘కదిరేశనన్నా... ఘోరం జరిగిపోయింది’’ అంటూ అరిచాడు.వాడి అరుపులు వినగానే...

సహస్ర గుండె జారినంత పనైంది.

వేగంగా డోర్లోకి పరుగెత్తుకొచ్చింది.

ఈలోపల కదిరేశన్ అడుగుతున్నాడు వాడ్ని ‘‘ఏమిట్రా స్కూటీ తీసుకొచ్చావ్ దీక్ష మేడం ఎక్కడ? ఏం జరిగింది? చెప్పరా.’’ అంటూ గర్జించాడు.‘‘నే వెళ్ళేసరికే స్కూటీ పొలడిపోదగ్గర్లో రోడ్మీద పడుందన్నా. దీక్షమ్మగారు అక్కడ లేరు. వాకబు చేస్తే చెప్పారు. ఉదయంనుంచి ఒకవేన్ ఆ సమీపంలోనే ఆగుందట. దీక్షమ్మ స్కూటీమీద వస్తుంటే ఆపేసారట. కత్తులు చూపి బెదిరించి వేన్లో తీసుకుపోయారట’’ అంటూ వాడు గాబరాతో జరిగింది చెప్తుంటే ముఖముఖాలు చూసుకున్నారంతా.ఆ మాటలు వినగానే...హతాశురాలయింది సహస్ర.ఆఖరికి అనుకున్నంతా అయింది.ఎంత చెప్పినా వినకుండా వెళ్ళి తను ప్రమాదంలో చిక్కుకుంది. తమ పీకలమీదికి తెచ్చింది. సందేహం లేదు. ఎట్టయప్ప మనుషులు దారికాచి దీక్షని కిడ్నాప్ చేసేసారు. ఇప్పుడేం చేయాలి?క్షణం కూడా ఆలస్యం చేయకుండా...వెంటనే విరాట్కి ఫోన్ చేసింది సహస్ర.విషయం తెలిసిన మూడోనిముషంలోనే విరాట్తో బాటు మునుసామి కూడా సహస్ర వద్దకొచ్చేసారు.‘‘నీకు బుద్ధుందా? బయటికెళ్ళొద్దని చిలక్కి చెప్పినట్టు చెప్పాను. వినక్కర్లేదా? దీక్షని ఎందుకెళ్ళనిచ్చావ్?’’ వస్తూనే సహస్ర మీద మండిపడ్డాడు విరాట్.‘‘ఎంత చెప్పినా వినకుండా వెళ్ళింది. ఏంచేయమంటావ్? వాళ్ళు దాన్ని ఎక్కడికి తీసుకెళ్ళారో ఏం చేస్తారోనని భయంగా వుంది విరాట్. ఏదో ఒకటి చేయాలి’’ అంది గాభరాను గొంతులోనే అణచుకుంటూ సహస్ర.

“కంగారు పడకండి” అన్నాడు మునుసామి.

“కొంచెం స్థిమితంగా ఆలోచిద్దాం. భయపడాల్సిందేమి లేదు. వాళ్ళకెక్కావలసింది సహస్ర. దీక్షకాదు. కాలనిలోకి రావటానికి ధైర్యంచాలక సహస్రను బయటికి రప్పించడానికి వేసిన మాష్టర్ ప్లానది. నా అంచనా కరక్టయితే కాస్సేపట్లో వాళ్ళు సహస్రకు ఫోన్ చేస్తారు. వెయిట్ చేద్దాం” అన్నాడు.“వెయిట్ చేయటం అనవసరం గురువుగారూ. వాళ్ళు ఖచ్చితంగా దీక్షను కీల్పాక్కం ఇరవైఏడోనెంబరు యింటికే తీసుకెళ్ళుంటారు. మనం వెంటనే వెళ్ళి దాడిచేద్దాం” అన్నాడు ఆవేశంలో విరాట్.“చినబాబు ఆవేశపడకు. ఆవేశపడితే పనులు కావు. అనర్థాలు జరుగుతాయి. ఇంతతెలిసీ ఆవేశంలో నువ్వు కూడా పొరబాటు పడుతున్నావు. చూసావా? వాళ్ళు తెలివితక్కువ వాళ్ళా దీక్షను తమ మకాంలోకి తీసుకెళ్ళటానికి? దీక్షకోసం సహస్రరాగానే చంపాలని వాళ్ళప్లాన్. చేతిలో హర్యానా షూటర్స్ వున్నారు. పకడ్బందీగా స్కెచ్ వేసారు. బయట ఎక్కడో స్పాట్ ఎంచుకున్నారు. వాళ్ళఫోన్ వస్తేగాని మనం ఓ నిర్ణయానికి రాలేం.      ధర్మకి ఫోన్కొట్టి మనవాళ్ళందర్ని యిక్కడికొచ్చేయమని చెప్పు” అన్నాడు.

వెంటనే ధర్మాకి ఫోన్ చేసాడు విరాట్.“ఒరే కదిరేశా ఓసారిలారారా” అంటూ కదిరేశన్ని దగ్గరకు పిలిచాడు మునుసామి.“మన కాలనీ గేటు నుండి మార్కెట్ వరకు రెండునుంచి మూడు ఫర్లాంగుల దూరం వుంటుంది. ఇది మామూలుగా జరిగిన కిడ్నాప్కాదు. ఎట్టయప్ప మనుషుల్లో ఎవడో ఒకడు ఇక్కడే రోడ్లో తిష్టవేసి మన మూమెంట్స్ని ఎప్పటికప్పుడు ఉప్పందిస్తున్నాడు. ఇప్పుడుకూడా వాడు ఇక్కడే ఉండుంటాడు. దీక్షను తీసుకెళ్ళాక మన కదలికల్ని ఓకంట కనిపెడుతుంటాడు. పంపించు. ఇద్దరు లేదా ముగ్గురుగా రెండు జట్లుగా పంపించు. పాలడిపో దరిదాపుల్లో అనుమానించతగ్గ ఎవడు కన్పించినా లాక్కురమ్మను. త్వరగా పంపించు” అంటూ సలహా యిచ్చాడు.దిరేశన్ తక్షణమే తన కుర్రాళ్ళని అటు పంపించాడు.“గురువుగారూ ఇంకావాళ్ళి పరిసరాల్లో ఉంటారంటే అనుమానమే. వీళ్లని పంపించటం అనవసరం” అన్నాడు విరాట్.“అవసరమే చినబాబు. ఇలాంటి వ్యవహారాల్లో కాస్త అనుభవం కూడా ఉండాలి. ఉంటే నా మాటలు మీకు అర్థమవుతాయి. వాళ్ళు సహస్రకు ఫోన్ చేస్తారు. దీక్ష ప్రాణాలతో ఉండాలంటే తాము చెప్పే అడ్రసుకి ఒంటరిగా రమ్మంటారు. వెంట ఎవరు వచ్చినా దీక్ష ప్రాణాలతో దక్కదంటారు. కాబట్టి దీక్షకోసం సహస్ర ఒంటరిగా బయలుదేరాలి. ఆమెను అనుసరించి కాస్త వెనగ్గా మనమూ బయలు దేరాలి. సహస్రకి తోడుగా కాలనీ నుంచి ఎవరన్నా వస్తున్నారో లేదో ముందుగానే తెలుసుకోడానికి వాళ్ళు ఖచ్చితంగా ఓ మనిషినిక్కడ ఉంచి వెళ్ళుంటారు” అంటూ తన అభిప్రాయం వివరించాడు మునుసామి. ఎందుకో అతని మాటలు వాస్తవం కావచ్చనిపించింది అందరికీ.

సరిగ్గా ఇరవై నిముషాల తర్వాత…

ఓ యువకుడ్ని జబర్దస్తీగా లాక్కొచ్చి…

అందరి ముందు పడేసారు కదిరేశన్ మనుషులు.

దారిలోనే వాడ్ని బలంగా కొట్టినట్టున్నారు.గజగజ వణికిపోతున్నాడు.''మన కాలనీ ఎంట్రన్స్ గేటు సమీపంలోనే అటూ యిటూ తిరుగుతూ ఫోన్లో ఎవరితోనో మాట్లాడుతున్నాడన్నా. మమ్మల్ని చూడగానే సెల్ ఆఫ్చేసి పారిపోబోయాడు. ఎంత కొట్టినా నోరు విప్పటంలేదు'' అంటూ రిపోర్ట్ చేసారు. వాడి దగ్గరనుంచి లాక్కున్న సెల్ఫోన్ని విరాట్కి అందించారు. ఫోన్లో పేర్లు చూడగానే అర్థమైపోయింది. వాడు శత్రు మనిషని.''వీడ్ని ఏంచేద్దాం గురువుగారు. మీరు చెప్పిందే నిజమైంది'' అంటూ మునుసామిని అడిగాడు విరాట్.

'ఏం చేయక్కర్లేదు. నోటికి టేప్ అంటించి కాళ్ళు చేతులు కట్టిలోన మూల గదిలో పడేసి తాళం పెట్టండి. తర్వాత చూద్దాం. అంటూ సలహా యిచ్చాడు మునుసామి. ఆ కుర్రాడ్ని అవతలికి లాక్కుపోయారు కదిరేశన్ మనుషులు.ఇంతలో సహస్ర సెల్ఫోన్ మోగింది.దీక్ష సెల్ నంబర్ అది. కాని ఖచ్చితంగా లైన్లో వుంది దీక్ష కాదని తెలుసు, దీక్ష సెల్ నుంచి ఫోన్తనకి చేస్తున్నారు.

నిశ్శబ్దంగా ఉండమని చెప్పి...

స్పీకర్ ఫోన్ ఆన్చేసి...

సహస్రను మాటాడమన్నాడు విరాట్.''ఏయ్ దీక్ష ఇంటికి రాకుండా ఏంచేస్తున్నావే? ఎక్కడున్నావ్?''ఏమీ తెలినట్టే అడిగింది సహస్ర.అటునుంచి వెకిలినవ్వు విన్పించింది.అది మగ గొంతు.''హలో జర్నలిస్ట్ లహరిమేడం. ఎంతయినా జర్నలిస్టువి గదా! బాగానే నటిస్తున్నావ్. నీ ఫ్రండు దీక్ష కిడ్నాప్ చేయబడిరది. ఆ విషయం నీకు తెలుసనినాకు తెలుసు. ఫోన్ నీ ఫ్రండుదయినా మాటాడుతుంది నేను'' అంటూ మరో సారి వెకిలిగా నవ్వాడు అవతలివ్యక్తి.''నేనంటే? ఎవడ్రా నువ్వు?.. మా దీక్ష ఎక్కడ?'' కటువుగా ప్రశ్నించింది.''బలి పశువుగదా ప్రస్తుతానికి దీక్ష మా దగ్గరే క్షేమంగా వుంది. తన ప్రాణాలు ఇప్పుడు నీ చేతిలో వున్నాయి. ప్రాణస్నేహితురాలు గదా. రా. వచ్చి నేను చెప్పే అడ్రస్నుంచి దీక్షను కాపాడుకో. ఒంటరిగా రా. ఒక్కదానివేరా. వెంట ఒక్కమనిషి వచ్చినా దీక్షను నిర్దాక్షిణ్యంగా చంపేస్తాం. గుర్తుంచుకో. నిర్ణయంనీది. నీకు ఒక గంట టైమిస్తున్నాను. టైంలోపల రావాలి....''

''ఒకే. వస్తున్నాను. ఒంటరిగానే వస్తున్నాను. చెప్పరా. అడ్రస్ చెప్పు''

అవతలి వ్యక్తి చెప్పాడు.

పెన్నుతో చిన్న పేపర్ మీదరాసుకుంది సహస్ర. ఆ స్లిప్పు తీసుకొని చూసాడు విరాట్. మీనంబాక్కం ఏర్పోర్ట్ ట్రైనింగ్ సెంటర్ రన్వేని చుట్టి దక్షిణంగా ఎగువున కాలనీకి పోయే రోడ్లో వుండే ఒక పాడుపడ్డ కట్టడం అడ్రస్ అది.

''అరే ఎట్టయప్పా!'' ఫోన్లో పిలిచింది సహస్ర.

''వాడెవడు? నాకు తెలీదు'' అన్నాడు అవతలివ్యక్తి.

''మరి నువ్వెవరు? త్యాగరాజన్కి మరో చెంచావా?'' దబాయించింది.''త్యాగరాజనెవరో నాకు తెలీదు. అయినా నాపేరుతో నీకు పనేంటి? చేతనైతే వచ్చి దీక్షను విడిపించుకెళ్ళు'' కరుగ్గా చెప్పాడు వాడు.''దీక్ష మీ దగ్గరుందని నాకు నమ్మకమేంటి? ఫోన్ దీక్షకివ్వు మాట్లాడాలి''''ఒకే. మాటాడు''పది సెకన్ల తర్వాత విన్పించింది ఓ గొంతు.ఏడ్చేస్తోంది.''సారీ సహస్ర నన్ను క్షమించవే'' అంది ఏడుస్తూనే.''దీక్ష కంట్రోల్ యువర్ సెల్ఫ్. భయంలేదు. చెప్పేది విను'' ధైర్యం చెప్పాలని చూసింది సహస్ర.''నీ మాట వినకుండా బయటకొచ్చి పెద్ద తప్పుచేసాను. బుద్ధొచ్చింది. నా ప్రాణం పోయినా ఫరవాలేదు. చందూని క్షమించమని చెప్పు. నేనేమైనా ఫరవాలేదు. నువ్వు రావద్దు. నిన్ను వీళ్ళు చంపేస్తారు. నీతో మాట్లాడిరది ఎట్టయప్ప...''అంతవరకే విన్పించింది.చెంపమీద కొట్టి ఫోన్ లాక్కునుండాలి ఎట్టయప్ప.

దీక్ష గొంతు కెవ్వుమంటూ ఫోన్లో విన్పించింది.''రేయ్ ఎట్టయప్పా...'' అంటూ కోపంతో రంకెవేసింది సహస్ర.''అరవకు... అర్థమైందిగా. నేను ఎట్టయప్పనే. రా... వచ్చి దీన్ని విడిపించితీసుకెళ్ళు'' అన్నాడు ఎట్టయప్ప.''రేయ్... నువ్వు మగాడివైతే దమ్ముంటే నేరుగా నా ముందుకొచ్చి మాటాడాలి. ఆడపిల్లని అడ్డంపెట్టుకుని నన్ను సాధించాలని చూడ్డం కాదురా. నువ్వు పిరికి పందవుగాబట్టే ఎట్టయప్పను కాదంటూ బొంకావ్. వస్తున్నారా. దీక్షను కొట్టిన నీ చేతుల్ని విరిచేయకపోతే నా పేరు సహస్రకాదు. దానికి ఏమన్నా జరిగితే ఒక్కడు... మీలో ఒక్కడూ ప్రాణాలతో మిగలడు జాగ్రత్త'' అంటూ హెచ్చరించి లైన్ కట్ చేసింది.''ఈ అడ్రసు నీకు తెలుసా?'' స్లిప్ మీది అడ్రస్ను సహస్రకు చూపించి అడిగాడు విరాట్.''తెలుసు. డకోటా విమానాలతో ట్రైనింగ్ యిచ్చే సెంటర్ పక్కగా వెళ్ళే ఈ వీధి ఎగువన ఒక కాలనీకి పోతుంది. మధ్యలో చాలాదూరం ఇళ్ళుండవు. అటుయిటు తోటలు గుబురు పొదలతో అడవిలా ఉంటుంది. అక్కడికి వెళ్ళాలి'' అంది లేచి లోనకెళ్తు సహస్ర.''యు ఆర్ కరెక్ట్.

ఇప్పుడేం చేద్దాం. నువ్వు బల్దేరుతున్నావా?'' అడిగాడు విరాట్.''అవును అట్టే టైం లేదు. ఇప్పుడేవస్తాను'' అంటూ తనగదిలోకి వెళ్ళింది సహస్ర.విరాట్ మునుసామి వంక చూసాడు.ఆయన తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.''చెప్పండి గురువుగారు. సహస్ర బయలుదేరుతోంది. మనం ఏం చేద్దాం? ఈ ప్రమాదం నుండి దీక్షను సహస్రను కూడా మనం కాపాడుకోవాలి. సహస్ర కన్నా ముందే మనం అక్కడికి చేరుకోవటం మంచిదా లేక సహస్రను పంపించి వెనకే వెళ్ళటం మంచిదా?'' అంటూ సలహా అడిగాడు విరాట్.''ఖచ్చితంగా మనం కాస్త వెనగ్గా వెళ్ళటం మంచిది'' అంటూ వెంటనే బదులిచ్చాడు మునుసామి.''చినబాబు. ఇది హేండ్

టు హేండ్ ఫైట్ కాదు. వాళ్ళ లక్ష్యం సహస్ర ప్రాణాలు తీయటం. ఇక్కడ ప్రధాన సమస్య నీకు తెలిందీ కాదు. వాళ్ళ దగ్గర ఆరుగురు షూటర్స్ ఉన్నారు. సహస్ర దీక్ష కోసం రాగానే కాల్చిచంపటం వాళ్ళ ఉద్దేశం. అంతే గాని ఫైటింగ్ వాళ్ళ ఉద్దేశం కాదు. సహస్రను ఒంటిగా బయటికి రప్పించటం కోసమే ఈ కిడ్నాప్ చేసారు. కాబట్టి దీక్ష కోసం సహస్ర చాలా సాహసం చేయాలి.

వాళ్ళంతా అక్కడ పొంచి ఉంటారు. రోడ్డు మీద ఓ కన్నేసి ఉంచుతారు. సమస్ర వెంట గాని వెనగ్గాగాని మనం ఎవరం వెళ్ళినా దీక్ష ప్రాణాలకు గ్యారంటీలేదు. కాబట్టి సహస్రను ముందు పంపించి పదినిముషాలు వెనగ్గా మనం బయలుదేరటం మంచిది. అక్కడికెళ్ళిన సహస్రకూడా మొండిగా వాళ్ళముందుకు పోవటం క్షేమం కాదు. వెళ్ళినట్టే వెళ్ళి వెనక నుంచి దెబ్బకొట్టి, ముందు దీక్షను అక్కడ్నుంచి బయటికి పంపించేయాలి. సహస్రకి వివరంగా చెప్పి పంపించు'' అంటూ సూచించాడు మునుసామి.మునుసామి మాటల్లోనే ధర్మమిత్రబృందం బస్సు రివ్వున వచ్చింది. ధర్మతో సహా అంతా బస్దిగి లోనకొచ్చేసారు. బస్సువీధి చివర రివర్స్ తీసుకుని వచ్చి కదిరేశన్ వేన్ వెనక ఆగింది.ధర్మతో సహా మిత్రులంతా బిలబిలలోనకొచ్చేసారు. జరిగిందివిని ఒక్కసారిగా హతాశులయ్యారు. ధర్మ ఎట్టయప్పమీద కోపంతో మండిపడ్డాడు. అంతా చర్చించుకొని ఒక నిర్ణయానకొచ్చేలోన సహస్రరెడీ అయి బయటికొచ్చింది.సింపుల్గా వైట్ అండ్ వైట్ పంజాబీ డ్రస్ ధరించింది. గ్రీన్ కలర్ చున్నీ మెడలో వేసుకుంది. చూడ్డానికి డ్రస్సు పంజాబి డ్రస్లాగే ఉంటుంది. కాని మార్షల్ ఆర్ట్స్ ఫైట్కి అనుగుణంగా డిజైన్ చేయబడి జేబులు కలిగి ఉంటుంది. జేబుల్లో ప్రత్యర్థుల మీద ప్రయోగించటానికి చిన్న చిన్న ఆయుధాలుంటాయి. వాటితో అవసరమైతే ప్రత్యర్థుల ప్రాణం తీయొచ్చు. లేదా గాయాలు కల్పించి నరకం చూపించవచ్చు.

''నేను బయలుదేరుతున్నాను'' అంది వస్తూనే.విరాట్ లేచి దగ్గరకొచ్చాడు.''సహస్రా ఇది లైఫ్ అండ్ డెత్ గేమ్. బి కేర్ఫుల్. సరిగ్గా పదినిముషాలు ఆగి నీవెనకే బయలుదేరుతున్నాం. ఈలోపు నువ్వు మేనేజ్ చేయాలి. డైరక్ట్ అటాక్ వద్దు. వాళ్ళను ఏమార్చి దీక్షను ముందు అక్కడ్నుంచి బయటికి పంపించెయ్. ఇంతలో మేం వచ్చేస్తాం'' అంటూ హెచ్చరించాడు.''ఒకె. బై' అందరికీ చెప్పి బయటికొచ్చింది సహస్ర. వెంట విరాట్ కూడా వచ్చాడు.స్కూటీ తీసుకొని స్టార్ట్ చేసింది సహస్ర.ఆమె చేతిమీద చేయి వేసి ప్రేమగా నిమిరాడు విరాట్.''జరిగిందాని గురించి బాధపడకు. దీక్షను సేఫ్గా బయటకు తేవటం మనలక్ష్యం. బి కేర్ఫుల్' అంటూ హెచ్చరించాడు.''ఒకే. నువ్వుకూడా జాగ్రత్త'''ఒకే డియర్. టేక్కేర్''

''ఒకే బై''ఎప్పటిలాగే చున్నీతో ముఖం కవర్ చేసుకుంది.ఒంటరిగానే బయలుదేరి వెళ్ళిపోయింది సహస్ర. ఆమెను సాగనంపి విరాట్ లోనకొచ్చాడు. ఎలా చూసినా తామంతా సుమారు ఏభైమందిపైగా వున్నారు. వెళ్ళి జగన్మోహన్ మనుషుల్ని చుట్టుముట్టడం పెద్దసమస్యకాదు. కాని అలా చేస్తే దీక్షప్రాణాలకు గ్యారంటీ లేదు. ఈ విషయం ఇంకా చందూకి తెలీదు. తను ఎప్పటిలాగే ఆఫీసుకు వెళ్ళి పోయాడు.సహస్ర వెళ్ళిన సరిగ్గా పదకొండో నిముషంలో విరాట్ వర్గం బయలుదేరింది. ముందుగా విరాట్ తన బైక్మీద కదిలాడు. ఆ వెనకే మునుసామి తన వాళ్ళతో వేన్లో కదిలాడు. ఆ వేన్ని అనుసరించి కదిరేశన్ వేన్ బయలుదేరింది. చివరిగా ధర్మతన బృందంతో మినీబస్లో అనుసరించాడు. దీక్ష ఇంటికి తాళంపెట్టి ఒకడ్ని మాత్రం అక్కడ కాపలా ఉంచాడు.



సహస్ర దీక్షను బంధించిన చోటుకు చేరుకున్న పదోనిముషంలోనే వీళ్ళంతా అక్కడుండాలి. కాని ఏర్పోర్ట్ రోడ్లో రెండు సిగ్నల్స్ని దాటడంలో ఏర్పడ్డ ఆలస్యంతో ఆ సమయం మరో పదినిముషాలు పెరిగింది. అంటే విరాట్ బృందం సహస్రను పంపించిన పదోనిముషంలో బయలుదేరినా మరో పది నిముషాలు కలిపి ఇరవై నిముషాలు ఆలస్యంగా అడ్రసులోని రోడ్ని చేరుకున్నారు.

ఆరోడ్కి చేరి మలుపు తిరగ్గానే ఎదురుగా నిర్మానుష్యంగా వున్న రోడ్లో రొప్పుతూ రోజుతూ ఒంటరిగా పరుగెత్తుకొస్తున్న దీక్ష కన్పించింది. ఆమెను చూడగానే ఒక్కసారిగి టెన్షన్ చోటు చేసుకుంది. అందరిలో ముందుగా రివ్వున దూసుకొచ్చి దీక్ష పక్కన బైక్ ఆపాడు విరాట్. తమ వాళ్ళను చూడగానే ధైర్యం తెచ్చుకోడానికి బదులు బోరున ఏడ్చి నెత్తి కొట్టుకుంటూ ఉన్న చోటే రోడ్ మీద నిలబడి పోయింది దీక్ష. రివ్వు రివ్వున బ్రేక్లతో కీచ్ కీచ్మని చప్పుడు చేస్తూండగా రెండు వేన్లు మినీ బస్సు ఆగిపోయాయి.

అంతటి ధైర్యం గుండె దిటువు కలిగిన విరాట్ కూడ దీక్ష దుఖ్ఖం చూసి కాస్త చలించాడు. కళ్ళముందు సహస్ర మెదిలింది. ఏమైంది? సహస్ర క్షేమంగా వుందా?

''నేను పాపిష్టి దాన్ని ఎంత చెప్పినా వినకుండా ఈ అనర్ధానికి కారణమయ్యాను. నా పాపానికి ప్రాయశ్చిత్తం లేదు. నాకు బతకాలని లేదు'' అంటూ బోరున ఏడుస్తున్న దీక్షను పక్కన కూచొని భుజం తట్టి ఓదార్చాడు విరాట్.

''దీక్ష ఆపెయ్ ముందా ఏడుపు ఆపెయ్'' అన్నాడు.

''అది కాదన్నయ్యా....'' వెక్కి వెక్కి పడుతూ ఏదో చెప్పబోయింది.

''ఇప్పుడు జరిగిందాని గురించి బాధపడిలాభంలేదు. అక్కడేం జరిగింది? సహస్ర ఎలా ఉంది?''

''నన్ను విడిపించి పంపించేసి వాళ్ళతో పోరాడుతోంది. పారిపోయి వస్తున్న నాకు రివాల్వర్ కాల్పులు విన్పించాయి. వాళ్ళు సహస్రను చంపాలని చూస్తున్నారు...''

ఆమాటలు వినగానే కోపంతో వూగి పోయాడు మునుసామి. ''పదండ్రా! అక్కడ పోరాడుతోంది సహస్ర. మనం వెళ్ళిపోయి ముందు అమ్మాయికి అండగా నిలవాలి. దీక్షకి ధైర్యం చెప్పి విరాట్ వెనకే తీసుకొస్తాడు. పదండి'' అనరుస్తు దిగినట్టే దిగి తిరిగి వేన్ ఏక్కేసాడు.

ఈసారి మినీ బస్సు ముందుకు దూసుకుపోగా వెనకే వేన్లు రెండూ పరుగెత్తాయి. చివరిగా దీక్షను తీసుకుని తన బైక్ మీద బయలు దేరాడు విరాట్.

శిథిల భవనం వద్దకొచ్చేసరికి ఆప్రాంతమంతా నిశ్శబ్దంగా వుంది. అటు యిటు ఎత్తయిన చెట్లు డొంకలు తీగలు పొదలు పిచ్చి మొక్కలతో కూడి చూడ్డానికి అదేదో అటవీ ప్రాంతాన్ని తపిస్తోంది. చాలా దూరం వరకు చూద్దామంటే ఒక్క యిల్లూ కనబడదు. ఆ ప్రాంతాన్ని ఏర్పోర్ట్ అథారిటీస్ విస్తరణకోసం స్వాధీనం చేసుకుంటుందనే పుకార్లు వున్నందున స్థలాల యజమానులెవరూ యిళ్ళు కట్టుకోడానికి సాహసించటం లేదు. ఉన్నదున్నట్టు వదిలేయటంతో అక్కడ ఎటుచూసినా ఎత్తయిన చెట్లు పొదలు డొంకలతో అటవీప్రాంతాన్ని తలపిస్తోంది. ఫోన్లో ఇచ్చిన అడ్రసుప్రకారం పాతకట్టడం కుడి పక్కగా రోడ్డానుకునే వుంది.

పురాతన కాలంనాటి హవేలి వంటి భవనం అది. సువిశాలమైన కాంపౌండ్ గోడలు పూర్తిగా శిథిలమైపోగా ఎంట్రన్స్ కాంపౌండ్ గేట్ ఉండే చోట తలుపులూడిన పెద్దరాతి గుమ్మం ఆర్చిలా నిలబడుంది. దానికి దగ్గరలో బారుగా రాతిస్థంభాలతో కూడిన మండపంలాంటి కట్టడం వుంది. సీలింగ్ చాలవరకు జారిపోయి మొండిగోడలు కొన్ని చోట్ల కన్పిస్తున్నాయి. దానికి తలుపుల్లేని దర్వాజాలు అక్కడక్కడా వున్నాయి. దానికి మధ్యభాగంనుంచి లోనకు దారివుంది.

దానికి అవతల విశాలమైన ఆవరణ వుంది. ఆ ఆవరణ అవతల పెద్ద భవనం తాలూకు మొండి గోడలు కొన్ని చోట్ల సీలింగ్తో కూడి ఇంకా శిథిలంగాకుండా రెండో అంతస్థుకూడా కన్పిస్తున్నాయి. పూర్వం ఎప్పుడో మండువా లోగిలి పద్ధతిలో నాలుగు పక్కలా కలిపి లేపిన పెద్ద భవనం తాలూకు శిథిల ప్రాంతం అది. చూడ్డానికి దయ్యాల కొంపలా వుంది.

విరాట్ బైక్ దిగి దీక్షను తీసుకునిలోన కెళ్ళేసరికి అప్పటికే ఆయుధాలు ధరించి ఓ పక్క ధర్మ బృందం మరో ప్రక్క మునుసామి ఇంకో పక్క కదిరేశన్ బృందం అంతా సహస్ర కోసం ప్రత్యర్థులకోసం ప్రతి అంగుళం గాలిస్తున్నారు.

అంతటా నిశ్శబ్దంగా వుంది.

ఆ ప్రాంతాల్లో ఎక్కడా ప్రత్యర్థులుగాని వారి వాహనాలుగాని లేవు. సహస్ర జాడలేదు. పెద్ద పోరాటమే జరిగిందనటానికి గుర్తుగా అక్కడడక్కడా నేలమీద నెత్తుటి మరకల జాడ తెలుస్తోంది. కాని ఒక్కరూ లేకుండా ఏమైపోయారంతా? సహస్ర ఏమైంది? అందరిలోనూ ఉత్కంఠత నెలకొనుంది. విరాట్ అయితే పిచ్చిపట్టినట్టు ''సమస్రా.. ఏమైపోయావ్? ఎక్కడున్నావ్?'' అంటూ ఆ ప్రాంతమంతా కలతిరుగుతూ అరుస్తుంటే అతడి అరుపులకి శిథిల భవనం పై అంతస్థుల్లోని గబ్బిలాయిలు బెదిరి ఒక్కసారిగి గాల్లోకి లేచాయి.

ఇక్కడ నుండి దీక్ష పరుగెత్తుకొంటూ తమకు ఎదురైనచోట మూడు ఫర్లాంగుల దూరం ఉండొచ్చు. దీక్ష పరుగెత్తుకు రావటానికి పావుగంట సమయం పట్టిందనుకొంటే తిరిగి అయిదు నిముషాల్లో తామంతా యిక్కడున్నారు. అయిదు నిముషాలు కాదు. రెండోనిముషంలోనే వచ్చేసారు. ఈ మధ్యపావుగంట సమయంలో ఇక్కడ ఏంజరిగింది? సహస్ర ఏమైంది? ప్రత్యర్థులేమయ్యారన్నది మిష్టరీగా వుంది.

ఒకవేళ వాళ్ళు సహస్రను చంపి వెళ్ళి పోయారనుకుంటే శవమన్నా అక్కడ పడుండాలి. లేదా దీక్షను తప్పించిన కొద్దిసేపటికే వీలుచూసుకుని సహస్రా పారిపోయి ఉండాలి. అలా జరిగుంటే ఈ పాటికి తను ఫోన్ చేయాలిగదా.

జరిగిన సంఘటనను ఎలా అర్థం చేసుకోవాలో తెలిక ఎక్కడి వాళ్ళక్కడ శిలా విగ్రహాల్లా నిలబడిపోయారు.

ఇంతకీ అక్కడ ఏం జరిగింది?

I I I

ఆ ప్రాంతాన్ని చేరుకోగానే...

ముఖానికి చుట్టుకున్న చున్నీ తీసేసింది సహస్ర.

మబ్బుల్లేని ఆకాశంలో సూర్యుడు తేజోమయంగా ప్రకాశిస్తున్నాడు. సమయం మధ్యాహ్నం పన్నెండు గంటలు కావస్తోంది.అక్కడ శిధిల భవనం వద్ద ఎట్టయప్ప బృందం కాపువేసి ఆమె రాకకోసం ఎదురుచూస్తోంది. తాము వేసింది మాస్టర్ ప్లాన్. ఈ సారయినా సహస్రను చంపలేకపోతే త్యాగరాజన్ ముందు తలెత్తుకోలేడు. అందుకే ఎట్టయప్ప చాలా పట్టుదలగా, పకడ్బందీగా ప్లాన్ వేసుకున్నాడు.మొండి గోడల వెంట చుట్టూ పొజిషన్స్ సెట్ చేసుకుని రెడీగా వున్నారంతా, హర్యానా షూటర్లో యిద్దరు రెండో అంతస్థులో వున్నారు. మిగిలిన నలుగురు షూటర్స్ దిగువున స్థంభాల వెనక సిద్ధంగా వున్నారు. మిగిలిన సుమారు పాతిక మంది ఎట్టయప్ప మనుషులు రకరకాల మారణాయుధాలు ధరించి తలో చోట పొజిషన్స్ తీసుకున్నారు.ఎదురుగా ఖాళీ స్థలంలో...

ఒకరాతి స్థంభానికి...చేతులు వెనక్కి విరిచి కట్టివేయబడుంది దీక్ష. ఎట్టయప్ప కొట్టిన దెబ్బకి ఆమె చెంప ఎర్రగా కందిపోయింది. అరిచిగోల చేయకుండా ఆమె నోటికి టేప్ అంటించారు. చేతులారా తెచ్చుకున్న ఈ కష్టానికి ఆమె కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.సహస్ర లోనకొస్తే ఎదురుగా దీక్ష తప్ప తామెవరూ కన్పించని విధంగా అంతా సెట్ చేసాడు ఎట్టయప్ప. లోనకు రాగానే దీక్షను చూసి సహస్ర పరుగున రావాలి. అలా వస్తుండగానే షూటర్స్ ఆరుగురూ ఆమెను నాలు పక్కలనుంచి పిట్టను కాల్చినట్టు కాల్చి చంపేయాలి. అదీ వాళ్ళప్లాన్. ఇందులో ఏమాత్రం అవకాశం ఇచ్చినా తిరగబడి ఆమె తామందర్నీ చంపేస్తుందని ఎట్టయప్ప భయం. కాబట్టి రాగానే స్పాట్లోనే సహస్రప్రాణం తీయాలని కాచుకునున్నారంతా.

సహస్ర రాకను గమనించేందుకు ఒకడ్ని రెండో అంతస్థు టెర్రస్ మీద కూచోబెట్టారు. వాడు అక్కడ్నుంచి రోడ్ని నిశితంగా గమనిస్తున్నాడు.క్షణాలు భారంగా దొర్లిపోతున్నాయి.అంతలో పైనున్నవాడు గొంతు చించుకొని అరిచాడు. ''అన్నా వచ్చేస్తోంది ఆ పిల్ల స్కూటీమీద వచ్చేస్తోంది. గెట్రెడీ'' అంటూ.''ఒక్కత్తే వస్తోందా వెంట ఎవరన్నా వున్నారా?'' దిగువనుంచి అరిచాడు ఎట్టయప్ప.''ఎవరూ లేరన్నా. సింగిల్గావస్తోంది'' వెంటనే బదులిచ్చాడు పైనున్నవాడు.ఆమాట వినగానే విజయగర్వంతో ఎట్టయప్ప ఛాతీ గుప్పెడు పెరిగింది. సంతోషంతో ఉబ్బిపోతూ మీసం తిప్పాడు. ఈ దెబ్బతో తన పరపతి త్యాగరాజన్ గారి ముందు పదిరెట్లు పెరిగిపోతుంది.''వస్తుందిరా. రాక ఎక్కడికి పోతుంది. స్నేహంకోసం ప్రాణత్యాగం చేస్తున్న వీరనారీ. రానీ... అరు బుల్లెట్లతో ఒకేసారి వీడ్కోలు చెప్దాం'' అంటూ దీక్షను చూసి వెకిలిగా నవ్వాడు. ఓ చేతిలో పొడవాటి బరిసె రెండో చేతిలో వేటకత్తితో పెద్ద పెద్ద అంగలు వేస్తూ పక్కన శిథిలాల వెనక్కు పోయి నక్కాడు.మండుటెండలో...

స్థంభానికి చేతులు వెనక్కి విరిచి కట్టబడున్న దీక్ష కళ్ళనుండి జలపాతంలా వర్షిస్తోంది కన్నీరు. అరవటానిక్కూడా లేకుండా నోటికి టేప్ అంటించారు. సహస్రలోనకు రాకూడదని మనసులోనే వేయి దేవుళ్ళకు మొక్కుకుంటూ గింజుకుంటోంది.అయితే...పైనున్న వాడు అరిచి అయిదు నిముషాలు కావస్తున్నా ఎక్కడా స్కూటీ ఇంజను శబ్దంగాని, సహస్ర రావటంగాని జరక్క పోవడంతో ఎట్టయప్పకి అనుమానం వచ్చింది. ఉన్న చోటునుంచి బయటికొచ్చి పైవాడ్ని చూస్తూ` ''ఏమైంది... ఆ పిల్లేది యింకారాలేదు. దారిలో ఆగిందా?'' అనరిచాడు.అప్పటికే వాడు కంగారుపడుతూ...

అవతల చెట్లవెనక రోడ్ని చూస్తున్నాడు.అటు చెట్ల గుబురు అడ్డురావటంతో వాడికేమీ కన్పించటంలేదు. అయినా ఏదో ఒకటి చెప్పకపోతే ఎట్టయప్ప అరుస్తాడని` ''ఆగినట్టుందన్నా. చెట్ల వెనక ఏముందీ యిక్కడికి తెలీటంలేదు'' అన్నాడు.ఆ మాటతో ఎట్టయప్పకు అనుమానం వచ్చేసింది. దగ్గరకొచ్చి రోడ్డు మీద ఎందుకు ఆగినట్టు? ఏదన్నాప్లాన్తో వచ్చిందా? ఏం జరిగిందో చూడాలనే ఉద్దేశంతో వడివడిగా రోడ్ మీదకు వచ్చాడు. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉండటం చూసి సాచి ముఖం మీద గుద్దినట్టు ఉలిక్కి పడ్డాడు.నిజంగా సహస్ర వచ్చిందా? లేక వచ్చినట్టు తమవాడు అబద్ధం చెప్పాడా! వస్తే ఇంతలో ఏమైంది? అయినా తనగురించి తెలీదా? తమ వాడు అబద్ధం ఎందుకు చెప్తాడు? ఏంజరుగుతోంది? గిరుక్కున లోనకు పోడానికి వెనుతిరిగాడు.సరిగ్గా అప్పుడే రెండో అంతస్థు శిధిలాలపైనుంచి కెవ్వుమంటూ వినవచ్చిందో ఆర్తనాదం. అదిరిపడి లోనకు పరుగెత్తిన ఎట్టయప్పకి రెండో అంతస్థు శిథిలాలపైనుంచి జారిపడిపోతూ కన్పించాడు తమ మనిషి.వాడి మీద అటాక్ జరిగిందా...లేక కాలుజారి కిందపడ్డాడు అర్థంగాక...ఉన్నచోటే శిలా విగ్రహంలా నిలబడి పోయాడు ఎట్టయప్ప.

I I I

తను చేరాల్సిన ప్రాంతాన్ని సమీపించగానే సహస్ర ఎగువకు గమనిస్తూ స్కూటీ వేగాన్ని తగ్గించింది.దూరంలో ఉండగానే చెట్లవెనక రెండో అంతస్థుపైన మొండిగోడపైనుంచి ఒకడు రోడ్నే కనిపెట్టి చూడటం గమనించింది.నేరుగా లోనకెళ్ళటం ఎంత ప్రమాదమో ఆమెకు తెలుసు. ప్రత్యర్థులు ఎవరెక్కడ ఏఏ పొజిషన్లో ఉన్నారో తెలిదు. దీక్షను ఎరగా వుంచి తనకు గాలం వేసి

చంపాలని చూస్తున్నారు. తనకు అనుకూలంగా పరిస్థితిని మలుచుకోవాలంటే కొంచెం రిస్క్ చేయక తప్పదు. ఏమాత్రం తేడా వచ్చినా అటుదీక్ష ఇటు తను ఇద్దరిలో ఎవరో ఒకరి ప్రాణం పోవటం ఖాయం. అయినా సాహసం చేయాలి తప్పదు. ఎట్టయప్పకు వూహించని షాకివ్వాలి.ఆలోచిస్తూనే...రోడ్ పక్క ఎత్తయినా చెట్ల కిందకు రాగానే...ఉన్నట్టుండి స్కూటీని దారి మళ్ళించింది. రోడ్డు వదిలి వేగంగా కుడి పక్క చెట్ల మధ్యగా పొదల వెనక్కి పోనిచ్చింది. కొంచెం దూరం వెళ్ళగానే గుబురు పొదల వెనక ఇంజన్ ఆపి స్కూటీని స్టాండ్ వేసింది. చెట్టు పుట్టల్ని కవర్ చేసుకుంటూ శిథిరల భవనం వెనక తట్టువైపు పరుగు తీసింది.మూడే మూడు నిముషాల్లో సగం కూలిన కాంపౌండ్ గోడను చేరుకుంది. నిశ్శబ్దంగా ఉంది అంతటా. మెడలోని చున్నీని తీసి నడుంకి బిగించి కట్టుకట్టుకుంది. మూడు రాళ్ళను దాటి గోడను సమీపిస్తుండగా రాళ్ళమధ్యనుంచి కస్సుమని పడగవిప్పి చివ్వున లేచిందో నల్లత్రాచు. అంతకన్నా వేగంగా కదిలింది సహస్ర చేయి పాము పడగ కింద ఒడిసి పట్టుకుని లేపింది. మూడు మూరల పొడవు కోడె త్రాచు 'సారీ డియర్. అనవసరంగా నాజోలికొచ్చావ్. ఇప్పుడు అవసరానికి నిన్ను వాడుకుంటున్నాను. సారీ' అంటూ దాని తలమీద తట్టి రెచ్చగొడుతూ ముందుకు కదిలింది.

మొండి గోడను కవర్ చేసుకుంటూ ఆవరణవైపు చూసింది. ఎక్కడి కక్కడ శిథిలావస్థలో వున్న ఆ పురాతన భవంతి వెనక తట్టు ఎవరూ కాపలా వున్న జాడలేదు. ఎవరూ తనను గమనించక ముందే మెరుపు వేగంతో పరుగెత్తి కూలిన రాళ్ళపైనుంచి గెంతుతూ పదిక్షణాల్లో మొదటి అంతస్థు బాల్కానీలోకి వెళ్ళిపోయింది. అదే సమయంలో అటు పక్క ఆవరణలోంచి ఎట్లయప్ప పైన కాపలా వున్న వాడ్ని ఇంకా రాలేదని అడగటం వాడు స్కూటీ రోడ్ మీద ఆగినట్టుందని బదులివ్వటం ఆ అరుపులు ఆమెకి విన్పించాయి.క్షణం కూడా ఆలస్యం చేయకుండా లోనకు పరుగెత్తి కూలిన టెర్రస్ శిథిలాల మీదుగా రెండో అంతస్థు బాల్కానీకి చేరుకొని పైకి చూసింది. పైన మొండిగోడమీద వున్న కాపలా వాడు తనకోసం రోడ్ వంక చూస్తూ ఆ ధ్యాసలో వున్నాడు. దిగువన ఆవరణ స్పష్టంగా కన్పిస్తోంది. మధ్యలోని స్తంభానికి కట్టబడి మండుటెండలో నిలబడుంది దీక్ష. నోటికి టేప్ అంటించ బడి గింజుకుంటోంది. ఎట్టయప్ప ఏంజరిగిందో చూడ్డానికి పెద్ద పెద్ద అంగలతో రోడ్ మీదికి పోతున్నాడు. ఓ చేతిలో బరిసె ఓ చేతిలో వేట కత్తి పట్టుకునున్నాడు వాడు.దీక్ష ఉన్న పరిస్థితి చూడగానే... కోపంతో భగ్గుమంది సహస్ర.

ఇక వెనక ముందు చూడలేదు.

బుసలు కొడుతూ చేతిలో మెలికలు తిరుగుతున్న నల్లత్రాచును తోక పట్టి గిరగిర తిప్పి విసిరేసింది పైన కాపలా వున్నవాడి మీదకి అంతే...గింగిరాలు తిరుగుతూ వచ్చి మీద పడిన నల్లత్రాచు కసికొద్దీ వాడ్ని ఇష్టానికి కాట్లు వేసింది. ఏంజరిగింతో అర్ధంమయ్యేలోపే వాడు చావు కేకలు పెడుతూ గోడపైనుంచి కిందపడిపోయాడు. ఇక వాడి ప్రాణాలకు గ్యారంటీ లేదని సహస్రకు తెలుసు. శిథిలం గాకుండా వున్న గదుల్లోంచి దూరి ముందు భాగం వైపు పరుగెత్తింది. దట్టంగా సాలెగూళ్ళు, ధూళితో నిండి వున్న ఆ గదులు ప్రస్తుతం గబ్బిలాయిలకి ఆవాసంగా ఉపయోగపడుతున్నాయి.ఉన్నట్టుండి సహస్ర అటుగా దూసుకురావటంతో వాటి ప్రశాంతతకి భంగం కలిగింది. బెదరి రొదచేస్తూ ఒక్కసారిగా గోల చేసాయి. ఈలోపల `అక్కడ రెండో అంతస్థులో ముందు పక్కస్థంబాల వెనక సిద్ధంగా పొజిషన్స్లోవున్నారిద్దరు షూటర్స్. పైనున్నవాడు అరచి కింద పడ్డంతో షాక్తిని పొజిషన్స్ వదిలి వాడి వద్దకు పరుగెత్తారు. వాళ్ళలో ఒకడు పారిపోతున్న నల్ల తాచును గమనించి రివాల్వర్తో షూట్ చేసాడు. పాము తల బుల్లెట్స్తో ఛిద్రం

కాగా ఎగిరి గోడవతలినుంచి కిందకు పడిపోయింది.

“ఏంటి? ఏమైందిరా! ఎందుకురా కిందపడ్డాడు వాడు?”దీక్షను కట్టి ఉంచిన చోటునుంచి ముందుకొస్తూ అరిచాడు ఎట్టయప్ప.“పాము సార్.. పాము కాటేసింది. పాముని షూట్ చేసాం. వీడు బతకడనుకుంటా. నోటినుంచి నురగలు వస్తున్నాయి” అంటూ బదులిచ్చాడు ఒకడు.ఇదే సమయంలో...ఒక్కసారిగా రొదచేస్తూ గబ్బిలాయిలు లేచి బయటకు ఎగిరిపోతుండటం చూసి అదిరిపడి అటు చూసిన షూటర్స్ ఇద్దరికీ సుడిగాలిలా బయటకు దూసుకొస్తున్న సహస్ర కన్పించింది. కంగారుపడి వాళ్ళిద్దరూ రివాల్వర్లు గురిపెట్టేలోన పరుగునవస్తూనే వేగంగా తన చేతులకు పని చెప్పింది సహస్ర. అంగుళం పిడి రెండంగులాల బ్లేడ్తో సన్నగా ఉండే చురికలు రెండు గాలిని చీల్చుకుంటూ దూసుకొచ్చి ఒకడి కుడి భుజంలోన రెండోది రెండోవాడి గొంతు పక్కన దిగబడ్డాయి. అంతే...

దారుణంగా అరుస్తూ కూలబడి పోయారిద్దరూ. చేతుల్లోని రివాల్వర్లు ఎగిరి శిథిలాల మధ్యలో ఎటో పడిపోయాయి.సహస్ర ప్రయోగించిన చురికలు సాధారణ చురికలు కావు. వాటి చివర బాణం మొన షేప్లో కొక్కేల్లా వుంటాయి. అవిదిగటం వరకే, దిగాక బయటకి తీయాలంటే డాక్టర్ సాయంలేకుండా సాధ్యంకాదు. గాలం ముల్లులా కొక్కేలు కండను పట్టేసి నరకం చూపిస్తాయి.దిగువనున్న ఎట్టయప్ప రెండో అంతస్థులో ప్రత్యక్షమైన సహస్రను చూడగానే షాక్తో నిలబడి పోయాడు. వెంటనే కంగారుతో... “వచ్చేసిందిరా నాయనో ఆ డెవిల్ వచ్చేసింది పై అంతస్తులో ఉంది. పొండి.. కాల్చి చంపండి. షూట్ హర్’ అంటూ గొంతు చించుకొని అరిచాడు.అంతటితో అంతవరకు ఎట్టయప్ప బిగించిన ఉచ్చు సడలిపోయింది. ఎక్కడి వాళ్ళక్కడ పొజిషన్స్ వదిలి పై అంతస్థు వైపు పరుగులు తీసారు.షూటర్స్ ఇద్దర్ని నేలకూల్చటంతో అక్కడ ఆగలేదు సహస్ర. కిందవాళ్ళు పైకి వచ్చేలోన మెట్లదారి వైపు పోకుండా బొంగరంలా తిరిగి వచ్చిన దారినే లోనగదుల్లోకి పరుగులు తీసింది. వాళ్ళంతా పైకి వచ్చేసరికి తను వెనక పక్క కూలిన శిథిలాలమీదుగా దూకుతూ కిందకు వచ్చేసింది. ఈలోపల...ఆవరణలో వున్న ఎట్టయప్ప జరుగుతున్న పరిణామాల్ని చూసి కోపంతో వూగిపోయాడు. తను వేసింది తిరుగులేని ప్లాన్ అనుకున్నాడు.

సహస్రరాగానే పిట్టను కాల్చినట్టు కాల్చి చంపొచ్చనుకున్నాడు. కాని చేతికి దొరికినట్టే దొరికి చేజారనున్న విజయాన్ని తలచుకోగానే కోపంతో భగ్గుమన్నాడు. తను పన్నిన వ్యూహాన్ని ఛేదించి సహస్రలోనకొచ్చిందంటే ఆమెను ఆపటం కష్టమని తెలుసు. దాంతో విచక్షణా జ్ఞానాన్ని మర్చిపోయి వేగంగా దీక్షముందుకెళ్ళాడు. అంతా చూస్తూనే వుంది దీక్ష. సహస్ర రాకను గమనించగానే ఆమె గుండె వేగం మరింత హెచ్చింది. ఎట్టయప్ప వంక భయం భయంగా చూస్తోంది.“ఏంటే అలా చూస్తావ్. నీ ఫ్రండు నిన్ను విడిపించి తీసుకెళ్తుందనే ధైర్యమా? అది ఆడపిల్ల కాదు. ఆడపిశాచి, రాక్షసి. మా ప్లాన్కి కౌంటర్ ప్లాన్ వేసింది. నన్ను చావు దెబ్బకొట్టాలనుకుంటోంది. నిన్ను విడిపించుకెళ్ళాలని వచ్చింది. ఒంటరిగా రమ్మంటే వచ్చినట్టే వచ్చి దొంగ దెబ్బ కొడుతోంది. వదులుతానా? దాన్ని చంపి నిన్ను ప్రాణాలతో వదలాలనుకున్నా. ఇపుడు నిన్ను చంపి ఆపిశాచికి పెద్ద షాకిస్తా’ నీ తల నరికి దానికి పిచ్చిపట్టేలా చేస్తా’ అనరుస్తూ చివ్వున వేటకత్తిని పైకి లేపాడు. వాడి ఆవేశం చూసి గజగజా వణికింది దీక్ష. క్షణం ఆగితే`

దీక్ష తలతెగి నేలమీద దొర్లేదే!

భయంతో కళ్ళుగట్టిగా మూసుకుంది.కాని ఆఖరి క్షణంలో...



దీక్షకు బదులు...

ఎట్టయప్ప బాధతో పొలికేక పెట్టాడు.

ఉలికిపడి కళ్ళు తెరిచిన దీక్షకు...

ఆయుధం వదిలి కింద పడి పోతూ కన్పించాడు ఎట్టయప్ప. వాడి కుడి భుజంలో ఒక ఛురిక, ఎడం భుజంలో ఒక నక్షత్రం లాంటి చక్రం దిగబడి ఎర్రగా నెత్తురు పొదుగుతోంది. సరిగ్గా భుజం. నరాల మీద నాటుకోవటంతో చేతులు రెండూ చచ్చు బడినట్టయి పోయి కదల్లేక బాధతో అరుస్తూనే వున్నాడు. వాడికి వెనగ్గా సుడిగాలి మాదిరి దూసుకొస్తూ కన్పించింది సహస్ర.

వస్తూనే కోపంతో వాడ్ని ఎండం కాలితో తన్ని వాడు వదిలేసిన ఆయుధాలు బరిసెను కత్తిని అందుకుంది. కళ్ళలో నిప్పుల వర్షిస్తుండగా ఉగ్రమూర్తిలా ఉరిమి చూసింది వాడి వంక.''ఇది నా ప్రాణం రా. దీక్షని అడ్డం పెట్టుకుని నన్ను చంపాలని చూస్తావ్ రా చేత కాని వెధవ? దీన్ని చెంప దెబ్బ కొట్టినందుకు నీ చేయి విరిచేయాలకున్నాను. ఏకంగా తల నరకాలని చూసావ్. ఇక క్షమించను. నీ చేతులు నరికేస్తున్నాను. పోయి ఆ పంది కొక్కు త్యాగరాజన్తో చెప్పు. తప్పులు ఒప్పుకొని చట్టానికి లొంగి పోతే సరి. లేకుంటే ఏదో రోజు వాడికీ నీ గతే పడుతుంది'' అంటూ వేట కత్తిని లేపింది.

''వద్దు.. ప్లీజ్... వద్దు వద్దు'' అనరిచాడు ఎట్టయప్ప. ప్రాణభయం అంటే ఏమిటో ఇపుడు వాడి కళ్ళలో కన్పిస్తోంది.

నిర్దాక్షిణ్యంగా ఎట్టయప్ప రెండు చేతుల్ని మణికట్టు వద్దకి నరికేసింది సహస్ర. ఎట్టయప్ప వేసిన భయంకరమైన గావు కేకతో ఆ ప్రాంతం మారు మోగింది. ఆ సంఘటన చూసి గొల్లున అరిచారు ఎట్టయప్ప మనుషులు.చేతులు నరికిన మరు క్షణమే గిరుక్కున తిరిగి దీక్ష నోటికి అంటించిన టేప్ని లాగేసింది సహస్ర. అట్టే టైం లేదు. అవతల రెండో అంతస్థుకి పరుగెత్తిన గుండాలంతా కిందకు వచ్చేస్తున్నారు. ఒకే వేటుతో దీక్ష బంధనాల్ని తొలగించింది.ఏడుస్తూ సారీ చెప్పి తనను వాటేసుకోబోతున్న దీక్షను విసురుగా వెనక్కి నెట్టేసింది సహస్ర. ''యూ బ్లడీ ఫూల్! సారీలకు ఏడ్వడానికి టైం లేదు. వాళ్ళొస్తే ఇద్దర్నీ చంపేస్తారు. పారిపో.. ముందిక్కడ్నుంచి పారిపో'' అనరిచింది.''నువ్వూ నాతో వచ్చేయ్యవే'' అంది అమాయకంగా దీక్ష.

''వాళ్ళ అంతు చూసి వెనకే వచ్చేస్తాను. వాళ్ళు నీ వెంట పడకుండా ఆపుతా. పారిపో. గో ఫాస్ట్'' అంటూ మరో సారి దీక్షను తోసి వెనుతిరిగింది సహస్ర. అప్పటికే ఎట్టయప్ప మనుషులు కిందకు దిగి అరుపులు కేకలతో దూసుకొచ్చేస్తున్నారు. అంతే...మరోసారి సహస్రతో చెప్పించుకునే పని లేకుండా కాలి కొద్ది వేగంగా రోడ్ వైపు పరుగుతీసింది దీక్ష.త్యాగరాజన్ వద్ద...

ఎట్టయప్ప తర్వాత నంబర్ టు స్థానంలో వున్న వాడు పాండ్యన్ అనే గుండా. ఎట్టయప్ప వెంట మధురై నుంచి వచ్చిన వాళ్ళలో వీడొకడు. ముప్పై లోపు వయసులో నల్లగా దుక్కలాంటి మనిషి. త్యాగరాజన్ నిర్ణయం ప్రకారం ఎట్టయప్ప ఏం చేయాలో స్కెచ్ వేసి చెప్పగానే తమ మనుషులతో అమలు చేయించేది ఈ పాండ్యనే.ఎప్పుడైతే సహస్ర ఎట్టయప్ప చేతులు నరికేసిందో, ఎప్పుడైతే అంత వరకూ బంధీగా వున్న దీక్ష తప్పించుకు పోతోందో, వెంటనే ''ఆ రాక్షసి మన ఎట్టయప్ప చేతులు నరికేసిందిరా ఆ పిల్ల దీక్ష తప్పించుకోకూడదు. దాన్ని ఆపండి అరే ఎక్కడ చచ్చార్రా ఈ హర్యానా షూటర్స్ కాల్చమనండిరా. వాళ్ళిద్దర్నీ కాల్చి

చంపమనండి'' అనరుస్తూ హెచ్చరిస్తూ సహస్ర వైపు పరుగునెత్తుకున్నాడు పాండ్యన్.సహస్ర ఓ చేత బరిసే రెండో చేతిలో నెత్తురోడుతున్న వేట కత్తితో బలి కోరుతున్న అమ్మవారిలా అక్కడే నిలబడుంది. ఎప్పుడైతే కొందరు దీక్ష వెనక పరుగెత్తబోయారో ఆ మరు క్షణం చేతిలోని వేట కత్తిని బలంగా వాళ్ళ వైపు విసిరింది.గింగిరాలు తిరుగుతూ వస్తున్న వేట కత్తిని చూసి గొల్లున అరుస్తూ వాళ్ళంతా వెనక్కి పరుగులు తీసారు.

వేట కత్తి వాళ్ళని హెచ్చరిస్తున్నట్టుగా నేలలో దిగబడింది. ఈ లోన బయటకు పారిపోయి రోడ్ మీద అదృశ్యమైంది దీక్ష. ఇక ఆమె వెంట పడ్డానికెవడికీ ధైర్యం చాల్లేదు. ఎందుకంటే చేతిలో బరిసెతో అపర చండీలా నిలబడుంది సహస్ర. ఈ సారి బరిసె విసిరతే ఎవడు చస్తాడో తెలిదు. చెట్టంత ఎట్టయప్ప చేతుల్నే నరికేసింది. తామెంత? ఆ అమ్మాయి గురించి తెలిసే ముందుకెళ్ళటమంటే కళ్ళు మూసుకొని ఆత్మ బలి దానం చేసుకున్నట్టే. అందుకే సహస్ర రాగానే కాల్చి చంపండి. హేండ్ టు హేండ్ ఫైటింగ్కి పోవద్దంటూ త్యాగరాజన్ సార్ పదే పదే హెచ్చరించాడు. ఎట్టయప్ప అలాగే ప్లాన్ చేసాడు. కాని ఆ పిల్ల తెలివి ముందు తమ ప్లానంతా మట్టి కొట్టుకు పోయింది. అనుకుంటూ దీక్ష కోసం పరుగెత్తే ఆలోచన విరమించుకొని పాండ్యన్ వైపు వచ్చేసారు వాళ్ళంతా. చాలా వేగంగా వెంట వెంటనే జరిగి పోయిన సంఘటనలివి. చేతులు తెగిన ఎట్టయప్ప నేల మీద దొర్లుతూ పెడ బొబ్బలు పెడుతూనే వున్నాడింకా.

తను ఒంటిగా నిలబడితే షూటర్స్ కాల్చి చంపేస్తారని సహస్రకు తెలుసు. అప్పటికే పాండ్యన్ గుంపుకి వెనక వస్తున్న షూటర్స్ నలుగురు రివాల్వర్లు గురి చేస్తున్నారు. తను గుంపులో జొరబడి వాళ్ళని మరింత కన్ ఫ్యూజ్ చేస్తే గాని బుల్లెట్లకు అందకుండా తప్పించుకోలేదు. అలా చేయాలంటే షూటర్స్ని కాస్సేపు ఆపాలి. సహస్ర జేబు లోంచి మినీ ఛురికలు నక్షత్రం షేపు లోని మినీ చక్రాల్ని వెంట వెంటనే షూటర్స్ దిశగా ప్రయోగించింది. సూర్యకాంతిలో మెరుపులు వెదజల్లుతూ తమ వైపు వస్తున్న ఆ మినీ ఆయుధాల్ని చూడగానే షూటర్స్ గుండె బేజారయింది. వాటి దెబ్బకి ఇప్పటికే తమ వాళ్ళిద్దరు రెండో అంతస్తులో ఎందుకూ పనికి రాకుండా పడున్నారు. వాటికి అందకుండా తప్పించుకోడానికి తిరిగి వెనక్కి పరుగు తీసారు నలుగురూ. ఆ గేప్లో బరిసె గిరగిర తిప్పుతూ సుడిగాలి మాదిరి గుంపుకి ఎదురు పరుగెత్తి వాళ్ళ మధ్యకు దూసుకు పోయింది సహస్ర.

ఆమె అంత సాహసం చేస్తుందని పాండ్యన్ కూడా వూహించలేదు. అతడి హెచ్చరికల్ని కూడా పట్టించుకోకుండా గొల్లున అరుస్తూ ఆయుధాలతో సహస్రను చుట్టు ముట్టారంతా. సహస్ర బరిసెను గిరగిరా తిప్పుతూ పోరాటం చేయనారంభించింది.బరిసె తిప్పటంలో ఆమె వేగం మెళకువలు చూసి పాండ్యన్ అంతటి వాడే ఆశ్చర్యపోయాడు. ఓ పక్క బరిసెను బాణాకర్ర మాదిరి తిప్పి ఆత్మరక్షణ చేసుకుంటూనే మరోపక్క సందు చూసి ఆమె కొడుతున్న బరిసె దెబ్బకి వంటి మీద దారుణమైన గాయాలు ఏర్పడి చావు కేకలు పెడుతున్నాడు ఒక్కొక్కడు.గుప్పెడు లావున ఆరడుగుల పొడవు దృఢమైన కర్ర చివర తప్పడగా మొగ్గ షేపులోని ఉక్కు లొడుగు బిగించబడి ఉంటుంది దానికి. రెండువైపులా పదునుండి చాలా ప్రమాదమైన ఆయుధం బరిసె. పొడిస్తే గుండెల్ని చీల్చేస్తుంది. తాకితే దారుణమైన గాయాల్ని చేస్తుంది. ''కొట్టండి, నరకండి... చంపండి'' అంటూ గుండాలు అరుపులతో ఆప్రాంతం మారుమోగులోంది. పరిస్థితి చూస్తున్న పాండియన్కి సహస్ర వ్యూహం అర్థమైపోయింది. వెంటనే... ''ఒరే తప్పుకోండి దూరంగా తప్పుకోండి. మీరు తప్పుకుంటే మనవాళ్ళు దాన్ని కాల్చి చంపేస్తారు. లేకపోతే మనందర్ని అది చంపేస్తుంది. వెనక్కి వచ్చేయండి''

అంటూ గొంతు చించుకొని అరిచాడు.పాండ్యన్ గొంతు విన్న మరు క్షణమే గుండాలంతా అలర్టవుతూ నేలక్కొట్టిన బంతుల్లా సహస్రను వదిలి వేగంగా చెదిరి పోనారంభించారు. వాళ్ళు తప్పుకుంటే తన ప్రాణాలకు ముప్పని సహస్రకు తెలుసు. ఎప్పుడైతే వాళ్ళు చెదిరపోనారంభించారో మరు క్షణం నేల మీది ఇనప రాడ్ ఒకటి అందుకొని తన వైపు రివాల్వర్లు గురి చేస్తున్న షూటర్స్ వైపు విసిరింది.

గింగిరాలు తిరుగుతూ వస్తున్న ఇనప రాడ్ను చూడగానే మరోసారి షూటర్స్ పక్కలకు పరుగు తీసారు. ఆ గేప్లో సహస్ర బరిసె వదలకుండా వేగంగా ఆవరణ లోంచి రోడ్ వైపు పొడవుగా వున్న శిథిలాల మండపం వైపు పరుగు తీసింది.''పారి పోతోంది. ఆపండిరా దాన్ని కాల్చి పారేయండిరా'' షూటర్స్ని హెచ్చరిస్తూ చిందులేస్తున్నాడు పాండ్యన్. కాల్పులు జరుపుతూ సహస్ర వెనక పడ్డారు నలుగురూ.బుల్లెట్లు గాల్లో దూసుకొస్తున్నాయి.తల మీదుగా దూసుకుపోతున్నాయి.కాళ్ళ వెనకే దుమ్ము తెరలు లేపుతున్నాయి.బుల్లెట్ల రేంజికి అందకుండా జిగ్ జాగ్గా పరుగులు తీస్తూ కన్ను మూసి తెలిచేలోన ఆవరణ దాటి వరండాలోకి వచ్చేసింది సహస్ర.పక్కనే రోడ్ వుంది.తనిప్పుడు రోడ్ దాటి అవతల చెట్ల తోపు లోకి పోతే చాలు. తను సేఫ్. వాళ్ళు పట్టుకోలేరు. కాని ఆ వెనకే రోడ్ వెంట ఏ జీప్లోనో పారిపోతున్న దీక్షను సులువుగా పట్టి వాళ్ళు చంపేస్తారు. పది నిమిషాల్లో వెనకే వచ్చేస్తామన్న తమ వాళ్ళింకా రాలేదు. వచ్చేవరకు వీళ్ళని ఆపుతూ తనిక్కడే ఉండాలి. లేదా పోరాడుతూ చావాలి. చచ్చేలోన కనీసం నలుగుర్ని చంపి తను చావాలి.

వరండాలోకి తప్పించుకున్న సహస్ర...ఒక ఎంట్రన్స్ పక్కన గోడకి స్థంభానికి మధ్యలో ఒదిగి కూచుంది. ధ్యాసంతా పక్కన ఎంట్రన్స్ వైపు ఎవరు వచ్చినా వేసేయడానికి సిద్ధంగా ఉంది.ఇదే సమయంలో ఆవరణలోని పాండ్యన్తో బాటు షూటర్స్ కూడా, ఎప్పుడైతే సహస్ర మండపం లోకి వెళ్ళి పోయిందో వెంటనే దూకుడు ఆపి ఉన్న చోట ఆగి పోయారు. ముఖ్యంగా షూటర్స్ నలుగురూ పాండ్యన్ సలహా మేరకు విడిపోయి ఒక్కొక్కడు ఒక్కొ ఎంట్రన్స్ వైపు రివాల్వర్లు గురి చేసి నెమ్మదిగా కదిలారు.ఆవరణ నుంచి మండపం కిందుగా రోడ్ మీదకు నాలుగు దారులున్నాయి. సుమారు రెండు వందల అడుగుల పొడవు మండపం అది. రోడ్డు అక్కడికి దిగువనుండటంతో ఆవరణలో వాళ్ళకి మండపంలో వాళ్ళగ్గాని అవతల రోడ్ కనబడదు. ఆచి-తూచి అడుగు ముందుకు వేయకపోతే ఏ ఎంట్రన్సోంచి సహస్ర దాడి చేసి ఎంత మందిని చంపుతుందో తెలిదు. అందుకే రివాల్వర్లతో కవర్ చేస్తూ నాలుగు మార్గాల వైపు విడి విడిగా కదిలారు షూటర్స్.లోపల స్థంభం పక్కప ఒదిగి బరిసెతో రెడీగా వున్న సహస్ర ధ్యాసంతా పక్కన ఎంట్రన్స్ మీద ఉండటంతో వెనక నుంచి ముంచుకొస్తున్న ప్రమాదాన్ని ఆలస్యంగా గుర్తించింది. తన వెనక ఏదో అలికిడి ఎవరో వస్తున్నారు. అదిరి పడి గిరుక్కున వెనక్కి చూసింది సహస్ర కాని అప్పటికే ఆలస్యమై పోయింది. సహస్ర తల తిప్పి చూసే లోపే ఆమె ముఖం మీదికి ఏదో బలంగా స్ప్రే చేయబడింది. అంతే ఆ తర్వాత ఏం జరిగిందో సహస్రకి తెలిదు.

క్షణాల్లో తెలివి తప్పి కిందకు వాలి పోయింది. వాలీ వాలక ముందే ఆమెను ఎత్తి భుజం మీద వేసుకుని రోడ్ మీదకు పారి పోయిందో ఆకారం.మరో అర నిముషం ఆలస్యంగా మండపం లోకి వచ్చిన షూటర్స్కి అక్కడ సహస్ర కన్పించ లేదు. పాండ్యన్తో సహా అంతా బిల బిలా రోడ్ మీదికొచ్చేసారు. కనుచూపు దూరంలో వాళ్ళకి ఎక్కడా సహస్ర జాడ తెలీటంలేదు. అంత దూరంలో ఇద్దరు కుష్టు

వ్యాధి గ్రస్థులు తోపుడు బండిలో మరో కుష్టు వ్యాధి గ్రస్తుడ్ని తోసుకుంటూ కంజీరా వాయించి పాటల పాటుకొంటూ వెళ్తున్నారు.''ఒరే... ఆ గండ్రా'' అనరిచాడు పాండ్యన్.ఆగి తిరిగి చూసాడు వాళ్ళలో ఒకడు.''లోపల్నుంచి ఓ అమ్మాయి పారిపోయి వచ్చింది ఎటెళ్ళిందో చూసారా?'' అనడిగాడు పాండ్యన్.''చూసాము సార్, రోడ్ దాటి అదో ఆ తుప్పలు దాటి చెట్ల లోపు లోకి పారిపోయింది'' అని చెప్పి తమ దారిన ముందుకెళ్ళిపోయారు వాళ్ళు.తాము రోడ్ దాటి వెళ్ళినా అడవి లాంటి ఆప్రాంతంలో ఇక సహస్రను పట్టుకోడం అసాధ్యమని గ్రహించాడు పాండ్యన్. ఆ కోపం ఈ కోపం తమ వాళ్ళ మీద, హర్యానా షూటర్స్ మీద చూపిస్తూ వెంటనే బయలుదేరమని ఆర్డరిచ్చాడు.అంత వరకు కాస్త దూరంలో చెట్ల వెనక వుంచిన మూడు వేన్లు రివ్వున దూసుకొచ్చాయి. చేతులు తెగిన ఎట్టయప్పతో బాటు పాము కరచి చచ్చిన వాడి శవాన్ని క్షత గాత్రులని ఒక్కడ్ని కూడా వదలకుండా అందర్ని వేన్లోకి చేర్చారు. అక్కడ్నుంచి దక్షిణంగా అటు పక్క కాలనీ మీదుగా ఆస్పత్రి వైపు వేగంగా దూసుకు పోయాయి వేన్లన్నీ.నిజానికి అటుగా వెళ్తున్న కుష్టు వ్యాధి గ్రస్తులిద్దరూ వేరెవరో కాదు. కోయంబేడు మురడన్ ముత్తు, వాడి శిష్యుడును. తోపుడు బండిలో కంబళి కప్పబడి వున్న మూడో మనిషి వేరెవరో కాదు మత్తు మందు ప్రభావంతో తెలివి తప్పిన సహస్ర. తల నుంచి పాదాల వరకు కంబళి కప్పేయటంతో ఎవరూ వూహించలేదు.నీ ప్రయత్నమనేది ఆపకు, ఏదో రోజు అదృష్టం నీ ఇంటి తలుపు తడుతుంది అని పెద్దలు వూరికే చెప్పలేదు ఇపుడా అదృష్టం ముత్తు తలుపు తట్టింది.

రక రకాల వేషాలతో సహస్ర కోసం వాళ్ళంతా గాలిస్తూనే వున్నారు. ఇవాళ అనుకోకుండా దిగువ కాలనీ మీదుగా ఏర్పోర్ట్ వైపు పోతున్న మురడన్ ముత్తు ఆ హవేలి ప్రాంతానికి రాగానే స్థంభం పక్కన ఒదిగి సిద్ధంగా మాటు వేసి వున్న సహస్రను గుర్తించటంలో పొరబాటు పడలేదు. అవతల ఆవరణ లోంచి కేకలు హెచ్చరికలు విన్పిస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో కాస్త సాహసం చేయక పోతే పనులు కావు. తెగించి పిల్లిలా సహస్ర వైపు కదిలి సాధించాడు.వాళ్ళు కొంత దూరం వెళ్ళే సరికి హడావుడిగా వేన్లు బైక్ మీద దీక్షతో సహా విరాట్ అంతా ఎదురయ్యారు. ఆ వెనకే ఒక ఆటో రివ్వున వచ్చి ఆగింది. బండిలో సహా సహస్రను ఆటో లోకి చేర్చి ఇద్దరూ ఎక్కి కూచున్నారు. అంతే క్షణంలో ఆటో ఆ ప్రాంతం నుంచి అదృశ్యమైంది.అటు పాండ్యన్ తమ వాళ్ళతో రామ పురం ఆస్పత్రి వైపు, ఇటు మురడన్ ముత్తు ఆటోలో తమ దారిన దూరంగా వెళ్ళి పోతుండగా విరాట్ బృందం నిర్మానుష్యంగా వున్న శిథిల భవంతికి చేరుకుంది.

*******************************************

సహస్ర ఎక్కడ?

ఏమై పోయింది?

ఇక్కడ ఏం జరిగి వుంటుంది?

అక్కడ చెల్లా చెదురుగా పడున్న కర్రలు, ఇనప రాడ్లు మొదలైన మారణాయుధాల్ని, నేల మీది నెత్తుటి మరకల్ని చూస్తుంటే ఖచ్చితంగా సహస్ర ప్రత్యర్థులతో దారుణంగా ఘర్షణ పడిందనటంలో, పోరాటం చేసిందనటంలో సందేహం లేదు. కాని ఉన్నట్టుండి ఈ ప్రదేశం నిర్మానుష్యంగా అవటం అక్కడ సహస్ర జాడ లేక పోడం బోలెడు అనుమానాలకు తావిస్తోంది. అసలు, సహస్ర ప్రాణాలతో ఉందా అనే సందేహం కూడా కలుగుతోంది.

ఎవరికీ ఏమీ అంతు పట్టడం లేదు. ఒక్క అయిదు నిముషాలు ముందుగా వచ్చుంటే పరిస్థితి వేరుగా వుండేది. ఎంతో ధైర్యంగా ఉండే విరాట్ కూడా ఆక్షణంలో డీలా పడిపోతూ కూలబడి పోయాడు.

మరో ప్రక్కన...

ఈ అనర్థమంతటికీ తనే కారణమన్న బాధతో కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది దీక్ష. ఎంత వెతికినా సహస్ర ఆచూకీ లేదక్కడ. మునుసామి, ధర్మ, కదిరేశన్ అంతా విరాట్ వద్ద కూర్చున్నారు. విరాట్ భుజం మీద చెయ్యేసాడు మునుసామి.''ఏమై ఉంటుంది? వాళ్ళు సహస్రను చంపేసుంటారా?'' రుద్ధ కంఠంతో విరాట్ అడుగుతుంటే బాధగా ముఖ ముఖాలు చూసుకున్నారంతా.''చిన బాబు ఏం మాటలవి?'' అంటూ కోప్పడ్డాడు మునుసామి.

''సహస్ర ఏమన్నా సాధారణ ఆడపిల్లా వాళ్ళ చేతుల్లో చావటానికి? రాచనెత్తురు. సాహసానికి మారు పేరు. ఆమెను చంపే మొనగాడున్నాడా? ఎందుకిలా అధైర్య పడతావ్? ఏమో శత్రువుల్ని తరుముకెళ్ళిందేమో చూద్దాం వెయిట్ చేద్దాం. అన్నట్టు స్కూటీ.. సహస్ర వచ్చిన స్కూటీ ఎక్కడ? ఈ ప్రాంతం లోనే ఒక్కడో వుంటుంది? వెతకండిరా వెతికి తీసుకు రండి. అన్నాడు మునుసామి.'' ఆ మాట వినగానే స్కూటీని వెదుకుతూ పరుగెత్తారు నలుగురు.

''సహస్ర వద్ద సెల్ ఉందిగా ఓ ఫోన్ కొట్టి చూడరా'' సలహా ఇచ్చాడు ధర్మ.

ఆ మాట వినగానే...

విరాట్ లో తిరిగి ఆశ చిగురించింది.

వెంటనే తన సెల్ నుంచి ఫోన్ చేసాడు.అవతల ఫోన్ రింగవుతోంది.కాని ఎత్తటం లేదు.ఇకసారి.... రెండోసారి..... మూడో సారి.ఫోన్ ఆన్ లోనే వుంది రింగవుతోంది. ఎత్తటం లేదంటే... తిరిగి సందేహం, విరాట్ ఇంకా డీలా పడిపోవటం చూసి... ''ఆపకు ఇంకో సారి ఫోన్ చేయ్ చిన బాబు'' అన్నాడు మునుసామి.విరాట్ ప్రయత్నం ఫలించింది.నాలుగో సారి ఫోన్ లిఫ్ట్ చేయబడింది.''సహస్రా.... ఆర్ యు ఒకే?'' ఆత్రంగా అడిగాడు విరాట్.అటునుంచి ఒక వికటాట్టహాసం...అతడి ప్రశ్నకు సమాధానంగా...''ఎవరు? ఎవడ్రా నువ్వు?'' కోపంతో ముఖం జేగురిస్తుండగా గద్దించాడు విరాట్.''ఎవర్నా... నేనెవర్నా? .... కిడ్నాపర్ని. ఇపుడు నీ సహస్ర మా బందీ'' అన్నాడు అవతలి వాడు.విరాట్కి పిచ్చి పట్టినంత పనైంది.అసలేమైందిక్కడ?త్యాగరాజన్ మనుషులేమయ్యారు? మధ్యలో ఈ కిడ్నాపర్లు ఎలా వచ్చారు? ఎవరు వాళ్ళు? సహస్రను ఎక్కడకు తీసుకు పోతున్నారు? ఫోన్లో వెనక ఏదో ఆటో పరుగెడుతున్న ఇంజన్ సౌండ్ వినబడుతోంది. త్యాగరాజన్ మనుషుల్నే ఇరగ దీసిన సహస్ర ఈ కిడ్నాపర్లకి ఎలా చిక్కింది? మధ్యలో వీళ్ళెవరో వస్తే ఎట్టయప్ప వాడి మనుషులు వూరుకుంటారా. నిజంగా కిడ్నాపా లేక తనను డైవర్ట్ చేయటానికి ఎట్టయప్ప వేసిన మరో ఎత్తుగడా!.''మీరు కిడ్నాప్ చేస్తున్నారని నమ్మకం ఏంటి? ఫోన్ సహస్రకివ్వు'' డిమాండ్ చేసాడు విరాట్.''అబ్బో! నీ గురించి ఈ పిల్ల గురించి మాకు తెలీదనుకున్నావా? నువ్వు చిరుతయితే ఈ అమ్మాయి శివంగి. స్పృహలో వుంటే మమ్మల్ని నంజుకు తినేయదూ? మత్తు మందిచ్చాం. స్పృహలో లేదు. తెలివి రాగానే మాటాడిస్తాలే.''

ఆ మాటలు వింటుంటే విరాట్కి నిజంగానే పిచ్చి పడుతున్నట్టుంది. అవతల వ్యక్తి గొంతు గంభీరంగా ఏమీ లేదు. ఎవడో కుర్ర వెధవలా మాటాడుతున్నాడు. ఒకటనుకుంటే ఇక్కడ మరేదో జరుగుతోంది.''ఎవడ్రా నువ్వు? తను మీకెలా చిక్కింది?'' విసుగ్గా అడిగాడు.''ఆ చెప్పేస్తారండి పాపం, చెప్పను. చెప్పనంతే''''ఎక్కడికి తీసుకెళ్తున్నారు?''''అదీ చెప్పను''''ఇంకేం చెప్తావ్ రా?''''ఏదీ చెప్పనంటున్నానా?''''సహస్ర నిజంగా ప్రాణంతో వుందా?''

''అదేంటి బాసూ అంత మాటనేసావ్. మేం కిడ్నాపర్లం. హంతకులం కాదు. తను బతికుంటేనే గదా మాకు లాభం. తను నిక్షేపంగా వుంది. డౌట్ వద్దు. రాత్రికి ఫోన్ చేసి మాటాడిస్తా.''''మీ డిమాండ్ ఏమిటి?''''డబ్బు''



“ఎంత?”

“మాకేం పెద్ద ఆశ లేదులే. నా ప్రియురాల్ని పట్టిస్తే కోటి అని ప్రకటనిచ్చావ్గా.... అదప్పటి నీ మాట. మూడు కోట్లిచ్చి ప్రియురాల్ని విడిపించుకెళ్ళు. ఇదిప్పటి మా మాట. రాత్రికి ఫోన్ చేస్తాను. సహస్రతో మాటాడి నమ్మకం కుదిరాకే నువ్వు డబ్బు రెడీ చెయ్యి. ఎక్స్ చేంజి ఎప్పుడు ఎక్కడ ఎలాగో రేపు చెప్తాను” అంటూ మరో మాటకి అవకాశం యివ్వకుండా లైన్ కట్ చేయటమే కాదు. స్విచ్చాఫ్ చేసేసాడు అవతల.

విరాట్ అయోమయంగా చూసాడు అందరి వంక.

‘‘ఏమైందిరా కిడ్నాపేంటి? ఎవరు వాళ్ళు?’’ అనడిగాడు పక్కనే వున్న ధర్మ.

‘‘అదే అర్ధమై చావట్లేదురా. అంతా గందరగోళంగా వుంది’’ అంటూ అవతలి వాడేం చెప్పిందీ వివరించాడు విరాట్.

అంతా విని మునుసామి దీర్ఘంగా ఆలోచిస్తూ ‘‘ఫోన్లో ఆటో శబ్దం వినన్పించిందన్నావ్ కదూ?’’ అనడిగాడు.

‘‘అవును వాళ్ళింకా సహస్రతో ఆటోలో ప్రయాణిస్తున్నారు. నాకెందుకో ఇది మరో నాటకం అన్పిస్తుంది’’ అన్నాడు విరాట్.

‘‘లేదు. దీనికీ త్యాగరాజన్ మనుషులకీ సంబంధం లేదు.’’ అన్నాడు స్థిరంగా మునుసామి.

‘‘ఎలా? మనకెలా తెలుస్తుంది. సంబంధం లేదని?’’ అనడిగాడు కదిరేషన్.

‘‘కొంచెం బుర్ర పెట్టి ఆలోచించండ్రా. వాళ్ళు సహస్రని ఆటోలో కిడ్నాప్ చేస్తున్నారు. జగన్మోహన్ మనుషులకి వాహనాలున్నాయి. ఆటోల్లో తిరగరు. రెండోది మాట్లాడిన వాడి గొంతును బట్టి ఇరవైకి కాస్త అటు యిటు వయసుంటుందని విరాట్ చెప్తున్నాడు. అంత చిన్న కుర్ర వెధవలెవరూ ఎట్టయప్ప వద్ద లేరు. కాబట్టి అమ్మాయి గురించి మనం భయపడాల్సింది లేదు. కిడ్నాప్ జరిగింది నిజం.’’

‘‘వీళ్ళు మాత్రం సహస్రని ఆటోలో ఎలా తీసుకెళ్తారు....? దారిలో ఎవరన్నా సహస్రను గుర్తు పడితే తాట తీస్తారని భయముండదా?’’ అనడిగాడు మరొకడు.

‘‘ఏ దుప్పటో ముసుగేసి పేషంట్ లా తీసుకెళ్తే ఎవడు గుర్తు పట్టేది. వాళ్ళేమీ తెలివి తక్కువ వాళ్ళు కాదు.’’ చెప్పాడు మునుసామి.

ఇంతలో... వెళ్ళిన నలుగురూ దీక్ష స్కూటీని చెట్ల వెనక వెదికి పట్టుకొని అక్కడికి తీసుకొచ్చారు.

అప్పటికి మధ్యాహ్నం...

ఒంటి గంట కావస్తోంది సమయం...

కాని వారికి ఆకలి దప్పులు లేవు.

తీవ్రంగా ఆలోచిస్తూ మౌనంగా వున్నాడు విరాట్. ఎవరికి వాళ్ళు కాస్సేపు నిశ్శబ్దంగా ఉండిపోయారు. దీక్ష మాత్రం మోకాళ్ళ మధ్య ముఖం దాచుకొని ఏడుస్తూనే ఉంది. ఉన్నట్టుండి లేచి దీక్ష పక్కకెళ్ళి కూచున్నాడు విరాట్.

''దీక్షా! నువ్విలా ఏడ్చినందువల్ల లాభం ఏమన్నా వుందా? అయిందేదో అయింది. సహస్ర క్షేమంగా ఉంది. కాదంటే కిడ్నాపర్స్ చేతిలో వుంది. అడిగిన డబ్బిచ్చి తీసుకొచ్చేద్దాం. ఏడవకు'' అన్నాడు.

''సారీ అన్నయ్యా ఇదంతా నావల్లే. సహస్ర ఎంత చెప్పినా వినకుండా వచ్చి మీ కష్టాలకి కారణమయ్యాను.'' ఆమెకు అనేక విధాల నచ్చచెప్పి ఓదార్చాడు విరాట్.

''ఇప్పుడేం చేద్దాం చిన బాబు వెనక్కి వెళ్ళిపోదామా?'' అడిగాడు మునుసామి.

''ముందు దీక్షను సేఫ్ గా ఇంటికి పంపించేయాలి'' అన్నాడు విరాట్.

''ఏం తల్లీ నీ స్కూటీలో ఇంటికెళ్ళిపోగలవా?'' అనడిగాడు మునుసామి.

''నా వల్ల కాదు. స్కూటీ నడప లేను. సమయానికి సహస్ర అడ్డు పడకుంటే ఎట్టయ్యప్ప చేతిలో అప్పుడే నా తల తెగి పడుండేది. ఇప్పటికీ నాకు గుండె దడ కాళ్ళు వణుకు తగ్గ లేదు.'' అంటూ సహస్ర వచ్చినప్పట్నుంచి తను రోడ్ వెంట పరుగెత్తే వరకు, తను

చూసిన సంఘటనలు సహస్ర పోరాటం గురించి దీక్ష వివరిస్తుంటే అంతా విభ్రాంతి చెందారు. ముఖ్యంగా సహస్ర ఎట్టయ్యప్ప చేతుల్ని మణికట్టు వద్దకి నరికేసిందని తెలిసి అచ్చెరువొందారు.

అప్పటికప్పుడు కదిరేషన్ మనుషుల్లో ఒకడ్ని స్కూటీ నడపమని చెప్పి దీక్షను వెనక కూచోమని ఇంటికి పంపించేసారు. పంపించే ముందు ఈ విషయాన్ని చందూకి ఫోన్ చేసి ఇప్పుడే చెప్పక ఆఫీసు నుంచి వచ్చే లోపలే మేం కాలనీకి వచ్చేస్తాం అలాగే విశాలకి ఏమీ చెప్పకు తెలిసిందంటే పనులన్నీ మానుకొని వచ్చేస్తుంది. నువ్వు ధైర్యంగా ఉండు. సహస్ర క్షేమంగా వస్తుంది. అంటూ హెచ్చరించాడు విరాట్. అలాగే కదిరేషన్ మనిషితో నువ్వు దీక్ష ఇంటి దగ్గరే మీ వాడితో ఉండిపో. మన లోన గదిలో బంధించిన కుర్రాడితో ఇక పని లేదు. వాడ్ని వదిలేయండి'' అన్నాడు.

స్కూటీ వెళ్లిపోగానే..

మునుసామి వంక చూసాడు విరాట్.

''ఈ అనర్థం మొత్తానికి కారణం ఎవరు గురువు గారూ?'' అనడిగాడు.

''ఇంకెవరు చినబాబు. దీక్షేగా....... ఆ పిల్ల బయటకు రాకుండా ఇంట్లో ఉంటే ఇదంతా జరిగేది కాదుగా'' చెప్పాడు మునుసామి.

కాదన్నట్టు తల అడ్డంగా వూపాడు విరాట్.

''మీరు కూడ పొరబాటు పడుతున్నారు చూసారా? అసలు ఆ త్యాగరాజన్ సహస్రను చంపించటం కోసం ఇలాంటి నీచమైన స్కెచ్ వేసి మనుషుల్ని పంపించక పోతే సమస్యలు వచ్చేవి కాదు గదా. మధ్యలో వచ్చి ఎవరో సహస్రను కిడ్నాప్ చేయరు గదా.''

''ఆ మాట నిజమే అనుకో కాని పందిని బురదలో దొర్లాకుండా ఆపగలమా? త్యాగరాజన్ వెధవని మనకు తెలుసు. అవునా?

''అందుకే... జరిగిందానికి వాడేం సమాధానం చెప్తాడో తెలుసుకోవాలనుంది.''

‘‘అంటే నీ ఉద్దేశం? వెళ్ళి ఇరవై ఏడో నెంబర్      ఇంటి మీద పడదామా?’’

ఇప్పుడు ధర్మ కల్పించుకుంటూ పడ్డం కాదు అంకుల్ విరాట్ ఉద్దేశం. ఓసారి మన సత్తా ఏమిటో రుచి చూపిస్తే గాని వాడి తిక్క తీరదు. లేక పోతే మళ్ళీ మళ్ళీ వెధవ ప్లాన్లు వేసి సహస్ర ప్రాణం తీయాలని చూస్తాడు’’ అంటూ వివరించాడు.

‘‘మనం తొందర పడుతున్నామేమో....పట్ట పగలు దాడి చేస్తే తర్వాత పోలీస్ కేసులు గొడవలు...’’ గుర్తు చేసాడు కదిరేషన్.

‘‘ఆ భయమక్కర్లేదు. పోలీస్ కేసు పెడితే ఉచ్చు తనకే బిగుస్తుందని వాడికి తెలుసు. ఇపుడు సహస్రను చంపాలని చేసిన కుట్ర మొత్తం బయట పడుతుంది. గాబట్టి అలాంటి పిచ్చి పని చేయడు’’ అన్నాడు విరాట్.

‘‘అయితే ఆలస్యమెందుకు? బయల్దేరండి’’ అంటూ లేచాడు మునుసామి. అంతే...

మరో మూడు నిముషాల్లో బయలుదేరిన విరాట్ బృందం వాహనాలు కీల్పాకం వైపు శర వేగంతో పరుగు      ఆరంభించాయి.

ఈ ఈ ఈ

కీల్పాక్కం...

ఇరవై ఏడో నంబరు యిల్లు...

ప్రస్తుతం ఆ భవంతిలో చాల మంది గుండాలున్నారు. అయినా అది చాలా నిశ్శబ్దంగా గంభీరంగా కన్పిస్తోంది. ఉదయం నుంచి త్యాగరాజన్ ఎక్కడికీ వెళ్ళ లేదు. దీక్షను బంధించిన విషయం తెలిగానే సహస్ర చావు కబురు కోసం ఎదురు చూస్తూ మేడ మీద

తన ఫ్లాట్ లోనే వున్నాడు.

ఎట్టియప్ప వెంట పాండ్యన్ తో బాటు ఆరుగురు హర్యానా షూటర్లు, పాతిక మంది తమ మనుషులు వున్నారు. తన స్కెచ్ కి డోకా లేదు. సహస్ర అంతమైన శుభవార్త తెలుస్తోందని కొండంత ఆశగా ఎదురు చూస్తుండగా సహస్ర తప్పించుకున్న వార్త పిడుగు పాటులా తెలిసింది.

దీక్షను క్షేమంగా విడిపించుకుంది. ఎట్టియప్ప చేతులు నరికేసింది. పాము విసిరి ఒకడ్ని చంపింది. షూటర్స్ లో ఇద్దరితో సహా పన్నెండు మంది దారుణమైన గాయాల పాలయ్యారు. ఇంతా చేసి సహస్ర నిక్షేపంగా పారిపోయింది. వాళ్ళందర్ని ఆస్పత్రిలో చేర్పించి రాబోతున్నాడు పాండ్యన్. వాళ్ళింకా రాలేదు.

తన పథకం మట్టి కొట్టుకు పోయి ఈసారి కూడ ఓడి పోడంతో కోపం, అశాంతి, అసహనంతో మగ్గి పోతూ ఫ్లాట్ లో మందు కొడుతూ కూచున్నాడు. కింది అంతస్థులో లోకల్గా రిక్రూట్ చేసిన గుండాలు నలభై మంది వరకు వున్నారు. వాళ్ళలో ఎవడికీ త్యాగరాజన్ని సమీపించటానికి ధైర్యం చాలటం లేదు.

ఇక్కడ త్యాగరాజన్ కి తెలిని విషయం తను కీల్పాక్కంలో వున్న సంగతి ఎవరికీ తెలిదనుకొంటున్నాడు. విరాట్ వర్గానికి ఈ అడ్రసు తెలుసన్న సంగతి తెలిస్తే బహుశ అంత తీరిగ్గా అక్కడ ఉండేవాడు కాదేమో.

సరిగ్గా ఒంటి గంటా నలభై నిముషాలు అవుతుండగా విరాట్ బృందం దాడి ఆరంభమైంది.

రెండు వేన్లు మినీ బస్సు రివ్వున దూసుకొచ్చి దుమ్ము తెరలు రేపుతూ గేటు బయట ఆగాయి. అవి ఆగీ ఆగక ముందే బయటకు దూకేసారంతా.

లోపలి వాళ్ళు ఎవరూ వూహించని సంఘనట ఇది. పైగా వచ్చినది తమ వాహనాలనుకొని వాళ్ళెవరూ అలర్టా లేరు. ఒక్క సారిగా లోనకు దూసుకొస్తున్న గుంపును చూసి కంగారు పడి ఆయుధాలు అందుకునే లోపలే విరాట్ వర్గం సునామిలా విరుచుకు పడ్డారు వాళ్ల మీద. దొరికిన వాడ్ని దొరికినట్టు విరగ దీయ నారంభించారు. అసలేం జరుగుతుందో తెలుసుకునే అవకాశం కూడ వదల్లేదు. ఈ లోపల విరాట్ మెట్ల దారి వెంట వేగంగా పైకి పరుగెత్తాడు.

తన ఫ్లాట్లో వున్న త్యాగరాజన్...

దిగువ నుంచి అరుపులు కేకలు విన్పించటంతో ఒక్క సారిగా అదిరి పడ్డాడు. ఎవరైనా గాని తన అడ్డా మీద దాడి చేసిన వాళ్ళని ప్రాణాలతో వదల కూడదని రివాల్వర్ అందుకొని వేగంగా కిందకు పరుగెత్తుకొచ్చాడు. దాంతో మొదట అంతస్థు దాటకుండానే విరాట్ త్యాగరాజన్ మెట్ల పైన ఒకరి కొకరు ఎదురు పడి పోయారు. అటు త్యాగరాజన్ ఇటు విరాట్ కూడ ఒకేసారి ఒకరి కొకరు రివాల్వర్లు గురి చేసుకున్నారు. నిజానికి విరాట్కి రివాల్వర్ లేదు. ఆ రోజు ధనగిరి మనిషి నుంచి వశ పర్చుకున్న రివాల్వర్ని జాగ్రత్త చేసాడు. దీక్ష కిడ్నాపయిన విషయం తెలిగానే ఎందుకైనా మంచిదని దాన్ని లోడ్ చేసి వెంట తెచ్చాడు. అది ఇక్కడ ఉపయోగ పడింది.

విరాట్ కి మూడు మెట్ల పైన త్యాగరాజన్ వున్నాడు.

ఇద్దరిలో ఒక్కరూ రివాల్వర్ దించ లేదు.

దిగువున హాల్లోను, బయట కూడ హోరా హోరీగా సాగుతున్న పోరాటం చూస్తుంటే త్యాగ రాజన్కి మతిలేదు. వచ్చిన వాళ్ళు తన మనుషుల్ని చితగొట్టేస్తున్నారు. తరిమి తరిమి కొడుతున్నారు. తన స్థావరం వీళ్ళకెలా తెలిసిందో బుర్ర చించుకొన్నా అర్థం గావటం లేదు.

“ఏమిటాలోచిస్తావ్ కాలుస్తావా? కాల్చు..... రివాల్వర్ మీద నీ వేలు కదిలిందంటే నాకన్నా ముందు నువ్వు ఛస్తావ్ చావుకు సిద్ధమేనా?” అరిచాడు విరాట్.

“ఎవరూ ఎవర్ని చంపక్కర్లేదు పో.............. నీ మనుషుల్ని తీసుకొని వెంటనే ఇక్కడ్నుంచి వెళ్ళిపో. లేదంటే కాల్చేస్తాను” హెచ్చరించాడు త్యాగరాజన్.

“ఎలా వెళ్తాను?......... మర్యాదగా సహస్రను అప్పగించు” వెళ్ళిపోతాను.

‘‘యుమీన్............ జర్నలిస్ట్ లహరి?’’

‘‘అవును’’

‘‘నాకేం తెలుసు? ఎక్కడికొచ్చి ఏమడుగుతున్నావో అర్ధమవుతోందా?’’ అరిచాడు త్యాగరాజన్.

విరాట్ కోపం హద్దులు దాటి పోయింది.

‘‘ఎవరితో మాటాడుతున్నావో తెలిసే మాటాడుతున్నావా? నీకేం తెలీదా? ఎట్టయప్ప ఎవడి మనిషిరా’’ అంటూ మెట్లపై నుంచే ఎగిరి పైన నిలబడున్న త్యాగరాజన్ కాళ్ళ మీద తన్నాడు. వూహించని విరాట్ అటాక్తో బాలన్స్ తప్పి కెవ్వున అరుస్తూ వెనక్కి విరుచుకు పడి పోయాడు త్యాగరాజన్. చేతిలో రివాల్వర్ ఎగిరి అవతల పడింది. గాభరాలో రివాల్వర్ ని చేజిక్కించుకోవాలని అటు దొర్లాడు. కాని అంతకు ముందే గెంతుతూ మెట్ల పైకి వచ్చేసిన విరాట్ ఆ రివాల్వర్ని కూడ స్వాధీనం చేసుకున్నాడు.

‘‘లేరా.......... పైకి లే’’ కరుగ్గా హెచ్చరించాడు.

‘‘లేవక పోతే ఏం చేస్తావ్? ఎవడ్రా నువ్వు? చంపేస్తావా? నన్ను చంపేస్తావా? మా తాత మాజి సియం. మాది బలమైన ప్రతిపక్ష పార్టీ. మా డాడీ సెంట్రల్ మినిస్టర్. నా వెనక పార్టీ కేడర్ వుంది.’’

త్యాగ రాజన్ మాటలు పూర్తి కాక ముందే...

విరాట్ చేతిలోని రివాల్వర్లు రెండూ ధన్ ధన్ మంటూ ఘర్జించాయి. అదిరి పడి కాళ్ళు వెనక్కి తీసుకొని లేచి నిలబడ్డాడు త్యాగరాజన్.

‘‘పద.......... మనం సెటిల్ చేసుకోవాల్సిన విషయాలు చాల వున్నాయి. ఇప్పుడు నిన్ను చంపటానికి ఒక్క బుల్లెట్ చాలు. నువ్వు ఛస్తుంటే నీ మాజి సియం తాత గాని, ఢిల్లీ లోని కేంద్ర మంత్రి నీ బాబు గాని, మీ పార్టీ కేడర్ గాని, నువ్వు కూడబెట్టిన ఆ

పొర ధన వాశి గాని ఏదీ నిన్ను కాపాడలేదు. ప్రాణాలు దక్కాలంటే చెప్పినట్టు విను పద" అంటూ హెచ్చరించాడు విరాట్.

ఇద్దరూ మేడ పైకి వచ్చారు.

ఓపెన్ టెర్రస్లో తను సోఫా మీద కూచొని ఎదురుగా త్యాగ రాజన్ ని కూచోమన్నాడు విరాట్.

"చెప్పు నా సహస్ర ఎక్కడ? ఏం చేసావ్?" అడిగాడు.

"మా దగ్గర లేదు" అన్నాడు ఆశ్చర్య పోతూ త్యాగ రాజన్.

"వేరెక్కడుంది?"

"మా దగ్గర లేదంటున్నాగా. ఎక్కడుందో నాకెలా తెలుస్తుంది. మా వాళ్ళ రిపోర్ట్ ప్రకారం తప్పించుకు పారి పోయింది. అంతే."

"అంతే అంటే? పారి పోతే నా వద్దకి రావాలిగా. ఇంత వరకు రాలేదు. ఖచ్చితంగా మీ వాళ్ళే ఏదో చేసుండాలి."

"చేయడానికి ఏముందిక్కడ? ఒకడి మీద పామును విసిరి చంపింది. ఇద్దరు షూటర్స్ భుజాలు చేతులు చచ్చు బడిపోయాయి. ఎట్టయప్పని చేతులు నరికేసింది. పది మందిని దారుణంగా గాయ పరిచి తప్పించుకు పోయింది. ఎట్టయప్పనే కాల్చేసాక నీ సహస్రని ఎవరేం చేయగలరు? ఆ పిల్ల సాధారణ యువతి కాదు. రణ చండి. పాతిక మంది కొమ్ములు తిరిగిన మగాళ్ళనే చావు దెబ్బ కొట్టి తన స్నేహితురాల్ని విడిపించుకు పోయింది. మెచ్చుకోవాలి. అలాంటి అమ్మాయిని మెచ్చుకోవాల్సిందే. కాని తను నా శతృవు. మెచ్చుకోలేను. ఆ పిల్ల మా దగ్గర లేదని మాత్రమే చెప్ప గలను. వాళ్ళందర్ని ఆస్పత్రిలో చేర్చి పాండ్యన్ మిగిలిన వాళ్ళు కాస్సేట్లో ఇక్కడికి వస్తారు. కావాలంటే వాళ్ళని అడుగు" జరిగింది చెప్తారు.

"సో……… తను పారి పోయింది నిజమంటావ్"

‘‘అదేగా చెప్తున్నాను’’

‘‘సో......... వాట్ నెక్స్ట్?’’

‘‘అంటే......... ఇంకా ఏం చెప్పాలి?’’

‘‘రెండు సార్లు తనను చంపాలని ప్లాన్ వేసి ఫెయిలయ్యావ్ గదా. ఈ సారి ఏం చేయాలనుకుంటున్నావ్? ఇంకో ఇరవై రోజులే వుంది. సైదా పేట కోర్టు కి తనూ వెళ్ళాలి, నువ్వూ వెళ్ళాలి. ఈ లోపలే సహస్రను చంపటం నీ లక్ష్యం...... మూడో ప్రయత్నం ఏమిటి? ఎలా చంపిస్తావ్?’’

ఒకింత ఆలోచించాడు త్యాగరాజన్.

‘‘ప్రస్తుతానికి నాదగ్గర ఎలాంటి ప్లాను లేదు. ఆ అమ్మాయిని చంపాలని కూడ అనుకోడం లేదు. కండ బలంకన్నా బుద్ధి గొప్పది కదా. ఆ బలాన్ని జయించలేనప్పుడు ఓటమి భరించి మిన్నకుండటం మంచిది. కాబట్టి ఇంకోసారి ప్రయత్నించాలనుకోడం లేదు. కాని....... చెప్పలేను. నా బుద్ధిబలం ఎప్పుడెలా ఉంటుందో చెప్పలేం. ఇవాళకి ఆలోచనలు లేవు, ఉండక పోవచ్చు. బుద్ధి, కర్మానుసారిణి అన్నారిందుకే. కాబట్టి నీ సహస్ర మా చేతిలో చావకుండా మీ జాగ్రత్తలో మీరుండటం మంచిది’’ అన్నాడు.

‘‘ఒకె....... చివరిగా ఓప్రశ్న అడుగుతున్నాను చెప్పు. ఇది టివి ఇంటర్వ్యూ కాదు. ప్రజల్ని ఏమార్చినట్టు నన్ను నమ్మించలేవు’’ అన్నాడు విరాట్.

‘‘జనం? ....’’ అంటూ ఫక్కున నవ్వాడు త్యాగరాజన్.

‘‘జనం గురించి వదిలేయ్. గొర్రెల మంద’’ అన్నాడు నవ్వుకుంటూ.

“తప్పు.      ప్రజల్ని తేలిగ్గా తీసేయకు. జనాన్ని మీరు గొర్రెల మంద అనుకొంటే ఆ మందను కాచే ఏసు క్రీస్తు దేవుడయ్యాడు. గొర్రెల మంద లాంటి జనాన్ని పరిపాలిస్తున్న మీ నాయకులెందుకు దేవుళ్ళు కాలేక పోతున్నారు?”

“మాటలతో మెలిక పెట్టాలని చూడకు మిస్టర్ విరాట్. ఉపమానాలు నాకు వచ్చు. గోవుల్ని కాచి గోపాలుడు దేవుడయ్యాడు. గొర్రెల్ని కాచి క్రీస్తు దేవుడయ్యాడు. రాక్షసుల్ని చంపిన రాముడూ దేవుడయ్యాడు. నరాధముల్ని వధించి పరశు రాముడూ దేవుడయ్యాడు. అయితే ఏమిటి? మానవుడు ఆశా జీవి. ఆశకు అంతు లేదు. అదృష్టం కలిసొచ్చి అవకాశాలు వచ్చినప్పుడే అందినంతా దోచుకోవాలి. నేను చేస్తోంది అదే. ఇప్పుడు గొప్పగా నీతులు చెప్పే బుద్ధిమంతుడు కూడ తన వంతు వస్తే నా లాగే చేస్తాడు.”

“ఒకె నిన్ను చూస్తుంటే ఇప్పటికిప్పుడే చితగొట్టి చంపేయాలనిపిస్తోంది. కాని వయసులో పెద్ద వాడివని ఆ పని చేయలేక వెళ్ళి పోతున్నా. కాని సహస్ర తిరిగి రాలేదంటే మాత్రం మళ్ళీ వచ్చి నిన్ను చంపేస్తాను. గుర్తుంచుకో” అంటూ చర చరా మెట్ల దారి వైపు కదిలాడు. కిందకు పో బోతూ ఆగి తిరిగి చూసాడు.

“పిచ్చి ముదిరితే ప్రమాదమన్న సంగతి నీకు తెలిందే కాదు. లోకంలో ఏ పిచ్చికైనా మందుంది గాని నీలాంటి డబ్బు పిచ్చికి మందు లేదు. భూ కుంభకోణాలతో పుచ్చి పోయావ్. నీకు మరుజన్మంటూ వుంటే ఖచ్చితంగా ఆ భూమి పైనే కుమ్మరి పురుగై పుట్టి మట్టి తిని బతుకుతావ్” అని చెప్పి చర చరా కిందికొచ్చేసాడు.

అప్పటికింకా దిగువన...

ఇరు వర్గాల మధ్యన హోరా హోరీగా కొసాగుతూనే వుంది పోరు. కాని విరాట్ వర్గానికే పై చేయిగా వుంది. అక్కడున్న గుండాలకు సరైన నాయకుడంటూ లేక పోడంతో వాళ్ళంతా ఆత్మ రక్షణలో పడి పోయారు. దిగువన హాలు బయట ఎటు చూసినా అరుపులు కేకలతో దొమ్మి కొనసాగుతూనే వుంది.

ఒక పక్క కర్రను విష్ణు చక్రంలా తిప్పుతూ మునుసామి వీర విహారం చేస్తున్నాడు. మరో పక్క క్రికెట్ బేట్తో విజృంభించి ఫైట్ చేస్తున్నాడు కదిరేషన్. ఇక ధర్మ అయితే దృఢమైన రెండు కర్ర ముక్కల్ని పుచ్చుకొని చెలరేగి పోతున్నాడు. చేతిలో ఇనప రాడ్ తో దొరికిన వాడి తాట తీస్తున్నాడు బండ శివ.

ధర్మతో బాటు మిత్ర బృందం సామాన్యమైందేమీ కాదు. వాళ్ళంతా విరాట్ తో బాటు ఒకే స్కూల్లో మార్షల్ విద్యలు అభ్యసించిన వాళ్ళు. వాళ్ళని ఆప గల సత్తా దమ్ము గల మొనగాడెవడూ ఆ లోకల్ గుండాల్లో లేరు. దాంతో అంతా కలిసి వాళ్ళని దుమ్ము దులిపేస్తున్నారు. ఈ లోపల ఆస్పత్రి నుంచి తమ వేన్ లలో తిరిగి వచ్చిన పాండ్యన్ బృందం అడ్డాలో పరిస్థితి గమనించి ఆగకుండా అటు నుంచి అటే అక్కడికి దూరంగా వెళ్ళిపోయారు.

విరాట్ కిందికొచ్చే సరికి అప్పటికే చావు దెబ్బలు తిని ఒక్కొక్కడు పోరాటం నుంచి తప్పుకొని పారి పోవటం మొదలైంది. పట్ట పగలు వీధిలో జనం ఎక్కడి వాళ్ళక్కడ నిలబడి పోయి భయ భ్రాంతులతో చూస్తున్నారు. అసలా యిల్లు ఎవరిదో అంతమంది గుండాలు అక్కడ ఎందుకున్నారో, దాడి చేస్తున్న మనుషులెవరో ఏదీ జనాలకు తెలీదు.

విరాట్ కిందికొచ్చిన అయిదు నిముషాల్లోనే ఆ పోరాటం ముగిసింది. ఇంచు మించు అంతా పారిపోగా ఆర్త నాదాలు చేస్తున్నారు. వాళ్ళని అంతటితో విడిచి పెట్టి వెను తిరిగారంతా. ఎంత వేగంతో వచ్చాయో, అంతకు మించిన వేగంతో విరాట్ వర్గాన్ని తీసుకొని ఆ ప్రాంతం వదలి వెళ్ళి పోయాయి వారి వాహనాలు. వాటి వెనకే విరాట్ తన బైక్ మీద అనుసరించి వెళ్ళిపోయాడు.

విరాట్ వర్గం వెళ్ళి పోయిన పది నిముషాల తర్వాత పాండ్యన్ తిరిగి అక్కడికొచ్చాడు అప్పటికే త్యాగరాజన్ అడ్డా వదలి వెళ్ళి పోడానికి కిందికొచ్చేసాడు. ఎవరి మీదా కోప్పడ లేదు. పాండ్యన్ రిపోర్ట్ ని వినలేదు. సింపుల్గా నేను వెళ్తున్నాను. రాత్రికి ఈ చోటు కాళీ చేసి అంతా మన వేలచ్చేరి లోని ఇంటికొచ్చేయండి. ఎవరన్నా అడిగితే నేనిక్కడ లేనని చెప్పండి అని చెప్పి కార్లో వెళ్ళి పోయాడు.

అంతే...

ఆ రోజు రాత్రికి రాత్రే...

త్యాగరాజన్ అడ్డా కీల్పాక్క నుంచి వేలచ్చేరి లోని ఇంటికి మార్చి వేయ బడింది.



సుమారు సాయంత్రం మూడు గంటలవుతుండగా దీక్ష ఇంటికి చేరుకున్నారంతా. అక్కడ దీక్షతో బాటు ఇద్దరు కదిరేషన్ మనుషులు మాత్రమే వున్నారు. బంధించి వుంచిన ఎట్టయప్ప మనిషిని వదిలేసారు.

వచ్చినప్పట్నుంచి దీక్ష సహస్ర కోసం ఏడుస్తూనే వుంది. అంతా తిరిగి రాగానే ముందు దీక్షను ఓదార్చి ధైర్యం చెప్పారు. అప్పటికింకా ఎవరూ భోంచేయలేదు. వంటలు చేసి సిద్ధంగా ఉంచటానికి అక్కడ ఎవరన్నా ఉంటేగా.

అలాగని అప్పటికప్పుడు వండి వార్చాలన్నా సుమారు ఏభై మందికి పైగా వున్నారు. జరిగే పని కాదు. కాబట్టి వచ్చి రాగానే అందరికీ భోజనాలు తెచ్చేందుకు నలుగుర్ని బస్ లో డబ్బిచ్చి తరిమాడు విరాట్.

నాలుగు గంటలవుతుండగా హోటల్ వాళ్ళే ముగ్గురు మనుషులొచ్చి అదే బస్లో భోజనం కూరలు అన్నీ పంపించారు. వాళ్ళే అందరికీ వడ్డించారు. భోంచేసి వాళ్ళని పంపించేసరికి నాలుగు నలభై నిముషాలయింది.

ఇందులో భోంచేయని వాడు మునుసామి ఒక్కడే. వయసవుతోంది గాబట్టి ఎటూ గాని టైంలో తింటే అరగదంటూ కాస్త మందు పుచ్చుకొని పక్కకు పోయి పడుకున్నాడు. చాలా మంది విశ్రాంతి తీసుకొని ఆరు గంటలకు లేచారు.

అక్కడ్నుంచి తిరిగి టెన్షన్ మొదలయింది.

ఇంత వరకు కిడ్నపర్ల నుంచి గాని, సహస్ర నుంచి గాని ఫోన్ రాకపోవటం కొంచెం కంగారు పుట్టిస్తోంది. ఈ లోపల ఆఫీసు నుంచి చందూ ఇంటికొచ్చాడు. అప్పటి వరకు చందూకి ఇక్కడ జరిగిన విషయాలేమీ తెలీదు. చందూను చూడగానే దుఃఖం ఆపుకోలేక తిరిగి ఏడ్చేసింది దీక్ష. అంతలో విశాల రివ్వున దూసుకొచ్చి గేటు బయట ఆగింది.

రోజూ ఉదయం సాయంత్రం సహస్రకు ఫోన్ చేసి మాట్లాడటం విశాల అలవాటు. ముఖ్యంగా విశాల ఇంటి నుంచి అంతా వచ్చేసాక తనిక్కడికి రాకూడదు గాబట్టి ఫోన్ చేస్తుంటుంది. ఇవాళ అయిదు గంటల తర్వాత నుంచి ఎన్ని సార్లు ఫోన్ చేసినా సహస్ర ఫోన్ స్విచ్చాఫ్ లో ఉండటంతో అనుమానం వచ్చి ఏమైనా అయిందని సరాసరి వచ్చేసింది. దాంతో విశాలకీ కిడ్నాప్ సంగతి తెలిసి పోయింది. ఏం చేయాలో తెలీక దీక్ష పక్కన కూచుని ఓదారుస్తూ ఉండిపోయింది.

క్రమంగా చీకట్లు ముసురుకున్నాయి.

వీధి దీపాలు వెలిగాయి.

రాత్రి ఏడు గంటలు కావస్తోంది.

ఇటు నుంచి చేస్తే స్విచ్చాఫ్ వస్తోంది.

క్షణాలు గడిచే కొద్ది టెన్షన్ పెరిగి పోతోంది. విశాల ఇంటికి తిరిగి వెళ్ళలేదు. దీక్షకు తోడుగా అక్కడే ఉండిపోయింది. ఇంట్లోను బయటా పట్ట పగల్లా లైట్లు వెలుగుతున్నాయి. ఇంటి నిండా జనం. సాయంత్రం హాల్లో సోఫాలో కూచున్న విరాట్ ఇంత వరకు లేవ లేదు. ఫోన్ కోసం ఎదురు తెన్నులు చూస్తున్నాడు. అందరి పరిస్థితీ ఇంచు మించుగా అదే.

''ఎందుకు మీరంతా అనవసరంగా టెన్షన్ పడతారు? సహస్ర కిడ్నాపర్ల వద్దనే సేఫ్గా ఉంది. అది నిజం. ఏదో టైంలో ఎలాగూ వాళ్ళు ఫోన్ చేయకుండా ఉండరు. ఓపిగ్గా వెయిట్ చేద్దాం. కంగారు పడితే పనులవుతాయా?'' అంటూ విరాట్తో సహా అందరికీ హితబోధ చేసాడు మునుసామి.

''కంగారు పడకుండా ఎలా ఉండగలను గురువు గారూ? మధ్యాహ్నం ఎప్పుడో ఒంటి గంట ప్రాంతంలో కిడ్నాప్ జరిగింది. ఎంత మత్తు మందు ప్రభావమైనా ఇంతవరకు స్పృహ రాకుండా ఉంటుందా? ఏం జరుగుతోందక్కడ అని ఆందోళనగా ఉంది'' ఉన్నాడు విరాట్.

''ఎందుకు ఆందోళన చిన బాబు. కొమ్ములు తిరిగిన మగవాళ్ళనే కాల్చేసిన సహస్రకి ఆకతాయి కుర్రాళ్ళు ఓ లెక్క. ఏదో మాజిక్ చేసి వాళ్ళని విరగ దీసి ఇప్పుడో కాస్సేపటికో తప్పించుకు వచ్చినా వచ్చేస్తుంది. ఇంకా స్పృహలోకి వచ్చుండక పోవచ్చు. ఇందులో మనం భయ పడాల్సిన సమస్య ఏమీ లేదు. అంతగా అవసరమైతే వాళ్ళడిగిన డబ్బు ఇచ్చి ఎలాగో విడిపించడానికి సిద్ధంగా వున్నాం. భయమెందుకు వెయిట్ అండ్సీ'' అన్నాడు మునుసామి. ఆయన మాటల్ని ధర్మ కదిరేషన్లు కూడ సమర్థించటంతో అంతటితో మౌనంగా ఉండి పోయాడు విరాట్. ఇలా టెన్షన్ టెన్షన్గా సమయం కదిలి పోతూనే ఉంది.

రాత్రి పది దాటింది.

పదకొండు దాటింది.

ఆ పూటకు టిఫిన్లతో సరి పెట్టుకున్నారంతా.

పదకొండున్నరవుతున్నా ఫోన్ రాకపోవడంతో ఇక ఈ రాత్రికి ఫోన్ చేయక పోవచ్చని మునుసామితో బాటు అంతా

నిర్ణయానికొచ్చేసారు. ఇక నిద్ర పోవటం మంచిదని ఎక్కడివాళ్ళక్కడ సర్దుకొంటూండగా సడెన్గా విరాట్ సెల్ మోగింది.

ఒక్క దూకులో ఫోన్ అందుకొని చూసాడు విరాట్. అది సహస్ర సెల్ నుంచే వచ్చిన ఫోన్. కిడ్నాపర్లే లైన్లో ఉన్నారనుకొంటూ స్పీకర్ ఫోన్ ఆన్చేసి హలో అన్నాడు విరాట్.

అందరి అంచనాలనూ తల్లకిందులు చేస్తూ...

అటు నుంచి స్వయంగా సహస్ర గొంతు విన్పించింది.

''హలో బావా ఎలా ఉన్నావ్? అంతా ఎలావున్నారు?'' అంటూ...

ఆ గొంతులో ఎక్కడా టెన్షన్ గాని కంగారు కాని ఏమీ లేదు. చాలా ఉత్సాహంగా మాట్లాడుతోంది. దాంతో విరాట్కి సర్రున కోపం ముంచుకొచ్చింది.''బుద్ధుందా? అసులు నీకు బుద్ధుందా? ఇక్కడ మేమంతా నీకోసం టెన్షన్తో ఛస్తుంటే మమ్మల్నే ఎలా ఉన్నారంటూ పరామర్శిస్తున్నావా? ఆ కిడ్నాపర్లు ఎక్కడ?'' అనరిచాడు.

''ఎందుకు బావా అంత కోపం? చెప్పిన టైంకి మీరు వచ్చుంటే కిడ్నాపర్లతో నాకీ తిప్పలుండేది కాదు గదా.'' అంది సహస్ర.

''అంటే తప్పు నాదంటావా?''

''లేకపోతే నాదా?''

''సరి సరి తప్పొప్పులు తర్వాత మాటాడుకోవచ్చు. ముందు నిన్నా కిడ్నాపర్లు ఎక్కడుంచారో చెప్తే వచ్చి విడిపిస్తాం గదా.''

''వద్దులే నీకంత విసుగైతే ఎందుకు చెప్పాలి. చెప్పనంతే'' అంటూ అవతల లైన్ కట్ చేసింది సహస్ర.

తల పట్టుకున్నాడు విరాట్.

“ఓర్నాయనో ఈ తిక్కదాంతో ఏం మట్లాడినా తంటాగానే ఉంది. ఏం చేయాలి” అన్నాడు.

స్పీకర్ ఫోన్ లోంచి ఇద్దరి సంభాషణ...

అంతా వింటూనే వున్నారు.

“ఫోన్ చేసి నాకివ్వు బావా. అక్కతో నేను మాట్లాడతాను” అంది విశాల.

“విశాల కాదు, నేను మాట్లాడతాను చిన్న బాబు ఫోనిలా యివ్వు” అన్నాడు వెంటనే మునుసామి.

“అవును బావా, అక్క చిన మావయ్య మాట వింటుంది యివ్వు” అంది విశాల.

విరాట్ ఫోన్ చేసి సెల్ మునుసామికిచ్చాడు.

అవతల రింగవుతున్న శబ్దం అందరికీ విన్పిస్తుంది.

పది సెకన్ల తర్వాత ఫోన్ లిఫ్ట్ చేయబడింది.

“అమ్మా సహస్ర” అంటూ పిలిచాడు మునుసామి.

ఈ సారి సహస్రకు బదులుగా.కిడ్నాపర్ గొంతు విన్పించింది.విలన్ లెవల్లో పెద్దగా నవ్వుతున్నాడు ఎవడో...''రేయ్ కుర్ర సన్నాసి నీ నోట్లో కిరసనాయిలు పొయ్య. నీ నవ్వు కంపు కొడుతుందిరా వెధవ. మర్యాదగా ఫోన్ సహస్ర కివ్వు'' అన్నాడు మునుసామి.''యిస్తా గాని. మూడు కోట్లు రెడీ చేస్తున్నారా లేదా చెప్పు'' అటు నుంచి అడిగాడు.''కోట్లు కాదురా నీ తోలు ఒలిచి కోటు కుట్టించుకుంటా. నా సంగతి నీకు తెలిదు. మర్యాదగా ఫోన్ సహస్ర కివ్వు.''మునుసామి మాటలకి వాడు భయ పడ్డాడో, బెదిరి పోయడో తీలీదుగాని వెంటనే ''అక్కో ఈ పెద్దాయనెవరో నన్ను భయ పెట్టేస్తున్నాడు. తిడుతున్నాడు. నువ్వే మాటాడు'' అంటూ వాడు సహస్రని పిలవటం విన్పించటంతో ఉలికి పడ్డారంతా.ఇదేం కొత్త మలుపో అర్థం గాక మతి పోయినట్టుగా ముఖ ముఖాలు చూసుకున్నారంతా. డబ్బు కోసం కిడ్నాప్ చేసారనుకుందాం. ఒకె. కాని సహస్రని వాడు అక్కాని పిలవటం ఏంటి? విరాట్ కూడ అర్థం చేసు కోలేక చిత్త భ్రమ ఏర్పడినట్టుగా అలా చూస్తుండి పోయాడు.వారి ఆలోచనలు ఓ కొలిక్కి రాక ముందే అటు నుంచి తిరిగి సహస్ర గొంతు విన్పించింది. ''హలో.... ఎవరూ?'' అంటూ.''నేను ముని సామిని మాటాడుతున్నా గాని ఏందమ్మా ఇదంతా? మాకేమీ అర్థం కావటం లేదు'' అన్నాడు.''అర్థమయ్యేలా చెప్పే దాకా విరాట్ ఆగితే గదా. విసుగుతో కోప్పడుతున్నాడు. అందుకే లైన్ కట్ చేసాను'' అంది సహస్ర.''కట్ చేసి కూచుంటే ఎలా తల్లీ. ఇక్కడ సమస్య చిన్నది కాదు గదా. పది నిముషాల్లో నీ వెనకే ఆ శిథిల భవనం వద్దకి వచ్చేస్తామని నీతో చెప్పిన మాట నిజమే. కాని ఏర్ పోర్ట్ దగ్గర రెండు సిగ్నల్స్ దాటి రావాలి. దాంతో లేటయింది. ఇందులో మా తప్పు గాని విరాట్ తప్పు గాని లేదు గదా...''

''అది కాదు చిన మావయ్యా'' ''నన్ను చెప్పని సహస్ర. మేం వస్తుంటే దారిలో దీక్ష ఎదురైంది. తనను తీసుకొని మేమంతా వచ్చే సరికి అక్కడ ఎవరూ లేరు. నీ జాడ లేదు. నీ సెల్కి ఫోన్ చేస్తే వాడెవడో నిన్ను కిడ్నాప్ చేస్తున్నామన్నాడు. ఆ కోపం ఈ కోపం కలిసి మేమంతా త్యాగ రాజన్ అడ్డా మీద పడి దాడి చేసాం. దొరికిన వాడ్ని దొరికినట్టు చితగొట్టి, మూడు గంటల కొచ్చి నీ ఫోన్ కోసం ఎదురు చూస్తున్నాం. నువ్వు పారి పోయావంటాడు త్యాగరాజన్. కిడ్నాప్ చేసామంటాడు కిడ్నాపరు. ఏది నమ్మాలి.నీ ఫోన్ స్విచ్చాఫ్ లో ఉండటంతో ఆరు గంటల కొచ్చిన విశాల ఇక్కడే ఉండి పోయింది. ఆఫీసు నుంచి వచ్చిన చందూ జరిగింది విని కంగారు పడుతున్నాడు. ఇప్పుడు అర్ధరాత్రి కావస్తోంది. ఆ కిడ్నాపరు వెధవ నిన్ను అక్కా అని పిలవటం ఫోన్లో విన్పిస్తుంది. చెప్పమ్మా ఇన్ని టెన్షన్ల మధ్య మేమంతా నిద్రలు మాని నీ కోసం కంగారు పడుతుంటే ఇలా విరాట్తో పంతాలకు పోయి నువ్వు మౌనంగా ఉండటం మంచిదా చెప్పు. కాస్త ప్రశాంతంగా నిద్రపోతాం'' అంటూ నచ్చ చెప్పాడు ముని సామి. ''సారీ చిన మావయ్యా జరిగింది చెప్తా గాని, ఫోన్ విరాట్ కివ్వండి'' అంది సహస్ర.విరాట్ ఫోన్ తీసుకొని ''హలో'' అనగానే ''సారీ విరాట్ అయాం సారీ'' అంది.''ఇట్సాల్ రైట్ చెప్పు ఏం జరిగింది?'' అడిగాడు విరాట్.సహస్ర చెప్పటం ఆరంభించింది.అంతా ఆసక్తిగా వినసాగారు.

********************************

సహస్రకు స్పృహ తెలిసే సరికి...రాత్రి సుమారు పది గంటలు కావస్తోంది.తలంతా దిమ్ముగా వుండి కొద్ది క్షణాలు ఏం జరిగింది తను ఎక్కడ వుంది ఏదీ గుర్తు లేకుండా పోయింది. కళ్ళు మూసుకొని కాస్సేపు అలాగే ఉండి పోయింది.క్రమంగా ఒక్కటొక్కటిగా...జరిగిన సంఘటనలన్నీ గుర్తు రాసాగాయి.అవును ఆ శిథిల భవనం మండపంలో చావుకి తెగించి శత్రువుల కోసం పొంచి కూచుంది. ఆ టైంలో తన వెనకే పిల్లిలా వచ్చి ఎవరో ముఖం మీద ఏదో స్ప్రే చేసారు. అంతే తర్వాత ఏం జరిగిందీ తనకు తెలిదు. కళ్ళు తెరిస్తే

ఇక్కడుంది.తనను చెక్క కుర్చీలో చేతులు వెనక్కి విరిచి కట్టేసారు. కాళ్ళు కూడ బంధించారు దిగువనెక్కడో మాటలు విన్పించడాన్ని బట్టి ఖచ్చితంగా ఇది డాబా మీది పోర్షను కావచ్చు. గోడలు రంగు మాసి వున్నాయి. అది చిన్న హాలు. దాని చివరి బెడ్ రూం కన్పిస్తోంది. ప్రస్తుతం ఇక్కడ తను తప్ప ఎవరూ లేరు. పైన సీలింగ్ ఫ్యాన్ తిరుగుతోంది.ఎవరు వీళ్ళు?అంత రిస్కు తీసుకొని ఎందుకు తనను తీసుకొచ్చారు? ఖచ్చితంగా వీళ్ళెవరో గాని త్యాగ రాజన్ మనుషులు మాత్రం కాదు. అక్కడ తను కనబడకపోడంతో విరాట్ తో బాటు అంతా ఏం కంగారు పడుతున్నారో ఏమిటో......... ఓసారి విరాట్తో మాట్లాడితే బాగుండేది. తీవ్రంగా ఆలోచిస్తోంది సహస్ర.

అంతలో ఎవరో మేడ మీది కొస్తున్న అలికిడి విన్పించింది. ఎప్పటిలా ఇంకా తెలివి రానట్టు నటిస్తూ అలాగే ఉండి పోయి క్రీగంట గమనించ నారంభించింది.గదిలో ట్యూబ్ లైటు కాంతి దేదీప్య మానంగా ప్రకాశిస్తోంది. వచ్చింది ఒకడు కాదు ఇద్దరు కాదు పన్నెండు మంది. ఆశ్చర్య కరమైన విషయం ఏమంటే వాళ్ళలో ఒక్కడు మాత్రమే సుమారు ఇరవై రెండు, ఇరవై మూడు సంవత్సరాల వయసు వాడు. మిగిలిన వాళ్ళంతా పదహారు నుంచి ఇరవై సంవత్సరాల మధ్య వయస్కులు. లోనకు రాగానే మెట్ల వైపు ఎంట్రన్సు డోర్ మూసేసారు. అంతా సహస్రను చూస్తున్నారు.''ముత్తన్నా దీనికింకా స్పృహ వచ్చినట్టు లేదు ఏం జేద్దాం?'' అనడిగాడొకడు.వాడా మాట అడిగిన మరు క్షణం.మురడన్ ముత్తు సాచి చెంప మీద కొట్టాడు వాడ్ని.''కొట్టడం కాదు. చంపేస్తాను వెధవా. నీ వయసెంతరా పదహారు. మీరే కాదు నాకన్నా వయసులో పెద్దది అక్క లాంటిది. అ మర్యాదగా దీన్ని, అది యిది అంటూ మాట్లాడొచ్చా? తప్పుగదా?'' అన్నాడు ముత్తూ.''అవునన్నా తప్పే'' అన్నాడు దెబ్బ తిన్నవాడు.''మనలో ఎవరు అమర్యాదగా మాట్లాడినా వూరుకోను చెప్తున్నాను. మన ప్లాను సక్ససయి డబ్బు చేతి కొచ్చేవరకు అక్కను మనం పువ్వుల్లో పెట్టి చూసుకోవాలి. తనేమన్నా సాధారణ అమ్మాయా, ఏదో ఇన్ని రోజులు మనం పడ్డ శ్రమకు దేవుడు కరుణించి ఇలా అక్క మనకు దొరికింది. గాని లేకపోతే మనవల్ల అయ్యే పనేనా.''

''ఆ మాట నిజమన్నా. ఇంకెవరం కూడ పొరబాటు చేయం'' అంటూ మాటిచ్చాడు మరొకడు.''అంతే కాదు గొప్పింటమ్మాయి. ఇక్కడ మన దగ్గర వున్నంత వరకు తల తాకట్టు పెట్టయినా సరే ఏ లోటు రాకుండా చూసుకోవాలి. అర్థమైందా?''''అర్థమైందన్నా. ఆ బెంగ అక్కర్లేదు. మన చేతిలో కత్తెరున్నంత వరకు డబ్బుకు లోటేముంది'' అన్నాడు మరొకడు.''సరి సరి. అక్కకింకా తెలివొచ్చినట్టులేదు. మనం పడుకుందాం. తెలివి రాగానే నేను మాటాడతాను'' అన్నాడు ముత్తూ.సహస్ర చుట్టూ చాపలు పరిచి వాళ్ళంతా పక్కలు సిద్ధం చేసుకో సాగారు. వాళ్ళ మాటలు వింటున్న సహస్రకు ముచ్చటేసింది. మౌనం వహించటం ఇష్టం లేక పొడిగా దగ్గి అటు యిటు కదిలి తలెత్తింది. ఎందుకంటే ఉదయం ఎప్పుడో తిన్న టిఫిను. గోడ గడియారం రాత్రి పది గంటలు సూచిస్తోంది. ఇంత వరకు ఏమీ తినక పోడంతో ఆకలి కరకర లాడుతోంది. ఆ పైన బాత్ రూం కెళ్ళి ఫ్రెషప్ అవ్వాలి. అర్జంటు.ఆమె స్పృహలోకి వచ్చినట్లు తెలిగానే ముత్తు బృందం బిరబిరా లేచిపోయింది. ముత్తూ ఆమె ఎదుటి కొచ్చాడు.

నోటికి టేప్ ఉండటంతో మాట్లాడ్డానికి వీలు గాక గింజు కొంటూ మూలుగుతోంది సహస్ర.''అక్కా నీ బాధ అర్థం చేసుకో గలను. అరిచి గోల చేయనని మాటిస్తే టేపు తీసేస్తాను. సరేనా?'' బ్రతిమాలుకున్నట్టు అడిగాడు ముత్తూ.సరేనన్నట్టు తలూపింది

సహస్ర.ముత్తూ ఆమె నోటికి అంటించిన టేప్ తీసేసాడు.''కట్లు... కట్లు కూడ విప్పండిరా'' అంది.''వూహు.......కట్లు విప్పితే మమ్మల్ని చితగొట్టి పారిపోతావ్? విప్పను. సారీ అక్కా'' అన్నాడు ముత్తూ''ఆ భయం అక్కర్లేదు. ప్రామిస్గా మిమ్మల్నేమీ చేయను. పారిపోను. నన్ను అక్కా అన్నావ్గా. అక్క తమ్ముళ్ళకిచ్చిన మాట నిలబెట్టుకుంటుంది. త్వరగా విప్పరా బాత్ రూం కెళ్ళి ఫ్రెషప్ అవ్వాలి.''సహస్ర మాటల మీద ముత్తూకు నమ్మకం ఏర్పడింది. ఏమైతే అయిందని సహస్ర కట్లు విప్పేసాడు.



''అక్కా ఆ ఎదురుగా ఉన్న బెడ్రూంకి అటాచ్డ్ బాత్ రూం వుంది. లోన నీకోసం రెండు కొత్త నైటీలు కూడ ఉంచాం. ఏకంగా స్నానం చేసివస్తే భోం చేద్దుగాని'' అన్నాడు.

''థాంక్యూ తమ్ముడూ'' అంటూ ఆ గదిలోకెళ్ళి తలుపు మూసుకుంది సహస్ర.

బాత్రూం లో తనకోసం కొత్త సబ్బు కొత్త టవలు కూడ ఉంచారు వాళ్ళు. ఫ్రెషప్ అయి చక్కగా స్నానం చేసి నైటీ లోకి మారిపోయింది.

ఆమె బయటికొచ్చే సరికి ఇరవై నిముషాలు పట్టింది.

ముత్తూతో సహా వాళ్ళంతా భయం భయంగా చూస్తూ అలాగే నిలబడ్డారు. సహస్ర వచ్చి తనను బంధించి ఉంచిన అదే కుర్చీలో కూచుంది. వెంటనే ముత్తూ ఒక ప్లేటులో చికెన్ బిర్యానీ పార్సిలు ఉంచి తెచ్చిచ్చాడు. పక్కన వాటర్ బాటిలుంచాడు. ఆకలితో వున్న సహస్ర భోజనం ఆరంభించి వాళ్ళ వంక చూసింది.

"ఏమిట్రా నిలబడున్నారు కూచోండి. నన్ను నమ్మండ్రా. అక్క దగ్గర భయమెందుకు? తప్పు చేస్తేనే అక్క కొడుతుంది. ఒప్పు చేస్తే మెచ్చుకుంటుంది. మీరే తప్పు చేయలేదు. కూచోండి" అంది.

అంతే...

స్కూలు పిల్లల్లా సహస్ర ఎదురుగా అంతా కూచుండిపోయారు. "నాకు తెలిసి మీరంతా డబ్బు కోసం నన్ను కిడ్నాప్ చేసి తెచ్చారనుకుంటున్నాను" అంది సహస్ర.

"అవునక్కా" అన్నాడు ముత్తు.

"మీ లీడర్ ఎవర్రా?"

"నేనే అక్కా. నన్ను మురడన్ ముత్తూ అంటారు. వీళ్ళంతా నా శిష్యుల్లాంటోళ్ళు. మేమంతా ఒక బేచ్. కోయంబేడు స్లమ్ ఏరియాలో పుట్టి పెరిగిన వాళ్ళం. బతకటానికి దారిలేక జేబులు కొట్టి బతికేస్తుంటాం."

"అర్ధమైంది మీ మీద నా కోపం లేకపోడానికి కారణం తెలుసా?"

‘‘తెలిదక్కా...      ఏంటక్కా?’’

‘‘కిడ్నాప్ చేస్తున్నామనుకొని మీరు నన్ను గొప్ప ప్రమాదం నుంచి కాపాడారు. ఆ సమయంలో నాకు మత్తు మందు స్ప్రే చేసి అక్కడ్నుంచి తప్పించక పోతే కనీసం నలుగురయిదుగుర్ని చంపి నేనూ చనిపోయేదాన్ని. వాళ్ళు నన్ను షూట్ చేసి చంపేసేవారు.’’

‘‘అంటే... లోపట్నుంచి రివాల్వర్ల శబ్దం విన్పించింది. వాళ్ళంతా ఆ త్యాగరాజన్ మనుషులేనా అక్కా?’’

ముత్తూ ప్రశ్నతో ఈ సారి...

సహస్ర ఆశ్చర్యపోయింది.

తినటం ఆపి ముత్తువంక చూసింది.

తనను క్లోజ్గా అబ్జర్వ్ చేస్తూండాలి. లేకపోతే వీళ్ళకి విషయాలు తెలిసే అవకాశం లేదు. సహస్రకి రాకూడని అనుమానమే వచ్చింది. ఇదేదో యధాలాపంగా తనను ఎత్తుకొచ్చిన విషయం కాదు. తనెవరో ఖచ్చితంగా వీళ్ళకి తెలిసే ఉండాలి.

‘‘ఏరా తమ్ముడూ నేనెవరో తెలుసా?’’ అనడిగింది.

‘‘తెలుసు నీ పేరు సహస్ర. పూర్తి పేరు లక్ష్మీ సహస్ర రచయిత్రివి. ఇంకా జర్నలిస్టు లహరివి. త్యాగరాజన్ గుట్టు బయటికి లాగి పత్రికలకెక్కించింది నువ్వేగదా. అందుకేగా వాడు నిన్ను చంపాలని చూస్తుంది. ఈ విషయాలు మాకెలా తెలుసని ఆశ్చర్యం వద్దక్కా. శిఖామణి వాడి మనుషులతో నీ ఫైటింగ్ని టివిలో సినిమా చూసినట్టు చూసినాం, త్యాగరాజన్ ఇంటర్వ్యూ ని చూసాం...’’

“మరి నా గురించి తెలుసుకొని కూడ ఎందుకు కిడ్నాప్ చేసార్రా?”

“అబ్బో... అదో పెద్ద కథక్కా. నా ప్రియురాల్ని పట్టిస్తే కోటి అంటూ బావ విరాట్ ప్రకటనిచ్చాడు చూడు. అప్పుడు మొదలైన కథ ఇంకా సాగుతూనే వుంది” అంటూ తమ గురించి ముత్తు జరిగిందంతా చెప్తుంటే పడి పడి నవ్వుతూనే వుంది సహస్ర.

“ఏమిట్రా మీరంతా నన్ను కిడ్నాప్ చేయాలని ముష్టి వాళ్ళ వేషాల్లో కూడా తిరిగారా!” అంటూ నవ్వుతూనే భోజనం ముగించి చేయి కడుక్కుంది.

“ఒక్క ముష్టి అవతారాలేనా, కుష్టు వ్యాధి వాళ్ళలా బండిలో కూచొని తోసుకుని బిచ్చమెత్తుకుంటూ మరీ గాలించాం. నిన్ను చూసి ఎత్తుకొచ్చింది కూడా ఆవేషంలో ఉండగానే” అన్నాడు ముత్తు.

“అయితే మీరు వేషాలు బాగా వేస్తారన్న మాట”

“ఏం చేయమంటావక్కా స్లం ఏరియాలో పుట్టి పెరిగిన గలీజు గాళ్ళం. చదువా అంతంత మాత్రం. బతకటానికి జేబు దొంగలుగా మారాం. కాని ఎంత కాలమీ వెధవ బతుకని బాధగా వుండేది. ఏదో జాక్ పాట్ కొట్టి జీవితాలు సెటిలయి పోవాలని కలలు కనే వాళ్ళం. ఎన్నో ప్రయత్నాలు చేసాం. ఏదీ కలిసి రాలేదు.

ఆ టైం లోనే ప్రకటన చూసి విరాట్కి ఫోన్ చేస్తే అప్పటికే నువ్వు తన వద్దకొచ్చేసావట. నా మీద మండిపడ్డాడు. అప్పుడే పాడు బుద్ధి పుట్టింది. పట్టిస్తే కోటి రూపాయలంటే విరాట్ బాగా సౌండ్ పార్టీ అనర్థమైంది. నిన్ను కిడ్నాప్ చేసి మూడు కోట్లు డిమాండ్ చేస్తే ఇస్తాడనిపించింది. దాంతో నీకోసం గాలించటం ఆరంభించాం” అన్నాడు ముత్తు.

“మీ బాధ అర్థమైందిరా. మీరంతా నన్ను అక్కా అంటున్నారు.

మిమ్మల్ని బాగా చేసే పూచీ నాది. సరేనా?”

‘‘‘సరక్కా నువ్వేం చెప్తే అది.’’

‘‘మరీ మీరు మూడు కోట్లు, నాలుగ కోట్లు అని ఆశ పడకండి. మీ అందరికీ తలా పది లక్షలిచ్చి, మీరు ఉద్యోగాల్లో గాని, వ్యాపారంలో గాని సెటిలయి గౌరవంగా బ్రతికేలా చేస్తాను. అక్కడి నుండి కష్టపడి సంపాదించుకొని జీవితంలో పైకి రండి. అది చాలదా?’’

‘‘అయ్య బాబోయ్ అడక్కుండానే వరాలిస్తున్నావాక్కా. అంత కన్నా మాకింకేం కావాలి? ఏరా ఏమంటారు?’’ అనడిగాడు ముత్తు కుర్రాళ్ళని.

‘‘చాలు. అక్క దేవత. మనకి కష్టాలు తీరినట్టే’’ అన్నారంతా.

‘‘అయితే నేనిక్కడ మీతో బాటు ఇరవై రోజులుంటాను. నేనిక్కడ వున్నట్టు ఎవరికీ తెలికూడదు. ముఖ్యంగా ఆ త్యాగ రాజన్ మనుషులకి అస్సలు తెలికూడదు. మారు వేషంతో ఎవరూ గుర్తించకుండా నన్ను సైదాపేట కోర్టుకి మీరే తీసుకెళ్ళాలి’’

‘‘అదెంత పనక్కా ఆవిషయం మాకు వదిలేయ్. మూడో కంటికి తెలీకుండా నిన్ను కోర్టులో హాజరు పరుస్తాం సరేనా?’’ అన్నాడు ఉత్సాహంగా ముత్తు.

‘‘సరేగాని మీరు నాకో వాగ్దానం చేయాలి. ఇక మీద పిక్ పాకెట్ మానేయాలి. మీరు దొంగలు కాదు. దొరలుగా మారాలి’’

సహస్ర మాటలకి వాళ్ళంతా ముఖముఖాలు చూసుకున్నారు. ‘‘సారీ అక్కా దొంగతనం మానేయాలని మాకూ వుంది. కాని ఖర్చులకి డబ్బు కావాలి గదా’’ అన్నాడు ముత్తు.

‘‘డబ్బు గురించి ఆలోచన మానేయండ్రా. నేను ఏర్పాటు చేస్తాను. నాఫోను ఎవరిదగ్గరుంది. ముత్తు నీదగ్గరుందా? యిలా యివ్వు ఓ సారి విరాట్తో మాట్లాడతాను. వాళ్ళంతా నాకోసం కంగారు పడుతుంటారు’’

ముత్తు ఫోన్ ఇవ్వగానే ఆన్ చేసి విరాట్ సెల్కి ఫోన్ చేసింది. విరాట్ కోప్పడ్డంతో అలిగి లైన్ కట్ చేసింది. తర్వాత అటునుండి విరాట్ చేసాడు.

''వాళ్ళని కాస్త కంగారు పెట్టాలి. నువ్వు మాట్లాడరా ముత్తు. మూడు కోట్లు డిమాండ్ చెయ్'' అంది. సెల్ ఆన్ చేయగానే అవతల మునుసామి లైన్లో వున్నాడు. విలన్లా నవ్వాడు ముత్తు.

**************************************

ఫోన్లో సహస్ర చెప్పిందంతా విని... తేలిగ్గా వూపిరి తీసుకున్నారంతా. కాని విరాట్ మనసు సహస్ర అక్కడే ఉండి పోతుందంటే అంగీకరించటం లేదు.

''సో... వాళ్ళంతా పిక్పాకెట్ కుర్రాళ్ళంటావ్. వాళ్ళు నిన్ను కాపాడారు సరే. అంతగా అభిమానం వుంటే వాళ్ళకు కావల్సినంత డబ్బిచ్చేద్దాం. నువ్వక్కడే ఉండి పోడం బాగాలేదు. మేమంతా నిన్ను కాపాడుకోలేమా? వచ్చెయ్ సహస్రా ప్లీజ్. ఎక్కడున్నావో చెప్పు నేనే వస్తాను'' అంటూ రిక్వెస్ట్ చేసాడు.

''బావా. నీకర్థం గావటం లేదు. ప్రస్తుతం నాకింత కన్నా సేఫ్ ప్లేస్ దొరకదు తెలుసా? నేను కాలనికి వచ్చేస్తే ఆ త్యాగరాజన్ తిరిగి ఎవరికో హాని తలపెట్టి నన్ను దెబ్బ తీయాలని చూస్తాడు. ఇక్కడుంటే ఆ సమస్య ఉండదు. నా గురించి అసలు తెలీదు. ఇక నువ్వు కూడా నేనింకా కాలనికి తిరిగి రాలేదని ఏంచేసావో చెప్పకపోతే చంపేస్తానంటూత్యాగరాజన్కి ఫోన్లు కొడుతూ డ్రామాను కంటిన్యూ చెయ్. వాడ్ని నేనేమయ్యానో తెలిక టెన్షన్ పడనీ. మనజోలికి రాడు. ఈ ఇరవై రోజులూ మీరక్కడ నేనిక్కడ. అంతే. తమ్ముళ్ళంతా నాకు అండగా వున్నారు. భయం లేదు. తిరిగి కోర్టులోనే మనం కలుసుకునేది. కోర్టులో నన్ను ఎవడూ కాల్చి చంపకుండా మీరంతా అలర్ట్గా ఉంటే చాలు.''

''కాని... ప్లీజ్ సహస్రా నిన్ను చూడాలి. ఓసారి రావచ్చుగా''

'ఓకే బావా వస్తాను. ఎల్లుండి ఆదివారం మీకు ఆఫీసు శలవు గదా. నాకోసం ఓ లక్ష రెడీ చేసి ఉంచు. ఖర్చులకి అవసరం. నా క్రెడిడ్ కార్డులన్నీ నాగదిలోని లాకర్లో ఉండిపోయాయి''

‘‘ఏయ్ డబ్బుగురించి ఇంతగా చెప్పాలా. లక్షకాదు ఎన్ని లక్షలయినా రెడీగా ఉంచుతా. కాని ఎక్కడకు రావాలి?’’

‘‘నేనే కాలనీకొస్తా. మనింటికే వస్తా’’

‘‘నిజంగా వస్తావా?’’

‘‘అరె వస్తానంటున్నానుగా, నా తమ్ముళ్ళందర్నీ తీసుకుని మరీ వస్తాను’’

‘‘వస్తే నీకే కాదు వాళ్ళందరికీ తలో లక్ష ఇస్తాను.’’

‘‘ఏంటీ? డబ్బులిచ్చి వాళ్ళని చెడగొట్టాలనే... వాళ్ళకి నేనిస్తాగాని ఫోన్ విశాలకివ్వు’’

ఆ తర్వాత విశాల, దీక్ష చందూ కదిరేశన్ అందరితో మాట్లాడి జాగ్రత్తలు చెప్పి లైన్ కట్ చేసింది సహస్ర.

********************************

సహస్ర సలహా మేరకు...

ఆ మరునాడు సాయంకాలమే...

త్యాగరాజన్ సెల్కి ఫోన్ చేసాడు విరాట్.

“హలో మళ్ళీ ఎందుకు నాకు ఫోన్ చేసావ్?” విసుగ్గా అడిగాడు త్యాగరాజన్.

“ఎందుకా! విందుభోజనానికి పిలుద్దామని. బుద్ధుందా? నా సహస్రని మాయం జేసి ఏమీ తెలీనట్టు కూచుంటే వూరుకుంటానా?” “నాకు తెలీదని నిన్నే చెప్పాను. ఉదయం ఫోన్ చేస్తే చెప్పాను. ఇంకా ఎన్ని సార్లు చెప్పాలి? తను పారిపోయిందంతే” “అంతే అంటూ బుకాయించక. పారిపోయింది నిజమైతే కాలనీకి ఇంత వరకు ఎందుకు తిరిగిరాలేదు.” “అందుకు నన్నేం చేయమంటావ్? మా గురించి భయపడి చెన్నై వదిలి పారిపోయిందేమో. మధురై వెళ్ళిపోయిందేమో. మహాదేవనాయకర్కి ఫోన్ చేసి అడుగు.” “మధురై కూడా వెళ్ళలేదు”

“అయితే వెతుక్కోండి. ఎక్కడ దాక్కుందో వెదికి పట్టుకోండి. నాకు ఫోన్ చేసి లాభం లేదు”

“కాని నిన్ను చంపేస్తే నాకు లాభం వుంది. నువ్వు చచ్చావని తెలిస్తే సహస్ర తిరిగొస్తుంది.”

“ఇక నీకా ఛాన్స్ లేదు విరాట్. నన్ను నువ్వు పట్టుకోలేవు”

“అలాగని భ్రమపడకు. నిన్ను క్లోజ్గా మావాళ్ళు కనిపెడుతూనే వున్నారు. కీల్పాక్కం వదిలి వేలచ్చేరి పారిపోతే వదులుతాననుకోకు. రెండు మూడు రోజుల్లో సహస్ర తిరిగొస్తే బతికి పోతావ్. లేదంటే నువ్వెక్కడున్నా వెతికి చంపుతా. నిన్ను వదలను” అని ఘాటుగా హెచ్చరిస్తూ లైన్ కట్ చేసాడు విరాట్.

అవతల త్యాగరాజన్ ముఖం షాక్తో ఎలా వుంటుందో వూహించుకొంటే విరాట్కి నవ్వొస్తోంది. ఆ రోజు గడిచిపోయింది. మరునాడు ఆదివారం. సహస్ర వస్తానని చెప్పిన రోజు.

ఉదయం తొమ్మిది గంటలకి ముందుగా విశాల తనకార్లో విరాట్ ఇంటికొచ్చేసింది. కాస్సేపటికి దీక్ష చందూ కదిరేశన్ మిగిలిన వాళ్ళు అంతా వచ్చేసారు. ధర్మ బృందం మాత్రం హోటల్ నుంచి ఇంకారాలేదు. “బావా అక్క నిజంగా వస్తుందంటావా?” విరాట్ ముందు తన సందేహాన్ని బయటపెట్టింది విశాల. “ఎందుకొచ్చిందా అనుమానం?” అడిగాడు విరాట్.

“శత్రువుల గురించి భయం ఉందిగా. అందుకే డౌటు”

''వస్తుందనేగా ఎదురు చూస్తున్నాం. చూద్దాం. ఏ టైమ్కి వస్తుందో తెలిదు. ఒక వేళ రాకపోనూవచ్చు'' ''ఆ డౌటే వద్దు. సహస్ర ఎప్పుడూ మాట తప్పదు వస్తుంది'' అంది ధీమాగా దీక్ష.''ఎలా వస్తుంది? నలుగురూ చూస్తారుగదా'' అనడిగాడు బండశివా.''ఏమో ఏ వేన్ లోనో రావచ్చు. అయినా ఈ అంచనాలెందుగ్గాని ముందు కాఫీ టిఫిన్ల సంగతి చూడండి'' అన్నాడు మునుసామి.క్షణాలు భారంగా దొర్లుతున్నాయి. ఈ లోపల ధర్మ బృందం కూడా వచ్చేసింది. అంతా కాఫీ టిఫిన్లు తీసుకొని తిరిగ్గా సహస్ర రాక కోసం ఎదురుచూడసాగారు. క్రమంగా పదిగంటలు దాటింది సమయం. ఆకాశాన్ని మబ్బులు కప్పి ఉంచటంతో సూర్యుడు కన్పించటం లేదు. వాతావరణం చల్లగా వుంది. గోస్వామి కాలనీ వీధులు మూడూ ప్రశాంతంగా వున్నాయి.

ఇంతలో...

ఎగువన కాలనీ ఎంట్రన్స్ దిశగా కలగాపులగంగా ఏవో కొన్ని గొంతులు వినవచ్చాయి. కుక్కలు పెద్దగా అరుస్తున్నాయి. గేటు వద్దకొచ్చి చూసిన బండశివాకి ఒక నక్కలోల్ల గుంపు అడుక్కొంటూ తమ మొదటి వీధిలోకే వస్తూ కన్పించింది.వీళ్ళని తమిళనాట ''కురవికారంగ'' అంటారు. ఆంధ్ర ప్రాంతంలో నక్కలోళ్ళంటారు. మగాళ్ళు గోచీ పెట్టుకొని పైన నడుంకి టవలు చుట్టుకుంటారు. ఎప్పుడోగాని చొక్కా వేసుకోరు. మెడలో పూసల దండలుంటాయి.సైకిలు ట్యూబు ముక్కలతో పక్షుల్ని గులకరాళ్ళతో కొట్టడానికి పంగలకర్ర చేసి అమ్ముతుంటారు. తీగతో ప్లాస్టిక్ పూసల్ని చుట్టి దండలు చేసి అమ్ముతారు. ఇంకా సిటీల్లోని మార్కెట్ సెంటర్లలో చిన్న చిన్న ప్లాస్టిక్ వస్తువులు దువ్వెనలు దుకాణం పెట్టి అమ్ముతారు.

ఆడాళ్ళయితే మోకాలు దాటని పొట్టిపరికిణీ వేసుకొని భుజంమీదకు పైటలావేసుకొని డాల్డా డబ్బాను భుజాన తగిలించుకు తిరుగుతారు. చంటి బిడ్డ తల్లులయితే ఎడం భుజాన జోలెలో బిడ్డను వేసుకుని తిరుగుతారు. తంబాకు నములుతుంటారు. వీళ్ళు అదృష్టం కలిసొస్తుంది నక్క కొమ్ము అంటూ నక్క గోళ్ళనే కొమ్ములంటూ అమ్ముతుంటారు. నక్కలకి కొమ్ములుండవని తెలిసి కూడా కొందరు అమాయకంగా గోళ్ళని కొనుక్కుని దాచుకుంటారు. ఈ నక్కలోళ్ళ జీవనశైలి ఆచార వ్యవహారాలు చిత్రంగా వుంటాయి అడుక్కోవటం కూడా వీళ్ళ కులవృత్తిలో భాగమే. వీళ్ళు అధికంగా తమిళనాట, ఆంధ్రాసరిహద్దు ప్రాంతాల్లో ఎక్కువగా కన్పిస్తుంటారు. అలాంటి నక్కలోళ్ళ గుంపు ఒకటి వీధిలోకొస్తూ హడావుడి చేస్తోంది. వాళ్ళంతా సుమారు పదిహేనుమంది వుంటారు. అయిదుగురు జట్టుగా ఒక్కో ఇంటి ముందు కెళ్ళి అడుక్కొంటున్నారు. వాళ్ళరాకతో వీధి మొత్తం సందడిగా మారిపోయింది. వాళ్ళలో ఓ గుంపు విరాట్ గేటు ముందుకొచ్చింది. ఆవరణలో తిరుగుతున్న మునుసామిని చూస్తూ వాళ్ళలో ఒకడు అరిచాడు.

''అదిగదిగో పెద్దాయనున్నాడు పెద్ద మనసుగల సామి. చద్దన్నం పెట్టిస్తారు. పాత బట్టలిప్పిస్తారు. ఆడండిరా పాడండి.'' అంటూ. ''ఏయ్ ఆగండాగండి పొద్దుటే ఏంటిరా మీ గోల. మా టెన్షన్లో మేముంటే మీగోలేంటి. పోండి పోండి'' అంటూ కసురుకున్నాడు మునుసామి. ''రాకరాక వచ్చినం సామి. అక్కలం వచ్చినాం, చెల్లెళ్ళం వచ్చినాం. తమ్ముళ్ళం వచ్చినాం. దయగలసామి

అట్టాకోప్పడకండి. అట్టు ముక్కో కాస్త పొంగలో ఇప్పించండి... ఆడండిరా... డమక్క డక్క డియ్యాలో. డిమిక్కి ఢక్కి డియ్యాలో" డాల్డా డబ్బాల్ని అదరగొడుతూ వాళ్ళంతా గేటు ముందు గంతులేస్తుంటే నవ్వు కోపం కూడా వస్తున్నాయి. ఇంతలో ఈ గోలకి లోపల్నుంచి విరాట్తో బాటు విశాల దీక్ష అంతా బయటకొచ్చేసారు.

"ఒరే బండశివా నువు గేటు దగ్గరే వుండరా. వాళ్ళు గేటుతీసుకుని వచ్చినా వచ్చేస్తారు. పొమ్మని చెప్పు" అనరిచాడు మునుసామి.

ఇంతలో పక్క యిళ్ళ దగ్గర్నుంచి మిగిలిన నక్కలోళ్ళు కూడ వచ్చి చేరి పోయారు. పన్నెండు మంది మగాళ్ళు ముగ్గురు అమ్మాయిలు. అంతా పిన్నవయస్కులే. అమ్మాయిలు ముగ్గురిలోనూ పెద్దమ్మాయి చామనఛాయగా చలాకీగా వుంది. వస్తూనే "ఏంది తమ్ముడూ. ఏమైంది?" అనడిగింది.

"చూడక్కా ఆ పెద్దాయన పొమ్మని కసురుతున్నాడు" అంటూ రిపోర్ట్ చేసాడు కుర్రాళ్లలో కాస్త పెద్దవాడు.

"పొమ్మంటే పోతామా ఏంది? నక్కకొమ్ము దిష్టితీసి ఆ పెద్దాయనికి కడితే కోపం పోతుంది. ఏడాదికో తూరి వచ్చినం. ఉత్తచేతులతో పంపిస్తారా? ఇక్కడ సానా మంది సాములున్నారు. మన ఆటనచ్చాలి పాట నచ్చాలి. చిందెయ్యండిరా" అనరిచిందా అమ్మాయి అంతే "ఢమక్క డియ్యా డియ్యాలో ` ఢమిక్క డియ్యా డియ్యాలో" అంటూ అంతా పాడుతూ డాల్డా డబ్బాల మీద బాదుతుంటే ఆ నల్లపిల్ల అద్భుతంగా చిందేయటం ఆరంభించింది.

నిజానికి ఆ నల్లపిల్ల ఎవరో కాదు.

సహస్ర.

మేలిమి బంగారు రంగులో మెరిసిపోయే ఆమె శరీరకాంతి ఇప్పుడు మేకప్ రంగులో నల్లగా మారి పోయింది. ఆమె వెంటవచ్చిన వాళ్ళంతా మురడన్ ముత్తు బేచ్. మరీ సహస్ర ఒంటరిగా రావటం బాగుండదని ముత్తు తన చెల్లెల్ని తెలిసిన మరో అమ్మాయిని ఇద్దరినీ సహస్రకి తోడుగా తీసుకొచ్చాడు. అద్భుతంగా వేషాలు కుదిరాయి. విరాట్తో సహా ఎవరూ సహస్రని గుర్తుపట్టలేక పోయారు. క్లోజ్ఫ్రెండు దీక్షకూడా గుర్తించలేదు. కాని కాస్త ఆలస్యంగా అయినా విశాల గుర్తుపట్టేసింది ఎలాగంటే.

సహస్రవి విశాల నేత్రాలు. చక్కగా తీర్చిదిద్దినట్టుండి, ఎదుటివాళ్ళని శాసిస్తున్నట్టుంటాయి. రంగుమారినా రూపూ రేఖలు మార్చినా కళ్ళుమారవు. అందుకే అచ్చు గుద్దినట్టు నక్కలోళ్ళ అమ్మాయిలా మారిపోయిన సహస్రను చూస్తూ మతి పోగొట్టుకుంది విశాల. ''అక్కా నీలో ఇంత టాలెంట్ ఉందనుకోలేదు'' అనుకుంది మురిసిపోతూ.

అంతలో గేటుముందు వాళ్ళగోల భరించలేక తరిమికొట్టాలని గేటువైపు కదిలాడు విరాట్. అతడి చేయిపట్టి వెనక్కి లాగింది విశాల.

''బావా...     తొందరపడమాకు. ఇంకా గుర్తు పట్టలేదా? ఆ నల్ల పిల్ల మన సహస్ర. వాళ్లంతా నిజంగా నక్కలోళ్ళుకాదు. సరిగా గమనించు'' అంది.సమీపంలోనే వున్న మునుసామి అమాటలు విని దగ్గర కొచ్చాడు. విషయం క్షణాల్లో అందరికీ పాకిపోయింది. మీరు గమ్మునుండండి నేను హేండిల్ చేస్తాను. ఇదిగో కదిరేశా మనోళ్ళని వీధిలోకి తరుము శతృమనుషులెవరన్నా గమనిస్తున్నారేమో చూడమను'' అని చెప్పి గేటు వద్దకెళ్ళి తెరిచాడు.

చుట్టుపక్కల యిళ్ళ తాలూకు పిల్లలు కొందరు వీధిలోకొచ్చి ఆ గుంపుని తమాషా చూస్తున్నారు.

''ఇదిగో అమ్మాయ్ మీ ఆట పాట నచ్చిందిగాని లోనకి రండి. కాస్త చద్దిబువ్వ రొట్టెముక్కతిని పోదురుగాని రండి'' అని పిలిచాడు.



‘ఇదిగో పెద్దాయనా నాకు మూడు కోట్లు కావాలి. అక్కకి పాత చీర కావాలి, చెల్లెళ్ళకి తమ్ముళ్ళకి పాత బట్టలు కావాల ఇస్తావా?’’ అనడిగాడు ముత్తు.

‘‘ఉంటే చూసిత్తాలేరా రండి’’

‘‘ఉత్తినే వద్దులే సామి. మా దగ్గర రెండు మాంచి నక్క కొమ్ములున్నాయి తీసుకో’’ అన్నాడు మరొకడు.

ఒకరి తర్వాత ఒకరు అంతా లోనకు రాగానే ధర్మ మనుషులు కదిరేషన్ మనుషులు కూడా చెకింగ్ కోసం వీధిలోకెళ్ళి పోయారు.

ఇంట్లోకి రాగాలనే అంతా వున్నారని కూడా చూడకుండా నల్ల పిల్ల చేయి పుచ్చుకుని చర చరా పడగ్గది లోకి లాకెళ్ళి తలుపు మూసాడు విరాట్.

కౌగిట బంధించి కంట నీరు నించాడు.

''ఒక్క రోజు నిన్ను చూడకుండా ఉండ లేను. మూడు రోజులైంది. ఈ ఇరవై రోజులు ఎలా గడపాలో తెలీటం లేదు. ఇదేం ఖర్మ. ఆగర్భ శ్రీమంతురాలివై వుండి ఈ వేషం ఏమిటి? వీధుల్లో అడుక్కోవటం ఏమిటి? ఇదంతా అవసరమా?'' అన్నాడు బాధగా.

''అంతటి శంకరుడే బిచ్చమెత్తగా లేనిది మనమెంత బావా. ప్రాణాలు కాపాడుకోడానికి తప్పదు. నాకూ నీ నుంచి దూరంగా ఉండటం బాధ గానే వుంది కాని భరించాలి తప్పదు. మేకప్ చెడి పోతుంది వదులు బావా ప్లీజ్'' అంటూ ముద్దిచ్చి మృదువుగా కౌగిలి విడిపించుకుంది.

''మమ్మల్ని గుర్తు పట్టలేరనుకున్నాను. ఎలా గుర్తు పట్టావ్?'' అంది నవ్వుతూ.

''నేనెక్కడ గుర్తు పట్టాను. అసలెవరూ గుర్తు పట్ట లేదు. విశాల గుర్తు పట్టింది'' అన్నాడు.

తలుపు తీసి విశాలను లోనకు పిలిచింది.

కాస్సేపు ముగ్గురూ చర్చించుకున్నారు.

తీసుకో వలసిన జాగ్రత్తల గురించి హెచ్చరించింది సహస్ర. తర్వాత విరాట్ ఇచ్చిన లక్ష రూపాయల పేపర్లో చుట్టిన పార్శల్ని డాల్డా డబ్బాలో వేసుకుంది, దీక్షను పిలిచింది. ఆమె తన గదిలోంచి తెచ్చిన నాలుగు జతల దుస్తుల్ని డాల్డా డబ్బాలో కుక్కుకొని బయటకొచ్చింది.

''వీడు నా పెద్ద తమ్ముడు ముత్తు'' అంటూ ముత్తును పరిచయం చేసింది. ''వీడు కిట్టు, వీడు బాల మురుగన్, వీడు

శివకుమార్'' అంటూ మిగిలిన కుర్రాళ్ళందర్నీ పరిచయం చేసింది. ''ఇది ముత్తు చెల్లెలు మీనా. ఈ అమ్మాయి ముత్తు అక్క కూతురు రమణి     నాకు తోడుగా వచ్చారు. అసలీ మారు వేషాల అయిడియా ముత్తుదే'' అంటూ పరిచయం చేస్తుంటే అందరికీ నమస్కరించారు వాళ్ళు.

''కిడ్నాప్ అయిడియా కూడా ముత్తుదే గదా'' అని మునుసామి అనగానే అంతా నవ్వుకున్నారు.

ముత్తు భుజం తట్టి అభినందించాడు విరాట్.

''ఏది ఏమైనా అంతా మన మంచికే అంటారు. ఈ పిల్లల్ని మనం సత్కరించాల్సిందే'' అన్నాడు ముచ్చట పడుతూ మునుసామి.

''ఏరా ఇక మీదట అక్క బాధ్యత మీది. మంచిగ వుండండి. దొంగతనాలు వద్దు. మీ భవిష్యత్తు బాగుండేలా మేం ఏర్పాటు చేస్తాం. అక్క చెప్పినట్టు వినండి'' అన్నాడు విరాట్.

''సరి బావా. అక్క మాట జవదాటం. మీరేమి దిగులు చెందక్కర్లేదు. కోర్టుకి ఎలా తీసుకొస్తామో ఎవరికీ తెలీదు చూడండి'' అంటూ మాటిచ్చాడు ముత్తు.

సహస్ర వారించినా వినకుండా కుర్రాళ్ళందరికీ తలో పాతికవేలు బహుమతిగా ఇచ్చాడు విరాట్. అంతా బండ శివా వేసిన టిఫిన్లు తిన్నారు. దీక్షకు ధైర్యం చెప్పి ఓదార్చింది సహస్ర. చందూని పరామార్శించింది.

అలా అందర్నీ పరామార్శించి బయలు దేరుతుండగా బయటి కెళ్ళిన ధర్మా కదిరేశన్లు తిరిగొచ్చారు.

''ఏరా పొజిషన్ ఏమిటి?'' అనడిగాడు విరాట్.

''లైన్ క్లియర్. అనుమానించ తగ్గ వాళ్ళెవరూ లేరు. ఎందుకైనా మంచిదని మార్కెట్ వరకూ అక్కడక్కడా మన వాళ్ళని వుంచాం'' అన్నాడు ధర్మ. ధర్మ కదిరేశన్లతో కూడా మాట్లాడాక సహస్ర బృందం ఎలా వచ్చారో అలాగే నక్కలోళ్ళ గుంపు లాగే ఆడుతూ

పాడుతూ కుర్రాళ్ళందర్నీ తీసుకొని బయటి కెళ్ళిపోయింది సహస్ర.

‘‘వీళ్ళంతా నడుచుకుంటూ వెళ్ళాల్సిందేనా?’’ అమాయకంగా అడిగింది విశాల.

‘‘లేదు లేదు కాలనీ గేటు బయట వీళ్ళ తాలూకు రెండు ఆటోలు ఆగున్నాయి’’ అన్నాడు కదిరేశన్.

సహస్ర వెళ్ళిపోయిన చాలా సేపటి వరకు తాము తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చర్చించుకొంటూనే వున్నారంతా.

*****************************

మరో వారం గిర్రున తిరిగింది.

కీల్పాక్కం నుంచి తన అడ్డాను వేలచ్చేరికి మార్చుకున్నా విరాట్ మూలంగా త్యాగ రాజన్కి మనశ్శాంతి లేకుండా పోయింది. విరాట్ రోజు విడిచి రోజూ ఫోన్ చేస్తూనే వున్నాడు. సహస్రను ఏం చేసావ్. ఇంత వరకు తిరిగి రాలేదు. తను రాలేదంటే నిన్ను చంపేస్తాను’’ అంటూ బెదిరించి విసిగిస్తూనే వున్నాడు.

విరాట్ విషయం పక్కనుంచితే…

అసలు తనకే చాలా ఆశ్చర్యంగా వుంది.

ఏమైందా అమ్మాయి? ఇంత వరకు కాలనీకి వెళ్ళక పోవటం ఏమిటి? ఫోన్ కూడా చేయకుండా తిరిగి రాకుండా ఏమై ఉంటుంది? ఒక వేళ ఆ పోరాటంలో తగిలిన గాయాలతో పారిపోతూ ఏ మారు మూలనో చని పోయి వుంటుందా? ఎట్టయప్ప గాని పాండ్యన్ గాని మిగిలిన వాళ్ళు గాని చెప్పిన మాటల్ని బట్టి చూస్తే అంత గొడవ జరిగినా ఆమె వంటి మీద చిన్న గీత కూడా పడ లేదు నిక్షేపంగా ఉందంటున్నారు. ఉంటే తిరిగి రాకుండా ఎక్కడికి పోయింది? వాయిదా తేదీ వరకు అజ్ఞాతంలో ఉందామని వెళ్ళి పోయిందా? లేక విరాట్ సహస్ర తిరిగి రాలేదంటూ అబద్ధాలతో తనకు గాభరా పుట్టిస్తున్నాడా!

ఏదీ ఒక అంచనాకు రాలేక పోతున్నాడు. దాంతో నిలకడగా ఏదీ ఆలోచించ లేక పోతున్నాడు. వేలచ్చేరి అడ్డా మీద కూడ తిరిగి విరాట్ వర్గం దాడి చేయొచ్చన్న అనుమానం కంగారు పెడుతూనే వుంది. తనక్కడ వుండటం క్షేమం కాదన్న ఉద్దేశంతో అక్కడికి మూడు వీధుల అవతల మరో యింట్లో అజ్ఞాతంలో కాలక్షేపం చేస్తున్నాడు.

ఆ రోజు సాయంత్రం ప్రశాంతంగా కూచుని మందు కొడుతుంటే విరాట్ ఫోన్ చేసి తిరిగి డిస్టర్బ్ చేసాడు. విసిగి పోయిన త్యాగరాజన్ విస్కీ గ్లాసును కోపంతో నేలకు విసిరి కొట్టాడు.

ఆ సమయంలో పాండ్యన్ తో బాటు మరో ముగ్గురు అక్కడే వున్నారు.

‘‘ఏంట్రా పాండ్యా మీరంతా వుండి కూడా ఏమిట్రా నాకీ టార్చర్? మనం వాళ్ళని గమనిస్తుంటే మనల్ని మన కదలికల్ని వాళ్ళు గమనిస్తున్నారు. సహస్ర తిరిగి రాకుంటే నన్ను చంపేస్తానంటున్నాడు. ఏం చేయాలి? అటు చూస్తే వాయిదా దగ్గర పడుతోంది. మీ వల్ల ఏ ప్రయోజనం లేకుండా పోతోంది’’ అనరిచాడు కోపంగా.

‘‘సార్ నేనో మాట చ్పెనా?’’ అడిగాడు పాండ్యన్.

‘‘చెప్పరా ఉపయోగ పడేదుంటే చెప్పు. ఏంటది?’’

‘‘ఆ విరాట్ మిమ్మల్ని చంపుతానంటూ బెదిరస్తున్నాడు గాని వారం తిరిగినా ఇంత వరకు అలాంటి ప్రయత్నం ఒక్కటీ చేయలేదు. ఎందుకంటారు?’’

ఉన్నట్టుండి ఆలోచనలో పడ్డాడు త్యాగరాజన్.

పాండ్యన్ తన మాటల్ని పొడిగిస్తూ` 'సార్ నిజంగా సహస్ర తిరిగి రాకుంటే విరాట్ లాంటి సమర్ధుడు ఇన్ని రోజులు ఆగుతాడా? ఎప్పుడో మన మీద రెండో అటాక్ చేసే వాడు గదా?' అనడిగాడు.

''అంటే ఏమిట్రా? సహస్ర వాళ్ళ దగ్గరే వుందంటావా? నన్ను బెదిరించి కన్ఫ్యూజ్ చేయటం కోసం నాకు ఫోన్ చేస్తున్నాడంటావా?''

''నా ఉద్దేశం అదే సార్. ఆ ఎఫెక్ట్ తోనే మీరు సరైన నిర్ణయం కూడా తీసుకో లేక పోతున్నారు. కొంచెం ఆలోచించండి సార్.''

అవునన్నట్టు తలూపాడు త్యాగరాజన్.

''అయితే ఆలస్యం దేనికి? ఈ రాత్రికే మన వాళ్ళని రెడీ చేసి కాలని మీద దాడి చేయండి. సహస్రతో సహా విరాట్ని కూడా చంపేయండి' అన్నాడు.

''అదంత సులువు కాదు సార్'' అన్నాడు వెంటనే పాండ్యన్.

''కాలనీలో సహస్ర దీక్షలుండే ఇల్లు ఒకటి విరాట్ ఉండే ఇల్లు ఒకటి రెండిళ్ళున్నాయి. ఆ యిళ్ళని, వీధుల్ని, కాలనీ కెళ్ళే రోడ్ వెంట కూడా వాళ్ళ మనుషులు తిరుగున్నారు. పగలు రాత్రి గట్టి నిఘా వుంది. మన వాళ్ళు కాలనీ గేటు దాటక ముందే వాళ్ళకి తెలిసి పోతుంది. వెళ్ళిన వాళ్ళలో ఒక్కడూ ప్రాణాలతో వెనక్కి రాలేదు. అలాంటి పొరబాటు చేయకూడదు''.

''మరెలా... ఏం చేద్దాం? చేత కాని వాళ్ళలా కూచోవలసిందేనా?''

“నా ఉద్దేశం అది కాదు సార్. మనకున్న ఒకే ఒక్క అవకాశం సైదా పేట కోర్టు. సహస్ర ఎక్కడ దాక్కున్నా వాయిదాకి వచ్చి తీరాలి. కోర్టు మెట్లు ఎక్కకుండానే కాల్చిపారేద్దాం”

“ఇలా ప్లాన్ చేసే మధురై కోర్టు దగ్గర దెబ్బ తిన్నాను. మళ్ళీ అదే ప్లానా!” అన్నాడు నీరసంగా త్యాగరాజన్.

“ఈ సారి ఫైయిలవటం జరగదు సార్. పక్కాగా ప్లాన్ చేద్దాం. అన్నట్టు మీరు ఆ రోజు కోర్టుకు రావాలిగా” అడిగాడు పాండ్యన్.

“లేదు నేను రానక్కర్లేదు. మన లాయర్లు ఆ విషయం చూసుకుంటున్నారు. మధురై కోర్టుకి నేను హాజరయ్యే ఏర్పాటు చేస్తున్నారు. టైం పడుతుంది”

“అయితే మీరిక నిశ్చింతగా ఉండండి సార్. సహస్ర ఎక్కడుందో వాళ్ళకి తెలుసు. మనల్ని రాంగ్ రూట్ పట్టిస్తున్నారు. కోర్టు వాయిదా లోపు ఆ విరాట్ మరో సారి మన మీద దాడి చేయటం జరగదు. విరాట్ ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకండి.

సహస్ర కోర్టుకి తప్పకుండా వస్తుంది. మన షూటర్స్లో ఇద్దర్ని బయట ఉంచుతాను. మరో ఇద్దరు లోన విజిటర్స్ గ్యాలరీలో ఉంటారు. ఇక దుస్తుల చాటున మారణాయుధాలతో సాధారణ పౌరుల్లా మనవాళ్ళు ఆవరణలో తిరుగుతూ రెడీగా ఉంటారు. సహస్రను ఎంత మంది రక్షణగా కోర్టుకి తీసుకొచ్చినా మెట్లు ఎక్కక ముందే చంపేస్తారు. అదీ తప్పించుకొని లోనకెళ్తే లోన ఇద్దరు షూటర్స్ ఉంటారు. వాళ్ళు సహస్రని బోను ఎక్కక ముందే కాల్చి పారేస్తారు. ఎలా చూసినా ఆ రోజు సహస్రకు చావు తప్పదు” అంటూ పాండ్యన్ తన ప్లానును వివరిస్తుంటే ఆసక్తిగా వింటూండి పోయాడు త్యాగరాజన్. ఎందుకో ఈ సారి తమ ప్లాన్ వర్కవుటయి, సహస్ర మరణిస్తుందనే గట్టి నమ్మకం త్యాగరాజన్లో ఏర్పడసాగింది.

******************************************

రోజులు గడుస్తున్నాయి...

వాయిదా దగ్గర పడుతోంది.

రెండ్రోజుల్లో సహస్ర కోర్టుకు వెళ్ళాలనగా ఆ రాత్రి విరాట్ సహస్ర సెల్కి ఫోన్ చేసాడు. వెంటనే లిఫ్ట్ చేసింది సహస్ర.

“బావా ఏంచేస్తున్నావ్? భోంచేసావా ఇంకా లేదా?” అనడిగింది.

“ఇంత క్రితమే భోంచేసాను నువ్వు భోంచేసావా?”

“ఇప్పుడే. మన వాళ్ళంతా భోంచేసారా?”

“అంతా భోంచేసారు. విశాల కూడా మాతో బాటు ఇక్కడే భోంచేసి ఇంత క్రితమే ఇంటికెళ్ళిపోయింది. అన్నట్లు ఎల్లుండే నువ్వు కోర్టుకు వెళ్ళాలి గుర్తుందిగా?”

“గుర్తుంది బావా”

“ఎలా వున్నావ్? నిన్ను చూసి యుగాలు గడిచినట్టుంది. విశాల గోల చేస్తోంది. దీక్ష బెంగపడి పోతోంది.”

“ఇంకెంత బావా రెండ్రోజులు ఓపిక పడితే సమస్యల నుంచి బయట పడిపోతాం. తమ్ముళ్ళంతా నన్ను చాలా బాగా చూసుకుంటున్నారు. నా గురించి బెంగ పడాల్సిన పని లేదు”

“అది సరి. కోర్టుకి ఎలా వస్తావ్? మేం కోర్టు దగ్గర రెడీ గానే వుంటాం”

“బావా మీరు నా కోసం చూడకండి. మీలో కొందరు ముందు గానే విజిటర్స్ గ్యాలరీలో కెళ్ళి త్యాగరాజన్ మనుషులు ఎక్కడెక్కడున్నారో గమనించి కవర్ చేయండి...”

“అవన్నీ మేం చూసుకుంటాం. సరే నువ్వెలా వస్తావ్. నేరుగా వచ్చేస్తావా లేక...”


“బావా ఎలా అని అడక్కు సస్పెన్స్. నువ్వే చూస్తావ్గా!” అంటూ నవ్వింది సహస్ర. మరో మూడు నిముషాలు సహస్రతో మాటాడి లైన్ కట్ చేసాడు విరాట్.

*********************************

రేపు వాయిదా రోజు అనగా...

ఆ ముందు రోజు ఉదయం కూడా తమిళనాడు సియం సెల్వీచెందామరై విరాట్ సెల్కి ఫోన్ చేసారు. “తగిన ప్రొటెక్షన్ లేకుండా సహస్ర కోర్టుకి వెళ్ళటం ప్రమాదం. ఇప్పుడైనా మీరు ప్రభుత్వ రక్షణ లోకి వస్తే మంచిది. తగిన ఏర్పాట్లు చేస్తాను” అన్నారు.

“సారీ మేడం సహస్ర జాడ ఇంత వరకు తెలిలేదు. కోర్టుకి వస్తుందో రాదో తెలిదు. మీ మాట కాదంటున్నందుకు క్షమించాలి” అంటూ సున్నితంగా ఆమె సలహాను తిరస్కరించాడు విరాట్.



సి.యం. గుంభనగా నవ్వటం ఫోన్లో విన్పించింది. ''మిష్టర్ విరాట్ ని పట్టుదలను మెచ్చుకొంటున్నానయ్యా. సహస్ర అభీష్టానికి విరుద్ధంగా నువ్వేమీ చేయవని అర్ధమవుతోంది. లోకంలో జంటలన్నీ మీలా ఏకాభిప్రాయంతో ముచ్చటగా ఉంటే ఎంత బాగుంటుంది? ఒకే సహస్ర ఎక్కడుందో తెలిక పోయినా ఆ అమ్మాయి నీకు ఫోన్లో టచ్లోనే ఉందని రేపు సైదాపేట కోర్టుకి హాజరవుతుందని నాకు తెలుసు. ఎనీవే బెస్ట్ ఆఫ్ లక్'' అంటూ లైన్ కట్ చేసారు సియం.

ఆమె మాటలకి విరాట్ నిర్ఘాంతపోయాడు. ఆమె తమని మర్చిపోలేదు. క్లోజ్గా గమనిస్తోంది. బహుశ తన ఫోన్ కాల్స్మీద నిఘా ఉంచవచ్చు.

అదే రోజు సాయంకాలం మధురై నుంచి సహస్ర తండ్రి మహా దేవ నాయకర్ సియం సెల్వి చెందామరైకి ఫోన్ చేసాడు.

“సియం గారు క్షమించాలి. తప్పనిసరై ఇలా సడెన్గా ఫోన్ చేసాను” అన్నాడు.

“ఫరవా లేదు మహా దేవ నాయకర్ గారు. మీరు మాకు మా పార్టీకి ఎంతో కావలసిన వారు. అంతా క్షేమం గదా!” పరామార్శించారు సియం.

“ఆ విషయం చెప్పటానికే ఫోన్ చేసాను మేడం. రేపు సహస్ర కోర్టుకి రాగానే ఆ త్యాగరాజన్ మనుషులు ఏదోటి చేసి చంపాలని చూస్తారు. మీరే తగిన రక్షణ ఏర్పాటు చేయించి మా బిడ్డని కాపాడాలి” అంటూ రిక్వెస్ట్ చేసాడాయన.

“నేనా విషయం మర్చిపోలేదు నాయకర్ గారూ. ఈ ఉదయం కూడా విరాటకి ఫోన్ చేసి అడిగాను. వాళ్ళు ప్రభుత్వ పరంగా ఏ సాయం తీసుకోడానికి సిద్ధంగా లేరు. అలా చేస్తే పరిస్థితి రాజకీయ గందరగోళానికి, అనిశ్చితికి కారణం కావచ్చని సందేహిస్తున్నారు. ఏం చేస్తాం? బట్ మీక్కాబోయే అల్లుడు జీనియస్. మీ అమ్మాయి డేరింగ్ డాషింగ్ లేడీ. వాళ్ళ రక్షణ ఏర్పాట్లలో వాళ్ళున్నారు గాబట్టి భయపడాల్సిందేమీ లేదనుకొంటున్నాను.

అయినప్పటికి ప్రభుత్వ పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ తీసుకోవటం జరిగింది. మీరూ మాక్కావలసినవారు. విరాట్ తండ్రి గారూ కోయంబత్తూరు లక్ష్మీ క్లాత్ మిల్స్ వెంకటరత్నం నాయుడు గారు కూడా కావలసిన వారు. కాబట్టి నేను ఉపేక్షించకుండా ఎప్పటికప్పుడు పరిస్థితి గమనిస్తూనే వున్నాను. భయపడకండి అంతా శుభమే జరుగుతుంది.

ఎ వార్ వితవుట్ బ్లడ్ అని నెత్తురు చిందకుండానే ముగిసిన యుద్ధాలు కొన్ని చరిత్రలో వున్నాయి. నా అంచనా కరక్టయితే రేపు అలాంటి ఒక యుద్ధాన్నే మనం చూడబోతున్నాం. మీకు తెలిని విషయాలిక్కడ చాలా వున్నాయి. మేం చూసుకుంటాం. మీరు నిశ్చింతగా ఉండండి” అంటూ భరోసా యిచ్చారు సియం.

“థ్యాంక్యూ మేడం. థ్యాంక్యూ” అంటూ కృతజ్ఞతలు తెలుపుకున్నాడు మహాదేవనాయకర్.

**************************************************

కోర్టు వాయిదా రోజు.

జర్నలిస్టు లహరి కోర్టుకు హాజరై తనిచ్చిన రిపోర్ట్ మీద త్యాగరాజన్కి వ్యతిరేకంగా స్టేట్మెంట్ యివ్వాల్సిన రోజు. అంతకు రెండ్రోజుల క్రితంనుంచే టివిల్లోను. పత్రికల్లోను జర్నలిస్టు లహరి సైదాపేట కోర్టుకు హాజరు కానున్న విషయాన్ని భిన్న కథనాలుగా వార్తలొచ్చాయి. తొమ్మిది గంటలకే పత్రికా విలేకర్లు కోర్టుకు చేరుకున్నారు. వివిధ ఛానళ్ళకు చెందిన రిపోర్టర్లు వీడియో కేమెరాలతో పరుగులెత్తుకొచ్చారు. రచయిత్రి సహస్ర, జర్నలిస్టు లహరి ఒకరే అని తెలిసి పోడంతో సిటీలోని ఆమె అభిమానులంతా లహరిని చూడాలని కోర్టుకి చేరుకోనారంభించారు. దాంతో ఉదయం తొమ్మిది గంటలకే చెన్నై సైదాపేట కోర్టుల సముదాయం ఆవరణ అంతటా సందడిగా మారిపోయింది.

త్యాగరాజన్ మనుషులు అప్పటికే అక్కడ తిష్టవేసి రెడీగా ఉన్నారు. హర్యానా షూటర్స్ యిద్దరు సాధారణ పౌరుల్లా వుండి కోర్టు మెట్లకి అటుయిటు ద్వారపాలకుల్లా నిలబడి సహస్ర రాక కోసం ఎదురుచూస్తున్నారు.

దుస్తుల్లో మారణాయుధాలు దాచుకున్న త్యాగరాజన్ మనుషులు సుమారు డెబ్బై మంది సాధారణ పౌరులతో కలిసిపోయి ఆవరణలో తిరుగుతున్నారు.

అక్కడికి కాస్త ఎడంగా ఒక పక్కన పార్కింగ్లో నిలిపిన వేన్లో కూచొని తమ వాళ్ళ పొజిషన్స్ని గమనిస్తున్నాడు పాండ్యన్. సెల్ఫోన్ నుంచే వాళ్ళకి సూచనలిస్తున్నాడు. హర్యానా షూటర్స్లోమరో ఇద్దర్ని అప్పటికే విజిటర్స్ గాలరీలోకి పంపించి వున్నాడు.

ఇదిలా ఉండగా అక్కడికి దూరంగా ఒక అశోక వృక్షం కింద ఆగుంది ఖరీదైన కారు ఒకటి. దానికి నల్లద్దాలు లేపి ఉంచటంతో బయటి వాళ్ళకు లోన ఎవరుందీ తెలీదు. ఆ కారులో ఇద్దరే వ్యక్తులున్నారు. ఒకడు కారు డ్రైవరు. రెండో వాడు త్యాగరాజన్ అతడు వెనక సీట్లో కూచుని పరిస్థితిని జాగ్రత్తగా గమనిస్తున్నాడు. అవసరమైతే అక్కడ్నుంచి వెళ్ళి పోడానికి వీలుగా డ్రయివరు కారు దిగిలేదు. స్టీరింగ్ వెనక కూచునే వున్నాడు.

పాండ్యన్ అంతగా చెప్పినప్పటికీ లహరి కోర్టుకి వస్తుందా? అసలా అమ్మాయి ఇన్ని రోజులుగా ఎక్కడుంది? ఎలా వస్తుంది? అసలు రాదా అనేక సందేహాలతో ఆత్రంగా ఎదురు చూస్తున్నాడు త్యాగరాజన్.

అయితే యిక్కడ విరాట్ వర్గం పరిస్థితి మాత్రం వేరు.

సహస్ర ఖచ్చితంగా కోర్టుకి వస్తుందని వాళ్ళందరికీ తెలుసు. కాని ఏరూపంలో ఎలా వస్తుందనేది మాత్రం తేలీదు. తమ ఏర్పాట్లలో తాముండాలి గాబట్టి ఒక్కరొక్కరుగా కోర్టు ఆవరణలోకి రావటం ఆరంభించారు.

సహస్రకు అసలైన ముప్పు హర్యానా షూటర్స్ నుంచి పొంచి వుంది. ఎవడు ఎటునుంచి షూట్ చేస్తాడో తెలీదు. ముందు వాళ్ళని గుర్తించాలి. వాళ్ళు ఎవరో ఎలా ఉంటారో దీక్ష ఒక్కదానికే తెలుసు. ఆ రోజు శిధిల భవనం వద్ద సంఘటనల్లో వాళ్ళని చూసింది. తనను త్యాగరాజన్ మనుషులెవరూ గుర్తించకుండా నల్లటి బురఖాలో బయలు దేరింది దీక్ష. ఆమె వెంట విశాల మాత్రమే కాదు లహరి స్టేట్మెంట్ వినాలనే కుతూహలంతో డాక్టర్ గుణదీపిక కూడా బయలు దేరింది. నల్లని బురఖాల్లో ఈ ముగ్గురూ వస్తుంటే వాళ్ళని అనుసరించి ముగ్గురు ముస్లిం యువకులూ వచ్చారు. వాళ్ళంతా పిల్లి గడ్డం తలమీద టోపీ పైజామా కుర్తాలు ధరించి అచ్చ ముస్లిం యువకుల్లాగే వున్నారు. కాని వాళ్ళలో ఒకడు విరాట్, రెండోవాడు ధర్మ చివరగా వస్తున్న వాడు చందూ.

వాళ్లంతా మెట్లను సమీపిస్తుండగానే దీక్ష అక్కడ అమాయకుల్లా నిలబడున్న హర్యానా షూటర్స్ ఇద్దర్నీ గుర్తించి విరాట్కి సైగ చేసింది. బయట ఇద్దరున్నారంటే మిగిలిన యిద్దరూ లోన గేలరీలో ఎక్కడో తిష్ట వేసుండాలని విరాట్కి అర్థమైంది. పక్కనే వస్తున్న మునుసామికి సిగ్నలిచ్చి మెట్లెక్కి లోనకెళ్ళి పోయాడు విరాట్.



మునుసామి కదిరేశన్లు కూడా గెటప్ మార్చుకునే వచ్చారు. కావి పంచెలు లుంగీల్లా చుట్టుకొని చొక్కాలు ధరించారు. తలకి తుండు చుట్టుకొని చుట్ట దమ్ము కొడుతూ పల్లెటూరి పెద్ద మనుషుల్లా తయారై వచ్చారు. వాళ్ళ ననుసరించి సాధారాణ పౌరుల్లా ధర్మ మిత్ర బృందం మునుసామి కదిరేశన్ మనుషులు కోర్టు ఆవరణలోకి వచ్చారు. అందరికి దుస్తుల మాటున ఆయుధాలు సిద్ధంగా వున్నాయి. అవసరమైతే రంగంలోకి దిగిపోడానికి తగిన ఏర్పాట్లతో వచ్చినా ఎవరికి వారు సంబంధం లేనట్టు తామూ సాధారణ పౌరులతో కలిసి పోయి విడివిడిగా ఆవరణలోనే తిరగసాగారు.

‘‘ఏం చేద్దాం. హర్యానా షూటర్స్ ఇద్దర్నీ ముందు వేసేద్దామా?’’ కదిరేషన్ మునుసామి చెవిలో గొణిగాడు.

‘‘తొందరపడకు. కోర్టు ఆరంభించకుండానే గొడవ జరగటం మంచిదికాదు. బయట జనంలో ఆ పాండ్యన్ గాడి మనుషులూ మనలా

కలిసిపోయి తిరుగుతున్నారు. గొడవ మొదలైతే అదిరణరంగమే. సహస్ర కోర్టులో ప్రవేశించే వరకు మనల్ని ఎట్టి పరిస్థితిలోనూ తొందర పడొద్దని విరాట్ చెప్పాడు. సహస్రకూడా ఫోన్లో అదే విషయం చెప్పింది. నాకెందుకో అనుమానంగా వుంది. సరిగా చూడు. మనలాగే పోలీసులు కూడా మఫ్టీలో జనంలో తిరుగున్నారు. మనం జాగ్రత్తగా ఉండాలి'' అంటూ హెచ్చరించాడు మునుసామి. వీళ్ళంతా లోనకెళ్ళకుండా బయటే తిరుగుతూ పరిస్థితిని గమనించసాగారు.

ఇదిలా ఉంటే ఇక్కడ ఎవరూ వూహించని మరో విశేషం జర్నలిస్టు లహరి అభిమానులు ఎందరో ఆమెను చూడాలని ఆమె స్టేట్మెంట్ వినాలని ఆశేషంగా తరలి రావటం. దాంతో కోర్టు ప్రాంగణమంతటా ఎటు చూసినా జనం కన్పిస్తున్నారు. అప్పటికే లోన విజిటర్స్ గాలరీ జనంతో కిక్కిరిసిపోయింది. లోన చోటులేక అనేక మంది కోర్టు వరండాలోను బయటే ఉండిపోయారు. సాధారణ కానిస్టేబుల్స్ కొద్దిమంది ఉన్నారు. వాళ్ళే జనాన్ని అదలించి కంట్రోల్ చేసే ప్రయత్నం చేసారు.

ఆ విధంగా కోర్టు ప్రాంగణమంతటా ఏ క్షణంలోనయినా బద్దలవటానికి సిద్ధంగా వున్న అగ్ని పర్వతంలా ఉంది, ఏ చిన్న గొడవ మొదలయినా అది రణ రంగానికి దారితీసి ఆ ప్రాంతం రక్తసిక్తమైపోతుంది. అటు త్యాగరాజన్ వర్గం ఇటు విరాట్ వర్గాలు రెండూ చాపకింద నీరులా చేరిపోయి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా వున్నాయి. అటు గాలరీలో ప్రవేశించిన దీక్ష కింద కోర్టు హాల్లోని బోను కన్పించేలా ఆ చివర ఒకడు ఈ చివర ఒకడుగా పౌరులతో కలిసిపోయి కూచున్న హర్యానా షూటర్స్ యిద్దర్నీ గుర్తించింది. పిల్లిలా ఒకడి వెనక్కి విరాట్ రెండోవాడి వెనక్కి ధర్మా చేరిపోయి ఏమీ తెలీనట్టు కూచున్నారు. ముగ్గురమ్మాయిలతో బాటు గాలరీ మధ్యలో ఒక చోట కూచున్నాడు చందూ.

ఇలా తలో చోట సెటలయి సిద్ధపడుతుండగా సమయం పది గంటలు కావచ్చింది. కోర్టు ఆరంభ సమయం దగ్గరపడుతోంది. ఇంకో అయిదు నిముషాల్లో పది కావస్తుందనగా ఒక ఓల్డ్ స్టాండర్డ్ వేన్ రణగొణ ధ్వనులు చేస్తూ దూసుకొచ్చి పార్కింగ్లో ఆగింది. ఆ వేన్ లోంచి ముందుగా సుమారు డెబ్బై సంవత్సరాల వయసుండే అయ్యంగారి బామ్మా ఒకావిడా దిగింది.

తమ కులాచారం ప్రకారం చక్కగా సాంప్రదాయంగా తొమ్మిది గజాల చేనేత చీర కట్టి కుచ్చిళ్ళు వెనక్కితీసి దోపుకుంది. అదేరంగు జాకెట్టు ధరించింది. వంటినిండా పైటతిప్పి తలమీదుగా మేలిముసుగు సరిచేసుకుంది.

ముగ్గు బుట్టలా తలపండిపోయినా వాలుజడ వేసుకుని శిగలో మందారపూలు తురిమింది. పాదాలకు మువ్వల పట్టీలు చేతుల నిండుగా రంగు గాజులు, ముఖాన అర్ధరూపాయంత కుంకుమ బొట్టుతో చూడ్డానికి గుడి లోంచి కదిలివస్తున్న అమ్మవారిలా వుంది. ఆవిడ చత్వారం కళ్ళజోడు సరిచేసుకునేలోన వేన్లోంచి బిలబిలా పదహారు మంది పిల్లలు దిగారు. వాళ్ళంతా పదిహేను ఇరవై రెండు సంవత్సరాల మధ్య వయస్కులు. వాళ్ళలో కొందరు అమ్మాయిలూ వున్నారు. అమ్మాయిలు చక్కగా పట్టు పావడా ఓణీల్లో లేత గులాబిల్లా మెరిసిపోతున్నారు. కుర్రాళ్ళంతా బోడిగుండు నెత్తిన జానపిలక పంచకట్టి జంధ్యం వేసుకొని పైన చొక్కాలు

ధరించారు. చూడ్డానికి వాళ్ళంతా అయ్యంగార్ల బామ్మగారు, ఆవిడ మనుమలు మనవరాళ్ళులా వున్నారు. ''రండర్రా పిల్లలూ'' అంటూ ఎడం చేయి నడుంమీద వుంచుకుని ముందు పోతుంటే పిల్లలంతా ఆవిడ్ని అనుసరించారు. పిల్లల కోడిలా ఆ పిల్లల్ని వెంటేసుకొని మెట్ల వైపు పోతున్న ముసలిబామ్మగార్ని అంతా తమాషాగా చూడసాగారు.

ఆవిడ కోర్టు మెట్లవద్దకి చేరుకునే సరికి అక్కడ పాండ్యన్ మనుషులు అయిదుగురు గుంపుగా చేరి మాట్లాడుకోవటం కన్పించింది బామ్మగారు వాళ్ళని చూస్తూ... ''ఎవర్రా మీరు శుంఠల్లారా.... అడ్డగాడిదల్లా దారికడ్డంగా వుండి ఏంటిరా మీ సోది. కోర్టు టైమైంది లోనకెళ్ళాలి. కాసింత దారోదలండర్రా'' అంది.

వాళ్ళంతా ఆవిడ్ని, ఆవిడ్ని చుట్టివున్న పిల్లల్ని తమాషాగా చూసారు. ఆవిడ మాటలకి కోపం రాకపోగా నవ్వేసారంతా ''ఏంది బామ్మగారూ ఈ వయసులో మీకు కోర్టులో పనేంటి? మీరూ జర్నలిస్టు లహరిని చూద్దామనే?'' అనడిగాడు వెక్కిరింపుగా ఒకడు.

ఆ మాటలకు ఏదో వింత వింటున్నట్టు బుగ్గలు నొక్కుకుని మరీ ఆశ్చర్యంగా చూసిందా అయ్యంగారి బామ్మ.

''అదెవరు నాయనా లహరి? మాకేంతెలుసు? సీత కష్టాలు సీతవి. పీతకష్టాలు పీతవి అన్నట్టు ఉన్న కష్టాలు మాకు చాలవా ఏంటి? మాయదారి కోర్టులకి ఎప్పుడన్నా వచ్చినామా ఏంటి. మా ముసలాయన బుద్ధి తిన్నగా వుంటే ఇక్కడికెందుకొస్తాంలే'' అంది

''ఇంతకీ మీ కొచ్చిన కష్టం ఏంటి బామ్మా. ఈ వయసులో ఎవరు మీ మీద కేసుపెట్టింది?'' కుతూహలం ఆపుకోలేక అడిగాడొకడు.

''అయ్యోరామ. చెప్పుకుంటే సిగ్గు చేటు నాయనా. ఈ వయసులో ఇంకా నేను చిలకలు చుట్టి నోటికందించటం లేదనీ... ఏదీ.... మా ముసలాయన అలిగి నాతో విడాకులు కావాలంటూ కోర్టుకెక్కాడు. రాక తప్పుతుందా చూస్తున్నారుగా వీళ్ళంతా నా మనవలు మనవరాళ్ళు. ఈ వయసులో నాకీ కష్టం అవసరమా... రామా.. కృష్ణా...'' అనుకుంటూ పిల్లలతో మెట్లెక్కి వెళ్తున్న బామ్మగారిని చూసి నిర్ఘాంతపోయారంతా.

''కాలమేంటిరా యిట్టా మారిపోతోంది పడుచు జంటలు కీచులాడుకుని కోర్టుకెక్కారంటే అర్థం వుంది. పూరు పొమ్మంటుంది. కాడు రమ్మంటుంది అన్నట్టున్న ఈ ముసలాళ్ళకూ విడాకులు అవసరమా'' అన్నాడొకడు ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ. అంతేగాని ఆ బామ్మగారి మీదగాని ఆవిడ మనుమలు మనవరాళ్ళమీదగాని ఒకింత కూడా అనుమానం రాలేదు. లోన కోర్టు హాల్లోకి పోడానికి దారిలేక పోటంతో వరండా లోనే జనాలకి ఇవతలగా నిలబడిపోయింది బామ్మగారి బృందం.

ఇంతలో కోర్టు సమయాన్ని చూచిస్తు గంట మోగింది. జడ్జిగారు తన సీటు వైపు రావటం చూసి ఎదురుగా టేబుల్స్ వెనక లాయర్లతో బాటు విజిటర్స్ కూడా లేచి నిలబడ్డారు. జడ్జిగారు కూచోగానే అంతా నిశ్శబ్దంగా కూచున్నారు. కోర్టు అమీనా ఇవతలికొచ్చి... ''జర్నలిస్టు లహరి `జర్నలిస్టు లహరి'' అంటూ మూడుసార్లు పెద్దగా అరిచి పిలిచాడు.

అప్పుడు వరండాలో వున్న బామ్మగారు వున్నట్టుండి కదిలింది. ఆమె కన్నా ముందు కుర్రాళ్ళంతా అడ్డుగా వున్న వాళ్ళని పక్కలకు తోస్తూ ''తప్పుకోండి'' అనరుస్తూ దారిచేసి హడావుడిగా బామ్మగార్ని హాల్లోకి ప్రవేశపెట్టారు. లోనకొస్తూనే సరాసరి వెళ్ళి...

బోనులో నిలబడింది బామ్మ. పైన విజిటర్స్ గ్యాలరీలోని విరాట్ బృందానికి వచ్చిన బామ్మ ఎవరో అర్థమైంది. గాని మిగిలిన ఎవరికీ అర్థంగాక ఆశ్చర్యంతో చూడసాగారు. లహరి ఎవరో వయసులో అమ్మాయి డేరింగ్ డాషింగ్ రిపోర్టరనుకున్నారు గాని ఆ వృద్ధురాలు లహరి ఏమిటని ముఖ ముఖాలు చూసుకుంటున్నారు. జడ్జిగారికీ అంతుబట్టక విచిత్రంగా చూసారు.

''బామ్మగారూ మీరెవరో పొరబాటున వచ్చినట్టున్నారు. మీ కేసు వాయిదా ఏ కోర్టులో వుందో అక్కడికి వెళ్ళండి. ఇక్కడ పిలిచింది జర్నలిస్టు లహరిని'' అంటూ గుర్తుచేసాడు జడ్జి.

''వచ్చింది కూడా జర్నలిస్టు లహరినే యువరానర్'' అంటూ బోనులో నిలబడిన బామ్మ తల మీది విగ్గు తీసేసి పైట చెంగుతో ముఖాన ముసలి మేకప్పి తుడిచేసుకోగానే కోర్టు హాలంతా మరోసారి షాకయింది. ''బామ్మ వేషంలో కోర్టుకొచ్చింది లహరి. జర్నలిస్టు లహరి ఈ అమ్మాయే'' అనుకొంటూ విజిటర్స్లో ఒక్కసారిగా కలకలం రేగటంతో ''సైలన్స్'' అంటు హెచ్చరించాడు జడ్జిగారు.

''మిస్ లహరి. కోర్టుకి మారు వేషంలో రావలసిన అవసరం ఏమిటి? మామూలుగా రావచ్చుగా!'' కాజువల్గా అడిగారు జడ్జిగారు.''వస్తే ప్రాణాలకి గ్యారంటీ లేదు. ప్రాణరక్షణకి మాకీ పాట్లు తప్పవు. మీరు ధర్మాసనంలో కూచుని తీర్పు చెబుతారు. కాని కోర్టు బయట ఏం జరుగుతోందో మీకు తెలిదు. న్యాయధర్మాలు కోర్టుకావల కిలోల లెక్కన అమ్ముడు పోతున్నా మీకు తెలిదు. తెలిసినా ఏమీ చేయలేరు. ప్రాణం పోతే పరిహారం ఇప్పించగలరు. కాని ప్రాణాన్ని తిరిగి తేలేరు'' అంటూ సహస్ర ఆవేశంతో మాటాడుతుంటే కోర్టు హాలంతా చీమ చిటుక్కుమన్నా విన్పించేంత నిశ్శబ్దంగా మారిపోయింది. సహస్ర మాటలు అందర్నీ ఆలోచింపచేస్తున్నాయి. క్షణం ఆగి తిరిగి మాట్లాడనారంభించింది సహస్ర.

“మనకు చట్టాలున్నాయి. న్యాయ ధర్మాల్ని కాపాడే బలమైన రక్షణ వ్యవస్థ వుంది. అయినా న్యాయధర్మాలు నిలువనీడలేక నాలాగే ఒదిగిపారిపోతున్నాయి యువరానర్. కన్పిస్తే తరిమి తరిమి కొడుతున్నారు. ఉసురు తీసి పరిహసిస్తున్నారు. ఎందుకు? న్యాయం కోరటం తప్పా? నిజాల్ని బయట పెట్టడం తప్పా?

మధురై కోర్టు బయటే నామీద హత్యాప్రయాత్నం జరిగింది. తృటిలో తప్పించుకున్నాను. ఎవరు చేయించారో ఎందుకో చేయించారో అందరికీ తెలుసు. నాకోసం వాళ్ళు ఇంతకాలం గాలిస్తూనే వున్నారు. చట్టం ఏం చేయగలిగింది? ప్రభుత్వం ఏంచేయగలిగింది? నిస్వార్ధంగా ప్రజలకోసం పెద్దమనుషుల అక్రమాల్ని కుంభకోణాల్ని కుండబద్దలు కొట్టడం ఈ దేశంలో నేరమా? ద్రోహమా? ఏమిటి నేను చేసిన తప్పు?

మధురై సంఘటన పునరావృతం కాకూడదనే నేనీ రోజు యిలా వేషం మార్చుకొని అందర్నీ ఏమార్చి కోర్టుకి రావలసొచ్చింది యువరానర్. నేరుగా వస్తే కోర్టు మెట్లముందే శవమై పడుండేదాన్ని. వ్యవస్థ మీరు అనుకుంటున్నట్టు ఏంబాగాలేదు యువరానర్. లంచం ఇస్తే ఎలాంటి కేసునయినా మాఫీ చేసే పోలీసు అధికారులున్నారు. లంచం యిస్తే బెయిలు మంజూరు చేసే జడ్జీలున్నారు. లంచం ఇస్తే చేసిపెట్టే కలక్టర్లున్నారు, ఎమ్మార్వోలున్నారు. వారు వీరేమిటి అన్ని శాఖల్లోను అవినీతి లంచగొండితనం, బంధుప్రీతి అధికరించి కంపుకొడుతున్నాయి. వీటి నిర్మూలించాల్సిన మంత్రులే పెంచి పోషిస్తున్నారు. తమకు అనుకూలంగా ప్రభుత్వయంత్రాగాల్ని మలుచుకొని పటిష్టమైన వ్యవస్థల్ని కూడా నిర్వీర్యం చేసేస్తున్నారు. ఇంతమంది ఇన్ని విధాలుగా ధర్మంతప్పుతుంటే న్యాయధర్మాలకి చోటెక్కడుంది యువరానర్.

ఒకటా రెండా దేశంలో ఎన్నో కుంభకోణాలు....? అక్రమార్కులదే రాజ్యం. కొన్ని బయటికొస్తున్నాయి. కొన్ని రావటంలేదు. చెన్నైనుంచి వచ్చి మధురైలో కంపెనీలు స్థాపించుకున్న త్యాగరాజన్ అక్రమాల గురించి విని ప్రాణాలకు తెగించి ఎన్నో నిజాలు సేకరించాను. భూ కుంభకోణాల్ని బయట పెట్టాను. కేసును నిర్వీర్యం చేయాలంటే నేను చావాలి. కాబట్టి వాళ్ళు నన్ను చంపాలని చూస్తున్నారు.

ఒక్కసారి అలా కోర్టు బయటి కెళ్ళి చూడండి యువరానర్. నన్ను కడతేర్చాలని కంకణం కట్టుకున్న వర్గం ఒకటి, నా ప్రాణాలు కాపాడాలని ఒక వర్గం అక్కడ నివురు గప్పిన నిప్పులా సిద్ధంగా ఉన్నాయి. అంతదేనికి.... ఈ కోర్టులోనే... ఇక్కడే... ఇప్పుడో కాస్సేపటికో ప్రత్యర్థులు నన్ను కాల్చిచంపినా ఆశ్చర్యపోనక్కర్లేదు....”

ఆవేశంలో...

అనర్గళంగా మాట్లాడుతూనే వుంది సహస్ర.

అంతలో విజిటర్స్ గ్యాలరీలో ఒక్కసారిగా కలకలం రేగింది. జడ్జి గారితోసహా అంతా అటు చూడగా అక్కడ అనూహ్య దృశ్యం కన్పించింది. రివాల్వర్లతో సహస్రను షూట్ చేయాలని ప్రయత్నిస్తున్న దుక్కలాంటి ఇద్దరు వ్యక్తుల్ని ఇద్దరు యువకులు అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. వాళ్ళిద్దరూ విరాట్ ధర్మలు. హర్యానా షూటర్స్ యిద్దరూ రివాల్వరున్న చేతుల్ని ముందుకు సాచి ఎలాగైనా సహస్రను షూట్ చేయాలని గింజుకొంటున్నారు.

గ్యాలరీలోని విజిటర్సు తొక్కిసలాడుతూ పక్కలకు పరుగు తీస్తున్నారు. ఇక లాభంలేదని తన చేతుల్లో గింజుకొంటున్న వాడ్ని ఎత్తి గ్యాలరీలోంచి కిందకు విసిరేసాడు విరాట్. ఆ వెనకే ధర్మ కూడా రెండో వాణ్ని తోసేసాడు. పైనుంచి కిందపడ్డంలో వాళ్ళ చేతుల్లోని రివాల్వర్లు ఎగిరి దూరంగా పడ్డాయి. పైనుంచి కింద పడ్డంతో ఎముకలు విరిగనంత బాధతో కెవ్వుమన్నారు ఒకేసారి యిద్దరూ. పడిలేచేలోన కోర్టులోపలే వున్న నలుగురు పోలీసులు పరుగున వచ్చి వాళ్ళిద్దర్నీ అదుపులోకి తీసుకున్నారు. కోర్టు అమీనా రివాల్వర్లు రెంటినీ తీసుకెళ్ళి జడ్జిగారి ముందుంచాడు.

ఆ తర్వాత పరిణామాల్లో సహస్ర అభ్యర్థన మీద లోపలి వాళ్ళు బయటకి పోకుండా, బయటి వాళ్ళు లోనకురాకుండా జడ్జిగారు తలుపుల్ని మూసి లాక్చేయించేసారు. పిమ్మట సహస్రనుంచి స్టేట్మెంట్ తీసుకోనారంభించారు. ఆమె సుప్రీంకోర్టుకి సబ్మిట్ చేసిన ప్రతుల్లో ఒకటి జడ్జిగారి ముందుంది. సహస్ర రిపోర్టు చదివి జడ్జిగారు అడుగుతుంటే సహస్ర మౌఖికంగా వివరణ యివ్వసాగింది. ఓ పక్క కోర్టుహాల్లో సహస్ర వివరణ యిస్తుండగానే బయట జరుగుతున్న నాటకీయ పరిణామాలు లోపలున్న ఎవరికీ తెలీవు.



సమయం పదిగంటలు దాటి పోడంతో...బయట అశోక వృక్షం కింద కార్లో కూచున్న త్యాగరాజన్కి పరిస్థితి అర్థం గాకుండా పోయింది. ఎక్కడా సహస్ర కోర్టుకి వచ్చిన జాడ కన్పించలేదు. ఆ విరాట్ గాని వాడి మనుషులు గాని ఎవరూ వచ్చినట్టు లేదు. కోర్టు లోపల బయటా జనం మాత్రం అలాగే వున్నారు. కోర్టు లోపల ఏం జరుగుతోందో అర్థంగావటం లేదు. ఇక ఉత్కంఠ భరించ లేక పది అయిదు నిముషాలకు కొంత దూరంలో వేన్లో వున్న పాండ్యన్కి ఫోన్ చేసాడు.

‘‘ఏమిట్రా పాండ్యా నాకు మతిపోతోంది. అయోమయంగా వుంది. మనం వేసిన ప్లానేమిటి యిక్కడ జరుగుతోందేమిటి? అవతల కోర్టు ఆరవభమైంది. సహస్ర వచ్చిందా రాలేదా?’’ విసుగంతా గొంతులో నింపుకొంటూ అడిగాడు.

‘‘నాకూ అదే అర్థంగావటం లేదు సార్. లోపల్నుంచి ఎవరూ బయటికి రాకుండా తలుపులు మూయించారు…’’

‘‘మన వాళ్ళెవరూ సెల్ఫోన్తో లోన లేరా?’’

‘‘హర్యానా షూటర్స్ యిద్దరే వున్నారు సార్. ఫోన్ చేస్తే స్విచ్చాఫ్ వస్తోంది’’

‘‘అఘోరించలేకపోయావ్. పక్కాగా ప్లాన్ చేసిన వాడివి విడిగా యిద్దర్ని సెల్ఫోన్స్లోనకు పంపించలేకపోయావా….’’

త్యాగరాజన్ మాటలు పూర్తిగాకుండానే అవతలి ఫోన్ స్విచ్చాఫ్ అయింది. పాండ్యన్ ఎందుకు స్విచ్చాఫ్ చేసాడో అర్థంగాక పిచ్చికోపంతో తలతిప్పి వేన్ వైపు చూడబోయాడు. ఇంతలో కారు పక్కకొచ్చి ఎవరో డోర్ మీద చప్పుడు చేసారు. వచ్చింది ఎవరో తెలీక కంగారు పడేలోన మరికొందరు కన్పించారు.

ఎందుకో త్యాగరాజన్ మనుసు సందేహించింది. కారును పొమ్మని డ్రయివర్కి సిగ్నలిచ్చాడు. డ్రయివర్ ఇంజన్ స్టార్ట్ చేస్తుండగా సడెన్గా అటు డోర్ తెరుచుకుంది. ఎవరో డ్రయివర్ని బయటికి లాగేసి స్టిరింగ్ తీసుకొంటూ లోనకొచ్చాడు. ఆ వెనకే కుడిపక్క డోర్ తెరుచుకొని హుందాగా కారెక్కి త్యాగరాజన్ పక్కన కూచున్నాడో వ్యక్తి. రెండో పక్క డోర్లోంచి మరో వ్యక్తి లోనకొచ్చాడు. కారు డోర్స్ని తెరిచే ఉంచారు. ‘‘ఎవరు? ఎవరు మీరంతా?’’ కోపంతో అరిచాడు త్యాగరాజన్.

కుడి పక్కన కూర్చున్న వ్యక్తి హుందాగా నవ్వి తన ఐడెంటిటీ కార్డు తీసి చూపించాడు.

‘‘మిష్టర్ త్యాగరాజన్ అయాం జికె పరాశరన్. జాయింట్ డైరెక్టర్ ఫ్రం సిబిఐ. వీళ్ళంతా నా సబార్డినేట్స్’’ అన్నాడు కూల్గా. సిబిఐ రంగప్రవేశం చేసిందని తెలీగానే త్యాగరాజన్ గుండెల్లో పెద్ద రాయి పడినట్టయింది. నోట మాట రాలేదు. ఏ బేస్ మీద సిబిఐ రంగంలోకి దిగిందో తెలిలేదు. ఎందుకంటే ఇంతవరకు ఈ కేసుమీద ఎలాంటి ఎంక్వయిరీ జరగలేదు. సహస్ర నుంచి స్టేట్మెంట్ తీసుకోలేదు. సిబిఐ రంగంలోకి దిగితే తన తండ్రి సెంట్రల్ మినిష్టర్ దేవరాజుకి తెలీకుండా ఉంటుందా? తనకి ఎలాంటి ఇన్ఫర్మేషన్ లేదే…

‘‘ఏమిటి పాండ్యన్తో మాట్లాడుతున్నావా? ఇక వాడితో మాట్లాడలేవు. పాండ్యన్ని మావాళ్ళు అదుపులోకి తీసుకున్నారు. ఓ సారి

బయటికి చూడు'' అన్నాడు పరాశరన్.

మఫ్టీలో వున్న పోలీసులు పాండ్యన్ని అరెస్ట్ చేసి దూరంగా వున్న పోలీస్ వేన్ వైపు తీసుకు పోతున్నారు. అప్పటికే మెట్లదగ్గర ఉన్న హర్యానా షూటర్స్ ఇద్దర్నీ అరెస్ట్ చేసి లాక్కుపోతున్నారు. అంతే కాదు కోర్టు ఆవరణ లోని త్యాగరాజన్ మనుషుల్ని వెదికి వెదికి మరీ పట్టుకుని వేన్ల వైపు తరలిస్తున్నారు. పరిస్థితి చూస్తుంటే ఒక్కసారిగా నవనాడులూ స్థంభించి పోయినట్టయింది.

''ఏమిటీ అన్యాయం? ఏ బేస్ మీద నన్ను మీరు అరెస్ట్ చేస్తున్నారు?'' చివరకు ఎలాగో నోరు పెకల్చి అడిగాడు త్యాగరాజన్.

''బేస్ ఉంది మిష్టర్. స్కెలిటన్లు కూడా నీ అక్రమాలకు సాక్ష్యం చెప్తాయి. మధురైలో నీ టేకు ఎస్టేట్లో జరిపిన తవ్వకాల్లో మొత్తం ఇరవై ఆరు శవాల తాలూకు అస్థిపంజరాలు లభ్యమయ్యాయి. వాటిలో రెండింకా పూర్తిగా శిథిలంకాలేదు. జర్నలిస్టు లహరి ఇచ్చిన రిపోర్టులో మిస్సింగ్ పర్సన్స్ పద్దెనిమిది మంది అస్థిపంజరాలు మీ ఎస్టేట్ లోనే దొరికాయి. స్టేట్ గవర్నమెంట్ తరపున సియం గారి అభ్యర్థనతో మేం రంగంలోకి దిగి అస్థిపంజరాల మీద జరిపిన పరిశోధనల్లో జర్నలిస్టు లహరి రిపోర్టు వాస్తవమని తేలింది. సో లహరి సేకరించి రిపోర్టులో పొందుపరిచిన అన్ని అంశాలమీద క్షుణ్ణంగా పరిశోధన జరపమని సుప్రీంకోర్టు ఆర్డర్. ప్రస్తుతానికి టేక్ ఎస్టేట్లో జరిగిన హత్యల ఆధారంగా మిమ్మల్ని అరెస్ట్ చేయటం జరిగింది'' అంటూ పరాశరన్ వివరిస్తుంటే అచేతనుడయ్యాడు త్యాగరాజన్.

''జర్నలిస్టు లహరి, షియీజ్ బ్రిలియంట్ ఆమె కోర్టుకు వచ్చింది. జడ్జిగారు స్టేట్మెంట్ తీసుకుంటున్నారు. ఆమెను చంపబోయిన హర్యానా షూటర్స్ మావాళ్ళకి లొంగిపోయారు. ఈ ఇన్ఫర్మేషన్ చాలనుకుంటాను. ఇక బయలుదేరదాం. కమాన్'' అంటూ కారు దిగాడు పరాశరన్. త్యాగరాజన్ని కూడా ప్రత్యేక వాహనంలో సిబిఐ కోర్టుకు తరలించగా డ్రయివరు త్యాగరాజన్ కారు తీసుకొని వెళ్ళిపోయాడు. కోర్టు అనుమతితో సిబిఐ అధికారులు త్యాగరాజన్తో బాటు అతడి మనుషులందర్నీ రిమాండ్కు తరలించారు. రక్తరహిత యుద్ధం ఆ విధంగా ముగిసింది. సాయంకాలం మూడు గంటల వరకు కోర్టు సహస్రనుంచి స్టేట్మెంట్ తీసుకొంటూనే వుంది. కోర్టు ముగియగానే తమిళనాడు సియం సెల్వచెందామరై ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీసు బృందం సహస్రను సురక్షితంగా గోస్వామి కాలనీకి చేర్చింది. అంతా తేలిగ్గా వూపిరి తీసుకున్నారు. సిబిఐ కస్టడీలో వున్న త్యాగరాజన్కి బెయిల్ నిరాకరించింది కోర్టు. ఎప్పటికి బయటికొస్తాడో కాలమే నిర్ణయించాలి.

***********************************

కోయంబత్తూరు...

వెంకటరత్నంనాయుడి గారిల్లు…

ఆ రోజు బంధువులందరి రాకతో కళకళలాడులోంది. త్యాగరాజన్ అరెస్టయిన వారం రోజులవరకు విరాట్తో సహా అంతా అక్కడే వున్నారు. తనను కాపాడి సొంత తమ్ముళ్ళలా "అక్కా" అంటూ కంటికి రెప్పలా తన్ని కాపాడిన మురడన్ ముత్తు బేచ్ని సహస్ర మర్చిపోలేదు. వాళ్ళకి తనిచ్చిన మాటనిలబెట్టుకుంది. ఇక దీక్షతో కలిసి సహస్ర మధురైకి బయలుదేరింది. దీక్షతో చందూనికూడ తన వెంట తీసుకెళ్ళింది.

విరాట్ తనమేనత్త కాంచనమాలను, విశాలను తీసుకొని కార్లో కోయంబత్తూరు చేరుకున్నాడు. అంతకు రెండ్రోజుల ముందే మునుసామి తన మనుషులతో కోయంబత్తూరు, కదిరేశన్ ధర్మలు తమ వాళ్ళతో మధురైకి వెళ్ళిపోయారు.

దీక్ష మధురై వచ్చిన విషయం తెలిగానే ఆమె అన్నలు వచ్చారు. చెల్లెలికి అన్యాయం చేసారు, పట్టించుకోడం లేదని నలుగురూ నాలుగు రకాలుగా చెప్పుకోడం తట్టుకోలేక, తప్పు తెలుసుకొని తామే దీక్ష చందూలకు వివాహం జరిపించటానికి ముందుకొచ్చారు. తర్వాత మహాదేవనాయకర్ దంపతులు సహస్రతో కోయంబత్తూరు బయలుదేరగానే వెంట దీక్ష చందూలు, అలాగే ధర్మ మిత్ర వర్గం అంతా కోయంబత్తూరు చేరుకున్నారు.

ఇక ఎంతో కాలం తర్వాత పుట్టింట్లోకి కూతురు విశాలను తీసుకొచ్చిన కాంచనమాలను చూడ్డానికి బంధువర్గమంతా వచ్చారు. భర్త రంగనాధ చౌదరి అన్నదమ్ములంతా వచ్చారు. రంగనాధ చౌదరి పోయిన విషయం తెలిసి అటువైపు బంధువర్గం బాధపడినా కాంచనమాల విశాల యిద్దర్నీ ఎంతో ఆదరంగా చూసారు. ఇక అంతా వచ్చిన విషయం తెలిసి వెంకటరత్నం నాయుడుగారి పెద్ద కూతురు కనకమహాలక్ష్మి, ఆమె భర్త కూతురు సాగరికతో వచ్చి ఇక్కడే వున్నారు. ఇక మునుసామి అయితే అందరితోబాటు నాయుడిగారింటనే వున్నాడు.

ఆ విధంగా అందరి రాకతో వెంకటరత్నంనాయడి గారిల్లు సకల శోభాయమానంగా కళకళలాడిరది. ఆ రోజు భోజనలానంతరం ముందుగా విరాట్ పెళ్ళి ప్రస్తావనని మునుసామి తీసుకొచ్చాడు. "దీక్ష చందూల వివాహానికి దీక్ష అన్నలు ముహుర్తం నిర్ణయించేసారు. మనమే లేటు. మన విరాట్ పెళ్ళికీ ముహుర్తం పెట్టేస్తే ఓ పనైపోతుంది గదా!" అన్నాడు.

"ఇందులో మా లేటు ఏముంది? ఓ మాట వాళ్ళనడిగితే తర్వాత పురోహితుడ్ని పిలిపించి ముహుర్తం ఖరారు చేద్దాం.

ఏమంటారు డాడీ?'' అన్నాడు విక్రాంత్.

"అవునవును అడగండి'' అన్నాడు వెంకటరత్నం నాయుడు.

"నాకయితే అడగటం అనవసరమనిపిస్తోంది. ఏకంగా పురోహితుడ్ని పిలిపించండి'' అన్నాడు మహాదేవనాయకర్.

"ఓ మాట అడుగుదాం నాయకర్ సాబ్ తప్పేముంది? ఏమ్మ సహస్రా, విశాల మీ ఇద్దరికీ బావను చేసుకోవటం సమ్మతమే గదా. ముహూర్తం పెట్టించేస్తాం.'' అనడిగాడు మునుసామి.

"అలాగే కాని బావ ముందుగా ప్రేమించింది అక్క సహస్రని కాబట్టి వాళ్ళిద్దరికీ పెళ్ళి జరిపించండి'' అంది విశాల.

"అదేమిటి? మరి నువ్వు?''

"నేను వాళ్ళతోనే ఉండిపోతాలే'' అంది.

"సహస్రా నువ్వేమంటావ్?''

"విశాల అలాగే చెప్తుంది కాని సొంత మరదల్ని పక్కనపెట్టి నన్ను చేసుకుంటే తప్పునాదంటారు. విశాలతోనే పెళ్ళి జరిపించండి'' అంది సహస్ర.

"మరి నువ్వు?''

"నేనూ వాళ్ళతోనే ఉంటాగా''

అక్కడే వుండి అంతా వింటున్న విరాట్ ఇక భరించలేక ''ఈ త్యాగాలేమిట్రా నాయనో... నా వల్ల కాదు. నాకు ఇద్దరూ కావాలి. పెళ్ళి చేసుకుంటారో లేదో అడగండి'' అంటూ లేచిలోనకెళ్ళిపోయాడు విరాట్. 'విన్నారుగా మా మావయ్య బంగారం. బంగారాన్ని వదులుకుంటామా ఏంటి మీరు చేసుకోనంటే చెప్పండి నేను చేసుకోడానికి రెడీగానే వున్నాను' అంది సాగరిక. దాంతో ఒక్కసారిగా గొల్లున నవ్వారంతా.

అప్పటికప్పుడు పురోహితుడ్ని పిలిపించి ముహుర్తాలు చూపించారు సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో పేరు బలం తిథి నక్షత్రాల్ని బట్టి వేరు వేరు ముహుర్తాలొస్తాయి. కాని లక్కీగా విరాట్కి ఒకే ముహుర్తంలో ఇద్దరికీ తాళికట్టే అద్భుతమైన ముహుర్తం కుదిరింది. ఆ ముహుర్తానికే రంగరంగ వైభవంగా వివాహమూ జరిగింది.

వివాహానికైతే లక్కీగా ఒకే ముహుర్తం కుదిరింది సరే. మరి శోభనానిక్కూడ పెళ్ళికూతుళ్ళిద్దరికీ ఒకే ముహుర్తాలు వస్తాయా.....? ఒకవేళ వస్తే.........???

: అయిపోయింది :